ఈనాడు

విజయవాడ 19-12-2025 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 129
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

చాంపియన్


సూర్యకుమార్

భారత్‌లో నెల రోజులకు పైగా సాగుతున్న దక్షిణాఫ్రికా పర్యటన ముగింపులోకి వచ్చేసింది. టెస్టుల్లో వైట్‌వాష్‌కు గురయ్యాక వన్డేల్లో పుంజుకుని సిరీస్ సాధించిన టీమ్‌ఇండియా.. టీ20ల్లోనూ సిరీస్ విజయానికి చేరువగా ఉంది. 2-1తో ఆధిక్యంలో ఉన్న సూర్యకుమార్ సేన.. చివరి మ్యాచ్‌లో నెగ్గి సఫారీలపై పైచేయి సాధించాలని చూస్తోంది.

ముగింపులో మురిపిస్తారా?

దక్షిణాఫ్రికాతో భారత్ చివరి టీ20 నేడు

రాత్రి 7 నుంచి


వరుణ్

అహ్మదాబాద్

లఖ్‌నవూలో నాలుగో టీ20 పొగ మంచు కారణంగా రద్దవడంతో తీవ్రంగా నిరాశ చెందిన భారత్, దక్షిణాఫ్రికా జట్లు.. సిరీస్‌లో చివరి మ్యాచ్ కోసం సిద్ధమయ్యాయి. శుక్రవారం అహ్మదాబాద్‌లో నరేంద్ర మోదీ స్టేడియంలో రెండు జట్లూ అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఇప్పటికే 2-1 ఆధిక్యంలో ఉన్న భారత్.. ఈ మ్యాచ్ ఓడినా సిరీస్ కోల్పోదు. అయితే వన్డే సిరీస్‌తో పొట్టి క్రికెట్లోనూ పైచేయి సాధిస్తే.. టెస్టుల్లో దక్షిణాఫ్రికా చేతిలో ఎదురైన వైట్‌వాష్ పరాభవానికి బదులు తీర్చుకున్నట్లవుతుంది. అహ్మదాబాద్‌లో సఫారీ జట్టు గెలిస్తే మాత్రం మొత్తంగా పర్యటనలో పైచేయి సాధించిన సంతృప్తితో స్వదేశానికి బయల్దేరుతుంది.

కెప్టెన్ మార్పు చూపిస్తాడా?: టీ20 సిరీస్‌లో దక్షిణాఫ్రికాపై భారత్ స్పష్టమైన పైచేయి సాధిస్తోంది. రెండో మ్యాచ్‌లో తడబడ్డా.. మొదటి, మూడో టీ20ల్లో తిరుగులేని ఆధిపత్యంతో గెలిచింది. అదే ఊపులో చివరి టీ20లోనూ నెగ్గాలని చూస్తోంది. అయితే కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఈ మ్యాచ్‌లో అయినా మెరుపులు మెరిపిస్తాడా లేదా అన్నది చూడాలి. సిరీస్‌లో అతను 3 మ్యాచ్‌ల్లో కలిపి 29 పరుగులే చేశాడు. ఈ మ్యాచ్‌లోనూ సూర్య రాణించకపోతే టీ20 ప్రపంచకప్ సమీపిస్తుండగా కెప్టెన్‌ను మార్చాలన్న డిమాండ్లు ఊపందుకుంటాయి. వైస్ కెప్టెన్ గిల్ ఫామ్ కూడా ఆందోళన కలిగిస్తోంది. అయితే గాయంతో బాధ పడుతున్న అతను.. ఈ మ్యాచ్ ఆడడం అనుమానమే. అతను అందుబాటులో లేకుంటే అభిషేక్ శర్మతో కలిసి సంజు శాంసన్ ఇన్నింగ్స్‌ను ఆరంభిస్తాడు. అభిషేక్‌తో పాటు హార్దిక్, తిలక్ ఫామ్‌లో ఉండడం సానుకూలాంశం. కుటుంబ కారణాలతో మూడో టీ20కి దూరమైన ప్రధాన పేసర్ బుమ్రా.. ఈ మ్యాచ్‌లో ఆడనున్నాడు. అతడి కోసం హర్షిత్ రాణా తన స్థానాన్ని త్యాగం చేయాల్సిందే. అర్ష్‌దీప్ రెండో పేసర్‌గా ఉంటాడు. వరుణ్ చక్రవర్తి, కుల్‌దీప్ యాదవ్ స్పిన్ బాధ్యతలు పంచుకుంటారు. సిరీస్ దక్కాలంటే గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా అంత తేలిగ్గా లొంగకపోవచ్చు. బ్యాటింగ్‌లో డికాక్, మార్‌క్రమ్, బ్రెవిస్.. బౌలింగ్‌లో యాన్సెన్, ఎంగిడి, బార్ట్‌మన్‌లపై ఆ జట్టు ఆశలు పెట్టుకుంది. హెండ్రిక్స్, మిల్లర్, స్టబ్స్ రాణించకపోవడం ఆ జట్టును దెబ్బ తీస్తోంది. ఈ మ్యాచ్‌లో అయినా ఈ ముగ్గురూ రాణిస్తారేమో చూడాలి.


శాంసన్

7 అహ్మదాబాద్‌లో భారత్ ఆడిన టీ20లు. అయిదు మ్యాచ్‌లు నెగ్గి, రెండు ఓడింది.

గిల్ ఉన్నట్లా లేనట్లా?

చివరి టీ20లో వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఆడతాడా లేదా అన్నది సస్పెన్స్‌గా మారింది. లఖ్‌నవూలో నాలుగో టీ20 ముంగిట సాధన చేస్తుండగా అతడి కాలి బొటనవేలికి బంతి తగిలి నొప్పితో బాధ పడ్డాడు. ఆ మ్యాచ్ జరిగినా అతను ఆడేవాడు కాదు. గిల్ చివరి మ్యాచ్‌కు కూడా దూరం కానున్నట్లు వార్తలు వచ్చాయి. కానీ అతను జట్టుతో పాటే అహ్మదాబాద్‌కు వెళ్లాడు. అంటే శుభ్‌మన్ ఆడే అవకాశాలను కొట్టి పారేయలేం. టీ20ల్లో అతడి ఫామ్ పేలవంగా ఉంది. ఈ సిరీస్ తొలి మూడు మ్యాచ్‌ల్లో కలిపి 33 పరుగులే చేశాడు.

పిచ్ స్పిన్నర్లదే!

అహ్మదాబాద్ పిచ్ సాధారణంగా స్పిన్నర్లకు బాగా సహకరిస్తుంది. కానీ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పేసర్లకూ అవకాశముండొచ్చు. ఇక్కడ పరుగులు బాగానే వస్తాయి. మ్యాచ్‌కు వాతావరణం పరంగా ఇబ్బందులేమీ లేవు. మంచు ప్రభావం ఉన్నా.. లఖ్‌నవూ స్థాయిలో మ్యాచ్‌కు ఇబ్బంది కలిగించదు.

రెచ్చిపోయిన ఇషాన్

- హరియాణాతో ఫైనల్లో 45 బంతుల్లోనే సెంచరీ
- ముస్తాక్ అలీ విజేత ఝార్ఖండ్
- తొలిసారిగా దేశవాళీ టీ20 ట్రోఫీ కైవసం


ట్రోఫీతో ఝార్ఖండ్ జట్టు

పుణె

దేశవాళీ టీ20 టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఝార్ఖండ్ తొలిసారి విజేతగా నిలిచింది. గురువారం ఏకపక్షంగా సాగిన ఫైనల్లో ఆ జట్టు 69 పరుగుల తేడాతో హరియాణాపై విజయం సాధించింది. రెండేళ్లుగా టీమ్‌ఇండియాకు దూరంగా ఉన్న వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ టోర్నీలో సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తూ ఫైనల్లోనూ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. అతను 45 బంతుల్లోనే సెంచరీ కొట్టాడు. ఇషాన్ (101; 49 బంతుల్లో 6×4, 10×6)కు తోడు కుమార్ కుశాగ్ర (81; 38 బంతుల్లో 8×4, 5×6), అనుకుల్ రాయ్ (40 నాటౌట్; 20 బంతుల్లో 3×4, 2×6), రాబిన్ మింజ్ (31 నాటౌట్; 14 బంతుల్లో 3×6) కూడా మెరుపులు మెరిపించడంతో మొదట ఝార్ఖండ్ 20 ఓవర్లలో 3 వికెట్లకు 262 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం హరియాణా 18.3 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది. ఛేదనలో 36 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన హరియాణాను యశ్‌వర్ధన్ దలాల్ (53; 22 బంతుల్లో 2×4, 5×6), నిశాంత్ సింధు (31; 15 బంతుల్లో 6×4), సామంత్ జఖార్ (38; 17 బంతుల్లో 2×4, 4×6) ఆదుకున్నప్పటికీ.. లక్ష్యం మరీ పెద్దది కావడంతో ఆ జట్టుకు ఓటమి తప్పలేదు. ఝార్ఖండ్ బౌలర్లలో సుశాంత్ మిశ్రా (3/27), బాల్ కృష్ణ (3/38), వికాస్ సింగ్ (2/30), అనుకుల్ రాయ్ (2/42) ఆకట్టుకున్నారు. ఇషాన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా, అనుకుల్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా ఎంపికయ్యారు.


ఇషాన్ కిషన్

సెమీస్ చేరువలో సాత్విక్ జోడీ

బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ టూర్ ఫైనల్స్


సాత్విక్, చిరాగ్

హాంగ్‌జౌ: బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ టూర్ ఫైనల్స్‌లో భారత జోడీ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి మెరుగైన ప్రదర్శనను కొనసాగిస్తున్నారు. గ్రూప్-బిలో వరుసగా రెండో విజయం సాధించిన ఈ జంట.. సెమీస్‌కు చేరువైంది. గురువారం జరిగిన మ్యాచ్‌లో భారత ద్వయం 21-11, 16-21, 21-11తో ఇండోనేసియాకు చెందిన ప్రపంచ నంబర్ 8 ఫజర్ అల్ఫియాన్, మహ్మద్ షోహిబుల్ ఫిక్రి జంటను ఓడించింది. మూడో సీడ్ సాత్విక్, చిరాగ్ ద్వయం గ్రూప్‌లో తన చివరి మ్యాచ్‌లో శుక్రవారం రెండో సీడ్ ఆరోన్ చియా, సో వూ యిక్ జంటను ఢీకొంటుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే గ్రూప్-బిలో అగ్రస్థానంతో సెమీస్‌కు చేరుతుంది. ఓడినా.. గ్రూప్‌లో మరో మ్యాచ్ ఫలితం అనుకూలంగా వస్తే ముందంజ వేసే అవకాశముంది. గురువారం జరిగిన పోరులో రెండో సీడ్ సాత్విక్, చిరాగ్ జోడీ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. దూకుడుగా ఆడిన ఈ ద్వయం తొలి గేమ్‌లో 6-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. విరామానికి 11-2తో నిలిచింది. అయితే భారత జోడీ డిఫెన్స్‌లో తడబడడంతో ఇండోనేసియా ద్వయం పుంజుకుంది. 9-13తో అంతరాన్ని తగ్గించింది. తిరిగి జోరందుకున్న సాత్విక్, చిరాగ్ చకచకా పాయింట్లు సాధించి పది గేమ్ పాయింట్లు సంపాదించారు. రెండో అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గేమ్‌ను సొంతం చేసుకున్నారు. రెండో గేమ్‌లో ఇండోనేసియా జోడీ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. సాత్విక్, చిరాగ్‌లకు ఎటాక్ చేసే అవకాశమివ్వని ఆ ద్వయం.. 8-3తో ఆధిక్యంలో నిలిచింది. కాస్త పుంజుకున్న సాత్విక్ జోడీ విరామానికి 9-11తో నిలిచింది. ఆ తర్వాత 11-11తో స్కోరు సమం చేసింది. కానీ అల్ఫియాన్, ఫిక్రి తిరిగి జోరందుకుని 19-15 ఆధిక్యం సంపాదించింది. పట్టుసడలించకుండా గేమ్‌ను గెలుచుకుంది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో ధాటిగా ఆడిన సాత్విక్-చిరాగ్ జంట 11-4తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. జోరును కొనసాగిస్తూ గేమ్‌ను, మ్యాచ్‌ను గెలుచుకుంది.

సెలక్టర్లు చూస్తున్నారా?

ఈనాడు క్రీడావిభాగం

వన్డేల్లో డబుల్ సెంచరీ చేసిన అతి కొద్దిమంది బ్యాటర్లలో ఒకడు ఇషాన్ కిషన్. టెస్టులు, టీ20ల్లోనూ అతను మెరుగైన గణాంకాలే నమోదు చేశాడు. భారత క్రికెట్లో కాబోయే స్టార్‌గా పేరు సంపాదించాడు. అలాంటి ఆటగాడు రెండేళ్ల పాటు టీమ్‌ఇండియా ఛాయలకే రాలేకపోయాడు. బీసీసీఐ కాంట్రాక్టునూ కోల్పోయాడు. ఐపీఎల్‌లోనూ తన ఫామ్ దెబ్బ తింది. ఇక అతడికి మళ్లీ భారత జట్టులో చోటు దక్కడం కష్టమే అనుకున్నారంతా! కానీ టీ20 ప్రపంచకప్ ముంగిట ముస్తాక్ అలీ టోర్నీలో చెలరేగి ఆడి.. టీమ్‌ఇండియాలో చోటు దిశగా అడుగులు వేస్తున్నాడు.

ఐపీఎల్‌లో మెరుపులు మెరిపించి 22 ఏళ్ల వయసులోనే టీమ్‌ఇండియాలో చోటు సంపాదించిన ఇషాన్.. మూడు ఫార్మాట్లలోనూ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. 32 టీ20ల్లో 26 సగటుతో 796 పరుగులు చేసిన అతను.. 27 వన్డేల్లో 42.4 సగటుతో 933 పరుగులు రాబట్టాడు. 2 టెస్టులాడి 78 సగటుతో 78 పరుగులు చేశాడు. కోహ్లికి కూడా సాధ్యం కాని వన్డే డబుల్ సెంచరీని అందుకోవడంతో ఒక దశలో ఇషాన్ పేరు మార్మోగింది. అయితే 2023 దక్షిణాఫ్రికా పర్యటన సందర్భంగా మానసిక స్థితి సరిగా లేదనే కారణం చెప్పి స్వదేశానికి వచ్చేయడం.. ఆపై బీసీసీఐ ఆదేశాలకు అనుగుణంగా దేశవాళీ క్రికెట్ ఆడకుండా ఐపీఎల్ కోసం ప్రాక్టీస్ చేయడం అతడి కెరీర్‌పై ప్రతికూల ప్రభావం పడింది. జట్టు యాజమాన్యం, సెలక్షన్ కమిటీ అతణ్ని పక్కన పెట్టేశాయి. దీంతో మళ్లీ టీమ్‌ఇండియాలో స్థానం సంపాదించలేకపోయాడు. బీసీసీఐ కాంట్రాక్టుల్లోనూ చోటు కోల్పోయాడు. తన దేశవాళీ ఫామ్ కూడా అంత గొప్పగా లేకపోయింది. ఈ ఏడాది ఐపీఎల్‌ను సెంచరీతో మొదలుపెట్టిన ఇషాన్.. తర్వాత ఫామ్ కోల్పోయాడు. అయితే రంజీ ట్రోఫీలో రాణించిన అతను.. ఇప్పుడు ముస్తాక్ అలీలో రెచ్చిపోయాడు. 2 శతకాలు, 2 అర్ధశతకాలు సహా 517 పరుగులు చేశాడు. అతడి సగటు 57.44 కాగా.. స్ట్రైక్ రేట్ 197.32 కావడం విశేషం. టోర్నీలో అతనే టాప్‌స్కోరర్ కూడా. ముఖ్యంగా కీలకమైన ఫైనల్లో మెరుపు సెంచరీ బాదడంతో భారత సెలక్టర్లు అతడి వైపు చూడక తప్పని పరిస్థితి నెలకొంది. జనవరిలో న్యూజిలాండ్‌తో జరిగే టీ20 సిరీస్‌కు జట్టులో చోటు కోసం అతను పోటీదారుగా మారాడు. ఆ అవకాశం దక్కించుకుని, నిలకడగా రాణిస్తే ఇషాన్‌ను టీ20 ప్రపంచకప్‌లోనూ చూడొచ్చు.



ఫుట్‌బాల్ ప్రపంచకప్ విజేతకు రూ.451 కోట్లు

మాంచెస్టర్: 2026 ఫుట్‌బాల్ ప్రపంచకప్ విజేత జట్టుకు రికార్డు స్థాయిలో రూ.451 కోట్ల ప్రైజ్‌మనీ దక్కనుంది. 2022 ప్రపంచకప్ గెలిచిన అర్జెంటీనాకు రూ.379 కోట్లు లభించాయి. గత కప్‌తో పోలిస్తే ఈసారి మొత్తం నగదు బహుమతిని ఫిఫా 48.9 శాతం పెంచింది. 2022 కప్‌లో మొత్తం ప్రైజ్‌మనీ 3971 కోట్లు కాగా.. ఈసారి రూ.5911 కోట్లకు పెరిగింది. గ్రూప్ దశలో పోటీపడే 48 జట్లకు రూ.81 కోట్ల చొప్పున దక్కనున్నాయి. ఈ టోర్నీ సన్నద్ధత కోసం ప్రతి జట్టుకు రూ.13.53 కోట్లు లభిస్తాయి. రౌండ్ ఆఫ్ 32 దశకు చేరే జట్లకు రూ.99.27 కోట్లు చొప్పున.. ప్రిక్వార్టర్స్‌లో ప్రవేశించే టీమ్‌లకు రూ.135 కోట్ల చొప్పున లభిస్తాయి. క్వార్టర్స్ చేరే జట్లకు రూ.171 కోట్ల చొప్పున దక్కుతాయి. నాలుగో స్థానంలో నిలిచే జట్టు రూ.243 కోట్లు, మూడో స్థానాన్ని సాధించే టీమ్ రూ.261 కోట్లు సంపాదిస్తాయి. రన్నరప్‌కు రూ.297 కోట్లు లభిస్తాయి. ప్రపంచకప్ విజేతతో పోలిస్తే క్లబ్ ప్రపంచకప్‌లో గెలిచే జట్టుకే ఎక్కువ నగదు బహుమతి దక్కుతోంది. 2025 క్లబ్ ప్రపంచకప్ నెగ్గిన చెల్సీకి రూ.1128 కోట్లు లభించాయి. జాతీయ జట్లతో పోలిస్తే క్లబ్ జట్ల నిర్వహణకు ఎక్కువ ఖర్చులు అవుతుండడంతో ఫిఫా అందుకు తగ్గట్టే ప్రైజ్‌మనీ ఇస్తోంది.

ఇండియన్ స్ట్రీట్ లీగ్‌లోకి గంగూలీ

కోల్‌కతా: ఇండియన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్ (ఐఎస్‌పీఎల్)తో భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ జట్టుకట్టాడు. మూడో సీజన్‌కు ముందు టైగర్స్ ఆఫ్ కోల్‌కతా జట్టుకు సహ యజమానిగా లీగ్‌లో అడుగు పెట్టాడు. వచ్చే ఏడాది జనవరి 9 నుంచి ఫిబ్రవరి 6 వరకు సూరత్‌లో ఈ టోర్నీ జరగనుంది.

ఐపీఎల్‌లో కూలీ తనయుడు


విశాల్ నిషాద్

నాన్న కూలీ.. కష్టపడితే కానీ పూట గడవని పరిస్థితి. కానీ ఆ కుర్రాడికి క్రికెటర్ కావాలన్న కోరిక పుట్టింది. అందుకు తగ్గ వసతులు ఊరిలో లేవు. అయినా పంట పొలాలే మైదానంగా భావించి క్రికెట్ ఆడాడు. స్పిన్నర్‌గా మారి సత్తా చాటాడు. ఐపీఎల్ ఫ్రాంఛైజీల దృష్టిలో పడి వేలంలో పంజాబ్ కింగ్స్‌కు రూ.30 లక్షలకు సొంతమయ్యాడు. ఆ కుర్రాడి పేరు విశాల్ నిషాద్. పేదరికాన్ని అధిగమించి ఐపీఎల్ లాంటి మెగా టోర్నీకి ఎంపికైన అతడి ప్రయాణం స్ఫూర్తిదాయకం.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని జంగల్ అయోధ్య ప్రసాద్ గ్రామానికి చెందిన 20 ఏళ్ల విశాల్‌ది పేద కుటుంబం. నలుగురు పిల్లల్లో అతడే చిన్నోడు. నాన్న ఉమేశ్ కూలి చేసి కుటుంబాన్ని పోషించేవాడు. విశాల్‌కు క్రికెట్‌పై ఇష్టాన్ని గమనించిన అతడి తండ్రి ప్రోత్సహించాడు. విశాల్ కూడా నాన్నతో కలిసి కూలికి వెళుతూనే మరోవైపు క్రికెటర్‌గా ఎదిగాడు. తమ గ్రామం నుంచి 20 కిలోమీటర్ల దూరంలోని గోరఖ్‌పూర్‌కు వెళ్లి క్రికెట్ ఆడేవాడు. ఆ కుర్రాడి పట్టుదలకు మెచ్చిన కోచ్ కల్యాణ్ సింగ్ అతడికి తన సంస్కృతి క్రికెట్ అకాడమీలో ఉచితంగా శిక్షణ ఇచ్చాడు. స్పిన్‌పై పట్టు సాధించిన అతడు.. స్థానిక టోర్నీల్లో ఆడుతూ ప్రత్యేకతను చాటుకున్నాడు. ఆపై కాన్పూర్ క్రికెట్ అకాడమీలో అవకాశం రావడంతో ఈ లెఫ్ట్‌ఆర్మ్ స్పిన్నర్ మరింత మెరుగయ్యాడు. 2024 యూపీ టీ20 ప్రీమియర్ లీగ్ విశాల్ కెరీర్‌ను మలుపు తిప్పింది. ఈ టోర్నీలో గోరఖ్‌పూర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన అతడు.. స్టార్ ఆటగాళ్లతో ఆడి ఆత్మవిశ్వాసాన్ని పెంచుకున్నాడు. 4 మ్యాచ్‌ల్లో 8 వికెట్లు తీసిన అతడు.. ఓ మ్యాచ్‌లో నితీశ్ రాణాను బోల్తా కొట్టించాడు. ఐపీఎల్‌లో ఆడే అవకాశం వస్తుందని విశాల్ కలలోనూ అనుకోలేదు. అతడికి ఒక్క ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ ఆడిన అనుభవం లేకపోవడమే ఇందుకు కారణం. ఫ్రాంఛైజీలు ఆసక్తి ప్రదర్శించడంతో వేలంలో చోటు సంపాదించిన ఈ స్పిన్నర్‌పై పంజాబ్ కింగ్స్ నమ్మకం ఉంచడంతో వచ్చే ఏడాది ఐపీఎల్‌లో బరిలో దిగే అవకాశాన్ని దక్కించుకున్నాడు. "కొన్నేళ్ల క్రితం గోరఖ్‌పూర్‌లో కొంతమంది పిల్లలు టెన్నిస్ బాల్ క్రికెట్ ఆడుతున్నారు. వారిలో ఒక కుర్రాడు బంతిని మెరుగ్గా లెగ్ స్పిన్ చేయడం ఆశ్చర్యం కలిగించింది. 'నా అకాడమీకి వస్తావా' అని అడిగా. అతడు ఆనందంగా ఒప్పుకున్నాడు. విశాల్ ప్రయాణం అప్పుడే మొదలైంది" అని కోచ్ కల్యాణ్ చెప్పాడు.

కాన్వే 178 నాటౌట్.. లేథమ్ 137

కివీస్ 334/1


లేథమ్ కాన్వే

మౌంట్ మాంగనుయ్: వెస్టిండీస్‌తో మూడు టెస్టుల సిరీస్‌ను చేజిక్కించుకునే దిశగా న్యూజిలాండ్ చివరి మ్యాచ్‌ను ఘనంగా ఆరంభించింది. గురువారం టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ఆ జట్టు ఆట చివరికి ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 334 పరుగులు చేసింది. డెవాన్ కాన్వే (178 బ్యాటింగ్; 279 బంతుల్లో 25×4) భారీ శతకంతో అజేయంగా నిలవగా.. మరో ఓపెనర్, కెప్టెన్ టామ్ లేథమ్ (137; 246 బంతుల్లో 15×4, 1×6) కూడా సెంచరీ చేశాడు. వీళ్లిద్దరూ తొలి వికెట్‌కు ఏకంగా 323 పరుగులు జోడించారు. ఈ ఏడాది టెస్టుల్లో ఏ వికెట్‌కైనా ఇదే అత్యుత్తమ భాగస్వామ్యం. న్యూజిలాండ్ తరఫున తొలి వికెట్‌కు ఇది రెండో అత్యుత్తమం. కాన్వే, లేథమ్‌ల జోరు చూస్తే తొలి రోజు వికెట్టే కోల్పోకుండా కివీస్ ఆట ముగించేలా కనిపించింది. అయితే ఇంకో 3 ఓవర్లే మిగిలుండగా.. లేథమ్‌ను పేసర్ రోచ్ ఔట్ చేశాడు. ఆట చివరికి కాన్వేకు తోడుగా నైట్ వాచ్‌మన్ జాకబ్ డఫీ (9) క్రీజులో ఉన్నాడు. సిరీస్ తొలి మ్యాచ్‌ను విండీస్ వీరోచితంగా పోరాడి డ్రాగా ముగించగా.. రెండో టెస్టులో కివీస్ నెగ్గింది.

ఇంగ్లాండ్ తడబాటు

తొలి ఇన్నింగ్స్‌లో 213/8



కమిన్స్

అడిలైడ్: యాషెస్ సిరీస్‌లో అదే కథ. ఇంగ్లాండ్ తేలిపోతుండగా.. ఆతిథ్య ఆస్ట్రేలియా తిరుగులేని ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. ఘనవిజయాలతో ఇప్పటికే సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో ఉన్న ఆసీస్.. మూడో టెస్టుపైనా పట్టుబిగిస్తోంది. కెప్టెన్ కమిన్స్ (3/54), బోలాండ్ (2/31), లైయన్ (2/51) విజృంభించడంతో రెండో రోజు, గురువారం ఆట ముగిసే సమయానికి ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 213 పరుగులకే 8 వికెట్లు కోల్పోయింది. ఆ జట్టు ఒక దశలో 71 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి చిక్కుల్లో పడింది. క్రాలీ (9), రూట్ (19)ను కమిన్స్ ఔట్ చేయగా.. పోప్ (3), డకెట్ (29)ను లైయన్ వెనక్కి పంపాడు. ఆ దశలో బ్రూక్ (45), కెప్టెన్ స్టోక్స్ (45 బ్యాటింగ్) జట్టును ఆదుకున్నారు. 127/4తో ఇంగ్లాండ్ కాస్త కోలుకుంది. కానీ 41 పరుగుల వ్యవధిలో నాలుగు వికెట్లు కోల్పోయి 168/8తో కష్టాల్లో చిక్కుకుంది. అయితే పట్టుదలతో నిలిచిన స్టోక్స్‌కు ఆర్చర్ (30 బ్యాటింగ్) అండగా నిలవడంతో ఇంగ్లాండ్ 200 దాటింది. మరో వికెట్ కోల్పోకుండా రెండో రోజును ముగించింది. ఇంగ్లాండ్ ఇంకా 158 పరుగులు వెనుకబడి ఉంది. ఉదయం 326/8తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా.. 371 పరుగులకు ఆలౌటైంది.

రెజ్లర్ల స్వతంత్ర శిక్షణపై నిషేధం: డబ్ల్యూఎఫ్ఐ

దిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) కొత్త సెలెక్షన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. జాతీయ జట్టుకు ఎంపికవ్వాలంటే దిగ్గజ, స్టార్ క్రీడాకారులు సహా ప్రతి ఒక్కరు శిక్షణ శిబిరాలకు హాజరవడం తప్పనిసరి చేసింది. రెజ్లర్లు స్వతంత్రంగా శిక్షణ పొందకుండా నిషేధం విధించింది. జట్టుకు ఎంపికైన క్రీడాకారులు కేటాయించిన శిబిరంలోనే శిక్షణ తీసుకోవాలని నిబంధన రూపొందించింది. ఒలింపిక్ కోటా క్రీడాకారులు ఫైనల్ వన్- బౌట్ సెలెక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనాలని స్పష్టంచేసింది. ఇటీవల అహ్మదాబాద్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో డబ్ల్యూఎఫ్ఐ ఈ మేరకు చర్చించి.. తీర్మానాన్ని ఆమోదించింది. అభిప్రాయం, సమీక్ష కోసం భారత క్రీడాప్రాధికార సంస్థ (సాయ్)కు నివేదించింది.

గంభీర్ కోచ్ కాదు.. మేనేజర్


కపిల్

కోల్‌కతా: ఆధునిక క్రికెట్లో కోచ్ పాత్ర ఆటగాళ్ల బాగోగులు చూసుకోవడం తప్ప.. కోచింగ్ ఇవ్వడం కాదని భారత మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ అన్నాడు. ఇప్పుడు గౌతమ్ గంభీర్ కూడా టీమ్‌ఇండియాకు కోచ్ కాదని మేనేజర్ మాత్రమేనని అతడు పేర్కొన్నాడు. "ఆధునిక క్రికెట్లో 'కోచ్' అనే పదాన్ని తప్పుగా వాడుతున్నారు. గంభీర్ కోచ్ కాదు. జట్టుకు మేనేజర్ మాత్రమే. పాఠశాల, కళాశాలల్లో ఆటలను నేర్పేవాడు మాత్రమే కోచ్. కోచ్ అనే పేరు ఇచ్చినంత మాత్రాన ఆ పాత్రను ఎవరూ పోషించలేరు. ఎందుకంటే ఒక లెగ్‌స్పిన్నర్ లేదా వికెట్‌కీపర్‌కు గంభీర్ ఎలా కోచ్ అవుతాడు? ఆటగాళ్లను చూసుకోవడం వరకే ప్రస్తుత కోచ్ పని. ప్లేయర్లకు ప్రోత్సాహం అందించాలి. స్ఫూర్తి రగిలించాలి. ఆటగాళ్లు జట్టులో సౌకర్యంగా ఉండేలా చూసుకోవాలి. ఇవి కోచ్ విధులు" అని కపిల్ చెప్పాడు.

యాషెస్‌లో స్నికో గొడవ



జేమీ స్మిత్ ఔటయ్యాడిలా.. కేరీ బతికిపోయాడిలా..

యాషెస్ సిరీస్‌లో డీఆర్ఎస్ చిచ్చు రేగింది. వరుసగా రెండో రోజూ స్నికో టెక్నాలజీ వివాదానికి కారణమైంది. గురువారం కమిన్స్ బౌలింగ్‌లో ఇంగ్లాండ్ బ్యాటర్ జేమీ స్మిత్ పుల్ షాట్ ఆడే ప్రయత్నంలో గురి తప్పాడు. క్యాచ్ ఔట్ కోసం ఆస్ట్రేలియా అప్పీలు చేయగా, ఫీల్డ్ అంపైర్ నితిన్ మేనన్.. మూడో అంపైర్ క్రిస్ గఫానేకు నివేదించాడు. బంతి.. బ్యాటును దాటిపోయిన తర్వాతే స్నికో స్పైక్ కనిపించినా స్మిత్ ఔటైనట్లు గఫానే ప్రకటించాడు. బంతికి, బ్యాటుకు మధ్య అంతరం స్పష్టంగా కనిపించింది. స్మిత్, నాన్ స్ట్రైక్ ఎండ్‌లో ఉన్న స్టోక్స్.. అంపైర్ మేనన్‌తో వాదించడం కనిపించింది. స్నికో వల్ల బుధవారం కూడా ఇంగ్లాండ్‌కు నష్టం జరిగింది. వ్యక్తిగత స్కోరు 72 వద్ద అలెక్స్ కేరీకి జీవనదానం లభించింది. టంగ్ బంతిని కేరీ కట్ చేయగా.. బంతి వెళ్లి స్మిత్ చేతుల్లో పడింది. క్యాచ్ ఔట్ కోసం చేసిన అప్పీలును అంపైర్ ఎహసాన్ రజా తిరస్కరించడంతో ఇంగ్లాండ్ సమీక్ష కోరింది. స్నికో మీటర్‌పై పెద్ద స్పైక్ వచ్చినా.. అప్పీలును గఫానె తిరస్కరించాడు. స్పైక్ వచ్చినప్పుడు బ్యాటుకు బంతి దూరంగా ఉండడమే అందుకు కారణం. బంతి తన బ్యాటును తాకుతూ వెళ్లినట్లు తర్వాత స్వయంగా కేరీనే అంగీకరించాడు. స్నికో టెక్నాలజీ ఆపరేటర్ తప్పిదం వల్లే.. కేరీ ఔట్ నుంచి తప్పించుకోగలిగాడని స్నికోను నిర్వహించే సంస్థ బీబీజీ స్పోర్ట్స్ అంగీకరించింది. తప్పిదానికి క్షమాపణలు చెప్పింది. స్ట్రైకర్ ఎండ్‌లో స్టంప్ మైక్రోఫోన్ శబ్దాన్ని కాకుండా.. బౌలర్ ఎండ్‌లోని స్టంప్ మైక్రోఫోన్ శబ్దాన్ని సమీక్షకు ఉపయోగించడమే మూడో అంపైర్ తప్పుడు నిర్ణయం తీసుకోవడానికి కారణమైందని అర్థమవుతోంది. శబ్ద తరంగాల ఆధారంగా స్నికోమీటర్ పనిచేస్తుంది.

ఈనాడు

విజయవాడ 19-12-2025 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 129
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



మోదీకి 'ఆర్డర్ ఆఫ్ ఒమన్'ను అందిస్తున్న ఒమన్ సుల్తాన్ హైథమ్ బిన్ తారిక్

ఒమన్‌తో భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

మరింత బలోపేతం కానున్న వ్యూహాత్మక భాగస్వామ్యం

ప్రధాని మోదీకి ఒమన్ అత్యున్నత పౌర పురస్కారం

నకిలీ మద్యం కేసులో జోగి సోదరులకు చుక్కెదురు

బెయిల్ పిటిషన్లను తోసిపుచ్చిన ఎక్సైజ్ కోర్టు

జనార్దనరావు, జగన్మోహన్‌రావుల పిటిషన్లూ తిరస్కరణ

లోపలి పేజీల్లో

తుపాకులతో బెదిరించి.. బ్యాంకు దోపిడీకి యత్నం

అనకాపల్లిలో కలకలం

10లో

భూముల లిటిగెంట్లపై పీడీ చట్టం



కలెక్టర్ల సదస్సులో మాట్లాడుతున్న చంద్రబాబు. పక్కన సీఎస్ విజయానంద్

వచ్చే భేటీలో భూ సమస్యలే తొలి ఎజెండా

పట్టాదారు పాసుపుస్తకాలు కొరియర్‌లో పంపాలి

కలెక్టర్లకు సీఎం చంద్రబాబు ఆదేశాలు

ఉత్తరాంధ్రలో రాజకీయ నేతల జోక్యం పెరిగిందన్న పవన్

ఈనాడు – అమరావతి

'భూ వివాదాల్లో కొందరు కావాలనే వివాదాలు సృష్టిస్తున్నారు. చిక్కులు పెంచుతున్నారు. వారిపై అవసరమైతే పీడీ చట్టం ప్రయోగించి, జైల్లో వేస్తాం' అని ముఖ్యమంతి చంద్రబాబు హెచ్చరించారు. సచివాలయంలో గురువారం కలెక్టర్ల సదస్సులో.. రెవెన్యూ శాఖపై చర్చ సందర్భంగా సీఎం మాట్లాడుతూ '22ఏలో పెట్టిన భూముల సమస్యలన్నీ త్వరగా తేల్చాలి. కొన్ని ఇళ్లు కూడా 22ఏలో ఉన్నాయి. వాటిపై ఇళ్లల్లో ఉన్నవారికి హక్కులు కల్పించాలి. పట్టాదారు పాసుపుస్తకాలు కొరియర్ ద్వారా ఇళ్లకు పంపితే, ఆలస్యాన్ని నివారించొచ్చు. తర్వాత రిజిస్ట్రేషన్ల డాక్యుమెంట్లు కూడా కొరియర్‌లో పంపే అంశం పరిశీలించాలి. మళ్లీ వాళ్లు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి రాకుండా చేయొచ్చు' అని సూచించారు. ఈ చర్చలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, 'విశాఖ, అనకాపల్లి, విజయనగరం తదితర ఉత్తరాంధ్ర జిల్లాల్లో భూకబ్జాల్లో రాజకీయ నాయకుల జోక్యంపై ఫిర్యాదులు వచ్చాయి. వారితో సంబంధం లేకుండా సమస్యలు పరిష్కరించేలా చూడాలి' అని పేర్కొన్నారు. సీఎం స్పందిస్తూ 'కలెక్టర్లు, ఎస్పీలు ఏ రాజకీయ నాయకుడి ప్రమేయాన్నీ అంగీకరించొద్దు. రికార్డుల ప్రకారమే వెళ్లాలి. ఎవరు తప్పు చేసినా వదిలిపెట్టే ప్రసక్తి లేదని స్పష్టంచేశారు. రికార్డుల డిజిటలీకరణ అవసరాన్ని మంత్రి మనోహర్ ప్రస్తావించారు.

జాయింట్ ఎల్పీఎంలపై జేసీలతో పరిశీలన

భూరికార్డులు, రిజిస్ట్రేషన్లు, ఆస్తి పత్రాలన్నీ డిజిటలైజ్ చేస్తున్నాం. కీలక డాక్యుమెంట్లన్నీ క్లౌడ్‌లో పెడతాం. లింక్ డాక్యుమెంట్లు డేటా వేర్‌హౌసింగ్‌లో పెడుతున్నాం.

■ రాష్ట్రంలో 2019-24 మధ్య అప్పటి పాలకులు తమకు దక్కని భూములను 22ఏ కింద నిషిద్ధ జాబితాలో చేర్చారు. అమ్ముకుందామని వెళ్లేసరికి హక్కుదారులు లబోదిబోమనే పరిస్థితి వచ్చింది. భూ సమస్యలను వంద శాతం పరిష్కరించి ప్రజలకు సవ్యంగా డాక్యుమెంట్లు ఇవ్వాల్సిన బాధ్యత కలెక్టర్లదే. జాయింట్ ఎల్పీఎం భూములపై ప్రతి జిల్లాలో ఒక జాయింట్ కలెక్టర్‌తో పరిశీలన చేయించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి

■ పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలను జారీ చేద్దాం. రికార్డుల నవీకరణ నమోదైన చోటు నుంచే నేరుగా హక్కుదారుకు కొరియర్‌లో పంపాలి.

(మిగతా 5లో)

మేమొచ్చిన 2 నెలల్లో మీరంతా జైళ్లకే

వైద్య కళాశాలల నిర్వాహకులకు జగన్ హెచ్చరికలు

జగన్ అవివేకానికి ఇది పరాకాష్ఠ

ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజం

జగన్ వారినేమీ చేయలేరు

పీపీపీ విధానాన్ని సమర్థించిన న్యాయమూర్తులను జైలుకు పంపుతారా?

మంత్రి సత్యకుమార్

5లో



బిల్లును ఉపసంహరించుకోవాలంటూ పార్లమెంటు ప్రాంగణంలో నిరసన తెలుపుతున్న మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, ఇతర విపక్ష నేతలు

జీ రామ్ జీ బిల్లుకు పార్లమెంటు ఆమోదం

- లోక్‌సభ సమ్మతించిన గంటల్లోనే రాజ్యసభలోనూ..
- అర్ధరాత్రి వరకు కొనసాగిన ఎగువసభ
- ప్రతుల్ని చించి లోక్‌సభలో విపక్షాల నిరసన
- కాంగ్రెస్ ఆరోపణల్ని తిప్పికొట్టిన కేంద్ర మంత్రి చౌహాన్

దిల్లీ: గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైనవారికి ఏడాదిలో 125 రోజుల పాటు పని కల్పించే 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్)' (వీబీ-జీ రామ్ జీ) బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. గురువారం సాయంత్రం లోక్‌సభ ఆమోదించి, కొన్ని గంటల్లోనే పంపిన బిల్లుకు ఎగువసభ అర్ధరాత్రి సమయంలో (మిగతా 3లో)

బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్‌గా చంద్రబాబు

- అవార్డుకు ఎంపిక చేసిన 'ది ఎకనమిక్ టైమ్స్' దినపత్రిక
- పారిశ్రామిక సంస్కరణలు, పెట్టుబడుల ఆకర్షణకు గుర్తింపు
- మార్చిలో నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా ప్రదానం



చంద్రబాబును అభినందిస్తున్న పవన్ కల్యాణ్

ఈనాడు, అమరావతి: ప్రముఖ దినపత్రిక ది ఎకనమిక్ టైమ్స్ ఏటా అందించే ప్రతిష్ఠాత్మక 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు ముఖ్యమంత్రి చంద్రబాబును వరించింది. ఆంధ్రప్రదేశ్‌లో వ్యాపార అనుకూల విధానాల అమలు, పారిశ్రామిక సంస్కరణలు, రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షిస్తున్నందుకు ఆయన్ను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు 'ది ఎకనమిక్ టైమ్స్' ప్రకటించింది. వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో (మిగతా 3లో)



సంపద అంటే..

సంపద కలిగి ఉండటమంటే ఏది పడితే అది కొనగలగడం కాదు. సంపద అంటే..

- మీకు స్వేచ్ఛను అందించగలిగేది.
- మీరు ఎప్పుడు కావాలంటే అప్పుడు పదవీ విరమణ చేయగలగే ధైర్యాన్నిచ్చేది.
- మీ కుటుంబానికి సహకరించే శక్తినిచ్చేది.
- మీకు నచ్చని విషయాన్ని నిర్మొహమాటంగా నచ్చలేదని చెప్పగలిగే తెగువనిచ్చేది.
- మీకు ఏదైతే నచ్చుతుందో అది మీరు చేయగలిగే వెసులుబాటునందించేది.

– పీటర్ మలౌక్, ఆర్థిక సలహాదారు

గ్రహం అనుగ్రహం

19–12–2025 శుక్రవారం


శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, మార్గశిర మాసం, బహుళపక్షం
అమావాస్య: తె. 6-23 తదుపరి పుష్య శుక్ల పక్ష పాడ్యమి
జ్యేష్ఠ: రా. 10-51 తదుపరి మూల
వర్జ్యం: లేదు
అమృత ఘడియలు: మ. 1-07 నుంచి 2-53 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-39 నుంచి 9-23 వరకు తిరిగి మ. 12-18 నుంచి 1-02 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.6.28; **సూర్యాస్తమయం:** సా.5.26

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	7.7	29.3
హైదరాబాద్	11.7	30.4
అనంతపురం	14.2	30.0
కర్నూలు	15.5	31.6
విజయనగరం	16.0	27.0
విశాఖపట్నం	16.8	28.6
కడప	17.0	28.0
శ్రీకాకుళం	17.0	28.0
రాజమహేంద్రవరం	17.0	32.5
గుంటూరు	18.0	31.0
విజయవాడ	18.8	29.1
తిరుపతి	19.1	29.2
నరసాపురం	19.2	31.4
ఒంగోలు	19.9	29.7
నెల్లూరు	22.0	28.7
తాడేపల్లిగూడెం	28.0	30.0



వజ్రోత్సవాల సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు. చిత్రంలో సెంట్రల్ విజిలెన్స్ విశ్రాంత కమిషనర్ కె.వి.చౌదరి, సినీ నిర్మాత అక్కినేని వెంకట్, శాస్త్రవేత్త జి.వి.రామిరెడ్డి, కళాశాల కార్యదర్శి అండ్ కరస్పాండెంట్ కె.ఎస్.అప్పారావు, గుడివాడ ఎమ్మెల్యే రాము, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు, కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు, ప్రిన్సిపల్ డా.పి.జె.ఎస్.కుమార్, వజ్రోత్సవ కమిటీ ఛైర్మన్ కొల్లి శ్రీనివాస్, డాక్టర్ సూరపనేని శ్రీనివాస్ తదితరులు



వజ్రోత్సవాల సావనీర్‌ను హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా ఆవిష్కరిస్తున్న రామోజీ గ్రూపు సంస్థల సీఎండీ కిరణ్

ఏఎన్నార్ కళాశాల.. విశ్వవిద్యాలయంగా ఎదగాలి

- పూర్వ విద్యార్థులంతా తోడ్పాటునందిస్తేనే ఇది సాధ్యం
- ఏఐ యుగంలో ఉన్నాం, విద్యా విధానంలో మార్పులు రావాలి
- వజ్రోత్సవాల్లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



ఈనాడు, అమరావతి, ఈనాడు డిజిటల్– మచిలీపట్నం, న్యూస్‌టుడే, గుడివాడ: ఎంతోమందిని ఉన్నతంగా తీర్చిదిద్దిన అక్కినేని నాగేశ్వరరావు కళాశాల మరింత అభివృద్ధి చెంది విశ్వవిద్యాలయంగా ఎదగాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. అందుకు అవసరమైన మౌలిక సౌకర్యాలు, మంచి వాతావరణం కల్పించడానికి ఇక్కడి నుంచి ఎదిగిన ప్రతిఒక్కరూ సహకారం అందించాలని సూచించారు. గుడివాడలోని ఏఎన్నార్ కళాశాలను స్థాపించి 75 ఏళ్లు పూర్తైన సందర్భంగా నిర్వహించిన వజ్రోత్సవాల ముగింపు కార్యక్రమంలో గురువారం వెంకయ్యనాయుడు గౌరవ అతిథిగా పాల్గొన్నారు. వజ్రోత్సవాలకు గుర్తుగా ముద్రించిన పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ 1950ల్లో స్థానిక పెద్దల చొరవతో ఇక్కడ కళాశాలను స్థాపించడం, తర్వాత అక్కినేని నాగేశ్వరరావు ఆర్థిక చేయూతనివ్వడం విద్యార్థులకు వరంగా మారిందని గుర్తుచేశారు. 'ప్రస్తుత విద్యా విధానంలో సమూల మార్పులు రావాలి. ఏఐ యుగంలో ఉన్నాం. సాంకేతికతకు అనుగుణంగా మనమంతా మారాలి. నేటితరం నైపుణ్యాలను పెంచుకుంటేనే పోటీ ప్రపంచంలో రాణించగలరు. ఉపాధిని చూపించే నైపుణ్యాలతో పాటు విజ్ఞానం, సంస్కారం పెంచేలా నూతన విద్యా విధానాన్ని కేంద్ర ప్రభుత్వం రూపొందిస్తోంద'ని వెంకయ్యనాయుడు వివరించారు. ఉపాధ్యాయులు బోధనలో ఆధునిక మార్పులను అందిపుచ్చుకొని, విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ఈ కళాశాలలో చదువుకుని, ఉన్నత స్థానాలకు ఎదిగిన రామోజీరావు వంటివారిని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

విద్యారంగం పరిస్థితి బాగోలేదు

-జస్టిస్ బట్టు దేవానంద్, హైకోర్టు న్యాయమూర్తి

న్యాయమూర్తిగా కాకుండా, ఒకప్పటి ఈ కళాశాల విద్యార్థి సంఘం నాయకుడిగా కొన్ని వాస్తవాలు చెప్పాలనుకుంటున్నా. ప్రస్తుతం విద్యారంగం పరిస్థితి సరిగా లేదు. ప్రభుత్వాలు రూ.వేల కోట్లు విద్యారంగంపై వెచ్చిస్తున్నా, వాటి ఫలాలు విద్యార్థులకు అందడం లేదు. ఉపాధ్యాయులు, అధ్యాపకుల శాశ్వత నియామకాలు చేపట్టకుండా, పొరుగు సేవలు, కాంట్రాక్ట్, గెస్ట్ ఫ్యాకల్టీలతో నెట్టుకొస్తున్నారు. వీరికి ఉద్యోగ భద్రత లేకపోవడంతో నిబద్ధతతో పనిచేసే అవకాశం లేదు. ఇటీవల ఏయూలా కళాశాలకు వెళ్తే, అక్కడ ఒకేఒక్కరు శాశ్వత సిబ్బంది ఉన్నారు. మిగతా వారంతా గెస్ట్ ఫ్యాకల్టీ, ఔట్‌సోర్సింగ్ సిబ్బందే. వాస్తవంగా అక్కడ 25 శాశ్వత పోస్టులున్నాయి. విద్యాసంస్థల్లో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలి. వారిలో నాయకత్వ లక్షణాలను పెంచితే, సమాజానికి తోడ్పాటునందించగలరు. ఇటీవల ప్రభుత్వం మాక్ అసెంబ్లీ నిర్వహించింది. ఇలాంటి వాటికంటే, నాయకులు స్వతహాగా ఎదిగేందుకు విద్యార్థి సంఘాల ఎన్నికలు దోహదపడతాయి. ఇందులో ఇబ్బందులుంటే పరిష్కరించాలి కానీ, ప్రమాదం జరుగుతుందని ప్రయాణాలు మానేయలేం కదా?

వచ్చే 25 ఏళ్లకు ప్రణాళిక ఉండాలి

-కేవీ చౌదరి, సెంట్రల్ విజిలెన్స్ మాజీ కమిషనర్

75 ఏళ్లుగా ఏఎన్నార్ కళాశాల నుంచి వేలమంది ఉన్నతంగా బయటకెళ్లారు. వచ్చే 25 ఏళ్లలో ఏం చేయాలో ఇప్పటినుంచే దృష్టి పెట్టాలి. అప్పుడే గతంలో కంటే రెట్టింపు ఫలితాలు పొందగలం. కాలం తీరిన కోర్సుల స్థానంలో ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా కొత్తవి ప్రవేశపెట్టాలి. కళాశాల కమిటీ ఆధ్వర్యంలో ఆ ప్రయత్నం జరుగుతోంది.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు.. రూ.50 లక్షల విరాళం

- రామోజీ గ్రూప్ సంస్థల సీఎండీ సీహెచ్ కిరణ్

భారతీయులు, ప్రధానంగా తెలుగు వాళ్లలో ఆంత్రప్రెన్యూరల్ స్పిరిట్ బాగా ఎక్కువనీ, తెలుగు రాష్ట్రాల్లోని ఏ జిల్లాలో చూసినా ఈ చొరవ కనిపిస్తుందని రామోజీ గ్రూప్ సంస్థల సీఎండీ సీహెచ్ కిరణ్ పేర్కొన్నారు. ఏఎన్నార్ కళాశాల వజ్రోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు. కళాశాల డైమండ్ జూబ్లీ సావనీర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కిరణ్ మాట్లాడుతూ గతంలో పెద్దలు ఎంతో ముందుచూపుతో వ్యవహరించేవారని, భావితరాలకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఎంతోమంది భూరి విరాళాలు అందించారని గుర్తుచేశారు. 'గుడివాడ ప్రభుత్వ కళాశాల, విజయవాడ లయోలా, గుంటూరులోని పలు కళాశాలలకు భారీగా విరాళాలిచ్చారు. వారి సహకారంతోనే విద్యాపరంగా ఈరోజు ఎంతో పురోగతి సాధించగలిగాం. మనం చదువుకున్న విద్యాసంస్థతో అనుబంధం నెమరువేసుకోవడం ఒక అనుభూతి. కానీ, తల్లిదండ్రులు చదువుకున్న విద్యాసంస్థతో అనుబంధాన్ని గుర్తుచేసుకోవడం వేరే స్థాయి అనుభూతి. నాన్న రామోజీరావు చదువుకున్న ఈ కళాశాలకు వచ్చి మొత్తం తిరిగి చూడాలనుకున్నాను. భవిష్యత్తులో కచ్చితంగా వచ్చి చూస్తాను' అని కిరణ్ పేర్కొన్నారు.

వృత్తి, వ్యక్తిగత నైపుణ్యాలు పెంచాలి

విద్యలో మనవాళ్లు బాగా ఆరితేరుతున్నా.. మానవ, వృత్తి, వ్యక్తిగత సంబంధాలు, నైపుణ్యాల విషయంలో వెనకబడి ఉన్నారని కిరణ్ పేర్కొన్నారు. 'ప్రపంచంలో నెగ్గుకురావడం, పది మందితో కలిసి జీవించడం అనేవే పాఠ్యాంశాలు, బోధనాంశాలుగా చెప్పాల్సిన అగత్యం ఏర్పడుతోంది. న్యూక్లియర్ కుటుంబాల వల్ల వీటిని నేర్పించడానికి పెద్దవాళ్లు ఎవరూ ఉండడం లేదు. అందుకే నాన్న పేరుతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏఎన్నార్ కళాశాల కమిటీ సహకారంతో అభివృద్ధి చేయాలని మా కుటుంబం అంతా నిర్ణయించుకున్నాం. ఎలా చేయాలో ఓ ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తాం. దీన్ని ప్రారంభించేందుకు కుటుంబం తరఫున రూ.50 లక్షల విరాళం అందించాలి అనుకుంటున్నామ'ని వెల్లడించారు. కళాశాల వందేళ్ల వేడుకకు కూడా అందరం కలిసే అవకాశం ఇవ్వాలని దేవుడిని ప్రార్థిస్తున్నానన్నారు.



వజ్రోత్సవాలకు హాజరైన ప్రముఖులు, పూర్వవిద్యార్థులు. ●వర్చువల్‌గా మాట్లాడుతున్న రామోజీ గ్రూపు సంస్థల సీఎండీ కిరణ్



చంద్రబాబును సన్మానిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు. చిత్రంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీలు

దిల్లీ చేరుకున్న సీఎం చంద్రబాబు

- ఎంపీల అభినందన
- నేడు ఆరుగురు కేంద్ర మంత్రులతో భేటీ

ఈనాడు, దిల్లీ: ముఖ్యమంత్రి చంద్రబాబు 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డుకు ఎంపికైన సందర్భాన్ని పురస్కరించుకుని తెదేపా ఎంపీలు ఆయనకు అభినందనలు తెలిపారు. దిల్లీ పర్యటన కోసం కేంద్ర మంత్రులను కలిసేందుకు గురువారం రాత్రి దిల్లీ చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికారు. బొబ్బిలి వీణను బహూకరించి శాలువాతో సత్కరించారు. ఎంపీలకు ధన్యవాదాలు తెలిపిన చంద్రబాబు.. అవార్డులు మన బాధ్యతను పెంచుతాయన్నారు. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజలకు లభించిన గుర్తింపు అని వ్యాఖ్యానించారు. ఇదే సందర్భంగా గురువారం కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడి పుట్టిన రోజును పురస్కరించుకొని ఆయన చేత కేక్ కట్ చేయించిన చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

- శుక్రవారం చంద్రబాబు ఆరుగురు కేంద్ర మంత్రులతో సమావేశం కానున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రోడ్డు, రవాణా మంత్రి నితిన్ గడ్కరీ, జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ, జలరవాణాశాఖ మంత్రి సర్బానంద్ సోనోవాల్‌లతో భేటీ అవుతారు. కేంద్ర భాగస్వామ్యంతో రాష్ట్రంలో చేపట్టిన పలు ప్రాజెక్టులు, కార్యక్రమాలపై వారితో చర్చిస్తారు. శుక్రవారం రాత్రికి అమరావతి చేరుకుంటారు. శనివారం అనకాపల్లిలో జరిగే 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొంటారు.

పప్పుధాన్యాల కొనుగోలుకు కేంద్రం అనుమతి

ఈనాడు–అమరావతి: రాష్ట్రంలో పప్పుధాన్యాల కొనుగోలుకు కేంద్రం అనుమతించింది. ధరల మద్దతు పథకం (పీఎస్‌ఎస్) కింద మద్దతు ధరపై 1,16,690 టన్నుల కందులు, 903 టన్నుల పెసర, 28,440 టన్నుల మినుముల సేకరణకు ఆమోదం ఇచ్చినట్లు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నుంచి రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడుకు లేఖ అందింది.



బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్‌గా ఎంపికైన సీఎం చంద్రబాబుకు అభినందనలు తెలుపుతున్న మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, కందుల దుర్గేష్, బీసీ జనార్దన్‌రెడ్డి, డీబీవీ స్వామి, ఆనం రామనారాయణరెడ్డి, రామానాయుడు, అనిత, నాదెండ్ల మనోహర్, అచ్చెన్నాయుడు, లోకేశ్, సత్యప్రసాద్, సీఎస్ విజయానంద్ ★ మంత్రులు ఫరూక్, రవీంద్ర, నారాయణ, సత్యకుమార్, పయ్యావుల కేశవ్, పార్థసారథి, సవిత, సంధ్యారాణి

‘బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్’గా చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా సీఎం ఈ అవార్డును అందుకోనున్నారు. భారతి గ్రూప్ ఛైర్మన్ సునీల్ భారతి మిట్టల్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్, కోటక్ మహీంద్ర బ్యాంకు వ్యవస్థాపకులు ఉదయ్ కోటక్, నారాయణ హెల్త్ వ్యవస్థాపకులు డాక్టర్ దేవిశెట్టి, ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా వంటి ప్రముఖులు సభ్యులుగా ఉన్న జ్యూరీ చంద్రబాబును ఎంపిక చేసింది.

ఈ గౌరవం రాష్ట్ర ప్రజలదే

రాష్ట్రం పెట్టుబడులకు గమ్యస్థానంగా మారిందనడానికి తనకు వచ్చిన ‘బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్’ పురస్కారం బలమైన గుర్తింపు అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఇందులో భాగస్వామిగా ఉన్నందుకు గర్వపడుతున్నట్టు తెలిపారు. ఈ పురస్కారాన్ని ప్రకటించిన ది ఎకనమిక్ టైమ్స్ పత్రికకు ఎక్స్ వేదికగా ధన్యవాదాలు తెలియజేశారు. ‘రాష్ట్రంలో ఉన్న అపార సామర్థ్యాన్ని వెలికి తీయడంలో నా కృషితో పాటు ప్రజల కఠిన శ్రమ ఉంది. ఇది రాష్ట్ర ప్రజలకు దక్కిన గౌరవం. అలాగే రాష్ట్రంపై నమ్మకం ఉంచి, పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన ప్రతి వ్యాపారవేత్తది’ అని చంద్రబాబు పేర్కొన్నారు.

సీఎం మార్గదర్శకత్వంలో పని చేస్తాం: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

చంద్రబాబుకు అవార్డు దక్కడంపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కలెక్టర్ల సదస్సులో అభినందనలు తెలిపారు. ‘ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వ శైలి ఎంతో స్ఫూర్తినిస్తుంది. రాష్ట్రాభివృద్ధి, నవతరం భవిష్యత్తు కోసం ఆయన అమలు చేస్తున్న పాలనా విధానాలు, పారిశ్రామిక వృద్ధికి చేపడుతున్న సంస్కరణలు కచ్చితంగా సత్ఫలితాలిస్తాయి. ఆయనకు దక్కిన ఈ అవార్డు రాష్ట్రానికి గర్వకారణమే కాదు.. ఒక బ్రాండ్ ఇమేజ్‌ను కూడా తీసుకొస్తుంది. ఆయన మార్గదర్శకత్వంలో మేమందరం రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తాం’ అని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

22న జనసేన పదవి- బాధ్యత సమావేశం

ఈనాడు, అమరావతి: కూటమి ప్రభుత్వంలో జనసేన పార్టీ తరఫున నామినేటెడ్ పదవులు పొందిన వారితో జనసేన అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ నెల 22న గుంటూరు జిల్లా మంగళగిరిలో ‘పదవి- బాధ్యత’ పేరుతో ఈ సమావేశం నిర్వహించనున్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ సమావేశంలో పాల్గొంటారు. వారు ప్రజల ఆకాంక్షలు ఎలా నెరవేర్చాలో పవన్‌కల్యాణ్ దిశా నిర్దేశం చేస్తారు. సమావేశ నిర్వహణకు ఆహ్వాన కమిటీని ఏర్పాటు చేశారు.

అవార్డు క్రెడిట్ అంతా మీదే

- సీఎస్, కార్యదర్శులు, హెచ్‌వోడీలు, కలెక్టర్లది ముఖ్య భూమిక
- ‘బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్’ అవార్డు దక్కడంపై సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ఎకనమిక్ టైమ్స్ ‘బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్’ అవార్డు తనకు దక్కడం వెనుక క్రెడిట్ అంతా సహచర మంత్రులు, సీఎస్, సీనియర్ అధికారులు, కార్యదర్శులు, హెచ్‌వోడీలు, కలెక్టర్లదేనని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. గతంలో అవార్డులు ఎప్పుడూ తీసుకోలేదని, విదేశీ వర్సిటీలు డాక్టరేట్ ఇస్తామన్నా సున్నితంగా తిరస్కరించానని చెప్పారు. “ఇప్పుడు అవార్డు దక్కడంతో వచ్చిన గుర్తింపు నాకు కాదు.. రాష్ట్రం బెస్ట్ అని గుర్తించడం సంతోషంగా ఉంది” అని వెల్లడించారు. సచివాలయంలో గురువారం నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబుకు అవార్డు వచ్చిన విషయాన్ని మంత్రి అచ్చెన్నాయుడు ప్రస్తావించారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఇతర మంత్రులు, ఉన్నతాధికారులు, కలెక్టర్లు లేచి నిల్చుని చప్పట్లతో ముఖ్యమంత్రికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. “సులభతర వాణిజ్యంలో 2014-19 మధ్య మొదటి ఏడాది మాత్రమే మనం రెండో స్థానంలో నిలిచాం. అప్పుడు గుజరాత్ తొలి స్థానంలో ఉంది. రెండో ఏడాది నుంచి నాలుగేళ్లపాటు ఏపీనే నంబరు వన్. ఎన్నిసార్లు నిబంధనలు మార్చినా మనమే తొలిస్థానాన్ని ఆక్రమించాం. ఇప్పుడు గేర్ మార్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తీసుకొచ్చాం. కేవలం 18 నెలల కాలంలో 25 పాలసీలు తీసుకొచ్చాం. ప్రతి నెలా ఎస్ఐపీసీ, ఎస్ఐపీబీ పెట్టుకుని పెట్టుబడులకు మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలుపుతున్నాం. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కేంద్రం పూర్తిగా సహకరిస్తున్నారు. కార్మిక సంస్కరణలు అమలుకు రాష్ట్రాన్ని సంప్రదించాలని ప్రధాని మోదీ కేంద్ర కార్మికశాఖకు సూచించారు. మిగతా రాష్ట్రాలైతే ముందు వెనకా ఆలోచిస్తాయి. ఆంధ్రప్రదేశ్‌ను కోరితే చేసి చూపిస్తారని అన్నారు. ఇక్కడ అమల్లోకి తీసుకొచ్చి ఆయన అన్న మాటను నిజం చేశాం” అని చంద్రబాబు అన్నారు.

గేర్ మార్చి స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్

‘ఇప్పుడు మరింత వేగంగా ముందుకు వెళ్లేందుకు గేర్ మార్చి స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ తీసుకొస్తున్నాం. ఈ విధానం అమలు తీరు చూసి రాబోయే రోజుల్లో అన్ని రాష్ట్రాలు మనల్ని సంప్రదించాలి. అన్ని దేశాలు మన గురించి మాట్లాడుకోవాలి. సాంకేతికత బాగా అభివృద్ధి చెందింది. కొత్త శకంలోకి అడుగుపెడుతున్నాం’ అని సీఎం తెలిపారు. ఈ సందర్భంగా ‘వేగంగా పాలన, సర్వీసులు అందించేందుకు ‘స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్’ ప్రజలకు చేరువయ్యేలా ఏ పేరు పెడితే బాగుంటుందనే దానిపై చర్చ జరిగింది. పలువురు మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు వివిధ పేర్లు సూచించారు.

ఒక తరం ముందు ఆలోచిస్తారు: పయ్యావుల

“వైకాపా హయాంలో రాష్ట్రం దాదాగిరిని చూసింది. ఇప్పుడు నాయుడుగిరి అనే పదం పరిచయమైంది. సీఎం చంద్రబాబు ఒక తరం ముందు ఆలోచిస్తారు. సంస్కరణలు అమలు చేయాలంటే చాలా ధైర్యం ఉండాలి. కానీ ఆయన పదే పదే అమలు చేశారు” అని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రశంసించారు.

★ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం ముందుకు వెళ్లి అన్ని విధాలుగా దేశంలోనే అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షించారు.

చంద్రబాబుకు పురస్కారం రాష్ట్రానికి గర్వకారణం

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎకనమిక్ టైమ్స్ ‘బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్’ పురస్కారాన్ని ప్రకటించడం రాష్ట్రానికి గర్వకారణమని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వ శైలి ఎంతో స్ఫూర్తినిస్తుందని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి, నవతరం భవిష్యత్తు కోసం ఆయన అమలు చేస్తున్న పాలనా విధానాలు, పారిశ్రామిక అభివృద్ధికి చేపడుతున్న సంస్కరణలు కచ్చితంగా సత్ఫలితాలు ఇస్తాయన్నారు. ఈ పురస్కారంతో రాష్ట్రానికి ఒక బ్రాండ్ ఇమేజ్ వస్తుందని పవన్ కల్యాణ్ స్పష్టంచేశారు.

కృషికి తగ్గ అవార్డు ఇది: నిమ్మల

సుదీర్ఘ అనుభవశాలి, దార్శనికుడు, ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబుకు ఈ అవార్డు రావడం ఆయన కృషికి తగ్గ ప్రతిఫలమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

ఎన్నికల్లో కంటే మా కుటుంబంతో పోటీపడటమే కష్టంలా ఉంది: లోకేశ్



ఈనాడు, అమరావతి: ‘నాన్నను బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు వరించింది. అమ్మ గోల్డెన్ పికాక్ అవార్డును ఇంటికి తెచ్చింది. దేశంలోనే బిజినెస్ రంగంలో అత్యంత శక్తివంతమైన మహిళల జాబితాలో నా భార్య స్థానం సంపాదించింది. ఇవి చూస్తే.... ఎన్నికల్లో కంటే మా కుటుంబంతో పోటీపడటమే కష్టమనిపిస్తోంది’ అని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఎక్స్ వేదికగా ఆసక్తికర పోస్ట్ చేశారు. ‘దేశ సంస్కరణల ప్రయాణంలో ఇంత కచ్చితమైన స్పష్టత, ధైర్యం, సమగ్రత ఉన్న నాయకులు చాలా అరుదు. ఈ అవార్డు సంస్కరణలపై ఆయనకున్న నిశితమైన దృష్టికి, పాలనలో వేగం, నమ్మకాన్ని నెలకొల్పిన కృషికి నిదర్శనం. ఇది మా కుటుంబానికే కాదు..రాష్ట్రానికి కూడా గర్వకారణం’ అని మరో పోస్ట్ చేశారు.

చంద్రబాబు కృషికి నిజమైన గుర్తింపు

గవర్నర్ అబ్దుల్ నజీర్

ఈనాడు, అమరావతి: రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిబద్ధత, అంకిత భావం, కృషికి ‘బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్’ అవార్డు నిజమైన గుర్తింపు అని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. సీఎంకు దక్కిన ఈ పురస్కారం రాష్ట్రప్రజలకు గర్వకారణమన్నారు.

జీ రామ్ జీ బిల్లుకు పార్లమెంటు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది. ఆ తర్వాత వాయిదా పడింది. సుదీర్ఘంగా సభ కొనసాగడం విశేషం. తగినంత సమయం ఇవ్వకుండా హడావుడిగా బిల్లులకు ఆమోదం తెలపడం అప్రజాస్వామికమంటూ విపక్షాలు రాజ్యసభ నుంచి వాకౌట్ చేశాయి. అర్ధరాత్రి 12.40 సమయంలో సంవిధాన్ సదన్ వెలుపల ధర్నాకు దిగాయి. రెండు దశాబ్దాలుగా అమల్లో ఉన్న ‘మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం’ (ఎంజీనరేగా) చట్టాన్ని రద్దుచేసి దీనిని తీసుకురావడంపై విపక్షాలు ఉభయసభల్లోనూ మరోసారి నిరసన తెలిపాయి. లోక్‌సభలో స్పీకర్ స్థానం వద్దకు వెళ్లి బిల్లు ప్రతుల్ని చించి విసిరేశాయి. బిల్లు ఆమోదం పొందిన తర్వాత సభ శుక్రవారానికి వాయిదా పడింది. పార్లమెంటు శీతాకాల సమావేశాలకు అది చివరిరోజు. ఎనిమిది గంటలపాటు లోక్‌సభలో, అయిదు గంటలసేపు రాజ్యసభలో జరిగిన చర్చకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సమాధానమిచ్చారు. మునుపటి పథకంలో లోపాలు సరిచేయడానికి మార్పులు తప్పనిసరి అయ్యాయని స్పష్టంచేశారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడతాం: ఖర్గే

బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పార్లమెంటు ప్రాంగణంలో విపక్షాలు నిరసన తెలిపాయి. గాంధీ విగ్రహం నుంచి మకర ద్వారం వరకు విపక్ష ఎంపీలు ర్యాలీ చేశారు. ఇందులో యూపీయే ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే, ఎంపీలు- కేసీ వేణుగోపాల్, కనిమొళి, టి.ఆర్.బాలు, ఎ.రాజా తదితరులు పాల్గొన్నారు. బిల్లును స్థాయీసంఘానికి పంపాలని డిమాండ్ చేశారు. మహాత్మాగాంధీని మోదీ ప్రభుత్వం అవమానించడమే కాకుండా, పనిహక్కును కూడా అణచివేసిందని ఖర్గే ఆరోపించారు. ప్రభుత్వ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడతామని ‘ఎక్స్’లో పోస్ట్ చేశారు.

అణుఇంధన బిల్లుకు రాజ్యసభ ఆమోదం

పౌర అణు ఇంధన రంగంలో ప్రైవేటు భాగస్వామ్యానికి వీలు కల్పించే ‘శాంతి’ బిల్లు పార్లమెంటు ఆమోదం పొందింది. గురువారం రాజ్యసభ దీనికి పచ్చజెండా చూపించింది. లోక్‌సభ బుధవారమే దీనిని ఆమోదించిన విషయం తెలిసిందే. బిల్లుపై చర్చకు అణుఇంధన శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ బదులిచ్చారు. రోజంతా నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా జరిగేందుకు అణు ఇంధనం నమ్మదగ్గదని, ఇతర పునరుత్పాదక ఇంధన వనరుల్లో అలాంటిది లేదని ఆయన చెప్పారు. భద్రతపరమైన వ్యవస్థల్లో ఎలాంటి రాజీ పడబోమని హామీ ఇచ్చారు. అణుధార్మికత పరంగా భయాలను తోసిపుచ్చారు. జవాబుదారీతనం సంబంధిత నిబంధనల్ని నీరుగార్చారంటూ పలువురు విపక్ష సభ్యులు అభ్యంతరం తెలిపారు. సమగ్ర పరిశీలనకు బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపించాలని డిమాండ్ చేశారు. అణువ్యర్థాల తరలింపు, సరఫరాదారుకు ఉన్న బాధ్యత పరంగా వారు అనుమానాలు వ్యక్తంచేశారు. ప్రభుత్వరంగాన్ని పణంగా పెట్టి ప్రైవేటువారిని ప్రోత్సహించవద్దని, దేశీయ సంస్థలకు చేయూతనివ్వాలని జైరాం రమేశ్ (కాంగ్రెస్) సూచించారు. ప్రభుత్వంపై ఎన్ని ఒత్తిళ్లున్నా నిర్బంధంగా బిల్లును ప్రవేశపెట్టకూడదని అన్నారు. విదేశీ ఒత్తిళ్లకు తలొగ్గి.. ప్రజా ఆస్తుల్ని, సున్నితమైన రంగాలను ఆశ్రిత పెట్టుబడిదారుల చేతుల్లో పెడతామా అని సాగరికా ఘోష్ (తృణమూల్) ప్రశ్నించారు. శాంతి బిల్లు వెనుక అదృశ్య శక్తులు ఉన్నాయని మరికొందరు సభ్యులు విమర్శించారు. పెట్టుబడుల్ని ఆకట్టుకుని, భవిష్య తరాలకు అణు ఇంధనాన్ని ఇచ్చేందుకు బిల్లు ఎంతో కీలకమని హర్ష్ వర్ధన్ శ్రింగ్లా (భాజపా) చెప్పారు. బొగ్గు నిల్వలు తగ్గిపోతుండటం వల్ల అణు ఇంధనమే సుస్థిరమైనదన్నారు. 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి అవసరమైన రూ.19లక్షల కోట్ల పెట్టుబడుల కోసం ప్రైవేటురంగ చేయూత అవసరమేనని సమర్థించారు. ఇది జవాబుదారీతనంతో కూడిన భాగస్వామ్యమే తప్పిస్తే ప్రైవేటీకరణ కాదని స్పష్టంచేశారు. సభ్యురాలు సుధామూర్తి కూడా దీనికి మద్దతు పలికారు.

శాశ్వత ఆస్తులు సమకూర్చడమే ధ్యేయం

రూ.10-11 లక్షల కోట్లను కేవలం కూలీలకిచ్చే వేతనాలపై ఖర్చుపెట్టడం కాకుండా శాశ్వత ఆస్తుల్ని సమకూర్చాలనే ఉద్దేశంతో, ఎంతో లోతుగా చర్చించాకే బిల్లు తయారుచేశామని చౌహాన్ వివరించారు. గ్రామాల్లో పూర్తిస్థాయి అభివృద్ధి జరగాలనేదే తమ ఉద్దేశమని చెప్పారు. గాంధీ ఆదర్శాలను అనేకసార్లు కాంగ్రెస్సే చంపేసిందని, రాజకీయ లబ్ధి కోసమే ఆయన పేరును వాడుకుందని విమర్శించారు. జేపీసీ వేయాలన్న డిమాండును స్పీకర్ ఓం బిర్లా తిరస్కరించారు. బుధవారం అర్ధరాత్రి 1.30 వరకు సభలో చర్చ జరిగిందని, అన్ని పార్టీల నుంచి 98 మంది మాట్లాడింది విన్నామని చెప్పారు. లోక్‌సభ ఆమోదించిన జీ రామ్ జీ బిల్లును మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ వెంటనే రాజ్యసభలో ప్రవేశపెట్టారు. అధ్యయనానికైనా సమయం ఇవ్వకపోవడాన్ని విపక్షసభ్యులు తప్పుబట్టారు.


ఈనాడు

దేశ ప్రతిష్ఠకు డోపింగ్ మచ్చ

సామర్థ్యం మేరకు ఆడి కష్టపడి సాధించే విజయం క్రీడాకారులకు సంతృప్తినిస్తుంది. సర్వశక్తులూ ఒడ్డి పోరాడినా పరాజయం తప్పనప్పుడు దాన్నీ అంతే హుందాగా స్వీకరించగలగాలి. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని మరింతగా రాటుదేలాలి. నిజమైన క్రీడాస్ఫూర్తికి అర్థమదే! కానీ, ఎలాగైనా గెలవాలన్న దురాశతో కొందరు క్రీడాకారులు యథేచ్ఛగా నిషేధిత ఉత్ప్రేరకాలు వాడుతున్నారు. ఆపై పట్టుబడి ఉజ్జ్వల భవిష్యత్తును సర్వనాశనం చేసుకుంటున్నారు. ఇలాంటి వారికి ఇండియా ఎక్కువగా నెలవు అవుతుండటం కలవరపరుస్తోంది. ప్రపంచ యాంటీ డోపింగ్ ఏజెన్సీ(వాడా) తాజా నివేదిక ప్రకారం- డోపీలు అధికంగా ఉన్న దేశంగా ఇండియా వరసగా మూడో ఏడాది కూడా పరువుమాసింది. జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ(నాడా) నిరుడు ఏడు వేలకు పైగా మూత్ర, రక్త నమూనాలను పరిశీలిస్తే- 260 మందికి సంబంధించి ప్రతికూల ఫలితాలు వచ్చాయి. చైనా 24 వేలకు పైగా శాంపిళ్లు పరీక్షిస్తే 43 మాత్రమే పాజిటివ్‌గా తేలాయి. ఫ్రాన్స్, రష్యా, జర్మనీ వంటివి పదివేలకు పైగా నమూనాలను తరచిచూస్తే నిషేధిత ఆనవాళ్లున్నవి ఎక్కడా వంద దాటలేదు. ఇండియాలో తక్కువ శాంపిళ్లలోనే పలువురు డోపీలు బయటపడటం- మన క్రీడావ్యవస్థ దారితప్పుతున్న తీరును కళ్లకుకడుతోంది!

దేశీయంగా గడిచిన నాలుగేళ్లలో 640 మంది డోపింగ్ టెస్టుల్లో విఫలమయ్యారు. వారిలో రెండొందల మంది అథ్లెటిక్స్ విభాగంవారే. తరవాతి స్థానాల్లో వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, పవర్ లిఫ్టింగ్, బాక్సింగ్ క్రీడాకారులున్నారు. కొందరు తెలిసీ తెలియక వాడుతున్న ఔషధాల మూలంగా డోపింగ్ ఉచ్చులో చిక్కుకుంటున్నారు. మరికొందరేమో కావాలని తప్పుడుమార్గాన్ని ఎంచుకుని చివరికి అందరి ఎదుటా తలదించుకుంటున్నారు. బుద్ధిచెప్పి సరైన బాటలో నడిపించాల్సిన కోచ్‌ల్లో కొంతమంది అలాంటివారికి సహకరిస్తుండటం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. 2030 కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యమివ్వనున్న ఇండియా, ఆ తరవాత ఒలింపిక్స్ నిర్వహణ ద్వారా తన శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటుకోవాలని భావిస్తోంది. అంతర్జాతీయ ఈవెంట్లలో పతకాల పట్టికలో ముందు నిలిచేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. కానీ, నానాటికీ జడలు విప్పుతున్న డోపింగ్‌కు అడ్డుకట్ట వేయకపోతే- రష్యా మాదిరిగా భారత్ సైతం అంతర్జాతీయ క్రీడా ప్రపంచంలో ఏకాకి అయ్యే దురవస్థ దాపురిస్తుంది. గతంలో శిక్షకులు, అధికారులు, వైద్యులు, అథ్లెట్లు.. ఇలా అందరి తోడ్పాటుతో రష్యాలో వ్యవస్థాగత డోపింగ్ విశృంఖలమై, చివరికి ఆ దేశ ప్రతిష్ఠను మంటగలిపింది!

డోపింగ్ పరీక్షల్లో పాజిటివ్‌గా తేలడంతో భారత స్టార్ స్ప్రింటర్ ద్యుతీ చంద్‌పై కొన్నాళ్ల క్రితం తాత్కాలిక నిషేధం పడింది. అమిత్ పంఘాల్(బాక్సింగ్), దీపా కర్మాకర్(జిమ్నాస్టిక్స్), నర్సింగ్ యాదవ్(రెజ్లింగ్), సీమా పునియా(డిస్కస్ త్రో) వంటి ప్రముఖ క్రీడాకారులెందరో డోపీలుగా తేలడం విస్మయపరచింది. క్రీడల్లో అనైతిక ధోరణుల నివారణకు కేంద్రం 2022లోనే ప్రత్యేక చట్టం తెచ్చింది. అయినప్పటికీ డోపింగ్ భూతం జడలు విప్పుతూనే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో- దొంగదారుల్లో పతకాల వేటకు బయల్దేరే ప్రబుద్ధులకు పగ్గాలు వేయడానికి కేంద్రం తెచ్చిన యాంటీ డోపింగ్ సవరణ బిల్లు మొన్న ఆగస్టులో పార్లమెంటు ఆమోదం పొందింది. అది సమర్థంగా అమలుకు నోచుకుంటేనే క్షేత్రస్థాయిలో మెరుగైన ఫలితాలు సిద్ధిస్తాయి. దాంతోపాటు డోపింగ్ పర్యవసానాలపై క్రీడాలోకంలో విస్తృతావగాహన కల్పించాలి. ఆరోగ్య చికిత్సలో భాగంగానైనా తీసుకోకూడని మందులేంటో తెలియజేయాలి. కావాలని ఉత్ప్రేరకాల ఊబిలోకి అడుగుపెట్టే క్రీడాకారులు, అందుకు వారిని ఉసిగొలిపే కోచ్‌లపై మాత్రం నిర్దాక్షిణ్యంగా వేటేయాలి!



ప్రతి పుస్తకం మనకు ఏదో ఒక పాఠం నేర్పుతుంది. ముందు తరాలవారికి భద్రంగా అందించాల్సిన ప్రపంచ వారసత్వ సంపదలు పుస్తకాలే. శ్వాసించడం, నీళ్లు తాగడం, వేళకు ఆహారం తీసుకోవడం ఎంత ముఖ్యమో చదవడమూ అంతే అవసరం.

– ఉమాశంకర్ జోషి, కవి

త్రికరణ శుద్ధిగా...

ఓ ఆశ్రమంలో విద్యాభ్యాసం చేస్తున్న శిష్యుడికి త్రికరణ శుద్ధి అంటే ఏంటన్న సందేహం వచ్చింది. నేరుగా వెళ్లి గురువును అడిగేశాడు. మనసు, మాట, చేత ఒకటవ్వడమే త్రికరణ శుద్ధి అంటే అని చెప్పారు గురువు. వివరించమని అడిగాడు శిష్యుడు. 'నువ్వు పైకి గురువుగారూ, మీ మూలంగానే జ్ఞానాన్ని పొందుతున్నానంటావు. లోలోపల ఇంకా ఎంతకాలం ఈ చాకిరీ చేయించుకుంటాడో అనుకుంటావు. గురువుకు సేవలు చేయడమే నీ కర్తవ్యమన్నట్లు ప్రవర్తిస్తావు... అంటే నీ మనసులో ఉన్నదొకటి, నాకు చెప్పేదొకటి, చేస్తున్నట్లు కనిపించేది ఇంకొకటి. దీన్ని త్రికరణ శుద్ధి లేకపోవడం అంటారు. ఉండటం అంటే ఏంటో నువ్వే అర్థం చేసుకో' అని గురువు అనడంతో శిష్యుడికి విషయం బోధపడింది.

ఒక్కమాటలో చెప్పాలంటే త్రికరణ శుద్ధి అంటే అంతఃకరణం శుభ్రంగా ఉండటమే. మనసు స్వచ్ఛంగా ఉంటే మాట మధురమవుతుంది. అది ఎదుటివారి మన్ననలను అందుకుంటుంది. ఇక్కడ కొంతమంది పొరపాటు పడే అంశం ఒకటుంది. ఒక వ్యక్తి నేరం చేయాలనుకుంటాడు, ఫలానా నేరం చేస్తానని చెప్పడమే కాకుండా చేసి చూపిస్తాడు. మూడూ ఒకటయ్యాయని దాన్ని త్రికరణ శుద్ధి అనరు. అది త్రికరణ ఐక్యం మాత్రమే కానీ, శుద్ధి కాదు. మనసు, కర్మ,వాక్కు అనే మూడూ పాపరహితంగా సద్భావంతో కలిసినప్పుడే అది త్రికరణ శుద్ధి అవుతుంది. త్రికరణాలు ఎప్పుడూ ధర్మానికి విరుద్ధంగా ఉండకూడదు.



అంతర్యామి

మన ఆలోచనలే మాటలవ్వాలి, మాటలు చేతలవ్వాలి. అవి ఎల్లవేళలా సమాజానికి మేలు చేయాలి. మనిషి వ్యక్తిత్వపరంగా పరిణతి సాధించాలన్నా, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలన్నా, సమాజంలో ఆదర్శపౌరుడిగా నిలబడాలన్నా, జీవితంలో శాంతీ సౌఖ్యం పొందాలన్నా... ఈ త్రికరణ శుద్ధి తప్పనిసరి.

వార్షిక పరీక్షల్లో ఓ విద్యార్థికి అన్ని సబ్జెక్టుల్లోనూ ఎనభైల్లో మార్కులు వచ్చాయి, ఒక్కదాంట్లో మాత్రం పదే వచ్చాయి. కాబట్టి ఆ అబ్బాయి ఫెయిలైనట్లేనంటారు కొంతమంది విద్యార్థులు. అన్ని సబ్జెక్టులూ మంచి మార్కులు తెచ్చుకున్నాడు కాబట్టి పాస్ చేసి పై తరగతికి పంపొచ్చంటారు మరికొంతమంది. ఇరువర్గాల వాదన విన్న గురువు ఇలా చెప్పారు... 'ఒక్క విషపు చుక్క కలిసినా బిందెడు పాలు పనికి రాకుండా పోతాయి. అలాగే సమాజంలో మంచిపేరు తెచ్చుకోవాలంటే మన వ్యక్తిత్వంలో చిన్న మరక కూడా ఉండకూడదు. అలాగే అన్ని విభాగాల్లోనూ సమాన ప్రతిభ చూపినప్పుడే విద్యార్థి రాణిస్తాడు. ఏ ఒక్కదాంట్లో విఫలమైనా అది సమగ్రమైన విజ్ఞానం అవదు'. త్రికరణశుద్ధిగా శ్రమించినప్పుడే అలాంటి జ్ఞానం అలవడుతుంది.

కొందరికి గొప్ప ఆలోచనలుంటాయి. వాటి గురించి అద్భుతంగా ప్రసంగిస్తారు. కానీ ఒక్కటీ ఆచరించరు. అలాంటివారు ఎప్పటికీ విజేతలు కాలేరు. మనసా, వాచా, కర్మణా తాను నమ్మిన సిద్ధాంతాలను ఆచరించారు కాబట్టే గాంధీజీ మహాత్ముడయ్యారు. వ్యక్తిగత, సామాజిక, ఆధ్యాత్మిక జీవితాల్లో త్రికరణ శుద్ధిలేని పనులేవీ స్థిరమైన విజయాలు పొందలేవు.

– యలమర్తి అనూరాధ

పర్యాటకానికి గోవా పాఠం!

శీతాకాలం పర్యాటకుల స్వర్గధామం గోవా. ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవలే ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన శ్రీరాముడి కంచు విగ్రహాన్ని దక్షిణ గోవాలో ఆవిష్కరించారు. దీంతో ఇక్కడికి వచ్చే పర్యాటకులు ప్రకృతి అందాలతో పాటు శ్రీరామచంద్రుణ్ని కూడా చూసి ముగ్ధులవుతున్నారు. ఈ వెలుగుల వెనక దట్టమైన చీకటి కూడా ఉంది. 64 ఏళ్ల కిందట సరిగ్గా ఇదే రోజున పోర్చుగీస్ వారి నుంచి విమోచన పొందిన గోవాకు ఇప్పుడు కావాల్సింది- డ్రగ్స్ దందా, దోపిడీలు, పర్యాటకులపై అత్యాచారాలూ వేధింపుల నుంచి నిజమైన విముక్తి!

డిసెంబరు వచ్చిందంటే చాలు పర్యాటకులతో గోవా కిటకిటలాడిపోతుంది. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు ఉత్తరాది కుర్రకారు సైతం గోవా వెళ్లడానికి ఆరాటపడిపోతుంటారు. ఐటీ ఉద్యోగులైతే అక్కడి పార్టీల కోసం ముందుగానే 'డేట్స్' ఫిక్స్ చేసేసుకుంటారు. ఈ సీజన్‌లో విదేశీ పర్యాటకులకూ కొదవుండదు. గోవాలోని పచ్చటి కొండలు, పాలనురుగు జలపాతాలు, ముచ్చటైన సాగర తీరాలు, పొడవాటి కొబ్బరి చెట్ల నడుమ వయ్యారాలు పోయే రహదారులు, శతాబ్దాల నాటి చర్చిలు వంటివి ఎన్నో... వాటితోపాటు ముచ్చటైన పైకప్పులు, బాల్కానీలూ ఉండే భవంతులు సైతం ఎవరినైనా ఇట్టే కట్టిపడేస్తాయి. అడుగడుగునా ప్రకృతి సౌందర్యం, భారత-పోర్చుగీస్ సంస్కృతుల సంగమమైన ఈ 'యూరోప్' చరిత్ర కూడా ప్రత్యేకమైనదే. 1510లో బీజాపూర్ సుల్తానుల చేతిలోంచి పోర్చుగీసు పాలనలోకి వెళ్లిపోయిన గోవాకు... భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన పద్నాలుగేళ్లకు గాని విమోచన లభించలేదు! నాలుగున్నర శతాబ్దాల తరబడి 'గోవకపట్టణ'లో తిష్టవేసిన పోర్చుగీస్ పాలకులు దాన్ని భారత్‌లో విలీనం చేయడానికి ససేమిరా ఇష్టపడలేదు. అడిగీఇడిగీ అంటూ కాలయాపనచేస్తూ రావడంతో, మరిక సహించజాలమంటూ భారత్ 1961 డిసెంబరు 18న 'ఆపరేషన్ విజయ్' చేపట్టింది. త్రివిధ సేనలు 36గంటల పాటు సాగించిన దాడుల ధాటికి అక్కడి గవర్నర్ జనరల్ బిత్తరపోయారు. ఆ మరుసటి రోజే ఆయన లొంగిపోవడంతో గోవాతో పాటు పోర్చుగీస్ ఆధీనంలోని డామన్ డీవ్‌లూ ఇండియా వశమయ్యాయి. అందుకే డిసెంబరు 19వ తేదీని గోవా విమోచన దినోత్సవంగా జరుపుతున్నారు.



పాలని నిజాం పాచిక!

ఆంగ్లేయులు ఇండియాకు స్వాతంత్ర్యం ప్రకటించడానికి సిద్ధమవుతున్న ఘడియలవి. దేశ నాయకులతో జోరుగా మంతనాలు సాగుతున్నాయి. ఎప్పటికప్పుడు విషయాలు తెలుసుకుంటున్న నాటి నిజాం పాలకుడు, ప్రపంచ కుబేరుడైన మీర్ ఉస్మాన్ అలీఖాన్‌కు ఏమీ పాలుపోలేదు. స్వతంత్ర భారతంలో తన ఆటలు సాగవని, తన విదేశీ వ్యవహారాలకు దారులన్నీ మూసుకుపోతాయని ఆయనకు తెలుసు. దాంతో నిజాం- తన దూతగా నవాబ్ జంగ్‌ను లండన్‌లోని బ్రిటిష్ ఉన్నతాధికారి సర్ ఆలెగ్జాండర్ రోజర్స్ దగ్గరికి పంపాడు. ఆయన రాయబారంతో లండన్, లిస్బన్‌లలో పోర్చుగీస్ అధికారులతో రహస్య మంతనాలు సాగించాడు నిజాం. గోవాను తనకు అమ్మేయాలని, కనీసం లీజుకైనా ఇవ్వాలని ప్రతిపాదించాడు. గోవా నుంచి అరేబియా సముద్రం మీదుగా వ్యాపారం చేసుకుంటానని, ఎంత కావాలంటే అంత ఇస్తానని ఆశచూపాడు. కానీ, పోర్చుగీసు పాలకులు ససేమిరా కుదరదని చెప్పేశారు. తరవాత ఆ ప్రయత్నాలు ముందుకెళ్లలేదు. నిజాం ఆశలు అడియాసలయ్యాయి. తన సంస్థానం కూడా స్వతంత్ర భారతంలో విలీనమైపోయింది.

పరువుమాస్తోంది అందుకే...

పోర్చుగీస్ వారి నుంచి విముక్తి పొందిన గోవా మొదట కేంద్రపాలిత ప్రాంతంగా ఉంటూ వచ్చింది. 1987 మే 30న ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది. పర్యాటకమే ప్రధాన ఆదాయవనరుగా కలిగిన గోవా తలసరి ఆదాయంలోనూ, మానవాభివృద్ధి సూచీలోనూ ముందువరసలో నిలుస్తోంది. నిరుడు కోటి మందికి పైగా అక్కడ పర్యటించగా, వారిలో సుమారు నాలుగున్నర లక్షల మంది విదేశీయులున్నారు.

దక్షిణాది వారు, ముఖ్యంగా తెలుగు పర్యాటకులు ఎక్కువగా నార్త్ గోవాలోని కలన్‌గూట్, బాగా, అంజునా బీచ్‌లకు వెళ్తుంటారు. వారి త్రిక ఆగుండా చపోరా కోటలనూ చుట్టేస్తారు. పాత గోవాలోని చర్చిలు, మపుసా వంటి మార్కెట్లు అన్నా మనవారికి మహా సరదా. ఇప్పుడు శ్రీరాముడి మహావిగ్రహం దక్షిణ గోవాలోని పర్తగాలిలో కొలువుదీరింది కాబట్టి, ఇకపై అక్కడ కూడా పర్యాటకుల తాకిడి పెరుగుతుందని అంచనా. పర్యటన సంగతి సరే... గోవాలోని ఐఐటీ, బిట్స్ పిలానీ, ఐఐఎం వంటి ప్రఖ్యాత సంస్థల్లో ఎంతోమంది తెలుగు విద్యార్థులు చదువుతున్నారు. ఉత్తర గోవాతో పోలిస్తే దక్షిణ గోవా కొంచెం భిన్నంగా ఉంటుంది. ఏకాంతం, ప్రశాంతత కోరుకునేవారు అక్కడి పాలోలెం, అగోండా బీచ్‌లలో కనిపిస్తారు. విదేశీయులు ఎక్కువగా వచ్చేది అక్కడికే. ఇప్పుడు చిక్కొచ్చిపడిందీ అక్కడే. విదేశీ వనితలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలతో గోవా పరువుపోతోంది. ఎక్కడో మొరాకో నుంచి వచ్చిన మహిళ తీవ్ర అస్వస్థతతో గోవా ఆస్పత్రిలోని ఉంటే... అక్కడి వైద్యుడు ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టడాన్ని ఏమనుకోవాలి? 2019లో 9.4లక్షల మంది విదేశీ పర్యాటకులు పంజిమ్‌కు వస్తే, ఇప్పుడు అందులో సగంమంది రావడం లేదంటే అందుకు కారణం ఇలాంటి అకృత్యాలే!

తెలుగు రాష్ట్రాలకూ డ్రగ్స్ సరఫరా...

గోవాలో డ్రగ్స్ దందా, పర్యాటకులను దోచుకోవడం వంటి ఘటనలు తరచూ వెలుగుచూస్తున్నాయి. బ్రెజిల్, నైజీరియా వంటి దేశాల నుంచి గోవాకూ, అక్కడి నుంచి హైదరాబాద్, విశాఖపట్నం వంటి నగరాలకు డ్రగ్స్ సరఫరా అవుతుండటం కలవరపరుస్తోంది. మొన్నీమధ్యే దర్యాప్తు నిమిత్తం గోవా వెళ్లిన తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ పోలీసులు అక్కడ ఓ నిందితుణ్ని పట్టుకుని రూ.1.25 కోట్ల విలువైన కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. అంతకుముందు ఏప్రిల్‌లో దక్షిణ గోవాలో రూ.43 కోట్ల విలువైన కొకైన్ పట్టుబడింది. గోవా పర్యాటకాన్ని పట్టిపీడిస్తున్న అత్యాచారాలు వేధింపులూ ట్యాక్సీ దందాలూ డ్రగ్స్ మాఫియా నుంచి తక్షణమే బయటపడాలంటే, ప్రభుత్వం చేయాల్సింది చాలా ఉంది. టూరిజానికి పెద్దపీట వేయాలనుకుంటున్న ఏపీ, తెలంగాణ వంటి రాష్ట్రాలు ఈ 'బీచ్ స్టేట్' చేదు అనుభవాలను గమనంలోకి తీసుకోవాలి. మాదక ద్రవ్యాలకూ వేధింపులకూ తావులేని సురక్షితమైన, ఆహ్లాదకరమైన పర్యాటకానుభూతిని అందివ్వాలి. మరీ ముఖ్యంగా విదేశీ పర్యాటకుల భద్రతకు పూచీ వహించాలి. అప్పుడే ప్రగతికి ఊతంగా పర్యాటకం మూడు పువ్వులూ ఆరుకాయలుగా వర్ధిల్లగలదు!

– తమ్మిశెట్టి రఘుబాబు

దాదాపు రెండున్నర శతాబ్దాల క్రితం ఇదే డిసెంబరు నెలలో 42 ఏళ్ల మహిళ మాల్వా రాజ్యానికి రాణి అయ్యారు. అంతకు ముందు యుద్ధాల్లో వరసగా భర్తను, మామగారిని, కొడుకునూ కోల్పోయిన ఒంటరి ఆమె. తప్పనిసరి పరిస్థితుల్లోనే పాలనా పగ్గాలు చేపట్టినప్పటికీ ఆమె 'పేరుకే మహారాణి' అన్నట్లుగా మిగలలేదు. యుద్ధవిద్యలు నేర్చారు. స్వయంగా యుద్ధాలు

అదే ఆమెకు నివాళి!

చేశారు. మూడు దశాబ్దాల పాటు రాజ్యాన్ని సుభిక్షంగా పాలించి తన సత్తా చాటారు. శతాబ్దాల నాటి పాలనా సంస్కరణలను నేటికీ గుర్తుచేసుకునేలా చేసిన 'ఫిలాసఫర్ క్వీన్' ఆమె. పేరు అహల్యాబాయి హోల్కర్. పరదా పద్ధతిని, ఆడంబరాలను కాదని, ప్రజల మధ్య ఉంటూ కష్టసుఖాల్లో వాళ్లకు అండగా నిలిచిన రాణెమ్మ.




విద్య, వైద్యం, నీటినిర్వహణ, రహదారులు లాంటి మౌలిక వసతుల కల్పన... ఈ ఆధునిక యుగంలోనూ పాలకులకు సవాళ్లుగా నిలుస్తున్న అంశాలు. వాటిని ఆనాడే అద్భుతంగా నిర్వహించడమే కాక, విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు నెలకొల్పి నగరాలను అభివృద్ధి చేసిన ఘనత రాణి అహల్యాబాయిది. మహేశ్వర్‌ని కొత్త రాజధానిగా మార్చి, కళల కేంద్రంగా తీర్చిదిద్ది, అక్కడి నేతకార్మికులను ప్రోత్సహిస్తూ వస్త్రపరిశ్రమను విస్తరింపజేశారు. ముఖ్యంగా కాశీ విశ్వనాథ్, సోమనాథ్ ఆలయాలతో సహా హరిద్వార్ నుంచి రామేశ్వరం వరకూ మరెన్నో జీర్ణ ఆలయాలను పునరుద్ధరించారు. భక్తుల సౌకర్యార్థం విశ్రాంతి గదులు, ధర్మశాలలు, ఇతర ఏర్పాట్లు చేశారు. నదుల దగ్గర ఘాట్లను నిర్మించారు. లింగ సమానత్వం గురించి తెలియని రోజుల్లోనే బాలబాలికల కోసం విద్యాలయాలు, ఒంటరి మహిళలకు ఆశ్రయాలు నిర్మించారు. వ్యవసాయానికి చెరువులు, కాలువలు తవ్వించారు. అహల్యాబాయి సుదీర్ఘ పాలన... ప్రజల పట్ల పాలకులకు ఉండాల్సిన సహానుభూతికి, బాధ్యతకు ప్రతీక. ఈ ఏడాది ఆమె 300వ జయంతిని పురస్కరించుకుని మధ్యప్రదేశ్‌లో పలు కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రముఖుల జయంతులు, వర్ధంతులు వచ్చినప్పుడు ఆరోజుకు నివాళులు అర్పించేసి మన పనులు మనం చేసుకోవడం ఆనవాయితీగా మారిన కాలమిది. కానీ నిజానికి చేయాల్సింది అది కాదు. వాళ్ల స్ఫూర్తి మన ఆచరణలో ప్రతిఫలించాలి. భక్తులుగా, తీర్థయాత్రికులుగా, దాతలుగా, స్వచ్ఛంద కార్యకర్తలుగా... స్త్రీలు అధిక శాతం కనిపిస్తారు. కానీ ఎంతమంది మహిళలు దేవాలయాల పాలన బాధ్యతల్లో, నిర్ణయాధికారం గల స్థానాల్లో ఉన్నారు? ఆర్థిక క్రమశిక్షణ, పారదర్శకత, సహానుభూతితో కూడిన వ్యవహారదక్షత మహిళల సొంతమని పలు సందర్భాల్లో రుజువైంది. వారి ఆ సామర్థ్యాలను ఆలయాల పాలకమండళ్లలోనూ వినియోగించుకుంటే భక్తులు, యాత్రికులకు మరింత మెరుగైన వసతుల కల్పనకు మార్గం సుగమమవుతుంది. ఆలయాల దగ్గర రద్దీ నిర్వహణ తేలికవుతుంది. నిధుల కేటాయింపు దగ్గరే ప్రాధాన్యాల ఎంపిక మారుతుంది. భక్తి దైవదర్శనంతో ముగియదని, దానికి ముందూ తరవాతా యాత్రికుల సంక్షేమానికి, సౌకర్యానికి ఇచ్చే ప్రాధాన్యం కూడా అందులో భాగమని నమ్మారు అహల్యాబాయి. ఆమె ఆదర్శాన్ని ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఇప్పుడు మరింత ఎక్కువగా ఉంది. ఆ దిశగా అడుగేసినప్పుడే అహల్యాబాయికి నిజమైన నివాళి అర్పించినవాళ్లమవుతాం!

– దేవినేని సురేష్

అందరికీ బీమా... ఎప్పటికీ సాధ్యం?

స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు అయ్యేనాటికి దేశంలోని అందరినీ బీమా రక్షణ పరిధిలోకి తీసుకురావాలన్నది ప్రభుత్వ ఆశయం. ఆ బృహత్ లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నాల్లో భాగంగా బీమా చట్టాల సవరణకు కేంద్రం నిశ్చయించింది. ఆ మేరకు సర్కారు రూపొందించిన 'సబ్ కా బీమా సబ్ కా రక్షా' బిల్లు తాజాగా పార్లమెంట్ ఆమోదం పొందింది. దీంతో దేశీయ బీమా రంగంలోకి వందశాతం ఎఫ్‌డీఐల రాకకు మార్గం సుగమమైంది. 2047 నాటికి భారతీయులందరినీ బీమా ఛత్రంలోకి తేవాలన్న సంకల్పం ఘనంగా ఉన్నప్పటికీ ప్రస్తుతం దేశీయంగా ఇన్సూరెన్స్ వ్యాప్తి చాలా తక్కువగా ఉంది. దేశవ్యాప్తంగా అన్ని బీమా ప్రీమియంల మొత్తం జీడీపీలో ఎంత శాతం ఉందన్న దాన్ని బట్టి ఇన్సూరెన్స్ వ్యాప్తిని లెక్కేస్తారు. 2014లో అది మన దేశంలో 3.3శాతంగా ఉంటే- 2023 నాటికి 3.7శాతానికి పెరిగింది. కానీ- ప్రపంచ సగటుతో, అనేక దేశాలతో పోలిస్తే భారత్‌లో బీమా వ్యాప్తి చాలా తక్కువ. 2023లో అది ఏయే దేశాల్లో ఎంత ఉందంటే (శాతాల్లో)...



ఆధారం: ఐఆర్‌డీఏఐ వార్షిక నివేదిక 2023-24

నక్సల్‌బరీలో కమల వికాసం

బెంగాల్ ఉత్తర భాగంలో ఒకప్పుడు నక్సలైట్ ఉద్యమానికి పురిటిగడ్డగా ఉన్న నక్సల్‌బరీ గ్రామం ఇప్పుడు భారతీయ జనతా పార్టీకి కంచుకోటగా మారింది. భాజపా అగ్రనేత అమిత్ షా 2017లో ఈ గ్రామంలోని ఒక దళిత కుటుంబంతో కలసి భోజనం చేయడం ఆపరేషన్ లోటస్‌కు నాంది పలికింది. అది క్రమక్రమంగా పశ్చిమ బెంగాల్, త్రిపురలలో భాజపా బలం పెరగడానికి కారణమైంది. గతంలో పశ్చిమ బెంగాల్ శాసనసభలో భాజపాకు ఒకటీ అరా సభ్యులు మాత్రమే ఉండగా, 2021 ఎన్నికల్లో వారి సంఖ్య రెండంకెలకు చేరింది. బెంగాల్ ఉత్తర ప్రాంతాల్లోని దళిత, గిరిజన, వెనకబడిన వర్గాలలో బలం పెంచుకోవడానికి భాజపా పట్టుదలగా చేసిన కృషి ఫలిస్తోంది.



మావోయిస్టు ఉద్యమం రోజురోజుకూ బలహీనమవుతోంది. కీలక నాయకులను కోల్పోతుండటం, కొత్త చేరికలు లేకపోవడంతో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల సంఖ్య తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో దేశంలో సాయుధ విప్లవ పోరాటాలకు దారిచూపిన నక్సల్‌బరీలో పరిస్థితి ఎలా ఉందన్నది పరిశీలనార్హం!

కనుమరుగైన వామపక్ష ప్రాబల్యం

రాష్ట్ర శాసనసభలో ఉత్తర బెంగాల్‌కు 54 సీట్లు ఉన్నాయి. ఈ ప్రాంతం గూర్ఖాల్యాండ్ కోసం గళమెత్తుతున్న డార్జిలింగ్ గూర్ఖాలకూ, కూచ్ బిహార్‌లోని రాజ్ బన్షీలకూ గట్టి నెలవు. ఈ రెండు గ్రూపులూ పశ్చిమ బెంగాల్ నుంచి వేరుపడి ప్రత్యేక రాష్ట్రంగానో, కేంద్ర పాలిత ప్రాంతంగానో ఆవిర్భవించాలని కోరుకుంటున్నాయి. తమ కోరిక భాజపా వల్ల తీరుతుందని వారు ఆశిస్తున్నారు. పశ్చిమ బెంగాల్ పాలక పార్టీ అయిన తృణమూల్ కాంగ్రెస్ పట్ల ఇక్కడ చాలామంది విముఖంగా ఉన్నారు. మరోవైపు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల నిర్విరామ కృషి వల్ల ఉత్తర బెంగాల్‌లో భాజపా పాగా వేయగలిగింది. నేడు అక్కడ కాషాయ పతాకాలు దండిగా రెపరెపలాడుతున్నాయి. ఈ ప్రాంతంలో ఎక్కడికెళ్లినా ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు తమ సంఘ సేవా కార్యక్రమాలతో, పౌర సమస్యలపై ఉద్యమాలతో చురుగ్గా కనిపిస్తారని తృణమూల్ నాయకుడు, సిలిగురి మేయర్ గౌతమ్ దేవ్ వెల్లడించడం గమనార్హం.

నక్సల్‌బరీ ఒకప్పుడు కమ్యూనిస్టులకు, ముఖ్యంగా నక్సలైట్లకు పెట్టనికోటగా ఉండేది. కానూ సన్యాల్, చారు మజుందార్‌లు నక్సల్‌బరీ నుంచి ప్రారంభించిన ఉద్యమం నక్సలైట్ ఉద్యమంగా దేశంలో విస్తరించిన సంగతి తెలిసిందే. ఉద్యమ ప్రారంభ సమయంలో ఇక్కడ పోలీసు కాల్పుల్లో చాలామంది మరణించారు. వారిలో అత్యధికులు మహిళలే. కాల్పుల్లో మరణించినవారి సంస్మరణార్థం ఏర్పాటు చేసిన విగ్రహాలు నక్సల్‌బరీ చౌకీలో ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి. తోడుగా మార్క్స్, లెనిన్, స్టాలిన్, కానూ సన్యాల్, చారుమజుందార్‌ల విగ్రహాలనూ ఏర్పాటుచేశారు. వామపక్షాలు చీలికలు వాలికలైన దృష్ట్యా భాజపాయే తమకు మిగిలిన ప్రత్యామ్నాయమని స్థానికులు భావిస్తున్నారు. 1967లో నక్సల్‌బరీలో తిరుగుబాటు ప్రారంభమైన స్థలాన్ని స్థానికంగా తియనాన్మెన్ చౌకీగా పిలుచుకుంటారు. వామపక్ష స్మారక చిహ్నాలు, తియనాన్మెన్ చౌకీ జోలికి వెళ్లకుండానే వాటి ప్రాధాన్యాన్ని భాజపా తగ్గించగలిగింది. గ్రామ ముఖద్వారంలో కార్గిల్ యుద్ధంలో అమరులైన వారికి స్మారక చిహ్నం నిర్మించడం ద్వారా ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు ఈ పని సాధించగలిగారు. ఆ స్మారక చిహ్నంలో స్థానిక గుర్ఖాల ఆయుధం కుక్రీతోపాటు హృదయాకారంలో ఒక గుర్తు కూడా ఉంటుంది. అక్కడ నుంచి చూస్తే సమీపంలోని కాంచనగంగ శిఖరం కనిపిస్తుంది. కార్గిల్ హిమ శిఖరాలలో పాకిస్థానీలతో భారతీయ వీరులు చేసిన యుద్ధాన్ని అది గుర్తుచేస్తుంది. నక్సల్‌బరీ యువత హృదయాలతో కార్గిల్ స్మారక చిహ్నం పెనవేసుకుంది. మరోవైపు నక్సల్ ఉద్యమ మూలాలను స్థానికులు మరచిపోవడం గమనార్హం.

అందరి మదిలో కార్గిల్ స్థూపమే

తియనాన్మెన్ చౌకీ పక్కనే పొలం పని చేసుకునే మీనూ సైబా అనే మహిళకు చౌకీలో ఉన్న విగ్రహాలెవరివో తెలియదు. కార్గిల్ యుద్ధ చిహ్నం గురించి మాత్రం బాగా తెలుసు. దేశంకోసం భాజపా పాటుపడుతోందనీ, కార్గిల్ స్మారక స్థూపం గర్వకారణమని ఆమె చెప్పుకొచ్చారు. ఆ స్థూపం మీది ఫలకంలో కార్గిల్ అమర వీరుల పేర్లు లిఖించి ఉన్నాయి. అక్కడ సందర్శకులు సెల్ఫీలు దిగుతుంటారు. తియనాన్మెన్ చౌకీలోని కానూ సన్యాల్ విగ్రహం పక్కన కూడా ఒక ఫలకంపై నక్సల్ అమరుల పేర్లుంటాయి. కానీ, అక్కడెవరూ సెల్ఫీలు దిగడం లేదు. నక్సల్‌బరీలో కానూ సన్యాల్ నివసించిన పూరిపాకలో ఇప్పుడు సీపీఎం కార్యకర్తలు గ్రంథాలయం నడుపుతున్నారు. ఆ గుడిసెను పర్యాటక ప్రాంతంగా మార్చడానికి తృణమూల్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. కానీ, గ్రామస్థులు ఆ ప్రతిపాదనను స్వాగతించడం లేదు. నక్సల్‌బరీ చుట్టుపక్కల ప్రాంతాలపై భాజపా పట్టు పెరిగిన నేపథ్యంలో 2026 అసెంబ్లీ ఎన్నికల్లో మిగిలిన పార్టీలు ఇక్కడ ఎలాంటి వ్యూహాన్ని అనుసరిస్తాయో మరి!

– బిలాల్ భట్

అనగనగా కొన్ని నక్షత్రాలు!



హాయ్! బుజ్జీ


హాయ్ నేస్తాలూ..! వేసవికాలం వస్తే చాలు మేడ మీద పడుకుని నక్షత్రాలు లెక్కపెట్టేస్తుంటాం కదా! ఇటువైపువి నేను, అటువైపువి నువ్వు అంటూ మన అన్నాదమ్ముళ్లు, అక్కాచెల్లెళ్లతో చిన్నచిన్న గొడవలు పెట్టుకుంటాం. సరదాగా వాటిని మనకు నచ్చిన పేర్లతోనూ పిలుచుకుంటాం. కానీ నిజంగానే నక్షత్రాలకు పేర్లు పెడుతుంటారు. ఇంతకీ ఆ పేర్లు ఎందుకు? ఎలా? పెడతారో తెలుసుకుందామా!

పురాతన కాలంలో నక్షత్ర సమూహాల ఆకారాన్నిబట్టి వాటికి ఓరియన్, ఉర్సా మేజర్ అంటూ కొన్ని పేర్లు పెట్టారు. కానీ ప్రస్తుతం కొత్తగా కనుగొన్న వాటికి శాస్త్రాల ఆధారంగా సంఖ్యలు, అక్షరాలను కలిపి పేర్లు పెడుతున్నారు. ఆ బాధ్యత ఇంటర్నేషనల్ అస్ట్రోనామికల్ యూనియన్(ఐఏయూ) తీసుకుంటోంది. మరో విషయం ఏంటంటే.. ఈమధ్య నక్షత్రాలకు పేర్లు పెట్టాల్సి వచ్చినప్పుడు 'నేమ్ ఎ స్టార్' అనే పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు, సాధారణ ప్రజలకూ పేరు పెట్టే అవకాశం ఇస్తున్నారు. అలా పెట్టిన పేర్లు ఐఏయూ ఆమోదించిన తరవాతే అధికారికం అవుతాయి. శాస్త్రవేత్తలు చాలా పరిశోధనలు చేస్తూ ఉంటారు కదా! అలాగే నక్షత్రాల మీద కూడా చేస్తారు. ఆకాశంలో బోలెడు నక్షత్రాలు ఉంటాయని మనందరికీ తెలుసు! మరి పరిశోధన సమయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా వాటిని గుర్తించడానికి.. వాటిలోని ప్రత్యేకత, స్థానాన్ని బట్టి పేర్లు పెడతారన్నమాట. అలా ఓ నక్షత్రానికి 'సిరియస్' అని పేరు పెట్టారు. ఎక్కువ ప్రకాశవంతంగా మెరవడం దాని లక్షణం. చూడగానే తెలిసిపోయేలా ఉంటుందన్నమాట. ఇలా పేర్లు పెట్టడం వల్ల వాటి దూరం, కాంతి, పరిమాణం.. ఇలా రకరకాల అంశాల మీద పరిశోధన కాస్త సులభమవుతుంది. ఈ విశేషాలు మీకెలా అనిపించాయి ఫ్రెండ్స్! ★

జగన్ అవివేకానికి ఇది పరాకాష్ఠ

● ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజం

ఈనాడు, అమరావతి: 'పీపీపీ విధానంలో వైద్య కళాశాలలు ఇస్తున్నారని.. ఎవరైనా వాటిని తీసుకుంటే వచ్చిన రెండు నెలల్లోనే జైల్లో పెడతామని జగన్‌మోహన్‌రెడ్డి చెబుతున్నారు. ఆయన రాజకీయ అవివేకానికి ఇది పరాకాష్ఠ. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు' అని



చంద్రబాబు అన్నారు. కలెక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'అభివృద్ధి కోసం ప్రపంచమంతా పీపీపీ మోడల్‌ను అనుసరిస్తోంది. పీపీపీకి ఇచ్చినా అంతిమంగా అది ప్రభుత్వ ఆస్తిగానే ఉంటుంది. ప్రైవేటుకు పోదు. కొన్నేళ్లు సమర్థంగా నిర్వహించి తిరిగి ప్రభుత్వానికి ఇస్తారు. వైద్య కళాశాలల సీట్లు పెరుగుతాయి. ఫీజు అదే ఉంటుంది. ఎన్టీఆర్ వైద్యసేవ ప్రకారమే 70శాతం ఇన్‌పేషెంట్లు, 100శాతం ఔట్ పేషెంట్లకు సేవలందిస్తారు. ఏడాదిన్నర రెండేళ్లలో కళాశాలల్ని పూర్తి చేస్తాం. ఈ విషయాలన్నీ ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలి' అని మంత్రులు, కలెక్టర్లు, ఎస్పీలకు చంద్రబాబు సూచించారు.

మేమొచ్చిన 2 నెలల్లో మీరంతా జైళ్లకే



ఈనాడు, అమరావతి: ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో నిర్వహణకు తీసుకునే వాళ్లు మేం అధికారంలోకొచ్చాక రెండు నెలలు తిరక్కముందే జైళ్లలో ఉంటారని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హెచ్చరించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైకాపా ఆధ్వర్యంలో చేపట్టిన సంతకాల సేకరణలో 1.04 కోట్ల మంది సంతకాలు చేశారని తెలిపారు. పార్టీ ముఖ్యనేతలతో కలిసి ఆయన గురువారం లోక్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిశారు. అంతకుముందు వాహనాల్లో తీసుకువచ్చిన సంతకాల ప్రతులను గవర్నర్ కార్యాలయ అధికారులు పరిశీలించారు. గవర్నర్ కలిశాక లోక్‌భవన్ వద్ద, అంతకుముందు తన క్యాంపు కార్యాలయంలో వైకాపా ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లాల అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలోనూ జగన్ మాట్లాడారు.

ప్రైవేటీకరణ కుంభకోణంపై కోర్టుకెళ్తాం: ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు వారికి ఇవ్వడంతో సీఎం చంద్రబాబు పెద్ద కుంభకోణానికి తెర తీశారని జగన్ ఆరోపించారు. 'ఒక్కో కాలేజీలో ఉద్యోగులకు జీతాల రూపంలో ఏడాదికి రూ.60 కోట్ల చొప్పున రెండేళ్లకు రూ.120 కోట్లు ఇవ్వబోతున్నారు. అంటే 10 కాలేజీలకు రూ.1,200 కోట్లు ప్రైవేటు నిర్వాహకులకు ప్రభుత్వమిచ్చేలా నిర్ణయించారు. పైగా ఆ కళాశాలలు ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయంటూ ప్రజలను మోసగిస్తున్నారు. ఈ 10 కాలేజీలు పూర్తి చేసేందుకు ఏటా రూ.వేయి కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.5 వేల కోట్లు పెడితే చాలు. ఏడాదికి రూ.2.50 లక్షల కోట్లకు పైగా బడ్జెట్ ఉన్న రాష్ట్రంలో రూ.వేయి కోట్లు పెట్టలేరా? పెట్టకపోతే వదిలేయండి, మేం అధికారంలోకొచ్చాక కాలేజీలను పూర్తిచేస్తాం' అని జగన్ వ్యాఖ్యానించారు. 'వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ 1.04 కోట్ల మంది చేసిన సంతకాల ప్రతులను గవర్నర్‌కు చూపించాం. గవర్నర్‌కు



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వినతి పత్రం అందజేస్తున్న జగన్, బొత్స సత్యనారాయణ



తాడేపల్లి వైకాపా కార్యాలయం నుంచి లోక్‌భవన్ వరకు నిర్వహించిన ర్యాలీ సందర్భంగా వాహనంలో తరలిస్తున్న సంతకాల ప్రతులు

పెద్ద మనసుంది కాబట్టి, ఈ అన్యాయంపై కొంచెం ఎక్కువ బాధపడ్డారు. మా పోరాటానికి సానుకూల ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నా' అని జగన్ చెప్పారు. ఈ సంతకాలతో కోర్టులోనూ పిటిషన్ వేయబోతున్నట్లు చెప్పారు. తాము ఇన్ని చేసినా చంద్రబాబు మారకపోవచ్చంటూ పరుష పదాలతో విమర్శించారు. రుషికొండలో రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టారు, ఆ డబ్బుతో రెండు వైద్య కళాశాలలు కట్టి ఉండవచ్చన్న సీఎం వ్యాఖ్యలను విలేకరులు ప్రస్తావించగా.. 'రుషికొండపై నేను రూ.240 కోట్లతో కట్టిన భవనం ఇప్పుడు విశాఖపట్నానికే తలమానికంగా, రాజభవనంలా, మాన్యుమెంట్‌గా మారింది' అని అన్నారు.

జగన్ వారినేమీ చేయలేరు



పీపీపీ విధానాన్ని సమర్థించిన న్యాయమూర్తులను జైలుకు పంపుతారా..?

వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ధ్వజం

ఈనాడు, అమరావతి: 'పీపీపీ విధానంలో వైద్య కళాశాలల నిర్మాణ బాధ్యత ఎవరైనా తీసుకుంటే.. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే జైలుకు పంపుతానని జగన్ బెదిరించడం హేయమైన చర్య. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలన్న ప్రభుత్వ నిర్ణయం మేరకు ముందుకొస్తున్న సంస్థలను బెదిరించడం సరికాదు. ఎవర్ని బెదిరిస్తారు? ఎవర్ని జైలుకు పంపుతారు? పీపీపీ విధానాన్ని తీసుకొచ్చిన నీతి అయోగ్‌ను, సమర్థించిన న్యాయమూర్తులను.. ఈ విధానానికి శ్రీకారం చుట్టిన ప్రధాని మోదీని జైలుకు పంపుతారా? ఆయన ఎవరినీ ఏమీ చేయలేరు' అని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ధ్వజమెత్తారు. సచివాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 100 మంది జగన్లు కట్టకట్టుకుని వచ్చినా అధికారంలోకి వచ్చేదిలేదన్నారు. '30 కేసుల్లో సంవత్సరాలపాటు జైల్లో ఉన్న జగన్ మళ్లీ జైలుకు వెళ్లకుండా చూసుకోవాలి. తీరు మారకపోతే మీ రాజకీయ సమాధి మీరే కట్టుకుంటారు. ఇంకో ప్యాలెస్ కట్టాల్సిన అవసరంలేదు. ఈ విధానంలో తప్పుంటే మంత్రిగా నన్ను జైలుకు పంపండి. చేతనైతే సీబీఐ విచారణ కోరండి' అని సవాల్ విసిరారు. 'ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణం జరగకూడదు. ఆసుపత్రులు అభివృద్ధి చెందకూడదు. పేద విద్యార్థులు డాక్టర్లు కాకూడదు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందకూడదు. ఇదే జగన్ ఉద్దేశం. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో వైద్య రంగం పటిష్ఠం అవుతోంది. కళాశాలలు పూర్తయితే పేద విద్యార్థులకు 220 సీట్లు అందుబాటులోకి వస్తాయి. 75 శాతం పడకలతో ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందుతుంది. ఇది ఇష్టంలేని జగన్ కుట్రతో బెదిరింపులకు పాల్పడుతున్నారు. పీపీపీ విధానం తప్పయితే.. ఎలాంటి పారదర్శకత లేకుండా 108, 104 నిర్వహణ అరబిందో సంస్థకు దాదాపు రూ.2 వేల కోట్లకు కట్టబెట్టబెట్టడం తప్పుకాదా? గతంలో మీరు నడిపిన ఆరోగ్యశ్రీ, డయాలసిస్ సేవలు పీపీపీ విధానంలో కాదా? ప్రైవేటీకరణ అని ఒప్పుకుంటారా' అని ప్రశ్నించారు.

గుండెపోటని నమ్మించినవారికి ఇదో లెక్కా..

'శరీరమంతా గొడ్డలి పోట్లు కనిపిస్తుంటే గుండెపోటు అని నమ్మించినవారు.. కోటి సంతకాలు అని నమ్మించలేరా? ఒక్కో నియోజకవర్గంలో 60 వేల ఓట్లు కూడా పడని వైకాపా నాయకులు 60 వేల సంతకాలు ఎలా సేకరించారు' అని సత్యకుమార్ ప్రశ్నించారు. రూ.400 కోట్లతో నిర్మించాల్సిన వైద్య కళాశాలకు రూ.500 కోట్ల నుంచి రూ.600 కోట్లకు వైకాపా ప్రభుత్వ హయాంలో పరిపాలనామోదం ఇచ్చారు. ఒక్కో కళాశాలలో రూ.150 కోట్ల నుంచి రూ.200 కోట్ల వరకు అవినీతికి పాల్పడిన జగన్.. ఆ మొత్తం తిరిగి చెల్లించాల్సి వస్తోందని అవినీతి ఆరోపణలు చేస్తున్నారు' అని మంత్రి పేర్కొన్నారు.

గవర్నర్ వద్దకు వెళ్లేందుకూ అదే దాదాగిరి

వైద్య కళాశాలలపై కోటి సంతకాలను సమర్పించేందుకు మందీమార్బలంతో లోక్‌భవన్‌కు ర్యాలీగా వెళ్లిన జగన్

● కాన్వాయ్‌తో సమాంతరంగా బైక్ ర్యాలీ

● మధ్యలో కూడళ్ల వద్దకు పెద్దఎత్తున జనాన్ని తరలించి హడావుడి

ఈనాడు, అమరావతి: పరామర్శలకైనా.. ఇంకో పేరుతో పర్యటనలకు వెళ్లినా మందీమార్బలంతో భారీగా షో చేయడం మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు అలవాటే. ఆ అలవాటును చివరికి రాష్ట్ర గవర్నర్‌ను కలిసేందుకు వెళుతున్నపుడు కూడా కొనసాగించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్వహణను పీపీపీ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు ప్రభుత్వం అప్పగిస్తోందని, ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైకాపా ఆధ్వర్యంలో సేకరించిన కోటి సంతకాల పత్రాలను సమర్పించేందుకంటూ గురువారం జగన్ లోక్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌ను కలిశారు. అయితే లోక్‌భవన్‌కు వెళ్లే క్రమంలో వైకాపా నేతలు, కార్యకర్తలు సృష్టించిన అలజడి అంతాఇంతా కాదు.



విజయవాడలోని అంబేడ్కర్ విగ్రహం కూడలి వద్ద బైక్‌లు, కార్లపైకి ఎక్కి హడావుడి చేసిన వైకాపా కార్యకర్తలు

అంబేడ్కర్ విగ్రహం వద్ద

రాజ్‌భవన్‌కు వెళ్లేమార్గంలో స్వరాజ్ మైదానంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్దకు జగన్ వెళ్లారు. అక్కడ కూడా నేతలు భారీగా జనాన్ని తీసుకువచ్చారు. నిబంధనలను గాలికొదిలేశారు. నానా హంగామా సృష్టించారు. మొత్తం జనమంతా ఆ స్మృతివనంలోకి వెళ్లడంతో అక్కడ గందరగోళం నెలకొంది. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

లోక్‌భవన్ వద్దా 'జై జగన్' నినాదాలు

గవర్నర్‌ను కలవాలంటే ముందస్తు అనుమతి ఉన్నవారు మాత్రమే లోక్‌భవన్‌కు రావాలి. కానీ, గురువారం జగన్‌తోపాటు ఆయన పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో లోక్‌భవన్ పరిసరాలకు చేరుకుని జై జగన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. అక్కడ పోలీసులు, భద్రతా సిబ్బంది వారించే ప్రయత్నం చేసినా వినకుండా లోక్‌భవన్ ప్రవేశద్వారం సమీపానికి వెళ్లి హడావుడి చేశారు.

వాహనాలతో హడావుడి

సంతకాల పత్రాల లోడ్‌తో ఉన్న వాహనాలను లోక్‌భవన్‌కు పంపేందుకు గురువారం ఉదయం జగన్ తన క్యాంపు కార్యాలయం వద్ద జెండా ఊపారు. అప్పుడూ భారీగా జనాన్ని సమీకరించి అక్కడ హల్‌చల్ చేశారు. మధ్యాహ్నం భారీ కాన్వాయ్‌లో జగన్, ఆయనతోపాటు పార్టీ నేతలు, కార్యకర్తలు లోక్‌భవన్‌కు బయల్దేరారు. ఆ కాన్వాయ్‌తోపాటు బైక్ ర్యాలీ చేపట్టారు. దీంతో వారధిపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. వారధి దాటాక కృష్ణలంక వద్ద కూడలిలో వైకాపా నేతలు భారీగా మహిళలు, ఇతర కార్యకర్తలను సమీకరించి గందరగోళం సృష్టించారు. అక్కడా ట్రాఫిక్ అటూ ఇటూ కదల్లేని పరిస్థితి కల్పించారు.

వైద్య కళాశాలలపై 'జగన్నాటకం'

● జగన్‌పై స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ ధ్వజం



ఈనాడు, అమరావతి: వైద్య కళాశాలలు, ఆసుపత్రుల నిర్మాణానికి పీపీపీ విధానం ఉత్తమమని కేంద్రానికి నివేదిక ఇచ్చిన పార్లమెంటరీ స్థాయీ సంఘంలో వైకాపా ఎంపీ గురుమూర్తి కూడా సభ్యుడేనని.. ఈ విధానానికి మద్దతుగా ఆయన నివేదికపై సంతకం కూడా చేశారని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పేర్కొన్నారు. దిల్లీలో పీపీపీ విధానానికి అనుకూలంగా సంతకాలు పెట్టి, రాష్ట్రంలో అందుకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ పేరుతో హడావుడి చేయడం 'జగన్నాటకం' కాదా అని ప్రశ్నించారు. పేదవాడికి మెరుగైన వైద్యం అందకూడదనే వైద్య కళాశాలల నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారా.. అని వైకాపా అధ్యక్షుడు జగన్‌ను నిలదీశారు. గతంలో వైద్య కళాశాలల పేరుతో రూ.8,500 కోట్ల దోపిడీకి జగన్ స్కెచ్ వేశారని ఆరోపించారు. "హైకోర్టు సైతం పీపీపీ విధానంలో వైద్య కళాశాలలపై వైకాపా వాదనల్ని తిరస్కరించి, వారి పిటిషన్‌ను కొట్టేసింది. కేంద్రం, నేషనల్ మెడికల్ కమిషన్, పార్లమెంటరీ స్థాయీ సంఘాలు, కేంద్ర స్థాయిలో వివిధ పార్టీలు పీపీపీ విధానానికి మద్దతునిస్తున్నాయి. ప్రజలు సైతం అనుకూలంగా ఉన్నారు. పేద విద్యార్థులకు వైద్య విద్య సీట్లు దక్కుతాయంటే జగన్ వ్యతిరేకిస్తున్నారు" అని మండిపడ్డారు.

విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో కార్డియాలజీ విభాగం పీపీపీకి ఇవ్వలేదా?

● వైకాపా నేతలపై మండిపడ్డ మంత్రి పార్థసారథి



ఈనాడు, అమరావతి: దేశంలో 75% రాష్ట్రాల్లో వైద్య కళాశాలలు ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య విధానం(పీపీపీ)లో నిర్వహిస్తున్నారని, ఈ విషయాన్ని వైకాపా నేతలు పక్కదారి పట్టించి ఉద్దేశపూర్వకంగా ఉద్రిక్తతలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కె.పార్థసారథి మండిపడ్డారు. పీపీపీ అంటే అర్థం తెలియని ఆ పార్టీ నేతలు ప్రజల్లో అపోహలు సృష్టించాలని చూస్తున్నారని విమర్శించారు. జగన్ సీఎంగా ఉన్నపుడే విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో కార్డియాలజీ విభాగాన్ని పీపీపీకి ఇచ్చిన విషయం వైకాపా నేతలకు గుర్తు లేదా? అని పార్థసారథి ప్రశ్నించారు. జగన్‌కు అనుమానం ఉంటే చర్చకు సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు. గురువారం కలెక్టర్ల సదస్సు ముగిసిన అనంతరం సచివాలయంలో మంత్రి విలేకరులతో మాట్లాడారు.

భూ వివాదాల్లో నేతల ప్రమేయంపై ఫిర్యాదులు

నేరాల కట్టడిలో నిర్లిప్తత వద్దు

● అసభ్య పోస్టులు పెట్టేవారిని ఏం చేయలేకపోతున్నామని విమర్శలు

● శాంతిభద్రతలపై సమీక్షలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ఈనాడు, అమరావతి: విశాఖపట్నం సహా ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పారిశ్రామిక ప్రాంతాల్లోని కొన్ని భూ వివాదాల్లో రాజకీయ నాయకుల ప్రమేయంపై ఫిర్యాదులొస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. రాజకీయ నాయకుల ప్రమేయం వల్ల అధికారులు కూడా ఏమీ మాట్లాడలేకపోతున్నారన్నారు. శాంతిభద్రతలపై సమీక్షలో ఆయన మాట్లాడారు. '15 శాతం వృద్ధి రేటు సాధించాలంటే శాంతిభద్రతల పరిరక్షణ చాలా ముఖ్యం. విశాఖపట్నంలో కొంతమంది చేతిలో ఆకస్మిక దాడికి గురైన బాధితులు పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే అక్కడ పట్టించుకోలేదు. దాడి చేసిన వారి వెనక కొందరు రాజకీయ నాయకులు ఉండటమే ప్రధాన కారణం. నేరాల కట్టడి విషయంలో పోలీసులు నిర్లిప్తంగా ఉండటం సరికాదు. ఏఐ ఉపయోగించి మార్ఫింగ్, నకిలీ చిత్రాలు సృష్టించి వాటితో సామాజిక మాధ్యమాల్లో అసభ్య పోస్టులు పెడుతున్నారు. దీనికి సామాన్య ప్రజలే కాదు.. నేను, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, హోం మంత్రి అనిత సహా అందరం బాధితులమే. అసభ్యంగా దూషిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్న వారిపై కఠినంగా వ్యవహరించాలి. అధికారంలో ఉన్నప్పటికీ అలాంటి వారిని ఏమీ చేయలేకపోతున్నామనే విమర్శలు ఎదుర్కొంటున్నాం' అని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ప్రజాప్రయోజనాలకు విఘాతం కలిగించేలా జరుగుతున్న నేరాల పట్ల అలక్ష్యంగా ఉండకూడదని వివరించారు.

ఫిర్యాదులొస్తే ఎవరైనా విడిచిపెట్టొద్దు: చంద్రబాబు

'భూ వివాదాల్లో రాజకీయ నాయకుల జోక్యాన్ని ఎంత మాత్రం సహించొద్దు. విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి తదితర జిల్లాల్లో రాజకీయ నాయకుల జోక్యంపై ఫిర్యాదులొస్తే వారిని విడిచిపెట్టొద్దు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. పవన్‌కల్యాణ్ సూచనకు స్పందిస్తూ ఆయన ఆదేశాలిచ్చారు. సామాజిక మాధ్యమాల్లో అసభ్య పోస్టులు, వ్యక్తిత్వ హననాలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరించేందు ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం ప్రతిపాదనలతో వస్తే చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

■ కాకినాడ జిల్లాలో ప్రార్థనమందిరాల్లో లౌడ్‌స్పీకర్ల వినియోగం శాంతిభద్రతల సమస్యకు కారణమవుతోందని ఆ జిల్లా కలెక్టర్, ఎస్పీ చెప్పారు. పవన్ కల్యాణ్ స్పందిస్తూ ఏ మతం వారైనా సరే విపరీతమైన శబ్దాలతో లౌడ్‌స్పీకర్లు పెట్టి కార్యక్రమాలు, వేడుకలు, ప్రార్థనలు చేయటం తప్పన్నారు. మంగళగిరిలో ఉంటున్న తాను కూడా ఈ శబ్దాలకు బాధితుడినేనని చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నిర్దేశిత డెసిబుల్ లోపే శబ్దాలు ఉండేలా చూడాలని సూచించారు.

20 నుంచి అన్ని పాఠశాలల్లో 'ముస్తాబు'

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో ఈ నెల 20 నుంచి విద్యార్థుల పరిశుభ్రతకు 'ముస్తాబు' కార్యక్రమం అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. క్యాన్సర్ రోగులు, దివ్యాంగులు సహా అధిక అవసరాలున్న వారిని ఆదుకునేందుకు వీలుగా ప్రతి జిల్లాలోనూ ఇన్‌ఛార్జి మంత్రి, కలెక్టర్ ఆధ్వర్యంలో 200 కొత్త పింఛన్లు మంజూరు చేసే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. కలెక్టర్ల సదస్సులో స్వర్ణాంధ్ర, పది సూత్రాలపై చర్చ అనంతరం ఆయన మాట్లాడారు. 'త్వరలో జనాభా నిర్వహణ విధానం అమలు చేస్తాం. కుప్పంలో ఇప్పటికే ప్రారంభించాం. రాష్ట్రమంతా అమలు చేసేలా ఉగాదికి పాలసీ తెస్తాం. సంతానోత్పత్తి రేటు, శ్రామిక జనాభా తగ్గుదల సమస్యలు, పరిష్కారాలపై కలెక్టర్లు దృష్టి పెట్టాలి' అని సూచించారు. హైదరాబాద్ రామచంద్ర మిషన్‌లో బయోడైవర్సిటీ పార్కులాంటివి అమరావతి, తిరుమలలో పెట్టాలని ఆలోచిస్తున్నామన్నారు. ఇలాంటివంటే ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఎంతో ఆసక్తి అని, ఒకసారి అక్కడ పర్యటించాలని సూచించారు.

భూముల లిటిగెంట్లపై పీడీ చట్టం

(మొదటి పేజీ తరువాయి)

తద్వారా రెండు మూడు దశలు తగ్గి ఆలస్యాన్ని నివారించవచ్చు. ఇళ్లకు సంబంధించి పొసెసన్ సర్టిఫికెట్లు త్వరగా అందించాలి.

■ రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ 'సమస్య ఏదైనప్పటికీ, అధికారులు ముందు ఫిర్యాదుదారుతో మాట్లాడాలి. మా కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు పంపుతున్నా, కొందరు సరిగ్గా స్పందించడం లేదు. ప్రతి సోమవారం ఫిర్యాదులు తీసుకుంటున్నారే తప్ప, వాటిని పరిష్కరించకపోవడమే సమస్య' అని వ్యాఖ్యానించారు. రెవెన్యూలో గుర్తించిన సమస్యలు, వాటి పరిష్కారానికి చేస్తున్న ప్రయత్నాలపై ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ వివరించగా, సీఎం అభినందించారు. తక్కువ సమయంలో ప్రజంటేషన్ పూర్తి చేశారని ప్రశంసించారు.

దివ్యాంగులు, హిజ్రాలకు ఉచితంగా నైపుణ్య శిక్షణ

● ప్రారంభించిన మంత్రి డోలా

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని దివ్యాంగులు, హిజ్రాలకు సాధికారత, పెంపు, ఉపాధి కల్పనకుగాను ఉచిత ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ప్రారంభించారు. గురువారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పోటీ పరీక్షలకు అవసరమైన సబ్జెక్టు బోధనతోపాటు డిజిటల్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, కెరీర్ గైడెన్స్, మెంటార్‌షిప్‌పై శిక్షణ అందిస్తారని తెలిపారు. దివ్యాంగులకు త్వరలో ఉచితంగా త్రిచక్రవాహనాలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. హిజ్రాలకు పింఛన్లతోపాటు గుర్తింపుకార్డులు, రేషన్ కార్డుల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ శిక్షణను ఉచితంగా అందించేందుకు ముందుకొచ్చిన 21 సెంచరీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ ప్రతినిధుల్ని ఆయన అభినందించారు.

అన్నదాతకు అందని సాంకేతికత



● వెబ్‌సైట్లు, యాప్‌లు ఉన్నా.. రైతులకు సమాచారం అందని ద్రాక్షే

● ఆన్‌లైన్‌లో వ్యవసాయోత్పత్తుల ధరలు ఉండవు.. ఈ-క్రాప్ నమోదుకూ సమస్యలే

ఈనాడు, అమరావతి: పలానా ఊళ్లో ఎరువుల నిల్వలు ఎన్ని ఉన్నాయని వ్యవసాయ అధికారులను అడిగితే.. వెబ్‌సైట్, యాప్‌లలో చూసి వెంటనే సీఎంకు చెప్పేస్తారు. కానీ, అదే ఊర్లోని రైతులకు మాత్రం ఆ విషయం తెలియదు. మార్కెట్ ధరలపై అధికారులు నిత్యం నివేదికలిస్తారు. అన్నదాతలకు మాత్రం ఏ పంటకు ఏ మార్కెట్లో ఎంత ధర ఉందో తెలియదు. వ్యవసాయ అనుబంధ శాఖలకు చెందిన వెబ్‌సైట్లు, యాప్‌లు పందుల సంఖ్యలో ఉన్నాయి. వీటి నిర్వహణకు ఏటా రూ.20 కోట్లకు పైనే ఖర్చు పెడుతున్నా.. అన్నదాతలకు మాత్రం సమాచారం అందని ద్రాక్షే. రాయితీ పథకాల వివరాలు కావాలన్నా.. వాటికి దరఖాస్తు చేయాలన్నా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందే. పాలనలో సాంకేతికత చేర్చాలని, ప్రజలు కార్యాలయాలకు వెళ్లకుండా వాట్సప్ సేవల్ని వారికి చేరువ చేయాలని సీఎం చంద్రబాబు చెబుతుంటారు. 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమంలోనూ దాన్నొక అంశంగా చేర్చారు. ఈ విషయంలో వ్యవసాయ, అనుబంధ శాఖల ధోరణి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. రైతులకు సాంకేతికతతో పని ఏముందన్నట్లు వ్యవహరిస్తున్నాయి. ఆన్‌లైన్, రియల్ టైమ్‌లో ఉన్న సమాచారాన్ని కేవలం తమ నివేదికల తయారీకే పరిమితం చేస్తున్నాయి.

ఈ-క్రాప్ నుంచి.. పంట అమ్మకం వరకు

■ ఈ-క్రాప్, ఈకేవైసీ నమోదుకు రైతులు ఒకటికి రెండుసార్లు కార్యాలయాలకు వెళ్లాల్సిందే. తమ పొలానికి ఈ-క్రాప్ నమోదైందో లేదో ఆన్‌లైన్‌లో తెలుసుకునే అవకాశమే లేదు. తాము ఏ పంటలు సాగు చేస్తున్నామో రైతులే స్వయంగా ఈ-క్రాప్‌లో నమోదు చేసే అవకాశం కల్పించొచ్చు. తర్వాత సిబ్బంది పొలానికి వెళ్లి వాటిని తనిఖీ చేసి ధ్రువీకరించొచ్చు. దీంతో ఈ-క్రాప్ త్వరితగతిన పూర్తవుతుంది. దీనికి అధికారులు అనుమతించడం లేదు.

■ పంట ఉత్పత్తుల సేకరణలో మార్క్‌ఫెడ్ కీలకం. ఈ సంస్థకు వెబ్‌సైట్, యాప్‌లున్నా.. అవేవీ రైతులకు తెలియవు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని అమ్ముకొనే పరిస్థితి లేదు. ఏ గ్రామంలో ఎంత కొన్నారో, ఎవరి నుంచి సేకరించారో కూడా రహస్యమే. టోకు విక్రయాల్లోనూ పారదర్శకత లేదు.

■ ఏ దుకాణంలో ఎన్ని యూరియా/డీఏపీ, ఇతర కాంప్లెక్స్ ఎరువుల బస్తాలున్నాయో ఆన్‌లైన్ చూసే అవకాశమే లేదు. అధికారులు మాత్రం రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామాల వారీగా లెక్కలు చెబుతుంటారు. అదేదో రైతులకూ అందుబాటులో ఉంచితే.. లోటుపాట్లపై డీలర్లను నిలదీస్తారు.

పథకాల వివరాలూ తెలియవు

■ వ్యవసాయ, అనుబంధ శాఖల్లో రాయితీ పథకాలు, వాటి వివరాలు రైతులకు అందుబాటులో లేవు. వాటికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశమే లేదు. ■ అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకానికి అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలంటే కార్యాలయానికి వెళ్లాల్సిందే. ■ భారీ వర్షాలు, వరదలు, కరవు సమయంలో వ్యవసాయ శాఖ పంటనష్టాన్ని లెక్కలేసి జాబితాలు తయారు చేస్తుంది. ఆ వివరాలేవీ ఆన్‌లైన్‌లో కనిపించవు. ■ పశుసంవర్ధక శాఖలో రైతులకు రాయితీపై దాణా ఇస్తారు. రాయితీపై గోకులం యూనిట్లు మంజూరు చేస్తున్నారు. పశువులు, మేకలు, గొర్రెల యూనిట్లు ఇస్తున్నారు. ఆక్వా, పశుసంవర్ధక, పట్టుశాఖల్లో రాయితీ పథకాలున్నాయి. వీటికి దరఖాస్తు చేయాలంటే రైతులు తప్పనిసరిగా కార్యాలయాలకు వెళ్లాల్సిందే.

శ్రీవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



శ్రీవారి ఆలయం ఎదుట జస్టిస్ టి.మల్లికార్జునరావు కుటుంబం

తిరుమల, న్యూస్‌టుడే: ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు గురువారం తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి ఆలయం ఎదుట తమిళ భక్తుల అత్యుత్సాహం



రాజకీయ పార్టీ పోస్టర్‌తో తమిళ భక్తులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ఆలయం ఎదుట తమిళనాడుకు చెందిన భక్తులు ఏఐఏడీఎంకే పార్టీ నాయకుల చిత్రాలున్న ఓ పోస్టర్‌ను ప్రదర్శించి, హల్‌చల్ చేశారు. ఈ ఘటన గురువారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఇటీవల శ్రీవారి దర్శనార్థం వచ్చిన భక్తులు రాజకీయ పోస్టర్‌ను ప్రదర్శిస్తూ రీల్స్ చేశారు. అవి సామాజిక మాధ్యమంలో పెట్టడంతో వైరల్ అయ్యాయి. ఈ విషయం తితిదే దృష్టికి వెళ్లడంతో గురువారం అధికారులు స్పందించారు. "తిరుమల కొండపై రాజకీయ ప్రచారాలు, రాజకీయ గుర్తుల ప్రదర్శన నిషేధం. తమిళ భక్తులు కొందరు నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీని ప్రదర్శించినట్లు గుర్తించాం. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అని ఓ ప్రకటనలో వెల్లడించారు.



ముందస్తు మధుమేహాన్ని తేలిగ్గా పరిగణించొద్దు

ముందస్తు మధుమేహం (ప్రీ డయాబెటిస్) అంటే భవిష్యత్తులో వచ్చే చక్కెర వ్యాధిగా భావిస్తూ దాన్ని తేలిగ్గా తీసుకోరాదు. ఆ స్థితి కూడా మెదడు, రక్తనాళాలను దెబ్బతీస్తుంది. ఈ పరిస్థితి పక్షవాతం ముప్పును పెంచుతుంది. చిత్తవైకల్యానికి దారితీస్తుంది. ఈ నేపథ్యంలో ముందస్తు మధుమేహ స్థితిలో ఉన్న వారు జీవనశైలి మార్పులతో ఆ స్థితి నుంచి బయటపడేందుకు ప్రయత్నించాలి. తద్వారా మధుమేహం ముప్పు నుంచి బయటపడటమే కాక గుండె, మెదడు ఆరోగ్యంగా ఉంటాయి.

– సుధీర్ కుమార్, న్యూరాలజిస్టు

పెళ్లయి 21 ఏళ్లు.. 12 మంది పిల్లలు

అన్నీ సుఖప్రసవాలే..

చిత్తూరు (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: ప్రస్తుత కాలంలో ఒకరిద్దరిని కంటేనే చాలనుకుంటున్నారు. కానీ, చిత్తూరు జిల్లాలోని ఆవులకంద్రిగకు చెందిన ముబీనా ఏకంగా 12 మందికి జన్మనిచ్చారు. వీరిలో ఆరుగురు ఆడ, ఆరుగురు మగ పిల్లలు ఉన్నారు. అన్నీ సుఖప్రసవాలే కావడం మరో విశేషం. మహబూబ్‌బాషా, ముబీనా దంపతులకు 21 ఏళ్ల క్రితం వివాహమైంది. చిన్నపాటి వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ముబీనా తాజాగా గురువారం 12వ సంతానానికి చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలో జన్మనిచ్చారు.

పరీవాహక ప్రాంతం వెలుపలికి నీటి మళ్లింపులు చట్టబద్ధమే

- కృష్ణా రెండు ట్రైబ్యునళ్లూ ఆ విషయాన్ని ఆమోదించాయి
- బ్రిజేష్ ట్రైబ్యునల్ ఎదుట ఏపీ వాదనలు
- తదుపరి విచారణ జనవరి 21కి వాయిదా

ఈనాడు, అమరావతి: 'అంతర్రాష్ట్ర నదీ చట్టం ప్రకారం ఒక పరీవాహక ప్రాంతం నుంచి మరో పరీవాహక ప్రాంతానికి తన రాష్ట్రంలోని నీటిని మళ్లించుకోవడం అనేది చట్టబద్ధం. కృష్ణా పరీవాహక ప్రాంతం బయటకు నీటిని మళ్లించడం పూర్తిగా చట్టబద్ధం. అలా చేయకూడదని ఎక్కడా లేదు. రాష్ట్రాన్ని ఒక యూనిట్‌గా చూడాలి. నదీ పరీవాహక ప్రాంతంలో ఉన్నవారితో సహా ఆ రాష్ట్రంలో నివసిస్తున్న అందరి ప్రయోజనాలను రాష్ట్రం పరిరక్షించాల్సి ఉంటుంది. ఆ నది నీళ్లు ఇతర బేసిన్‌లో వాడుకోకూడదని కానీ, మళ్లించకూడదని కానీ చట్టపరమైన అడ్డంకి ఎక్కడా లేదు' అని ఏపీ తరఫున సీనియర్ న్యాయవాది జయదీప్ గుప్తా వాదించారు. దిల్లీలో బ్రిజేష్ ట్రైబ్యునల్ ముందు గురువారం రెండో రోజు జస్టిస్ బ్రిజేష్‌కుమార్, సభ్యులు జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ తాలపత్ర ఎదుట తన వాదనలు కొనసాగించారు. గుప్తాకు సీనియర్ న్యాయవాది ఉమాపతి, న్యాయవాదులు ఎస్.సంజయ్, జి.శరత్ చంద్ర సహకరించారు. వారి వాదనల్లో ముఖ్యాంశాలు..

★ పరీవాహక ప్రాంతం బయటికి నీటిని మళ్లించవచ్చని బచావత్ ట్రైబ్యునల్ నిర్దేశించలేదు. ఆ విషయం ట్రైబ్యునల్ దృష్టిలో ఉండి కూడా కాదనలేదు. అందుకు కారణాలను ఏదో వివరాలలో పేర్కొంది. దీన్ని రెండో కృష్ణా ట్రైబ్యునల్ కూడా సమర్థించింది. పరీవాహక ప్రాంతం బయటికి నీటి మళ్లింపులు చట్టబద్ధమైనవేనని అనుమతించింది.

★ రెండో కృష్ణా ట్రైబ్యునల్.. కృష్ణా పరీవాహక బయటి ప్రాంతంలో ఉన్న ప్రాజెక్టులకు అదనపు నీటిని కేటాయించింది. తెలుగుగంగ ప్రాజెక్టుకు జలాలు కేటాయించింది. తద్వారా పరీవాహక ప్రాంతం బయట నీటి మళ్లింపును గట్టిగా సమర్థించినట్లయింది.

★ 2014 రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం కూడా ఈ మళ్లింపులను అంగీకరించింది. పదకొండో షెడ్యూలు నాలుగో పేరాలో ఈ విషయం స్పష్టమవుతుంది. పదకొండో షెడ్యూలు పదో పేరాలో పేర్కొన్న నదుల నుంచి బయటి ప్రాంతాలకు మళ్లించిన నీటితో నిర్మిస్తున్న ప్రాజెక్టులను అనుమతించింది. వాటిని నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులుగా పేర్కొంది.

★ 1956 అంతర్రాష్ట్ర నదీ జల వివాదాల చట్టం, 2014 రాష్ట్ర విభజన చట్టం ప్రకారం.. కృష్ణా తొలి, రెండో ట్రైబ్యునళ్ల నిర్ణయాలను వెనక్కు తీసుకునే ఆస్కారం లేదు.

★ నందికొండ ప్రాజెక్టు సంయుక్త నివేదిక కూడా బయటి పరీవాహకానికి నీటి మళ్లింపును అంగీకరించింది. అప్పటి హైదరాబాద్, ఆంధ్ర రాష్ట్రాలు ఈ ఒప్పందం చేసుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం, ప్రణాళిక సంఘం దాన్ని ఆమోదించాయి. ఆ నివేదిక ప్రకారం నందికొండ కృష్ణా ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా ఇతర బేసిన్‌కు నీటిని మళ్లించారు. ఈ క్రమంలో తెలంగాణ కూడా ఈ ఒప్పందానికి కట్టుబడి ఉండాలి. అంతకుముందు రాష్ట్రాలు తీసుకున్న నిర్ణయాలకు కొత్త రాష్ట్రాలు కట్టుబడి ఉండాల్సిందే.

★ భవిష్యత్తులో గోదావరి జలాలు మళ్లిస్తారనే పూహల ఆధారంగా దశాబ్దాల కిందట నిర్మించిన ప్రాజెక్టుల ధ్వంసమయ్యేలా నిర్ణయాలు తీసుకోలేరు. అలాంటి వాదనలను సమర్థించలేం. ఆ ప్రాజెక్టుల నీటి కేటాయింపులు మార్చలేం.

★ బయటి పరీవాహకానికి నీటి మళ్లింపులను బచావత్ జలవివాద ట్రైబ్యునల్ ఆమోదించింది. మానవ వాస్తవ జీవితాల ఆధారంగా నీటిని చూడాలే తప్ప.. భౌగోళిక అంశాల ఆధారంగా చూడలేము అని పేర్కొంది.

★ బ్రిజేష్ ట్రైబ్యునల్ తదుపరి విచారణను జనవరి 21కు వాయిదా వేశారు.

నకిలీ మద్యం కేసులో జోగి సోదరులకు చుక్కెదురు

- బెయిల్ పిటిషన్లను తోసిపుచ్చిన ఎక్సైజ్ కోర్టు
- జనార్దనరావు, జగన్మోహన్‌రావుల పిటిషన్లూ తిరస్కరణ
- ఏడుగురు నిందితులకు షరతులతో బెయిల్ మంజూరు



జోగి రమేష్, జోగి రాములను విజయవాడ జైలుకు తరలిస్తున్న పోలీసులు

ఈనాడు, అమరావతి: మాజీ మంత్రి, వైకాపా నేత జోగి రమేష్, అతని సోదరుడు రాముకు కోర్టులో చుక్కెదురైంది. నకిలీ మద్యం కేసులో వీరి బెయిల్ పిటిషన్లను విజయవాడలోని ఎక్సైజ్ కోర్టు తిరస్కరించింది. వీరితోపాటు ప్రధాన నిందితులు అద్దేపల్లి జనార్దనరావు, అతని సోదరుడు జగన్మోహన్‌రావుల పిటిషన్లనూ కోర్టు తోసిపుచ్చింది. ఇదే కేసులో మిగిలిన నిందితులు నకిరికంటి రవి, బాదల్ దాస్, ప్రదీప్‌దాస్, కల్యాణ్, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, శ్రీనివాస్‌రెడ్డి, చెక్కా సతీష్‌లకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ మేరకు న్యాయాధికారి లెనిన్‌బాబు గురువారం ఆదేశాలిచ్చారు.

31 వరకు రిమాండ్ పొడిగింపు...

ఈ కేసులో నిందితులకు గురువారంతో రిమాండ్ ముగియడంతో జోగి సోదరులతో సహా నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న 13 మందిని విజయవాడ ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి ముందు పోలీసులు హాజరుపరిచారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె కారాగారంలో ఉన్న అద్దేపల్లి సోదరులు, మరికొందరు నిందితులు వర్చువల్ విధానంలో పాల్గొన్నారు. వీరికి ఈనెల 31 వరకు రిమాండ్ పొడిగిస్తూ న్యాయాధికారి ఉత్తర్వులిచ్చారు.

50 రోజులవుతోంది.. బెయిల్ ఇవ్వండి: న్యాయాధికారితో జోగి రమేష్

'సర్.. 50 రోజులవుతంది. నాకు బెయిల్ ఇవ్వండి.'.. అని జోగి రమేష్ ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి లెనిన్‌బాబును కోరారు. బెయిళ్లను తిరస్కరిస్తూ ఉత్తర్వులు ఇచ్చిన తర్వాత వైకాపా నేత.. న్యాయాధికారి వద్దకు వచ్చి బెయిల్ కోసం అడిగారు. న్యాయవాది ద్వారా రమ్మని న్యాయాధికారి సూచించారు.

జోగి సోదరులకు జైలు మార్పు...

నెల్లూరు జైలులో ఉన్న జోగి రమేష్, రాములను విజయవాడ కారాగారానికి మార్చాలని.. వారి తరఫు న్యాయవాది మెమో దాఖలు చేశారు. దీనికి కోర్టు ఆమోదం తెలిపింది. దీంతో జోగి సోదరులను విజయవాడ కారాగారానికి తరలించారు.. జోగి రమేష్‌కు విచారణ ఖైదీ నంబరు 8153, జోగి రాముకు ఖైదీ నంబరు 8154 నంబర్లు కేటాయించారు.

కారు ప్రమాద నిందితుడి తండ్రి ఏఎస్సైపై వేటు

మదమంచి శ్రీనివాసరావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చిన పల్నాడు ఎస్పీ



ఏఎస్సై మదమంచి శ్రీనివాసరావు

ఈనాడు డిజిటల్, నరసరావుపేట: చిలకలూరిపేట బైపాస్ వద్ద జరిగిన ప్రమాదానికి ప్రధాన కారకుడు వెంకటనాయుడు తండ్రి నరసరావుపేట డీఎస్పీ కార్యాలయంలో పనిచేసే ఏఎస్సై మదమంచి శ్రీనివాసరావు అలియాస్ శీనుపై వేటు పడింది. కుమారుడి అరాచకంలో తండ్రి పాత్ర ఉన్నట్లు విచారణలో నిర్ధారణ కావడంతో ఏఎస్సైను సస్పెండ్ చేస్తూ పల్నాడు ఎస్పీ కృష్ణారావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 4న నాదెండ్ల మండలం గణపవరం సమీపంలోని చిలకలూరిపేట బైపాస్ వద్ద జరిగిన ప్రమాదంలో అయిదుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతిచెందిన విషయం తెలిసిందే. వెంకటనాయుడి బృందం ఓ భారీ లారీని ఆపి అక్రమంగా డబ్బులు వసూలు చేసే ప్రయత్నంలో ప్రమాదం జరిగినట్లు సీసీ ఫుటేజీ ద్వారా చిలకలూరిపేట గ్రామీణ పోలీసులు గుర్తించారు. అనంతరం నిందితుల్ని సీసీ కెమెరాల్లో గుర్తించి అదుపులోకి తీసుకున్నాక డీఎస్పీ కార్యాలయంలో పనిచేసే ఏఎస్సై శీను కుమారుడి లీలలు వెలుగులోకి వచ్చాయి. 2023లో ఏఎస్సై కుమారుడు కోటప్పకొండ వద్ద రూ.2వేల నోట్ల మార్పిడికి రూ.10 లక్షల కమీషన్ ఎరవేసి.. కారుతో పాటు రూ.50 లక్షలు దోచుకున్నట్లు కేసు నమోదైంది. ఆ కేసులో తండ్రి పాత్రపై ఎప్పటి నుంచో విచారణ ఫైలు ఎస్పీ కార్యాలయంలో పెండింగులో ఉంది. ఏఎస్సై 15 ఏళ్లుగా నరసరావుపేటలోనే పనిచేస్తున్నారు. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని కుమారుడు వెంకటనాయుడు దందాలు చేసినట్లు, ఫైనాన్స్ కార్లను తీసుకొచ్చి ఫేక్ నంబర్లతో ఇతరులకు తక్కువ ధరకే అమ్మడం, గంజాయి క్రయవిక్రయాలు చేసినట్లు ఆరోపణలున్నాయి. వీటన్నిటి విషయంలో కుమారుడిని ఎప్పటికప్పుడు రక్షిస్తూ.. అరాచకాలకు అండగా నిలిచినట్లు తేలడంతో ఏఎస్సైని మొదట వెల్దుర్తి ఠాణాకు బదిలీ చేశారు. తాజాగా సస్పెండ్ చేశారు.

పోక్సో కోర్టు విచారణకు హాజరైన గోరంట్ల మాధవ్, 'సాక్షి' ప్రతినిధి

విజయవాడ(గవర్నర్‌పేట), న్యూస్‌టుడే: అత్యాచారానికి గురైన బాధితురాలి పేరును వెల్లడించినట్లు విజయవాడ సైబర్ క్రైం పోలీసులు నమోదు చేసిన కేసులో వైకాపా మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, 'సాక్షి' ప్రతినిధి రామాంజనేయులు గురువారం విజయవాడ పోక్సో న్యాయస్థానానికి వచ్చారు. మహిళల హక్కులను కాలరాసేలా బాధితురాలి పేరును వెల్లడించారంటూ మహిళా కమిషన్ పూర్వ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఏ1గా గోరంట్ల మాధవ్, ఏ2గా సాక్షి యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం విజయవాడ పోక్సో న్యాయస్థానంలో ఈ కేసు విచారణకు వచ్చింది. విచారణ అనంతరం కేసును జనవరి 16కు వాయిదా వేస్తూ న్యాయమూర్తి వేల్పుల భవానీ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు.

వలకు చిక్కిన భారీ తిమింగలం



విశాఖపట్నం (మల్కాపురం), న్యూస్‌టుడే: విశాఖలోని యారాడ సముద్ర తీరంలో గురువారం భారీ తిమింగలం మత్స్యకారుల వలలో పడింది. తీరానికి సుమారు 100 మీటర్ల దూరంలో మత్స్యకారులు వల వేయగా.. అందులో చిక్కుకుంది. ఒడ్డుకు తీసుకొచ్చాక తిమింగలాన్ని గుర్తించారు. వెంటనే వల నుంచి వేరు చేసి సముద్రంలోకి పంపించేందుకు చూశారు. ఎంతకూ వీలు కాకపోవడంతో రాత్రి వరకూ ప్రయత్నాలు చేశారు. చివరికి అది ఒడ్డునే చనిపోయింది.

విజయవాడలో పిల్లల విక్రయ ముఠా అరెస్టు

- దిల్లీ, ముంబయి నుంచి శిశువుల అక్రమ రవాణా
- శిశు సంరక్షణ కేంద్రానికి ఐదుగురు చిన్నారులు



ముఠా నుంచి రక్షించిన ఓ చిన్నారితో సీపీ రాజశేఖర్‌బాబు

ఈనాడు, అమరావతి: దిల్లీ, ముంబయి మహానగరాల నుంచి శిశువులను విజయవాడకు తెప్పించి, చుట్టుపక్కల ప్రాంతాల్లో అమ్ముతున్న పది మంది సభ్యుల ముఠాను నగర పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠా గత నెలరోజుల్లో ఇలా ఐదుగురు చిన్నారులను తెప్పించి, ఇద్దరిని అమ్మేసింది. మరో ముగ్గురిని అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. అమ్మిన ఇద్దరితో సహా మొత్తం ఐదుగురు పసి పిల్లలను పోలీసులు రక్షించి, వారిని శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. విజయవాడలోని భవానీపురం, నున్న, కొత్తపేట స్టేషన్లలో వీరిపై మూడు వేర్వేరు కేసులు నమోదయ్యాయి. విజయవాడ నుంచి పారిపోయిన దిల్లీకి చెందిన కిరణ్‌శర్మ, భారతిలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందం దిల్లీకి వెళ్లింది. ఒకట్రెండు రోజుల్లో వీరిని అదుపులోకి తీసుకునే అవకాశం ఉంది. ఈ కేసు వివరాలను నగర పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు గురువారం మీడియాకు వెల్లడించారు. నగరానికి చెందిన బలగం సరోజిని.. శిశు విక్రయాలు, సరోగసీ కేసుల్లో అరెస్టై నెల క్రితమే జైలు నుంచి బయటకొచ్చింది. ఆమె తిరిగి పిల్లలను విక్రయించడం ప్రారంభించింది. పిల్లలను ఇక్కడికి తెప్పించి, ఒక్కొక్కరిని రూ.3-5 లక్షల వరకు అమ్ముతోంది. ఇందుకోసం ఓ ముఠాను ఏర్పాటు చేసుకుంది. ఈ సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం ఉదయం నుంచి విజయవాడ, పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో దాడులుచేసి 10 మందిని అరెస్టు చేశారని సీపీ వివరించారు.

కన్నా నీపై కన్ను పడనీయం



శ్మశాన వాటికలో బిడ్డను పూడ్చిన ప్రదేశం, ఎదురుగా కర్రకు ఏర్పాటుచేసిన నిఘానేత్రం

చంద్రగిరి గ్రామీణ, న్యూస్‌టుడే: అల్లారుముద్దుగా పెంచుకున్న బిడ్డ చనిపోవడంతో అశ్రునయనాల మధ్య శ్మశానంలో ఖననం చేశారు. తదనంతరం నెలకొన్న అనుమానంతో ఖననం చేసిన ప్రదేశాన్ని సీసీ కెమెరాతో నిత్యం పర్యవేక్షిస్తున్నారు. తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం కందులవారిపల్లి పంచాయతీకి చెందిన బాలుడు(6) అనారోగ్యంతో ఈనెల 8న చనిపోయాడు. తల్లిదండ్రులు పొలిమేరలోని శ్మశానంలో పూడ్చారు. మృతదేహాన్ని క్షుద్రపూజల కోసం కొందరు తీసుకెళ్తారన్న అనుమానంతో ఖననం చేసిన చోట సోలార్‌తో పనిచేసే సీసీ కెమెరా ఏర్పాటు చేశారు. కెమెరా ఫుటేజీని నిత్యం సెల్‌ఫోన్‌లో చూసుకుంటున్నారు. ఘటనపై పోలీసులను సంప్రదించగా మండలంలో క్షుద్రపూజలు లేవని, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తామని వెల్లడించారు.

కర్ణాటకలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం

ఈనాడు, బెళగావి: కర్ణాటక విధానసభలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం లభించింది. బెళగావిలోని సువర్ణసౌధలో నిర్వహిస్తున్న శీతాకాల సమావేశాల్లో భాగంగా గురువారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి హెచ్.సి. మహదేవప్ప కర్ణాటక ఎస్సీ ఉపజాతుల వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లుకు సభ ఆమోదం లభించింది. జస్టిస్ హెచ్‌ఎన్ నాగమోహన్‌దాస్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా రూపొందించిన ఈ బిల్లు ప్రకారం 101 ఉపజాతులున్న ఎస్సీలకు కేటాయించిన 17 శాతం రిజర్వేషన్ సదుపాయం 6, 6, 5 శాతం కోటాతో ఏ, బీ, సీ కేటగిరీలకు వర్తిస్తుంది. కేటగిరీ 'ఏ'లో 16 ఉపజాతులకు (లెఫ్ట్) ఆరు శాతం, 'బీ' కేటగిరీలోని 19 ఉపజాతులకు (రైట్) 6 శాతం, 'సీ' కేటగిరీలోని 63 ఉపజాతుల (టచబుల్స్)కు 5 శాతం చొప్పున రిజర్వేషన్ వర్తిస్తుంది. మరో మూడు ఉపజాతులు (ఆది ఆంధ్ర, ఆది ద్రవిడ, ఆది కర్ణాటక) ఏ లేదా బీ కేటగిరీలో ఏదైనా ఓ రిజర్వేషన్ సదుపాయాన్ని పొందే వీలు కల్పించారు.

స్క్రబ్ టైఫస్‌తో వృద్ధురాలి మృతి

అనంతపురం(వైద్యం), గాండ్లపెంట, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంటకు చెందిన వృద్ధురాలు (72) స్క్రబ్ టైఫస్ లక్షణాలతో మృతిచెందారు. జ్వరంతోపాటు తీవ్ర ఆయాసం వస్తుండటంతో ఆమెను కుమారుడు ఈనెల 11న అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చేర్పించారు. ఎలిసా పరీక్ష చేయగా స్క్రబ్ టైఫస్‌గా నిర్ధారణ అయింది. ఎక్యూట్ మెడికల్ కేర్‌లో ఉంచి వైద్యులు చికిత్సలు అందిస్తుండగా పరిస్థితి విషమించి బుధవారం రాత్రి మరణించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి, ఆర్‌ఎంవో డాక్టర్ హేమలత తెలిపారు.

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
శుక్రవారం డిసెంబరు 19, 2025



చీర కట్టు.. చక్కని జట్టు..

ఫిక్కీ ఫ్లో విజయవాడ ఛాప్టర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ చీర దినోత్సవాన్ని విజయవాడలోని ఓ హోటల్లో నిర్వహించారు. సభ్యులు సంప్రదాయ వస్త్రాలతో ర్యాంప్ వాక్ చేసి హొయలొలికించారు. విజేతలకు కలెక్టర్ సతీమణి సుప్రీత బహుమతులు అందజేశారు.

- లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే

సేవారంగంలో భేష్!

పారిశ్రామిక ప్రగతిలోనూ జిల్లా ముందంజ

2025-26లో జీవీఏ పథం (రూ.కోట్లలో)

విభాగం	లక్ష్యం	సాధించింది	సాధించాల్సింది	ర్యాంకు
సేవారంగం	69,220	27,613	41,607	01
పరిశ్రమలు	21,113	9,460	11,653	04
వ్యవసాయం	12,632	3,957	8,675	22

ఈనాడు, అమరావతి: సేవా రంగంలో జిల్లా అద్భుతమైన వృద్ధి రేటుతో దూసుకుపోతోంది. విశాఖ, గుంటూరు, తిరుపతి జిల్లాల కంటే మెరుగైన ప్రగతి సాధించింది. విజన్-2047లో భాగంగా నిర్దేశించిన లక్ష్యాల దిశగా అడుగులు పడుతున్నాయి. బుధ, గురువారాల్లో జరిగిన కలెక్టర్ల సమావేశంలో 2025-26 ఆర్థిక ఏడాది ఇప్పటి వరకు వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగంలో సాధించిన ప్రగతి, లక్ష్యాల నివేదికలు కలెక్టర్ ప్రభుత్వానికి అందించారు. స్థూల అదనపు విలువ జోడింపు(జీవీఏ)తో జిల్లా మెరుస్తోంది.

సేవారంగం నెంబర్-1: ★ జిల్లాలో వ్యవసాయంతో పోలిస్తే సేవా, పారిశ్రామిక రంగాల్లో వృద్ధి కనిపిస్తోంది. ★ తిరుపతి, తర్వాత ఆధ్యాత్మికంగా ప్రాధాన్యత, రైల్వే, ఆర్టీసీ, హోటల్, పర్యాటకం తదితర అంశాల్లో మంచి ఆదాయం, రాజధాని కావడంతో సేవల రంగం పురోగతి సాధిస్తోంది. ★ సేవారంగంలో అత్యధికంగా రూ.27,613 కోట్ల జీవీఏతో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ★ పారిశ్రామిక రంగంలోనూ ప్రగతి పథంలో ఉంది. రూ.9,460 కోట్ల జీవీఏతో విశాఖ, తిరుపతి, అనకాపల్లి తర్వాత నాలుగో స్థానంలో ఉంది. ★ నగరీకరణ ఎక్కువగా ఉండడంతో వ్యవసాయ రంగంలో 22వ స్థానంలో ఉంది. ★ 2025-26 ఆర్థిక ఏడాదిలో జీడీవీఏ రూ.1,02,965 కోట్లకు పెరగాలని లక్ష్యం కాగా ఇప్పటికి రూ.41,029 కోట్లకు చేరింది.

ఆలోచన మెరిసింది.. ఆవిష్కరణై నిలిచింది..

విజ్ఞానదాయకంగా రాష్ట్ర యువజనోత్సవం

న్యూస్‌టుడే, తాడేపల్లి

విద్యార్థులు నూతన ఆలోచనలతో రూపొందించి ప్రదర్శించిన వివిధ రకాల ప్రాజెక్టులు ఆలోచింపజేసేలా ఉన్నాయి. సమాజహితానికి దోహద పడేందుకు వివిధ కళాశాలల విద్యార్థులు నూతన ఆలోచనలతో తయారు చేసిన ప్రాజెక్టులను తాడేపల్లి మండలం వడ్డేశ్వరం కేఎల్ డీమ్డ్ విశ్వ విద్యాలయంలో గురువారం ప్రారంభమైన రాష్ట్ర యువజనోత్సవాల్లో ప్రదర్శించారు.



మహిళల ఆత్మరక్షణకు ఎలక్ట్రిక్ ఫుట్‌వేర్

నేటి సమాజంలో మహిళలకు రక్షణ కరవైంది. బయటకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి. అనుకోని ఘటనల నుంచి వారిని వారు రక్షించుకునేందుకు అవసరమైన ఫుట్‌వేర్‌ను రూపొందించాం. ఫుట్‌వేర్‌లో చిన్న సెన్సార్ ఏర్పాటు చేశాం. పాదం బొటనవేలు కింద ఉండే దీన్ని రెండుసార్లు నొక్కితే ముందుగా ఇందులో మనం ఎవరెవరి నంబర్లయితే ఫీడ్ చేశామో వారికి ఆపదలో ఉన్నట్లు లొకేషన్‌తో పాటు సమాచారాన్ని అందిస్తుంది. వారికి ఈ సమాచారం చేరినట్లుగా మహిళ ధరించిన ఫుట్‌వేర్ నుంచి వైబ్రేషన్ వస్తుంది. దీంతో మహిళ తనకు రక్షణ లభిస్తుందని ధైర్యంగా ఉంటుంది. జీపీఎస్ విధానం ద్వారా ఇది పని చేస్తుంది. దీని వల్ల సదరు మహిళకు రక్షణ కలుగుతుంది.

- హాసిని, మంజుభార్గవి, బీటెక్, కేబీఎన్ కాలేజ్, విజయవాడ



స్మార్ట్ పార్కింగ్ సిస్టం

రద్దీగా ఉండే మాల్స్, సినిమాహాళ్లు, ఇతర ప్రాంతాల్లో వాహనాలు నిలిపేందుకు స్థలం ఉందా? లేదా అని ముందుగా తెలుసుకునేందుకు స్మార్ట్ పార్కింగ్ సిస్టం రూపొందించాం. దీని ద్వారా పార్కింగ్ ప్రదేశంలో ఖాళీగా ఉన్న చోటును గుర్తిస్తుంది. కారు వెంటనే పార్క్ చేసుకోవడానికి సౌలభ్యంగా ఉండేలా యాప్ రూపకల్పన చేశాం. వెబ్‌పేజీ ద్వారా మానిటరింగ్ జరుగుతుంది. సమయం వృథా కాదు. అదే ప్రాంతంలో ఎలక్ట్రిక్ కార్ ఛార్జింగ్ అయ్యే ఏర్పాట్లు చేశాం.

- మోహన మణికంఠ, సత్య ప్రవీణ్, సురేష్‌బాబు, ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కాలేజ్, భీమవరం



సౌరశక్తి తోడుగా.. ముందుకు సాగిపోదా..

పెరుగుతున్న పెట్రోల్ ధరలతో పాటు వాతావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు సోలార్ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాన్ని తయారు చేశాం. సోలార్ నుంచి ఎలక్ట్రిక్ కన్వర్టు చేసి వినియోగిస్తాం. 40 ఓల్ట్స్ సోలార్ ప్యానల్ మూడింటిని వినియోగించాం. బ్యాటరీ రీఛార్జి చేస్తే 30 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చు. నిరంతరం బ్యాటరీ ఛార్జి అవుతూ ఉంటుంది. దూర ప్రాంతానికి ప్రయాణించే వారికి మధ్యలో పెట్రోల్, ఛార్జింగ్ సమస్యలు ఉండవు.

-నీరజ్యోతి ప్రకాష్, కోయని యువరాజ్, చరణ్‌తేజ, ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ కళాశాల, గుడ్లవల్లేరు, కృష్ణా జిల్లా

సాంకేతికతతో నేరాలు నియంత్రించాం

కలెక్టర్ల సమావేశంలో సీపీ రాజశేఖరబాబు

ఈనాడు - అమరావతి: సాంకేతికత, సీసీ కెమెరాల వినియోగంతో నేరాలను నియంత్రించామని సీపీ రాజశేఖరబాబు తెలిపారు. గురువారం ఆయన కలెక్టర్ల సమావేశంలో పాల్గొని నగరంలో నేరాల నియంత్రణకు చేపట్టిన చర్యలు, భవిష్యత్తు కార్యాచరణను సీఎం చంద్రబాబుకు వివరించారు. నగరంలోని పోలీస్ శాఖ పరిధిలోని సీసీ కెమెరాలు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లను అనుసంధానం చేసి వాటి పనితీరు పరిశీలించేందుకు ఈ-హెచ్ఎమ్ఎస్ (విలేజ్ హెల్త్ మేనేజ్‌మెంట్ సిస్టం) అనే డ్యాష్ బోర్డును తయారు చేశామని తెలిపారు. దీనిని ప్రారంభించేందుకు రావాలని సీఎం చంద్రబాబును కోరగా ఆయన అంగీకరించారు. 'ప్రజలు, వివిధ సంస్థల భాగస్వామ్యంతో 10 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. వాటి నిర్వహణ, పర్యవేక్షణకు సురక్ష అనే సాఫ్ట్‌వేర్ ఏర్పాటు చేస్తాం. క్రైమ్ డిటెక్షన్ 84 శాతంగా ఉంది. నేరం జరిగిన 36 గంటల్లో నిందితులను అదుపులోకి తీసుకుంటున్నాం. నగరంలోని 3800 మంది హిస్టరీషీటర్ల వివరాలు, వేలిముద్రలు, చిత్రాలు అన్ని డిజిటలైజ్ చేశాం. ముఖ గుర్తింపు విధానంలో నేరస్థుల వివరాలు అనుసంధానం ద్వారా.. నవరాత్రులు, భవానీ దీక్షల సమయంలో ఆయుధాలకి వచ్చిన వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నాం. దొంగతనాలు 32.9 శాతం తగ్గించామ'ని వివరించారు.



హాజరైన పోలీస్ కమిషనర్, కలెక్టర్

చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరి

విద్యాధరపురం: ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి సుహాసిని తెలిపారు. గురువారం తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో 21న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొనే వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎం, బూత్ వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. జిల్లాలో 966 బూత్‌ల పరిధిలో 2,48,900 మంది చిన్నారులకు చుక్కలు వేయించే లక్ష్యంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. సీఎంవోహెచ్ అర్జునరావు, ఏఎంవోహెచ్ గోపాలకృష్ణ, ఎస్ఎంవో భవానీ పాల్గొన్నారు.

వదిలిస్తారా.. వదిలేస్తారా..!

ఈనాడు, అమరావతి

★ అక్రమార్కులపై మైనింగ్ శాఖ కొరడా
★ రూ.100 కోట్ల మేర నోటీసుల జారీ..

'విజయవాడ రూరల్ మండలం, కొత్తూరు- తాడేపల్లి, వేమవరం, జి.కొండూరు పరిధిలో వైకాపా హయాంలో విచ్చలవిడిగా మట్టి తవ్వేశారు. లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వి.. రూ.వందల కోట్లు కొల్లగొట్టారు. సర్వే నంబర్ల వారీగా ఎవరెవరు ఎంత మట్టి అక్రమంగా తవ్వారో లెక్కలు తేల్చారు. సదరు సంస్థలు, వ్యక్తులకు ఎన్టీఆర్ జిల్లా గనులు, భూగర్భ శాఖ అధ్వర్యంలో నోటీసులు జారీ చేస్తున్నారు. జరిమానాతో కలిపి రూ.100 కోట్లు చెల్లించాలని.. నోటీసులిచ్చిన విషయం వెలుగుచూసింది. సహ చట్టం ద్వారా వివరాలను కోరగా.. ఈ విషయం బయటపడింది.'



వైకాపా జమానాలో కొత్తూరు రెవెన్యూ పరిధిలో విచ్చలవిడిగా తవ్వేసిన తీరు..



ఈ ప్రదేశం ఇప్పుడు ఓ పెద్ద చెరువులా..

గుట్ట, కట్ట, పొలం దేన్నీ వదల్లేదు.. కొత్తూరు- తాడేపల్లి, వేమవరం, విజయవాడ రూరల్ పరిధిలో.. 10.48 లక్షల క్యూబిక్ మీటర్లలో మట్టిని తవ్వుకుపోయినట్లు గుర్తించారు. ఈ మట్టికి వాస్తవంగా చెల్లించాల్సింది.. రూ.10.89కోట్లు, జరిమానా రూ.46.96 కోట్లు కలిపి... రూ.57.85 కోట్లు చెల్లించాలని నోటీసులు జారీ చేశారు.

జి.కొండూరు పరిధిలోనూ భారీగానే.. ✪ వెలగలేరు పరిధిలోనూ.. 5.75 లక్షల క్యూబిక్ మీటర్లు తవ్వేశారని గుర్తించి.. ఈ మట్టికి రూ.6.01 కోట్లు, జరిమానాగా రూ.25.90 కోట్లు చెల్లించాలని నోటీసులిచ్చారు.

✪ చల్లగుండ్ల అజయ్ రూ.7.04 కోట్లు, డి.దేవేంద్రరావు రూ.11.12 కోట్లు, బాషా రూ.1.70 కోట్లు, కొందరికి రూ.12.05 కోట్లు చెల్లించాలని తాఖీదులిచ్చారు. ✪ అత్యధికంగా చప్పిడి రవివర్మ, పావులూరి నాగేశ్వరరావు కలిపి రూ.30.99 కోట్లు, యు.గోపాలరావు రూ.3.44 కోట్లు, పి.మాధవరావు రూ.2.89 కోట్లు, పి.నాగేశ్వరరావు రూ.1.52 కోట్లు చెల్లించాలని నోటీసులిచ్చారు. మేఘా ఇంజినీరింగ్ సంస్థ కూడా అనుమతి తీసుకున్న దాని కంటే అదనంగా తవ్వినందుకు.. రూ.16.92 కోట్లు చెల్లించాలని తాఖీదులిచ్చిన విషయం వెలుగుచూసింది. ✪ కోటిబాబ్ - రూ.55.69 లక్షలు, పరకల శ్రీనివాసరావు - రూ.37.92, టి.నాగేశ్వరరావు రూ.36.62, కె.శేఖర్‌బాబు 30.54, బొడ్డు ప్రకాశరావు రూ.27.36, ఎటిపి ఇన్‌ఫ్రా రూ.21.20 లక్షలు మేర చెల్లించాలని నోటీసులిచ్చారు.

పి.నైనవరం పరిధిలో.. విజయవాడ రూరల్ మండలం పి.నైనవరం గ్రామ రెవెన్యూ పరిధిలోనూ భారీగా మట్టిని తవ్వుకుపోయారు. 2.60 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వేసినందుకు డి.వెంకటేశ్వరరావు అనే వ్యక్తికి రూ.14.42కోట్లు చెల్లించాలంటూ నోటీసులు ఇచ్చారు.

సందేహాల వెల్లువ.. ఈ నోటీసులను ఏడాది కిందటి నుంచే జారీ చేయడం ఆరంభించారు. కానీ.. ఇప్పటివరకూ వీటిపై ఎలాంటి చర్యలు మాత్రం తీసుకోలేదు. సర్కారు ఖజానాకు రావాల్సిన ఈ డబ్బులను రికవరీ చేసే ఉద్దేశం అధికారులకు ఉందా? లేదా? అనే సందేహాలు వెల్లువెత్తుతున్నాయి.

ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. మొత్తం 1,50,000 మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యంగా ఉండగా, ఇప్పటివరకు 14,236 మంది రైతుల నుంచి 1,02,781.560 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేశారు. 24 గంటల్లోగా నగదు చెల్లిస్తున్నారు. ఇప్పటివరకు రూ.218.72 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సతీష్ తెలిపారు. మొత్తం 18.75 లక్షల గోనె సంచులు అవసరం కాగా, 31.96 లక్షల సంచులను అందుబాటులో ఉంచినట్టు వెల్లడించారు.

కాలనీ పేరు.. రైల్వే బొగ్గు లైను

విజయవాడలో రైల్వే బొగ్గు లైను కాలనీకి ఒక ప్రత్యేకత ఉంది. 1950 సంవత్సరానికి ముందు అన్ని బొగ్గు ఇంజిన్లు ఉండేవి. వాటికి ఇక్కడే బొగ్గు నింపడంతో దానికి రైల్వే బొగ్గు లైన్ కాలనీగా మారింది. విజయవాడ స్టేషన్‌కు కూత వేటు దూరంలోనే ఉంటుంది ఈ కాలనీ. బొగ్గును రైల్వే స్టేషన్‌కు లేదా లోకో షెడ్‌కు చేరవేసే ప్రత్యేకమైన రైలు మార్గం (లైన్) ఉండే ప్రాంతం కావడంతో ఆ ప్రాంతానికి బొగ్గు లైన్ అనే పేరు స్థిరపడిపోయింది. గతంలో లారీలు బొగ్గు లోడుతో బయట నుంచి వచ్చి ఇక్కడికి చేరుకుంటాయి. అనంతరం ఆ బొగ్గును ఇంజిన్‌లో లోడ్ చేసేవారు. ఇదే ప్రాంతంలో రైల్వే ఉద్యోగుల క్వార్టర్స్ ఆ ప్రాంతంలో ఉండడం వల్ల అది కాలనీగా మారింది. ప్రస్తుతం ఈ కాలనీలో రైల్వే ఉద్యోగులు నివసిస్తున్నారు.

- విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే

నిండు మనసుల త్యాగఫలం.. పీఎన్‌బీఎస్



విజయవాడలోని పండిట్ నెహ్రూ ఆర్టీసీ బస్టాండ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆసియాలోనే రెండో పెద్ద బస్టాండ్‌గా దీనికి పేరుంది. మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు కృషి, ఆలోచనలతో దాదాపు 22 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. దీని వెనుక ఉన్న కథ మీకు తెలుసా.. ఒకప్పుడు ఈ ప్రాంతాన్ని భాస్కరరావుపేటగా పిలిచేవారు. సిటీకి మధ్యలో ఉండడంతో బస్టాండ్ నిర్మాణానికి అనువుగా ఉంటుందని ప్రభుత్వం భావించింది. ప్రత్యామ్నాయంగా ఇక్కడ నివాసం ఉంటున్న వారికి స్థలాలు ఇవ్వాలని ఆలోచనతో అప్పటి మేయర్ టి.వెంకటేశ్వరరావు సూచన మేరకు 1986లో భవానీపురం ఊర్మిళానగర్ రైతుల నుంచి ఎకరం రూ.95 వేలు చొప్పున 27 ఎకరాల పొలాన్ని కొనుగోలు చేశారు. ఆ ప్రాంతంలో ఐదు ప్రధాన రహదారులు, 42 అంతర్గత రహదారులకు రూపకల్పన చేశారు. భాస్కరరావుపేటలో సొంత స్థలాలు ఉన్న వారికి ఊర్మిళానగర్‌లో కేటాయించారు. అద్దెలకు ఉండే వారిని పాయకాపురం, రాజీవ్‌నగర్ తదితర ప్రాంతాలకు తరలించారు. ఒక్క ఊర్మిళానగర్‌లోనే 864 మందికి స్థలాలు ఇవ్వడం విశేషం. ఒక్కో కుటుంబానికి రూ.5,116 చొప్పున ఇచ్చారు. అనంతరం విజయవాడ బస్టాండ్ రూపకల్పన చేశారు. – భవానీపురం, న్యూస్‌టుడే

మేలుకోరేలా.. మేలుకొనేలా..!



బాపులపాడు మండలం వీరవల్లికి చెందిన 'తానా' ఫౌండేషన్ కార్యదర్శి రాజా కసుకుర్తి.. ఉద్యాన మొక్కలు పెంచుతుంటారు. తన వ్యవసాయ క్షేత్రంలో పంటలకు పురుగుల మందు పిచికారీ చేసే సమయంలో అధికారులు, వైద్యులు చెప్పే సూచనలు, జాగ్రత్తలను తూచా తప్పకుండా పాటిస్తారు. అంతే కాదు.. తోటి రైతులు వారి పొలాల్లో తెగుళ్ల నివారణ కోసం రసాయన మందులు పిచికారీ చేసే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడంతో అనారోగ్యానికి గురవుతున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకుని ఇటీవల రూ.50 లక్షలతో మండల పరిధిలోని వారికి అధునాతన పవర్ స్ప్రేయర్లు ఉచితంగా పంపిణీ చేశారు. వాటితో పాటు రక్షణగా ధరించేందుకు ప్రత్యేక దుస్తులు, చేతులకు గ్లౌజులు, ఎయిర్ ఫిల్టర్‌తో కూడిన మాస్కు, కళ్లను పూర్తిగా మూసి ఉంచేలా కళ్లజోడు, గొడుగు, టార్చిలైట్‌తో కూడిన కిట్లు అందజేస్తూ రైతు రక్షకుడిగా వ్యవహరిస్తున్నారు.

– హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే

వజ్రోత్సవం.. అనురాగ సౌరభం





పూర్వ విద్యార్థులు, ప్రముఖుల సమక్షంలో తపాలా బిళ్లను ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం - న్యూస్‌టుడే, గుడివాడ: గుడివాడ అక్కినేని నాగేశ్వరరావు కళాశాల వజ్రోత్సవ వేడుకలు ఆద్యంతం ఆనందభరితంగా సాగాయి. మూడోరోజు గురువారం ముగింపు వేడుకలో పూర్వవిద్యార్థులు సందడి చేశారు. పలు సేవాకార్యక్రమాలు, కళాశాల అభివృద్ధికి వితరణలతో.. సమాజ శ్రేయస్సు కోరుతూ చేసిన ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. ఇక్కడ చదివి ఉన్నత స్థానాలకు ఎదిగి.. దేశ విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు విచ్చేసి.. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థుల కలయికలు, గత స్మృతుల కలబోతలతో వేడుక కనుల పండువగా జరిగింది. 'మా తరగతి ఇదే.. ఈ బెంచీలోనే కూర్చున్నాం.. ఇక్కడే ప్రశంసలందుకున్నాన'ని ఒకప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.. గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అభినందన సందేశం పంపించారు.

విజయపథం... తొలుత ప్రిన్సిపల్ డాక్టర్ కుమార్ కళాశాల విజయాలు.. కార్యక్రమాలను వివరించారు. ★ మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్, కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు, తదితరులు శిలాఫలకాన్ని, వజ్రోత్సవ తపాలా స్టాంపును ఆవిష్కరించారు.

విజ్ఞాన పాఠం.. విజయ గీతం



రోజుకు పది గంటలు పాటలు విని పోటీ పరీక్షల్లో విజయం సాధించామని రాబోయే రోజుల్లో పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు చెప్పనున్నారు. ఇదేంటి.. సరిగానే విన్నామా...! అన్న సందేహం రాక తప్పదు. అవునండీ ఇది నిజమే.. రోజుకు 8 నుంచి 12 గంటలు కష్టపడి చదివాం అని చెప్పే రోజుల నుంచి పాటలు విన్నాం అనే రోజులొచ్చాయి. ఏఐ(కృత్రిమ మేధ) సాంకేతిక పరిజ్ఞానంతో వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం కొన్ని ఆడియోలు, వీడియోలు వచ్చేశాయి. తెలుగు, ఆంగ్లంతో పాటు వివిధ సబ్జెక్టులకు సంబంధించి, జనరల్ నాలెడ్జ్ వంటి అంశాలు అభ్యర్థులకు అర్థం కావడానికి ఈ పద్ధతి పుట్టుకొచ్చింది. సంగీతానికి చలించని శరీరం ఉండదనే నానుడి ఇక్కడ వర్తించినట్లు అవుతోంది. ప్రస్తుతం ఇవి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు వరంగా మారాయి. వినే వాటి కన్నా చూసే అంశాలే మొదడులో నిక్షిప్తమై ఉంటాయని నిర్వాహకులు వీటిని రూపొందించారు. అలంకారాలు, వృత్తాలు, సంధులు, తదితరాలు ఇందులో ఉన్నాయి. ప్రస్తుతం ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్), ఏపీపీఎస్సీకి సిద్ధమవుతున్న లక్షల మంది అభ్యర్థులు వీటిని చూస్తూ, ఆలకిస్తున్నారు. ఇంటర్ నేషనల్ స్టోన్ బోర్డు యూనివర్శిటీ ఏఐ ఉపయోగంలో భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో ఉందని ఇప్పటికే ప్రకటించింది.

– ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే

పసి మోములపై కర్కశ కత్తి

విజయవాడలో పిల్లల విక్రయ ముఠా అరెస్టు!

నెలలో ఐదుగురిని తెప్పించి.. ఇద్దరి విక్రయం

ఈనాడు, అమరావతి

ఉత్తరాది రాష్ట్రాల నుంచి పిల్లలను తెప్పించి.. విజయవాడ కేంద్రంగా విక్రయిస్తున్న పది మంది సభ్యుల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. భవానీపురంలో పోలీసుల తనిఖీల్లో దారుణం వెలుగుచూసింది. ఆపై విజయవాడ, సత్తెనపల్లిలో బృందాలుగా ఏర్పడి దాడులు చేసి ఐదుగురు చిన్నారులను రక్షించారు. వీరిలో అప్పటికే ఇద్దరిని విక్రయించారు. నిందితులు గతంలో వివిధ కేసుల్లో అరెస్టయి జైలుకెళ్లారు. నెల కిందటే విడుదలైనా.. మళ్లీ పిల్లల విక్రయాలు ప్రారంభించారు. సీపీ రాజశేఖర్‌బాబు గురువారం వివరాలు వెల్లడించారు.

జైలుకెళ్లినా మారలేదంతే.. విజయవాడవాసి బలగం సరోజిని.. సులభంగా డబ్బు సంపాదించేందుకు సంతానం లేని వారికి పిల్లలను విక్రయించే మార్గాన్ని ఎంచుకుంది. విజయవాడ, పరిసరాల వారితో కలసి ముఠాగా ఏర్పడింది. దిల్లీ, ముంబయిలో పలువురితో సంబంధాలు పెట్టుకుని.. వాళ్లతో విజయవాడకు పిల్లలను తెప్పించి ఒక్కో బిడ్డను రూ.3-4 లక్షలకు విక్రయిస్తూ.. రూ.50 వేలు కమీషన్ తీసుకుంటుంది. మార్చిలో విజయవాడలో పిల్లలను విక్రయిస్తుండగా సరోజిని, ఫరీనా, కొందరిని అరెస్టు చేయగా జైలుకు వెళ్లొచ్చారు. సృష్టి ఫర్టిలిటీ కేసులో హైదరాబాద్ పోలీసులు సరోజిని, ఫరీనా, నందినిలను అరెస్టు చేశారు. సరోగసీ, ఎగ్ డోనార్స్‌తో మాట్లాడి వీరు డాక్టర్ నమ్రత వద్దకు తీసుకెళ్లేవారు. ఈ కేసులో జైలుకెళ్లి నెల కిందట విడుదలయ్యారు.

దిల్లీ, ముంబయి నుంచి రప్పిస్తూ..

జైలు నుంచి విడుదలయ్యాక సరోజిని... దిల్లీ, ముంబయి సరఫరాదారులతో సంబంధాలు నెరిపింది. ఒక్కొక్కరితో రూ.1-2 లక్షలకు మాట్లాడుకుంది. ఉత్తరాది రాష్ట్రాల్లో పిల్లలను పోషించలేని పేదల నుంచి తీసుకుని.. విజయవాడకు తెచ్చి సరోజినికి ఇస్తారు. ✦ నెల కిందట ముంబయివాసి కవిత.. తన సహాయకులు నూరి, సతీష్‌లతో ఓ శిశువును విజయవాడకు పంపింది. శిశువును తీసుకున్న సరోజిని.. బ్లెస్సీ ఇంట్లో ఉంచింది. పిల్లలు లేని కొత్తపేట ప్రాంత దంపతులకు రూ.3.70 లక్షలకు అమ్మింది. ✦ 15 రోజుల కిందట ముంబయి ముఠా ఓ శిశువును తెచ్చి సరోజినికివ్వగా.. సత్తెనపల్లిలో బాబావలి, నందిని ఇంట్లో ఉంచింది.✦ మూడు రోజుల కిందట ముంబయి నుంచి మరో శిశువు రాగా.. సరోజిని సత్తెనపల్లిలో ఉంచింది. ✦ బుధవారం వేకువన దిల్లీ నుంచి కిరణ్‌శర్మ, భారతిలు ఇద్దరు చిన్నారులను తీసుకుని విజయవాడ వచ్చారు. సరోజిని, బ్లెస్సీ, విజయలక్ష్మి వెళ్లి శిశువులను తీసుకుని.. బ్లెస్సీ ఇంట్లో ఉంచారు. వెంటనే ఓ శిశువును పాయకాపురం వుడా కాలనీ దంపతులకు రూ.3.50 లక్షలకు అమ్మారు.



పోలీసులు రక్షించిన చిన్నారులు

మెరుపుదాడితో వెలుగులోకి...

✦ ఇదే సమయంలో పోలీసులు బ్లెస్సీ ఇంటిపై దాడి చేశారు. అప్పటికే ఒక శిశువును విక్రయించగా.. మిగిలిన చిన్నారిని రక్షించారు. ఈముగ్గురిని అరెస్టు చేసి.. వీరిచ్చిన సమాచారంతో సత్తెనపల్లిలో వలి ఇంటిపై దాడి చేసి.. అక్కడి ఇద్దరు శిశువులను, అమ్మిన ఇద్దరు పిల్లలను రక్షించారు. మొత్తంగా ఐదుగురిని శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు.

మూడు కేసులు నమోదు...

సరోజిని, విజయలక్ష్మి, బ్లెస్సీ, నందిని, బాబావలి, మణి, ఫరీనా, వంశీ కిరణ్ కుమార్, యోహాన్, శ్రీనివాసరావులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిపై భవానీపురం, నున్న, కొత్తపేట ఠాణాల్లో.. బీఎన్ఎస్ 143, జువైనల్ చట్టం 81, 87 సెక్షన్ల కింద కేసులు పెట్టారు. సరోజినిపై నున్న, హైదరాబాద్‌లో కేసులున్నాయి. విజయలక్ష్మిపై మంగళగిరి, ఏలూరు, కోదాడ, జనగాం, సూర్యాపేటల్లో ఐదు కేసులు.. ఫరీనాపై నున్న, హైదరాబాద్‌లో ఒక్కో కేసు, నందినిపై హైదరాబాద్‌లో ఒక కేసు ఉంది.

అదుపులో కిరణ్‌శర్మ, భారతి

బుధవారం వేకువన ఇద్దరు చిన్నారులను తెచ్చిన కిరణ్‌శర్మ, భారతి.. నగరంలో ఓ హోటల్‌లో దిగారు. మధ్యాహ్నం డబ్బులు ఇస్తామనడంతో ఆగిపోయారు. ఇంతలో పోలీసులకు సరోజిని ముఠా దొరకడంతో.. వీరు పరారయ్యారు. రంగంలోకి దిగిన ప్రత్యేక బృందం దిల్లీ వెళ్లి.. వీరిని అదుపులోకి తీసుకొని విజయవాడకు తెస్తోంది.

రామోజీ వింటర్ ఫెస్ట్ షురూ

మిన్నంటిన పర్యాటకుల సందడి



రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పర్యాటకుల స్వర్గధామం రామోజీ ఫిల్మ్‌సిటీలో గురువారం రామోజీ వింటర్ ఫెస్ట్ ప్రారంభమైంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 1వ తేదీ వరకు సాగే ఈ ఫెస్ట్‌లో తొలి రోజే సందడి మిన్నంటింది. సందర్శకులు ఫిల్మ్‌సిటీ అందాలు ఆస్వాదించేలా, వినోదంతో ఆనందతీరాలను చేరేలా ఏర్పాట్లు చేయడంతో చిన్నా పెద్ద ఉత్సాహంగా వేడుకల్లో పాలుపంచుకున్నారు. కార్నివాల్ పరేడ్, మ్యూజికల్ గ్లో గార్డెన్, మాయాలోక్ సందర్శనతో ఆనందించారు. రామోజీ ఫిల్మ్‌సిటీ సందర్శన వేళలను రాత్రి 9 గంటల వరకు పొడిగించడంతో.. మిరుమిట్లుగొలిపే విద్యుద్దీప కాంతుల్లో గార్డెన్ల అందాలు, ఆకట్టుకొనే లోకేషన్లలో సకుటుంబ సమేతంగా, బంధుమిత్రులతో సరదాగా గడిపారు. అద్భుతమైన సినిమా సెట్లు, చిత్రలోకాన్ని కళ్లముందుకు తెచ్చే స్టూడియో టూర్‌తో సరికొత్తగా విహార అనుభూతిని సొంతం చేసుకున్నారు. వైల్డ్ వెస్ట్ స్టంట్స్, రైడ్స్, లైవ్ షోలు, సాహస్, బర్డ్ పార్కులో విహారాన్ని మధుర జ్ఞాపకాలుగా పదిలం చేసుకున్నారు.



కార్నివాల్ పరేడ్..

రామోజీ వింటర్ ఫెస్ట్‌లో భాగంగా రాజసం ఉట్టిపడేలా ఏర్పాటు చేసిన కార్నివాల్ పరేడ్ ఆకట్టుకుంటోంది. శకటాలతో సాగే ఈ పరేడ్‌లో కళాకారుల నృత్య ప్రదర్శనలు, వివిధ వేషధారులు సందర్శకులను ఆకట్టుకుంటున్నారు. మ్యూజికల్ గ్లో గార్డెన్ పర్యాటకులను కలల ప్రపంచంలో విహరించేలా చేస్తోంది. ఐకానిక్ సినిమా సెట్ల మాయాజాలాన్ని మాయాలోక్ కళ్ల ముందుకు తెస్తుండటంతో సందర్శకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కార్నివైబ్ 2026కు సిద్ధం

డిసెంబరు 31న రాత్రి కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టే క్షణాలను ఆస్వాదించేందుకు 'రామోజీ కార్నివైబ్ - 2026' వేదిక సిద్ధమైంది. ఇక్కడ వార్ ఆఫ్ డీజేలు, లైవ్ బ్యాండ్, ప్రత్యేక ప్రదర్శనలు ఆకర్షణగా నిలువనున్నాయి. అతిపెద్ద ఓపెన్ ఎయిర్ డ్యాన్స్ ఫ్లోర్‌లో 2026 కౌంట్‌డౌన్ ఉత్కంఠభరిత క్షణాలను బంధుమిత్రులతో కలిసి గడిపేందుకు అవకాశం ఉంటుంది. పసందైన విందు, అపరిమిత పానీయాలు, వీనులవిందైన సంగీతంతో సందడి చేయవచ్చు. కాల్ ఆన్ డ్రైవర్, బేబీ కేర్ సౌకర్యాలు వినియోగించుకోవచ్చు.

ప్రత్యేక ప్యాకేజీలు..

వింటర్ ఫెస్ట్, న్యూ ఇయర్ వేడుకలకు వివిధ ప్రత్యేక ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో ఈ వేడుకలను ఆస్వాదించాలనుకొనే వారి కోసం ప్రత్యేక, విడిది ప్యాకేజీలు ఉన్నాయి. రామోజీ ఫిల్మ్‌సిటీలో బస చేసి వేడుకల్లో పాలుపంచుకోవచ్చు. **మరిన్ని వివరాలకు..** **www.ramojifilmcity.com** లాగిన్ అవ్వండి. కాల్ సెంటర్ నంబర్: 76598 76598

భవానీ దీక్షల విరమణల రెండో విడత ఆదాయం రూ.3.21 కోట్లు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రి ఈనెల 11 నుంచి 15 వరకు శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన భవానీ దీక్షల విరమణ సందర్భంగా భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను గురువారం లెక్కించగా రూ.3,21,22,542 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం ఈవో శీనానాయక్ తెలిపారు. భక్తులు సమర్పించిన కానుకలతో పాటు 182 గ్రాముల బంగారం, 12.376 కిలోల వెండి వస్తువులను మొక్కుల రూపంలో చెల్లించారు. కానుకలతోపాటు విదేశీ కరెన్సీ 190 యూఎస్ఏ డాలర్లు, 5 ఆస్ట్రేలియన్ డాలర్లు, 25 కెనడా డాలర్లు, 5 సౌదీ రియాల్స్ వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. రెండ్రోజుల్లో రూ.4,49,13,187 ఆదాయం వచ్చిందని ఆలయ అధికారులు తెలిపారు. కానుకల లెక్కింపును దేవస్థానం పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, సభ్యులు పద్మావతి ఠాకూర్, సరిత పర్యవేక్షించారు.

గుణదల సీఐ, సబ్ రిజిస్ట్రార్‌లపై కేసు నమోదు

స్థలం తనఖా వ్యవహారంలో కోర్టు ఆదేశాలు అమలు

మధురానగర్, న్యూస్‌టుడే: ఒక యువతికి చెందిన స్థలాన్ని ఆమెకు తెలియకుండా తనఖా పెట్టిన కేసులో న్యాయస్థానం ఆదేశాల మేరకు గుణదల సీఐ, గుణదల సబ్ రిజిస్ట్రార్‌తోపాటు ఏలూరుకు చెందిన శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, మరికొందరిపై గుణదల పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు. గంగిరెద్దుల దిబ్బకు చెందిన శీలం లాలిత్యకు గుణదల విజయ మేరీ స్కూలు సమీపంలో కొంత స్థలం ఉంది. ఈ స్థలాన్ని లాలిత్య భర్త రాజు, ఛాయాదేవి తదితరులు ఆమెకు తెలియకుండా ఏలూరుకు చెందిన శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో రూ.50 లక్షలకు తనఖా పెట్టారు. ఆ తరువాత మరో వ్యక్తి పేర రిజిస్టర్ చేశారు. దీనిపై లాలిత్య న్యాయస్థానంలో కేసు వేశారు. విచారణ అనంతరం దీనిపై గుణదల సబ్ రిజిస్ట్రార్, సీఐ, శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌తోపాటు లాలిత్య భర్త రాజు, ఛాయాదేవి, నల్లి శేషుకుమార్, పెద్ద సుబ్బారావు తుల్లిమిల్లి, సురేష్‌కుమార్ తుల్లిమిల్లి, ఏడుకొండలు కూరాకుల, శోభన్‌బాబు మన్మథలపై కేసు నమోదు చేయాలని 1వ అదనపు చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలతో గుణదల పోలీసులు కేసు నమోదు చేశారు.

అనిల్ చోఖ్రా, వెంకటేశ్ నాయుడు పిటిషన్లపై ముగిసిన వాదనలు

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో నిందితుడు రోనక్ కుమార్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై ఏసీబీ కోర్టు విచారణ జరిపింది. సిట్ అధికారులకు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేసేందుకు తదుపరి విచారణను ఈ నెల 23కి వాయిదా వేసింది. తమకు జైలులో వసతులు కల్పించాలని కోరుతూ అనిల్ చోఖ్రా, వెంకటేశ్ నాయుడు పిటిషన్లపై కోర్టు విచారణ జరిపింది. ఇరువైపులా వాదనలు విన్న న్యాయస్థానం..తీర్పును రిజర్వ్ చేసింది. ఈనెల 20న ఉత్తర్వులిస్తామని తెలిపింది.

మధుర స్మృతుల నిలయం.. ఏఎన్నార్ కళాశాల

ఈనాడు డిజిటల్ – మచిలీపట్నం, న్యూస్‌టుడే – గుడివాడ

'మధుర స్మృతులకు నిలయం అక్కినేని నాగేశ్వరరావు కళాశాల' అని పూర్వ విద్యార్థులు నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఇక్కడ చేరకు ముందు వరకు చదువులో వెనుకపడి సాధారణ విద్యార్థులుగా ఉండేవారమని, అప్పటి అధ్యాపకుల ప్రత్యేక చొరవతో మెరుగై ఉన్నత స్థానాలకు చేరుకున్నామని గుర్తుచేసుకున్నారు. వజ్రోత్సవాల సందర్భంగా గురువారం నిర్వహించిన వేడుకలో కళాశాలతో తమ అనుబంధాన్ని నెమరువేసుకున్నారు.

- నాగేశ్వరరావు విలువల గురించి ఎక్కువ మాట్లాడేవారు. నేటి సమాజానికి ఆయన స్ఫూర్తిదాయకం. కళాశాలలో విలువలతో కూడిన విద్యను నేర్పుతూ మరింత ముందుకు తీసుకెళ్లాలి. **- ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్**
- నేను పదో తరగతి మొదట ఫెయిల్. ఈ కళాశాలలో చేరకు ముందు వెనుక పడిన విద్యార్థిని. ఇక్కడి అధ్యాపకుల కృషితో ఫస్ట్ క్లాస్ స్టూడెంట్‌గా ప్రశంసలు అందుకున్నా. ఈ స్ఫూర్తితోనే ప్రొఫెసర్ అయ్యి.. నోబెల్ బహుమతి వరకు వెళ్లా. కాలేయ సంబంధిత వ్యాధి హెపటైటిస్-సి వైరస్‌కు వ్యాక్సిన్ తయారు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. వచ్చే 3ఏళ్లలో దాన్ని సాధిస్తాం. ఇలా సైన్స్‌లో ప్రావీణ్యం సాధించడానికి ఈ కళాశాలే ముఖ్య కారణం. **- పూర్వ విద్యార్థి ప్రొఫెసర్ గుంటక రామిరెడ్డి**
- ఈ వేడుక చూస్తుంటే నాన్న సినిమా మూగ మనుషులులోని పాటలో 'పోయినోళ్లందరు మంచోళ్లు.. ఉన్నోళ్లు పోయినోళ్ల తీపి గుర్తులు' అని చెప్పాలనిపించింది. నాగేశ్వరరావు తీపి గుర్తులు ఈ కళాశాల. వృత్తి విద్య కోర్సులతోనే దేశం త్వరగా అభివృద్ధి చెందుతుంది. ప్రభుత్వాలు ఆ దిశగా కృషి చేయాలి. **- అక్కినేని వెంకట్**
- ఎంజాయ్ చేస్తూ చదువుకుంటున్నట్లే చేసే పనిలోనూ ఆనందాన్ని వెతుక్కోవాలి. ఒంటరిగా సాధించిన విజయం కంటే నలుగురితో కలిసి సాగించిన ప్రయాణం అద్భుతం. విజయాలు వాటంతట అవే వస్తాయి. కళాశాల వజ్రోత్సవాల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనంతో పాటు ప్రస్తుత విద్యార్థులకు స్ఫూర్తిదాయక అనుభవాలు తెలపడం ఆనందదాయకం. **- ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**
- అనుకున్న లక్ష్యం కోసం అర్థాకలితో పోరాడి అక్కినేని నాగేశ్వరరావు ఎన్నో విజయాలు సాధించారు. అందుకు ఈ కళాశాలే ఉదాహరణ. **- ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా**
- స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు ప్రవేశపెట్టడం శుభపరిణామం. దీనికి పూర్వ విద్యార్థుల సహకారం కావాలి. **- రావి వెంకటేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్**
- అక్కినేని నాగేశ్వరరావు గుర్తుగా పలు కార్యక్రమాలు చేసుకోవడం మా అదృష్టం. **- అక్కినేని ఫౌండేషన్ ఛైర్మన్ తోటకూర ప్రసాద్**



వజ్రోత్సవాల పైలాన్‌ని ఆవిష్కరిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్ కొల్లి శ్రీనివాసరావు

పోలీసు కస్టడీకి వంశీ అనుచరులు

తొలి రోజు సాగని విచారణ

ఈనాడు - అమరావతి: సత్యవర్ధన్‌పై దాడి, అపహరణ కేసులో వల్లభనేని వంశీ అనుచరులు నలుగురిని పటమట పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు రెండు రోజుల కస్టడీలో భాగంగా గన్నవరం కారాగారంలో ఉన్న తేలప్రోలు రాము, నెల్లూరు జైలులో ఉన్న కొమ్మా కోట్లు, వజ్రకుమార్, యర్రంశెట్టి రామాంజనేయులను కస్టడీకి తీసుకున్నారు. నెల్లూరు కేంద్ర కారాగారం నుంచి ముగ్గురు నిందితులు రావడం ఆలస్యమైంది. వారికి వైద్య పరీక్షలు నిర్వహించి పటమట స్టేషన్‌కు తెచ్చేసరికి గురువారం సాయంత్రం అయింది. దీంతో తొలి రోజు విచారణ సాగలేదు. నిందితులను సాయంత్రం విజయవాడ కారాగారంలో అప్పగించారు. తిరిగి శుక్రవారం ఉదయం కస్టడీకి తీసుకోనున్నారు.

అప్పులు తీర్చలేక ఆత్మహత్య

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట పట్టణంలోని కోదాడ రోడ్డులో గల డాలర్స్ కాలనీకి చెందిన మహ్మద్ ఇబ్రహీం (30) బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం... డాలర్స్ కాలనీలోని ఒక అపార్ట్‌మెంట్‌లో భార్య, పాప, తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటున్నారు. ఆయన హైదరాబాద్‌లో ఒక ప్రైవేట్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్ పని చేస్తున్నారు. బుధవారం రాత్రి జగ్గయ్యపేట వచ్చిన ఇబ్రహీం ఇంటికి వెళ్లకుండా రాత్రి 8 గంటల సమయంలో తల్లిదండ్రులు నివాసం ఉండే అపార్ట్‌మెంట్ సమీపంలోని ఖాళీ స్థలంలో చాకుతో గొంతు కోసుకున్నాడు. అదే సమయంలో కొందరు బాలురు రక్తపు మడుగులో ఉన్న ఆయన్ను చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారొచ్చి జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి చిల్లకల్లు ఎస్సై సూర్యశ్రీనివాస్ విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆన్‌లైన్‌లో క్రికెట్, బెట్టింగ్‌లకు అలవాటు పడి అధికంగా అప్పులు చేశారు. అవి తీర్చలేక చాకుతో గొంతు కోసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. మృతుడి బ్యాగ్‌లో చాకు, సూసైడ్ నోట్ లభించాయి. ఆయన భార్య యాసెన్ సూసైడ్ నోట్‌లోని చేతిరాతను గుర్తించి నిర్ధారించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మహ్మద్ ఇబ్రహీం (పాత చిత్రం)

ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ హత్య కేసులో ఐదుగురికి జైలు

నిందితులంతా కుటుంబ సభ్యులే

కృష్ణలంక, న్యూస్‌టుడే: విజయవాడ నగరంలో సంచలనం సృష్టించిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ హత్య కేసుకు సంబంధించి మృతుడి కుటుంబ సభ్యులు ఐదుగురికి న్యాయస్థానం కఠిన కారాగార శిక్ష విధిస్తూ గురువారం తీర్పునిచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ మహమ్మద్ ఆయూబ్ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ కుటుంబంతో లబ్బీపేట పోలీస్ క్వార్టర్స్‌లో నివాసం ఉండేవారు. 2016 డిసెంబరు 19వ తేదీన గిరిపురంలో ఉంటున్న బంధువుల ఇంట్లో దిన కార్యక్రమానికి ఆయూబ్.. కుటుంబ సభ్యులతో వెళ్లగా భోజనాల విషయంలో కొడుకులకు, తమ్ముళ్లకు మధ్య గొడవ జరిగింది. ఆయూబ్‌కు, కుటుంబ సభ్యులకు మధ్య గతం నుంచి ఆస్తి గొడవలు ఉండడంతో ఇంటికొచ్చిన తరువాత భార్య, కూతుళ్లు, కొడుకులతో అతడికి వివాదం జరిగింది. గొడవ పెద్దదైన క్రమంలో పెద్ద కూతురు నీలోఫర్ సుల్తానా బ్యాట్‌తో తండ్రి తలపై గట్టిగా కొట్టడంతో రక్తస్రావమై ఘటనా స్థలంలో ఆయూబ్ మృతి చెందారు. హత్య విషయాన్ని బయటకు రానీయకుండా రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాలని కుటుంబ సభ్యులు నిర్ణయానికి వచ్చి అతడి శవాన్ని కారులో ఎక్కించి జి.కొండూరు మండలం వెలగలేరు పరిసరాల్లో పడేశారు. దీనికితోడు మృతుడి శవానికి సమీపంలో ద్విచక్ర వాహనాన్ని పడేసి వారంతా ఇంటికి చేరుకున్నారు. 21వ తేదీన మృతుడి పెద్ద కుమారుడు షేక్ సద్దాం హుస్సేన్. . తన తండ్రి జికొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లుగా అక్కడి పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. జి.కొండూరు పోలీసులు ప్రమాదంపై కేసు నమోదు చేసి విచారిస్తున్న క్రమంలో ఆయూబ్ తండ్రి ఇచ్చిన సమాచారం మేరకు మృతుడి ఇంటి పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. అనంతరం కుటుంబ సభ్యులే అతడిని హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించినట్లుగా నిర్ధారించి హత్య కేసుగా మార్చి కృష్ణలంక పీఎస్‌కు బదిలీ చేశారు. అప్పటి కృష్ణలంక సీఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించి కుటుంబ సభ్యులే అతడిని హత్య చేసినట్టు నిర్ధారించారు. ఏ1గా షేక్ నీలోఫర్ సుల్తానా, ఏ2గా షేక్ సద్దాం హుస్సేన్, ఏ3గా షేక్ ఇమ్రాన్ హుస్సేన్, ఏ4గా షేక్ జకీరు స్నీసా, ఏ5గా షేక్ నజియా సుల్తానాలను 2017 ఏప్రిల్ 13వ తేదీన పోలీసులు అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపర్చారు. విచారణలో నేరం రుజువైనందున ఏ1, ఏ2, ఏ3లకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేలు జరిమానా, ఏ4కు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ 7వ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి బి.అబ్రహాం తీర్పునిచ్చారు.

మావోల కస్టడీ పిటిషన్‌పై జిల్లా కోర్టులో అప్పీలు చేసుకోండి

ఈనాడు - అమరావతి

తాము అరెస్టు చేసిన నలుగురు మావోయిస్టులను కస్టడీలోకి తీసుకుని నగరంలోనే విచారించేందుకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ పటమట పోలీసులు గురువారం ఎంఎస్‌జే కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మావోయిస్టులను నెల్లూరు కారాగారంలో మూడు రోజుల పాటు విచారించేందుకు నాలుగో ఏసీజేఎం కోర్టు ఇచ్చిన తీర్పుపై పోలీసులు గురువారం ఎంఎస్‌జే కోర్టులో అప్పీలు చేశారు. మావోలను నెల్లూరులో కాకుండా విజయవాడకు తీసుకొచ్చి.. ఇక్కడే విచారించేలా అనుమతి ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన న్యాయాధికారి.. మచిలీపట్నంలోని జిల్లా కోర్టులో దాఖలు చేసుకోవాలని సూచించారు. ఈ పిటిషన్ తిరిగి శుక్రవారం బందరులోని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి కోర్టులో అప్పీలు చేయనున్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -123. రిటైల్ ధర 150 చికెన్ విత్ స్కిన్ - 218, చికెన్ స్కిన్‌లెస్ - 248.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 266 చికెన్ స్కిన్‌లెస్ - 276.

ఆశ చూపించి.. అందినంత దోచుకుని..

గంపలగూడెం, విస్సన్నపేట, న్యూస్‌టుడే : విస్సన్నపేట లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్ సంస్థ నిర్వాహకులు పేదలకు మాయమాటలు చెప్పి రెండేళ్లలో భారీగా లూటీ చేశారు. 2023 మార్చిలో ఎల్‌బీఎఫ్‌ను స్థాపించిన నండూరు దుర్గాప్రసాద్, భార్య శివాని అధిక వడ్డీ ఆశ చూపి డిపాజిటర్ల నుంచి అందినంత దోచేశారు. సంస్థలో 20 నెలల్లో వివిధ జిల్లాల నుంచి సభ్యులుగా చేరిన వారి నుంచి పెట్టుబడులు పెరగడం ఆ మేరకు తిరిగి వారికి చెల్లించేందుకు తగిన సొమ్ము లేకపోవడంతో బోర్డు తిప్పేసేందుకు నిర్ణయించుకున్నట్లు సమాచారం. ముందస్తు ప్రణాళికతో డిపాజిటర్ల సొమ్ము దారి మళ్లించి గుట్టుచప్పుడు కాకుండా ఆస్తులు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది.

కొన్ని పత్రాలు వెలుగులోకి.. ఒక వైపు శివాని కోసం విస్సన్నపేట పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టిన ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. మరో వైపు మద్దులపర్వకు చెందిన ఆమె తల్లిదండ్రులను ప్రతిరోజు విస్సన్నపేట పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి విచారిస్తున్నారు. దీనిపై ఆయన నుంచి సరైన సమాచారం రావడం లేదని పోలీసులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం కూడా వివిధ ప్రాంతాలకు చెందిన ఎల్‌బీఎఫ్ సంస్థ బాధితులు విస్సన్నపేట స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. ఇప్పటికే పదుల సంఖ్యలో తమకు న్యాయం చేయాలని ఠాణా బాట పట్టారు. విజయవాడకు చెందిన ఎల్‌బీ. అరవింద రూ.3 లక్షలు, రేపూడికి చెందిన బి.వెంకట నర్సయ్య రూ.50 వేలు, బి.వెంకటకృష్ణ రూ.7.50 లక్షలు, ఏలూరుకు చెందిన ఎం.రాజు రూ.5 లక్షలు, విజయనగరానికి చెందిన డి.సత్యగోవిందమ్మ రూ.లక్ష, ఆగిరిపల్లికి చెందిన బి.ఎస్.రవళి రూ.లక్ష వరకు 2023 ఆగస్టు నుంచి 2024 డిసెంబరు మధ్య ఎల్‌బీఎఫ్‌లో డిపాజిట్ చేసినట్లు కొన్ని పత్రాలు వెలుగులోకి వచ్చాయి. ఈ క్రమంలో సంస్థలో మేనేజర్లుగా పని చేసిన వారిని పోలీసులు పిలిచి విచారిస్తున్నారు. దీనిపై ఇప్పటికే 20 మందికిపైగా ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఇందులో కొందరు పోలీసులు కూడా బాధితులుగా ఉన్నట్లు సమాచారం.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

20న పాఠశాల సముదాయ సమావేశాలు


గంపలగూడెం, న్యూస్‌టుడే : తిరువూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు శనివారం పాఠశాల సముదాయ సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యా శాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయినట్లు ఎ.కొండూరు ఎంఈవో- 2 ఈ.కేశవరావు గురువారం తెలిపారు. తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, విస్సన్నపేట మండలాల పరిధిలో మొత్తం 12 క్లస్టర్లలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తారు. ఇందులో ఇటీవల జరిగిన ఎస్ఏ- 1 పరీక్షల ఫలితాలు, వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక, జీఎఫ్ఎల్ఎన్‌పై సమీక్ష, నమూనా పాఠాలు బోధిస్తారు.

మామిడి కాయల తరలింపు

విస్సన్నపేట: మండల కేంద్రంలో గురువారం మేలు రకమైన తోతాపురి మామిడి కాయలు టన్ను రూ.70,000లు ధర పలికాయి. ముంబయి వాసి మార్కెట్‌కి 10 టన్నులు లారీ ద్వారా ఎగుమతి చేసినట్లు మామిడి వ్యాపారి రాయల కిట్టు తెలిపారు.

సందడిగా సెమీ క్రిస్మస్ వేడుక

జి.కొండూరు, న్యూస్‌టుడే : స్థానిక సామాజిక భవనంలో క్రైస్తవ ఆరాధన సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఇందులో అధిక మంది విశ్వాసులు పాల్గొని క్రైస్తవ గీతాలాపన చేస్తు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం నిర్వాహకులు కేకు కోసి పంచి పెట్టారు. పాస్టర్ డా.ప్రభుకుమార్, సంఘస్తులు పాల్గొన్నారు.


గీతాలాపన చేస్తున్న చిన్నారులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

- కొండపల్లి పురపాలికలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ వెంకటరత్నం స్పందించారు. ఆయా ప్రాంతాలను పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు. వీధుల్లోకి చెత్త బండ్లు వెళ్లాలని, డ్రెయిన్లను శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. - న్యూస్‌టుడే, కొండపల్లి
- రెడ్డిగూడెం పంచాయతీ 2వ వార్డులోని డ్రెయినేజీలో పూడిక పేరుకుందని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం... మీకు తోడుగా ద్వారా సమస్యను అధికారులకు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పూడిక తీయించారు. - న్యూస్‌టుడే, రెడ్డిగూడెం
- నరసాపురం ఉప్పర బజారులో చెత్త పేరుకుందని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను పంచాయతీ అధికారులకు తెలిపారు. గ్రామ కార్యదర్శి జి.స్వాతి స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, విస్సన్నపేట
- తిరువూరు 18వ వార్డులోని డ్రెయిన్లలో మట్టి, పిచ్చిమొక్కలు పెరిగాయని స్థానికుడు సాయి భాస్కరరావు సమస్యను అధికారులకు తెలిపారు. శానిటరీ అధికారి స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, తిరువూరు టౌన్

గంపలగూడెంలో ప్రజాదర్బార్ నేడు

గంపలగూడెం, న్యూస్‌టుడే : స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం తిరువూరు శాసనసభ్యుడు కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో టి.సరస్వతి గురువారం తెలిపారు. మండల పరిధిలోని ప్రజలు ఇందులో దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని ఆమె కోరారు.

22న సీపీఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ

గంపలగూడెం, న్యూస్‌టుడే : భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమం తిరువూరులో ఈ నెల 22న నిర్వహిస్తున్నట్లు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌కే.నాగుల్‌మీరా గురువారం తెలిపారు. ఇందులో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, జిల్లా నాయకులు పాల్గొంటారని ఆయన చెప్పారు.

చుక్కలు వేద్దాం.. మహమ్మారిని తరిమేద్దాం

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే

పోలియో మహమ్మారి చిన్నారుల దరి చేరకుండా వారికి చుక్కల మందు వేసేందుకు వైద్యారోగ్య శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 21న జాతీయ రోగ నిరోధక దినోత్సవం(ఎన్ఐడీ) నిర్వహించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదే రోజు వైద్య శాఖ మార్గదర్శకాల మేరకు అయిదేళ్ల లోపు చిన్నారులకు చుక్కల మందు వేస్తారు. దీనికి ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలకు ఒక రోజు శిక్షణ ఇవ్వనున్నారు. తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, విస్సన్నపేట మండలాల్లో ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమానికి 116 కేంద్రాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో 16,291 మంది చిన్నారులకు చుక్కలు వేసేందుకు 656 మంది సిబ్బందిని నియమించారు.


అంగన్‌వాడీ కేంద్రంలో అయిదేళ్లలోపు చిన్నారులు

అధికారులకు ప్రోత్సాహకాలు

భారతదేశం 14 ఏళ్లుగా పోలియో రహితంగా ఉంది. 2011లో దేశంలో చివరి కేసు నమోదైంది. పోలియో రహిత స్థితిని దేశంలో కొనసాగించేందుకు భారత ప్రభుత్వం ఈ ఏడాది మరోసారి అయిదేళ్ల లోపు చిన్నారులకు చుక్కలు వేయాలని నిర్ణయించింది. ఇందుకు శని, ఆదివారం గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో టీకాలపై వివిధ మాధ్యమాలు, వనరుల ద్వారా ప్రచారం నిర్వహించాలని రాష్ట్ర ఇమ్యునైజేషన్ అధికారి తాజాగా ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు అవగాహన ప్రదర్శనలు నిర్వహించాలి. కార్యక్రమంలో క్షేత్ర స్థాయిలో ఏవైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే డీఐవో, ఎస్ఈపీఐవోకు నివేదించాలి. ఇందులో పాల్గొన్న సిబ్బంది, అధికారులకు ప్రోత్సాహకాలు ఉంటాయి.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 21న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. 0-5 ఏళ్ల చిన్నారులకు చుక్కలు వేయాల్సి ఉంది. తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా తప్పనిసరిగా తమ పిల్లలను కేంద్రాలకు తీసుకొచ్చి పోలియో మందు వేయించాలి. చుక్కలు వేయడంపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నాం. - ఎ.కనకదుర్గా భవాని, చౌటపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు

దివ్యాంగ విద్యార్థుల మధ్య జన్మదిన వేడుక

జి.కొండూరు, న్యూస్‌టుడే : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రంలోని దివ్యాంగ విద్యార్థుల నడుమ మాజీ ఎంపీపీ వేములకొండ తిరుపతిరావు జన్మదిన వేడుక గురువారం చేసుకున్నారు. విద్యార్థులకు కేకు, మిఠాయిలు పంచిపెట్టారు. వీరికి స్టిమ్యులేటర్ అవసరమని సిబ్బంది కోరగా వారంలో ఏర్పాటు చేస్తానన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రస్తుత జీవన విధానంలో మహిళలు ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని శాంతివన్ ఫౌండేషన్ అధ్యక్షుడు లంకె జనార్దన్ తెలిపారు. ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా గురువారం శాంతివన్ యోగ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూలపాడులోని మహిళలకు ప్రత్యేకంగా ధ్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మగువలు యోగా నేర్చుకోవడం ద్వారా కుటుంబ సభ్యులందరూ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు.

పోటీ పడ్డారు.. బహుమతులు సాధించారు

మైలవరం, న్యూస్‌టుడే : క్విజ్‌లో పోటీ పడిన పలువురు విద్యార్థులు పతకాలు సాధించారు. ప్రతిభ చాటి ప్రశంసా పత్రాలు పొందారు. 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా గురువారం స్థానిక సెయింట్ మేరీస్ పాఠశాలలోని విద్యార్థులకు క్విజ్ పోటీలు జరిగాయి. ఇందులో కె.ఉదయ్ కుమార్, ఎస్.జయనారాయణ(7వ తరగతి), ఎం.లావణ్య(8వ తరగతి) విద్యార్థులు వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించారు. వీరికి పాఠశాల కరస్పాండెంటు ఇ.మల్లికార్జునన్, ప్రిన్సిపల్ ఆర్.మధు, ఉపాధ్యాయులు బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు.


మైలవరం : విజేతలతో మల్లికార్జునన్, ఉపాధ్యాయులు


విస్సన్నపేట : గెలుపొందిన వారితో నరసింహారావు, సరోజ కుమారి తదితరులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజన శక్తులను వెలికితీయడానికి 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీలు తోడ్పడతాయని స్థానిక లిటిల్ స్టార్ స్కూల్ కరస్పాండెంటు వైవీ నరసింహారావు అన్నారు. ఈ పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో జి.కార్తీక్, పీవీఎన్ మణికంఠ, డి.ప్రభుకుమార్(9వ తరగతి) విద్యార్థులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంటు వైవీ నరసింహారావు, ప్రిన్సిపల్ కె.సరోజ కుమారి విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు.

గ్రామాన్ని విభజించి ప్రత్యేక పంచాయతీగా ప్రకటించండి

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : ఎ.కొండూరు మండలం రేపూడి గ్రామ పంచాయతీ విభజన కోరుతూ పాత రేపూడిలో గ్రామస్థులు చేపట్టిన నిరసన దీక్ష గురువారం కొనసాగింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో మేరకు రేపూడి నుంచి పాత రేపూడి గ్రామాన్ని విభజించి ప్రత్యేక పంచాయతీగా ప్రకటించాలని నినాదాలు చేశారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సత్వరమే విభజన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సెస్సీ డీసీ ఛైర్మన్ కటారి కోటేశ్వరరావు, నాయకులు కృష్ణకుమారి, ఎం.ఏలియాబాబు, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


నిరసన దీక్షలో పాల్గొన్న గ్రామస్థులు

తిరువూరులో యూటీఎఫ్ జిల్లా మహాసభ

విస్సన్నపేట, న్యూస్‌టుడే : తిరువూరులో ఈ నెల 21న జరుగనున్న నాలుగో జిల్లా మహాసభను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి బీపీహెచ్‌వీ సూర్యనారాయణ కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద దీనికి సంబంధించిన కరపత్రాలను ఎంఈవోలు కె.శంకర్రావు, ఎం.సుధాకర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.చంటిబాబు, ఏ.మురళీకృష్ణ, సంఘ నాయకులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శంకర్రావు, సుధాకర్ తదితరులు

కాల్వలకు నీరు విడుదల

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఎన్నెస్పీ రెండో జోన్‌లోని మధిర బ్రాంచి కెనాల్‌కు ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబంధం నుంచి 72వ కి.మీ నుంచి గురువారం 1190 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్ బాబు తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 587 క్యూసెక్కులు చేరాయని, అక్కడ నుంచి దిగువన మేజర్ల వారీగా గంపలగూడెం 30, ఊటుకూరు-1కి 80, పెదకొమిర 30, మధిర 60, నిదానపురం 70 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

తిరువూరు, ఎ.కొండూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే : మాస శివరాత్రి సందర్భంగా గురువారం తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లోని శివాలయాల్లో అర్చకులు శివలింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు, న్యూస్‌టుడే : ధనుర్మాసం సందర్భంగా పాత తిరువూరులో శ్రీదేవి, భూదేవి సమేత వేంకట చలపతి స్వామి గుడిలో గురువారం అర్చకులు డీవీ.కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో గోదా రంగనాయక స్వామి విగ్రహాలకు లక్ష తులసీ దళార్చన నిర్వహించారు. గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు మండలాల్లోని వైష్ణవాలయాల్లో గోదాదేవికి విశేష పూజలు, తిరుప్పావై పాశురాల పఠనం చేశారు.


తిరువూరు ఆలయంలో లక్ష తులసీ దళార్చన

భక్తిశ్రద్ధలతో ఇరుముడుల కార్యక్రమం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : రామవరప్పాడులో అయ్యప్ప స్వామి దీక్షాపరుల ఇరుముడుల కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. భక్తులకు అన్నసమారాధన చేపట్టారు.


శబరిమల బయలుదేరిన అయ్యప్ప స్వాములు

సమావేశాలు జయప్రదం చేయాలని పిలుపు

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : సీఐటీయూ ఆధ్వర్యంలో విశాఖలో నిర్వహించే అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ తిరువూరులో సీపీయం నాయకుల ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. సీపీయం మండల కార్యదర్శి బి.వేంకటేశ్వరావు, ఇశ్రాయేలు, రమేష్, బాబు, గురవయ్య, ఆనందరావు, జమలయ్య తదితరులు పాల్గొన్నారు.



తిరువూరులో సీఐటీయూ నాయకుల ప్రదర్శన

హద్దులు లేని వేగం.. ప్రమాదాలు అధికం

కొండపల్లి, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే

అతి వేగంతో జరుగుతున్న ప్రమాదాలను నివారించాలన్న పోలీసుల ఆలోచన కొందరి దుర ఆలోచనతో మరికొన్ని ప్రమాదాలు జరిగేటట్లుగా చేస్తోంది. విజయవాడ- హైదరాబాద్(65) జాతీయ రహదారి గొల్లపూడి నుంచి కంచికచర్ల వరకూ కొంత కాలంగా ప్రమాదాలకు కొదవలేకుండా పోయింది. నిత్యం ఏదో ప్రమాదం సంభవిస్తూనే ఉంది.


ఇబ్రహీంపట్నం పెట్రోల్ బంకు వద్ద జాతీయ రహదారిపై పడిన కంకర రాళ్లు

బూడిద లారీలు, టిప్పర్లు, ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు హద్దులు లేని వేగంతో ప్రయాణిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న గ్రామాల పరిధిలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వీటిని నివారించాలని ఇబ్రహీంపట్నం పోలీసులు అనేక చోట్ల సీసీ కెమెరాలు పెట్టారు. అయితే ఈ ప్రయత్నం ప్రమాదాలను గుర్తించడానికి మాత్రమే ఉపయోగపడింది. ఈ నేపథ్యంలో బ్లాక్‌స్పాట్‌లను గుర్తించాలని పోలీసులు మరో ఆలోచన చేశారు.

బ్లాక్ స్పాట్‌లు గుర్తింపు..

ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్‌లను గుర్తించి, అక్కడ చర్యలు తీసుకోవాలని పోలీసులు భావించారు. ఈ విధంగా జాతీయ రహదారిపై కంచికచర్ల నుంచి గొల్లపూడి ప్రారంభం వరకూ 12 బ్లాక్ స్పాటలను గుర్తించారు. ఆయా చోట్ల బారికేట్లు ఏర్పాటు చేశారు. దీంతో వాహనాల వేగం తగ్గి పోలీసుల ప్రయత్నం సఫలమైంది. అయితే మండల పరిధి, శివార్లలో ఉన్న కంకర క్రషర్ల నుంచి లోడుతో వెళ్లే లారీలు కొత్త సమస్యను తెచ్చి పెట్టాయి. అధిక లోడుతో వెళ్లే ఈ లారీలు బారికేడ్ల వద్ద మలుపు తిప్పుకొంటున్నప్పుడు కంకరంతా రహదారిపై పడిపోతోంది. దీంతో రాత్రి, తెల్లవారుజామున వెళ్లే ద్విచక్ర వాహనదారులు పలు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన ట్రాఫిక్ పోలీసులు అధిక లోడ్లతో వెళ్తున్న లారీలకు జరిమానాలు విధించారు. వీరిని నివారించాలని భావించిన క్రషర్ల యాజమాన్యాలు పరోక్షంగా ట్రాఫిక్ సిబ్బందిపై ఆరోపణలను కమిషనరేట్‌కు పంపారు. దీంతో వారు మిన్నకుండా ఉండిపోయారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

విస్సన్నపేట, న్యూస్‌టుడే : స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద గురువారం మండలంలోని ఉపాధ్యాయులు గత నెలలో ఎ.కొండూరు మండలం సీఆర్పీగా పని చేస్తూ మృతి చెందిన గుగులోతు నాగపండు కుటుంబానికి ఆర్థిక సాయంగా రూ.1,05,000లు ఎంపీడీవో చేకు చిన్న రాట్నాలు చేతుల మీదుగా అందించారు. ఎంఈవోలు శంకరరావు, సుధాకర్, ఉపాధ్యాయులు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : ఇటీవల మృతి చెందిన గుగులోతు నాగపండు కుటుంబానికి ఎంఈవో-1 ఎం.రాజశేఖర్ రూ.25 వేలు ఆర్థిక సాయం చేశారు. కుమ్మరికుంట్లలో నాగపండు కుటుంబ సభ్యులను ఉపాధ్యాయులతో కలిసి ఆయన పరామర్శించారు. ఎన్.జార్జ్‌వాషింగ్టన్, డి.సురేష్, భవాని శంకర్, పాపారావు, ప్రసాద్ పాల్గొన్నారు.


నాగపండు భార్యకు నగదు అందిస్తున్న ఎంపీడీవో చిన్న రాట్నాలు

గాంధీజీ పేరు మార్చడం దేశానికి అవమానం

మైలవరం: మహాత్మా గాంధీజీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకానికి ఆయన పేరును తొలగించడం ఆయనకు, దేశానికి జరిగిన అవమానమేనని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్ పేర్కొన్నారు. పేరు మార్పును నిరసిస్తూ గురువారం స్థానిక నూజివీడు రోడ్డులోని గాంధీజీ, పొట్టిశ్రీరాములు విగ్రహాల వద్ద చిత్రపటాలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రామకృష్ణ, గిరికుమార్, నాగేశ్వరరావు, దుర్గారావు, సుధాకర్, ఆనందరావు, పాల్గొన్నారు.


మైలవరంలో కాంగ్రెస్ నాయకుల నిరసన

దుస్థితికి చేరిన ఎత్తిపోతల పథకం

జి.కొండూరు, న్యూస్‌టుడే : తారకరామ ఎత్తిపోతల పథకం దుస్థితికి చేరి నిరుపయోగంగా మారిందని తక్షణమే నిర్వహణ చేపట్టాలని ఏపీ ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శిని కోరారు. విజయవాడ ఇరిగేషన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన బోర్డు సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. తారకరామ ఎత్తిపోతల నిర్వహణ లేకపోవడంతో దాదాపు పది వేల ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారే వీలుందని సభ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే నిర్వహణ చేపట్టి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ లీలా కృష్ణ, మేనేజింగ్ డైరెక్టర్ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

చదువే జీవితానికి ప్రధానం


మాట్లాడుతున్న హనిమిరెడ్డి, పక్కన అధ్యాపకులు

మైలవరం, న్యూస్‌టుడే : బోధనలో అభ్యసన ముఖ్య పాత్ర పోషిస్తుందని, చదువే జీవితానికి ప్రధానమని స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణ దాత హనిమిరెడ్డి పేర్కొన్నారు. కళాశాలలోని తెలుగు విభాగం ఆధ్వర్యంలో గురువారం క్రియేటివ్ లెర్నింగ్ మెటీరియల్స్ అనే అంశంపై వారం రోజుల కార్యశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పి.రంగారావు మాట్లాడుతూ విద్యా బోధనను బోధనోపకరణాలు సులభతరం చేస్తాయని వివరించారు. తెలుగు విభాగాధిపతి ఎం.దేవానంద్ కుమార్ మాట్లాడుతూ బోధనోపకరణాల సాయంతో చెప్పిన పాఠ్యాంశాలు జీవితాంతం గుర్తుంటాయని చెప్పారు. ఐక్వాక్ కోఆర్డినేటర్ బి.సుభాషిణి, అధ్యాపకులు ఫణికుమార్, జె.రాముడు, శ్రీనివాస్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.


సాధించిన ట్రోఫీలు, ధ్రువపత్రాలతో విద్యార్థులు

కరాటే పోటీల్లో ప్రతిభ


గొల్లపూడి, న్యూస్‌టుడే : కరాటే పోటీల్లో కొత్తూరు తాడేపల్లిలోని సెయింట్ బెనెడిక్ట్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని బీఆర్.అంబేడ్కర్ మెమోరియల్ న్యూ షావోలిన్ కుంఫూ అకాడమి ఆధ్వర్యంలో తాజాగా జరిగిన కరాటే పోటీల్లో ఈ పాఠశాలకు చెందిన 14 మంది విద్యార్థులు పలు బహుమతులు సాధించారు. వీటిలో ఆరు బంగారు, రెండు రజత, ఆరు కాంస్య పతకాలున్నాయి. ఈ మేరకు విద్యార్థులను, పీఈటీ రాజశేఖర్‌ను పాఠశాల ప్రిన్సిపల్ ఫాదర్ చిన్నప్ప గురువారం అభినందించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

విస్సన్నపేట, న్యూస్‌టుడే : లయన్స్ క్లబ్ ఆఫ్ విస్సన్నపేట ఆధ్వర్యంలో స్థానిక సిద్ధార్థ విద్యా సంస్థలో రెడ్డిగూడెం మండలం నాగులూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఆంధ్ర హాస్పిటల్ గొల్లపూడి వారి సహకారంతో విస్సన్నపేట వికాస్ విద్యాసంస్థలో వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో పలువురు విద్యార్థులు రక్తదానం చేశారు. లయన్స్ క్లబ్ వారు రక్తదానం చేసిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ఆంధ్ర హాస్పిటల్ వైద్య సిబ్బంది, విద్యా సంస్థల కుటుంబం పాల్గొన్నారు.

ప్రణాళికా బద్ధంగా విద్య..

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా విద్యను అభ్యసించాలని లయన్స్ మాజీ గవర్నర్ అన్నవరపు కోటిరెడ్డి పేర్కొన్నారు. విస్సన్నపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నాగులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం వరలక్ష్మి, లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు రాయల అరుణ కుమారి, రెడ్డిగూడెం వికాస్ కళాశాల ప్రిన్సిపల్ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


విస్సన్నపేట: వైద్య శిబిరంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, వైద్యులు

క్రికెట్ విజేత నార్త్ మండల జట్టు

మైలవరం, న్యూస్‌టుడే : లీప్ టోర్నమెంటులో భాగంగా విజయవాడ డివిజన్ ప్రభుత్వ ఉపాధ్యాయుల క్రికెట్ తుది పోటీని స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి క్రీడా ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. విజయవాడ నార్త్, ఈస్ట్ జట్ల మధ్య జరిగిన పోటీలో నార్త్ జట్టు విజయం సాధించింది. ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన ఇరు జట్లకు ఎంఈవో బాలు స్టేడియంలో పతకాలు అందజేశారు.


ప్రథమ స్థానం సాధించిన వారితో ఎంఈవో బాలు

సహజ వనరులను పొదుపుగా వినియోగిద్దాం

కొండపల్లి: ప్రకృతి వనరులను పొదుపుగా వినియోగించకపోతే భవిష్యత్తులో పెనుముప్పు తప్పదని జెన్‌కో శిక్షణ కేంద్రం ముఖ్య ఇంజినీర్ బి.శ్రీధర్ అన్నారు. ఇంధన పొదుపు వారోత్సవాల కార్యక్రమాన్ని శిక్షణ కేంద్రంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వాతావరణం తీవ్రమైన వేడిమిని సంతరించుకొందన్నారు. దీనికి అనేక రకాల కారణాలు లేకపోలేదన్నారు. కార్యక్రమంలో శిక్షణ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ కేంద్రం వద్ద ఇంజినీర్లు, అధికారులు

టీఎన్‌టీయూసీ కార్మిక పరిషత్ సమావేశం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : టీఎన్‌టీయూసీ కార్మిక పరిషత్ జనరల్ బాడీ మీటింగ్‌ను ఇబ్రహీంపట్నం సంగమం వద్ద గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కార్మిక నాయకులు పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబును కోరారు. ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో బస్సులను ఎక్కడబడితే అక్కడ నిలపడంతో మైలేజీ సమస్య వస్తుందని వాపోయారు. డ్రైవర్లు, కండక్టర్లకు అధికారుల ఒత్తిడి అధికమైందని ఆవేదన చెందారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

గద్దె అనూరాధకు శుభాకాంక్షలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : తెదేపా జిల్లా నూతన అధ్యక్షురాలుగా ఎంపికైన గద్దె అనూరాధను రెడ్డిగూడెం మండలానికి చెందిన తెదేపా నాయకులు విజయవాడలో గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు పి.కిరణ్‌కుమార్ రెడ్డి, తెలుగు యువత మండల మాజీ అధ్యక్షుడు వి.వెంకటేశ్వర రెడ్డి(పెద్దబాబు), డీసీ ఛైర్మన్ ఎన్.బాల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : ఎ.కొండూరు మండల తెదేపా నాయకులు గద్దె అనూరాధను మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు బి.పీక్లానాయక్, ఏఎంసీ మాజీ అధ్యక్షుడు ఎ.రమేష్‌రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.టీమానాయక్, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు పిట్టా చైతన్య తదితరులు ఆమెను సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


మహాపాత్రో గురుదేవ్ (పాత చిత్రం)


విస్సన్నపేట, న్యూస్‌టుడే : బతుకు తెరువు కోసం ఒడిశా రాష్ట్రం పూరి జిల్లా మల్లు గ్రామం నుంచి వలసొచ్చి విస్సన్నపేట మండలం కొండపర్వలో ఏడేళ్లుగా జీవిస్తున్న మహాపాత్రో సురేష్ దంపతుల ఏకైక కుమారుడు మహాపాత్రో గురుదేవ్(23) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన ఇది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మృతుడు మహాపాత్రో గురుదేవ్ కొంతకాలంగా విస్సన్నపేటలోని ఓ కార్ల షోరూంలో స్పేర్ పార్ట్స్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నాడు. కొండపర్వ ఫ్యాన్ల కంపెనీలో వైండింగ్ పని మేస్త్రీగా తండ్రి పని చేయడంతో కుటుంబమంతా అక్కడే ఉంటున్నారు. ఎప్పటిలాగే కుమారుడు గురుదేవ్ గురువారం ఉదయం విధులకు వెళ్లేందుకు స్కూటీపై కొండపర్వ నుంచి బయలుదేరాడు. విస్సన్నపేట వద్దకు రాగానే వెనుక నుంచి వేగంగా వస్తున్న లారీ స్కూటీకి ఢీకొనడంతో గురుదేవ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి ఇటీవలే పెళ్లి సంబంధం కుదిరింది. కుటుంబమంతా సొంత రాష్ట్రానికి వెళ్లి శుభకార్యం జరుపుకోవాలని అనుకుంటున్న వేళలో ఇలా జరగడంతో తల్లిదండ్రులు విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరువూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విస్సన్నపేట ఎస్సై రామకృష్ణ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం గురుదేవ్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులు ఒడిశాకు తీసుకెళ్లారు.

శిరస్త్రాణం.. నిలిపిన ప్రాణం


ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : శిరస్త్రాణం ధరించిన ఇద్దరు ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయాలతో బయటపడ్డ సంఘటన తుమ్మలపాలెం వద్ద బుధవారం రాత్రి జరిగింది. ఇబ్రహీంపట్నానికి చెందిన పంగా వెంకటేష్, అతని మిత్రుడు శిరస్త్రాణాలు ధరించి బైక్‌పై విజయవాడ బయలుదేరారు. తుమ్మలపాలెం వద్ద రోడ్డు పక్కనున్న వాహనాన్ని తప్పించే క్రమంలో ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం తుక్కు తుక్కు కాగా వీరిద్దరు స్వల్పంగా గాయపడ్డారు. ఈ సంఘటనతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ ఎస్సై లక్ష్మణరావు అక్కడికి చేరుకుని 108 సిబ్బందిని పిలిపించి క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేయించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

మెదడుకు మైక్రాన్ చికిత్స!

- లోపలి భాగాల్లోని కణజాలాల అమరిక, ప్రవర్తనపై పరిశోధన
- భవిష్యత్తులో వైద్య, ఔషధ రంగాల్లో భారీ మార్పులకు అవకాశాలు
- కీలకంగా ఐఐటీ మద్రాస్‌లోని ఎస్‌జీబీసీ



మానవ శరీరంలోని గుండె, కళ్లను అత్యంత సూక్ష్మస్థాయిలోనూ వైద్యులు చూడగలుగుతున్నారు.. చికిత్సలు చేస్తున్నారు. మరి.. మెదడును అంతే సూక్ష్మ స్థాయిలో చూడగలుగుతున్నారా..? అంటే లేదనే సమాధానం వస్తోంది. కపాలంలో ఉండే ఈ భాగంపై విస్తృతస్థాయి సూక్ష్మ పరిశోధనలు లేకపోవడమే అందుకు కారణం. దీన్ని ఐఐటీ మద్రాస్ సవాల్‌గా తీసుకుని పరిశోధనలు సాగిస్తూ.. పురోగతి సాధిస్తోంది.



14 వారాల పిండంలోని మెదడు సూక్ష్మ కణజాల రూపం

పెద్దవయసు వారి చిన్న మెదడులోని కణజాలం

పెద్దవారి మెదడు లోపలి భాగాల్లో సూక్ష్మంగా కనిపిస్తున్న ఫైబర్ పదార్థం

ఐఐటీ మద్రాస్‌లోని సుధా గోపాలకృష్ణన్ బ్రెయిన్ సెంటర్ (ఎస్‌జీబీసీ) కీలక పరిశోధనల దిశగా అడుగులు వేస్తోంది. మెదడు లోపలి పొరల్లో కణజాల ఆకృతి ఎలా ఉంది? సాధారణ వ్యక్తుల్లో, జబ్బుపడిన వారిలో వస్తున్న మార్పులేంటనేది అత్యంత సూక్ష్మంగా పరిశీలన చేస్తున్నారు. 3డీ ఇమేజీల్ని తీస్తున్నారు. అమెరికాకు చెందిన పరిశోధకులతో పాటు వేలూరు క్రిస్టియన్ మెడికల్ కాలేజీ, బెంగళూరు నిమ్‌హాన్స్, చెన్నై సవిత మెడికల్ కాలేజీ, మెడిస్కాన్ తదితర సంస్థలతో కలిసి ఈ పరిశోధనల్ని విస్తృతం చేశారు.



సుధా గోపాలకృష్ణన్ బ్రెయిన్ సెంటర్ లోపలి భాగం

450 మెదడుల సేకరణ

ఎస్‌జీబీసీ పరిశోధకుల ప్రకారం.. ప్రస్తుతం మెదడులోని భాగాల్ని ఎంఆర్ఐ ద్వారా చూడగలుగుతున్నారు. ఇందులో మిల్లీమీటర్ల స్థాయి వరకే చూడొచ్చు. మెదడులోని కణజాలాల్ని బాగా చూడాలంటే మైక్రాన్ల సైజుకు వెళ్లాలి. ఒక్కో కణజాలం 5-10 మైక్రాన్లు ఉంటుంది. అంటే మానవుని వెంట్రుకలో 5-10వ వంతు. ఆ స్థాయిలో కణజాలాన్ని, అందులోని మార్పుల్ని వైద్యులు చూడగలిగినప్పుడే మెదడుకు కచ్చితమైన చికిత్స ఇవ్వగలరని నిపుణులు చెబుతున్నారు. ఇందుకోసం ఎస్‌జీబీసీలో అధునాతన యంత్రాలతో ఇమేజింగ్ వ్యవస్థ తెచ్చారు. దీనిపై ఇంజినీరింగ్, వైద్య, సాంకేతిక, ల్యాబొరేటరీ తదితర విభాగాలకు చెందిన నిపుణులు పనిచేస్తున్నారు. పరిశోధన కోసం ఇప్పటివరకు 450 మంది వివిధ వయసుల మృతులకు చెందిన మెదడుల్ని సేకరించారు. వీటిలో పిండం దశ నుంచి 60 ఏళ్ల వయసు వరకు ఉన్నవారివి ఉన్నాయి. వాటిని అధునాతన యంత్రాల్లో నిల్వ ఉంచి సూక్ష్మంగా పరిశోధిస్తున్నారు.

వ్యాధిగ్రస్తుల్లో ఎలా ఉంది..?

పరిశోధనల్లో భాగంగా తల్లి గర్భంలో ఉన్న పిండం వివిధ వారాల్లో మెదడు లోపలి భాగాలు ఎలా ఉంటాయనేది సూక్ష్మంగా కణజాలస్థాయిలో 3డీ మ్యాపుల్ని ఈ ఏడాది విడుదల చేశారు. ఈ ప్రయత్నం ప్రపంచంలోనే తొలిసారి అని అక్కడి పరిశోధకులు చెబుతున్నారు. ప్రస్తుతం పుట్టిన బిడ్డ నుంచి పెద్ద వయసుల వారి వరకు మెదడు లోపలి భాగాలకు 3డీ ఇమేజీల్ని తీస్తున్నారు. సాధారణ వ్యక్తుల్లో కణజాల స్థాయిలో మెదడు ఎలా ఉంది.. డేరెస్, కొవిడ్, ఆల్జీమర్స్ వంటి వ్యాధులున్న వారిలో మెదడు కణజాలస్థాయిలో వచ్చిన మార్పుల్ని అంచనా వేస్తున్నారు. వచ్చే ఏడాది ఈ ఫలితాల్ని విడుదల చేసేందుకు ముందుకెళ్తున్నారు.

డేటా దాచే రహస్యం కోసం..

ఒక మనిషి మెదడు 2.5 పెటాబైట్ల (పీబీ) సామర్థ్యంతో ఉంటుందని అంచనా. అంటే.. 2.5 కోట్ల గిగాబైట్ల సామర్థ్యం. ఇంత డేటాను మెదడు ఎలా దాచుకోగలుగుతోంది? మనిషి మెదడులోని ఆకృతి దీనికి ఎలా సహకరిస్తోందనేది ఎస్‌జీబీసీ చేస్తున్న మరో ఆసక్తికర పరిశోధన. ఈ పరిశోధనల తర్వాత అతితక్కువ స్థలంలో ఎక్కువ స్టోరేజీ సాంకేతికతపై దృష్టి సారించే అవకాశాలున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇందులో వేగంగా మెరుగైన ఫలితాల్ని చూసేందుకు కృత్రిమమేధ (ఏఐ) సాంకేతికతను వాడుతున్నారు.

వైద్య విప్లవం సాధ్యమే

– ప్రొఫెసర్ మోహనశంకర్ శివప్రకాశం, ఎస్‌జీబీసీ హెడ్



న్యూరాలజీ, ఆంకాలజీ విభాగాలకు సంబంధించి ఇది కీలక పరిశోధన. మెదడును మరింత క్షుణ్నంగా చూడగలిగితే వైద్యంలో అద్భుతాలు జరుగొచ్చు. మా పరిశోధనల ద్వారా భవిష్యత్తులో వైద్యవిధానాల్లో పెను మార్పులు రావడానికి అవకాశాలున్నాయి. కొత్త ఔషధాల ఉత్పత్తికీ ఆస్కారముంది. ఫలితంగా కొన్ని కోట్ల మందికి మంచి జరుగొచ్చు. వాణిజ్యపరంగా కొత్తమార్గాలు తెరుచుకోవడంతో పాటు బ్రెయిన్ ఇమేజింగ్‌లో డేటా సెట్ల అనలిటిక్స్ పెరగడంతో పాటు మెదడుపై క్లినికల్ రీసెర్చ్, క్లినికల్ ట్రయల్స్ జరిగేందుకు ఊతమిస్తుంది.

- ఈనాడు, చెన్నై

శ్రీశైల మల్లన్న స్పర్శ దర్శనాలు పెంపు

జనవరి నుంచి అమలు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో శ్రీమల్లికార్జున స్వామి స్పర్శ దర్శనాలను సంబంధించిన వేళలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు దేవస్థానం ఈవో ఎం.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. శని, ఆది, సోమవారాల్లో స్వామివారి స్పర్శ దర్శనం సమయాలను పెంచాలని భక్తుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈవో చెప్పారు. వారాంత రోజుల్లో జనవరి నుంచి 6 స్లాట్ల ద్వారా భక్తులకు స్పర్శ దర్శనం టికెట్లు జారీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. వారాంత రోజుల్లో వీఐపీ బ్రేక్ ఉదయం 6-7 వరకు, స్పర్శ దర్శనం ఉ.7-8.30 వరకు, వీఐపీ బ్రేక్ దర్శనం ఉ.10.30-11.30 వరకు, స్పర్శ దర్శనం ఉ.11.45-మ.2 వరకు, వీఐపీ బ్రేక్ రా.7.45-8 గంటల వరకు, స్పర్శ దర్శనం రా.9-11 వరకు ఉంటుందన్నారు. టికెట్లను www.aptemples.ap.gov.in, www.srisailadevasthanam.org, మన మిత్ర 9552300009 వాట్సప్ నంబరు ద్వారా బుకింగ్ చేసుకోవచ్చన్నారు. రూ.150 శీఘ్ర దర్శనం, రూ.300 అతిశీఘ్ర దర్శనం టికెట్లను ఆన్‌లైన్, కరెంటు బుకింగ్ ద్వారా పొందవచ్చన్నారు.

ఆంధ్రా ఊటీ గజగజ



అరకులోయ, చింతపల్లి, న్యూస్‌టుడే: ఆంధ్రా ఊటీ అరకులోయలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కొన్నిచోట్ల మంచు పేరుకుపోయి కనిపిస్తోంది. గురువారం డుంబ్రిగుడలో అత్యల్పంగా 3.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. జి.మాడుగులలో 4.1, హుకుంపేట 6.2, ముంచంగిపుట్టు, పాడేరు 6.9, పెదబయలు 7.1, చింతపల్లిలో 7.5 డిగ్రీలు నమోదయ్యాయని పేర్కొన్నారు.

వైకాపా నేత వంశీపై హత్యాయత్నం కేసు

గత ఏడాది ఎన్నికల అనంతరం గొడవల్లో వంశీ అనుచరుల దాడి



ఈనాడు, అమరావతి: వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీపై హత్యాయత్నం కేసు నమోదైంది. నూతక్కి సునీల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయవాడ నగరంలోని మాచవరం పోలీస్ స్టేషన్‌లో కేసు కట్టారు. వంశీని ఏ1గా చేర్చారు. అతనితో పాటు అనుచరులు యతీంద్ర రామకృష్ణ, కొమ్మా కోట్లు, ఓలుపల్లి రంగా, కాట్రు శేషు, మేచినేని బాబు, ముల్పూరి ప్రభుకాంత్, అనగాని రవి, మరికొంత మందిని నిందితులుగా పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం గొడవల్లో వంశీ ఆదేశాల మేరకు అతని అనుచరులు ఫిర్యాదుదారు, అతని మిత్రులపై గత ఏడాది దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు.

చంపమని అనుచరులను ఉసిగొల్పిన వంశీ

గత ఏడాది జూన్ 7న సునీల్ తన స్నేహితులు రవీంద్ర కుమార్, శివదుర్గా వరప్రసాద్, విజయ్‌కుమార్, బాబుతో కలసి విజయవాడ గాయత్రీనగర్‌లోని బేకర్స్ హార్వెస్ట్ కాఫీ షాపు వద్ద ఉన్నారు. ఆ సమయంలో యతీంద్ర రామకృష్ణ, ముల్పూరి ప్రభుకాంత్ తదితరులు సునీల్ వద్దకు వచ్చారు. అసభ్యకర సంజ్ఞలు చేస్తూ.. ‘గెలవడం కాదురా.. మా అన్న వంశీ విజయవాడలోనే ఉన్నాడు. మీ అంతు చూస్తాం.. దమ్ముంటే రండిరా’ అంటూ రెచ్చగొడుతూ.. వారి కారు తాళాలు లాక్కున్నారు. అనంతరం వంశీ అపార్ట్‌మెంట్‌లోకి వెళ్లారు. సునీల్, అతని మిత్రులతో కలసి అక్కడికి వెళ్లాడు. అప్పటికే అక్కడ ఉన్న అనుచరులను వంశీ రెచ్చగొట్టారు. సునీల్‌ను చంపండి అంటూ వారిని ఎగదోశారు. దాంతో వారు కర్రలు, మారణాయుధాలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆ తర్వాత సునీల్ ఆసుపత్రిలో చేరాడు. మూడు నెలల పాటు నడవలేని పరిస్థితుల్లో ఇంటికే పరిమితమయ్యాడు. బాధితుడు తాజాగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ముందస్తు బెయిలివ్వండి: వంశీ

నూతక్కి సునీల్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా విజయవాడ-మాచవరం పోలీసులు ఈ నెల 17న తనపై నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ వైకాపా మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ(ఏ1) గురువారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

దేశంలోని ప్రతి ప్రాంతానికీ ప్రత్యేక వారసత్వం

- ఇన్‌టాక్ కార్యశాలలో వక్తల పిలుపు

ఈనాడు, అమరావతి: మన దేశంలో ప్రతి భాషకూ, ప్రాంతానికీ ఓ ప్రత్యేకత, చరిత్ర ఉందని, వాటి గొప్పతనాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. మాతృభాషను ప్రేమించినట్లుగానే, ఇతర భాషలనూ గౌరవించాలని సూచించారు. మనం మాట్లాడుతున్న ఎన్నో తెలుగు పదాలు ఇతర భాషల నుంచి వచ్చి చేరాయని గుర్తుచేశారు. ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చర్ హెరిటేజ్ (ఇన్‌టాక్) ఆధ్వర్యంలో విజయవాడలో ఉపాధ్యాయులకు కార్యశాల నిర్వహించారు. ఇన్‌టాక్ కన్వీనర్ సాయి పాపినేని ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాలల్లో



జస్టిస్ జాస్తి చలమేశ్వర్

హెరిటేజ్ క్లబ్‌ల ఏర్పాటుపై దిశానిర్దేశం చేశారు. ‘వేల ఏళ్లుగా తమిళ, కన్నడ, అరబిక్, ఇంగ్లిష్, పర్షియా.. ఇలా ఇతర భాషల పదాలు తెలుగులో వచ్చి చేరాయి. మనల్ని పాలించిన ఎందరో పాలకుల మూలాలు ఇతర రాష్ట్రాల్లో ఉన్నాయి. రాజరాజనరేంద్రుడు కర్ణాటక చాళుక్యుల వారసుడు. కృష్ణదేవరాయలు కన్నడ, సంస్కృతం, తెలుగు భాషల్లో రాయగలరు. తమిళం మాట్లాడగలరు’ అని జస్టిస్ చలమేశ్వర్ వివరించారు. న్యాయవాదులు కోర్టుల్లో చందమామ కథల్లో పాత్రల మాదిరిగా సరళంగా వాదించాలని జూనియర్లకు తాను సలహాలిస్తుంటానని చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు అలాగే చెప్పాలన్నారు.

ఆంధ్రాలో వందకు పైగా కళారూపాలు

తోలు బొమ్మలాట, బుర్రకథ, హరికథ, ఒగ్గుకథ ఇలా మన రాష్ట్రంలోనే వందకు పైగా కళారూపాలు ఉన్నాయని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎన్‌కే నరసింహారావు తెలిపారు. వీటిన్నింటి లక్ష్యం.. విషయాన్ని ప్రజలకు ఆకట్టుకునేలా చెప్పడమేనని పేర్కొన్నారు. ‘ఉపాధ్యాయులు స్థానిక చరిత్రను తవ్వితీయాలి. తర్కబద్ధంగా నిరూపించాలి. మొగల్రాజపురం గుహలు, మోటుపల్లి వంటి నౌకాశ్రయాలపై మనకు అవగాహన తక్కువ. కానీ, యూరోపియన్ నావికుడు ఆంధ్రా తీరం వెంబడి ఉన్న పోర్టుల్లో ఎగుమతులు, దిగుమతుల లెక్కలు కూడా వందల ఏళ్ల క్రితమే రాశాడ’ని ఉదహరించారు. హెరిటేజ్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ సర్వీస్ (హెచ్‌ఈసీఎస్) ప్రిన్సిపల్ డైరెక్టర్ పూర్ణిమా దత్ మాట్లాడుతూ ప్రపంచంపై ప్రాచీన భారతదేశం చూపిన ప్రభావాన్ని స్కాట్‌లాండ్ చరిత్రకారుడు విలియం డాల్‌రింపుల్ తన ‘ది గోల్డెన్ రోడ్’ పుస్తకంలో వివరించారని తెలిపారు. ‘మన అయోధ్య స్ఫూర్తితో థాయ్‌లాండ్‌లో ‘అయుతయ’ అనే మహానగరం ఉంది. బుద్ధిజం ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలు తూర్పు దేశాలకు వ్యాపించాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఏపీ ప్రెస్ అకాడమి ఛైర్మన్ ఆలపాటి సురేశ్, ఇన్‌టాక్ ఏపీ కన్వీనర్ లక్ష్మీనారాయణ, విజయవాడ ఇన్‌టాక్ సభ్యులు పాల్గొన్నారు.



పాడె మోస్తున్న మోహనకృష్ణ, రామకృష్ణ. చిత్రంలో రాజు కుమారుడు శ్రీధర్‌వర్మ తదితరులు

ఎన్టీఆర్ అభిమాని పాడె మోసిన నందమూరి కుటుంబం

తిరుమల, న్యూస్‌టుడే: నందమూరి తారక రామారావు(ఎన్టీఆర్) వీరాభిమాని, అఖిల భారత ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్రరాజు అలియాస్ ఎన్టీఆర్ రాజుకు గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. తిరుమల క్షేత్రంలోని కానుకమాను వద్దనున్న శ్మశానవాటికలో జరిగిన అంత్యక్రియల్లో ఎన్టీఆర్ కుటుంబం నుంచి నందమూరి రామకృష్ణ, మోహనకృష్ణ, ఆయన కుమార్తె మోహనరూప, సినీనటుడు చైతన్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు. వృద్ధాప్య సమస్యలతో ఆయన మృతిచెందిన విషయం తెలిసి తిరుమలకు చేరుకున్న వారు.. ముందుగా స్థానిక ఆర్బీసెంటర్ వద్ద ఉంచిన మృతదేహానికి నివాళులర్పించారు. రాజు కుమారుడు శ్రీధర్‌వర్మ, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. మోహనరూప మాట్లాడుతూ.. ఎన్టీఆర్ వీరాభిమానిగే కాకుండా మా కుటుంబంలోని వ్యక్తిగా మెలిగిన రామచంద్రరాజు మృతిచెందడం బాధాకరమన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేలు మురళీమోహన్, అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, శాప్ ఛైర్మన్ రవినాయుడు, తిరుపతి ఉపమేయర్ ఆర్సీ మునికృష్ణ, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహ యాదవ్, తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి, మాజీ జేఈవో శ్రీనివాసరాజు తదితరులు నివాళులర్పించారు.

కాపులు, దళితుల ఐక్యతతో అధికారం

సీఐడీ మాజీ చీఫ్, ఐపీఎస్ అధికారి సునీల్‌కుమార్

ఆచంట, న్యూస్‌టుడే: కాపులు, దళితుల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, ఏపీలో కాపుల ఐక్యతను కొందరు ఉద్దేశపూర్వంగా అడ్డుకుంటున్నారని సీఐడీ మాజీ చీఫ్, ఐపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్ అన్నారు. గురువారం పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం పెనుమంచిలిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఏపీలో 25 శాతం కంటే ఎక్కువగా ఉన్న ఈ రెండు వర్గాలూ కలిస్తే రాజకీయ అధికారం సాధ్యమవుతుందన్నారు. రాజకీయాలు ఇచ్చిపుచ్చుకునేలా ఉండాలని.. కాపులు రెండున్నరేళ్లు, దళితులు రెండున్నరేళ్లు అధికారంలో ఉండే విధంగా ఆలోచనలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. దీనికి బీసీలు మద్దతు తెలిపితేనే సామాజిక న్యాయం సాధ్యమన్నారు. డిసెంబరు 26న విశాఖపట్నంలో నిర్వహించనున్న ‘రంగనాడు’కు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. దళితవాడలను గుర్తించడంతో పాటు ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు పంచాయతీల అభివృద్ధికే ఖర్చు చేయాలని సునీల్ కుమార్ సూచించారు.

తుపాకులతో బెదిరించి.. బ్యాంకు దోపిడీకి యత్నం

- అనకాపల్లిలో కలకలం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: సమయం.. మధ్యాహ్నం 2.30 గంటలు. బ్యాంకు సిబ్బంది అప్పుడే లంచ్ చేసి వారి సీట్లలోకి వస్తున్నారు. ఈ సమయంలో బ్యాంకులోకి ప్రవేశించిన నలుగురు దుండగులు ఖాతాదారులు, క్యాషియర్, మేనేజర్‌ను తుపాకులతో బెదిరించారు. బ్యాంకు సిబ్బంది అలారం స్విచ్ నొక్కడంతో పోలీసులు వస్తున్నారని భయపడి దుండగులు పారిపోయారు. ఈ సంఘటన అనకాపల్లిలో తీవ్ర సంచలనం రేపింది. అనకాపల్లి రింగురోడ్డులోని కెనరాబ్యాంకు వద్దకు గురువారం మధ్యాహ్నం ఏడుగురు దుండగులు మూడు ద్విచక్రవాహనాలపై వచ్చారు. 25 నుంచి 35 ఏళ్ల వయసు ఉన్న వీరిలో ముగ్గురు బ్యాంకు బయట ఉన్నారు. నలుగురు బ్యాంకులోకి ప్రవేశించారు. ఈ సమయంలో బ్యాంకులో 10 మంది వరకు ఖాతాదారులు ఉన్నారు. ఇద్దరు దుండగులు ఖాతాదారులను బెదిరించారు. మరో వ్యక్తి క్యాషియర్ కాలర్ పట్టుకుని లాగి తుపాకీ చూపించాడు. ఇదే సమయంలో మహిళా మేనేజర్ క్యాబిన్‌లోకి మరో వ్యక్తి వెళ్లి తనకు డబ్బులు ఇవ్వాలంటూ



బ్యాంకులో దుండగుల హల్‌చల్

తుపాకీ చూపించి బెదిరించాడు. లోపల గదిలో ఉన్న సిబ్బంది అలారం బటన్ నొక్కడంతో పెద్ద శబ్దం వచ్చింది. దీంతో పోలీసులు వస్తున్నారనే భయంతో దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. దీనిపై బ్యాంకు మేనేజర్ సౌజన్య పోలీసులకు సమాచారం ఇచ్చారు. అదనపు ఎస్పీ (క్రైం) మోహనరావు, పట్టణ ఎస్సై భాస్కరరావు సంఘటనా స్థలానికి వచ్చి విచారణ చేపట్టారు. క్లూస్‌టీం పోలీసులు వేలిముద్రలను సేకరించారు. దుండగులు ఎలాంటి మాస్కులు లేకుండానే బ్యాంకులోకి ప్రవేశించారు. సీసీ టీవీ ఫుటేజీలో ముఖాలు స్పష్టంగా కనిపించడంతో వీరి ఆచూకీ కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. సుమారు 15 నిమిషాలపాటు బ్యాంకులో ఉన్న దుండగులు దోపిడీకి యత్నించారు. పట్టణ పోలీసులు దీనిపై కేసు నమోదు చేశారు. దుండగులు తెచ్చినవి డమ్మీ తుపాకులా, నిజమైనవా అన్నదానిపై ఆరా తీస్తున్నారు.

అధికారిణిగా పాలన.. అమ్మలా లాలన!

- చిన్నారిని ఎత్తుకుని జోకొట్టిన డీసీపీ సరిత

‘ఏం చిట్టి తల్లీ.. ఏం కావాలి? నేమ్ ప్లేట్ కావాలా? నా పేరు సరిత. పెద్దయిన తర్వాత నువ్వూ ఐపీఎస్ అవుతావా? ఖాకీ డ్రెస్ వేసుకుంటావా? చెప్పు నాన్నా..’ అంటూ విజయవాడ కమిషనరేట్ అడ్మిన్ డీసీపీ సరిత ఏడుస్తున్న చిన్నారిని చేతుల్లోకి తీసుకుని జోకొట్టారు. ఉత్తరాది రాష్ట్రాల నుంచి శిశువులను తీసుకొచ్చి విజయవాడలో విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలను వెల్లడించేందుకు గురువారం ఉదయం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న ఊయలలో ఏడుస్తున్న ఓ చిన్నారిని చేతుల్లోకి తీసుకున్న సరిత అమ్మలా లాలించారు. ఏడుపు మానిపించేందుకు కొద్దిసేపు ఎత్తుకుని ముద్దుచేశారు. ఈ సందర్భంగా ఆ చిన్నారి డీసీపీ నేమ్‌ప్లేట్‌ను వదలకుండా ఇలా పట్టుకుంది.



–ఈనాడు, అమరావతి

మోదీ, అమిత్ షా రాజీనామా చేయాలి

పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

ఈనాడు, అమరావతి: నేషనల్ హెరాల్డ్ అక్రమ కేసుపై న్యాయస్థానం చీవాట్లు పెట్టడం భాజపా నీచ రాజకీయాలకు చెంపపెట్టని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల వ్యాఖ్యానించారు. ధర్మపీఠం ముందు ప్రతీకారానికి చోటులేదని నిరూపితమైందని గురువారం ఆమె ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ‘కేంద్రంలోని పెద్దలు ఆకాశం వంటి కాంగ్రెస్ పార్టీపై ఏదో చేయాలని చూస్తే, చివరకది వారి మొహంపైనే పడింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ని బానిసగా చేసుకుని కాంగ్రెస్ అధినాయకత్వంపై బురద చల్లాలని చూసినా, గాంధీ కుటుంబాన్ని వేధించాలని కుట్రలు పన్నినా అంతిమంగా న్యాయమే గెలిచింది. వ్యవస్థలను కేంద్రం సొంతానికి వాడుకుంటున్నట్లు మరోసారి రుజువైంది. ఇది అధర్మం అంతానికి, మోదీ నిరంకుశత్వానికి చరమగీతం’ అని షర్మిల పేర్కొన్నారు. స్వయం ప్రతిపత్తి గల వ్యవస్థలను దుర్వినియోగం చేసినందుకు, కాంగ్రెస్‌ను అపఖ్యాతి పాలు చేయాలని చూసినందుకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాలు తమ పదవులకు రాజీనామా చేయాలి’ అని ఆమె డిమాండ్ చేశారు.

విజయవాడ స్టేషన్‌పై రద్దీ తగ్గించండి

- శాటిలైట్ స్టేషన్ నిర్మించండి
- రైల్వేమంత్రికి ఎంపీలు కేశినేని శివనాథ్, దగ్గుబాటి పురందేశ్వరి వినతి

ఈనాడు, దిల్లీ: విజయవాడ రైల్వేస్టేషన్‌పై రద్దీని తగ్గించేందుకు గొల్లపూడి సమీపంలో శాటిలైట్/హాల్ట్ రైల్వేస్టేషన్‌ను ఏర్పాటు చేయాలని స్థానిక ఎంపీ కేశినేని శివనాథ్, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్‌ను కోరారు. అలాగే కొండపల్లి రైల్వే స్టేషన్ నుంచి కృష్ణా మిల్క్ యూనియన్ వరకు రైల్వే ట్రాక్‌పై నీరు చేరకుండా నీటి నిర్వహణ వ్యవస్థను ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేశారు. వారు గురువారం ఇక్కడ పార్లమెంటు భవనంలో రైల్వే మంత్రిని కలిసి ఈమేరకు వినతిపత్రం సమర్పించారు. ‘బల్బ్‌లైన్స్ చుట్టూ ప్రస్తుతం ఖాళీ స్థలాలు ఉన్నాయి. రైల్వే అవసరాల కోసం వాటిని సేకరించడం చాలా సులభం. ఈ ప్రాంతం కొత్త రైలు, వాయుమార్గాలతో అనుసంధానం కానుంది. రాజధాని అభివృద్ధిని దృష్టిలో ఇక్కడ కొత్తగా అమరావతి రైల్వేలైన్ నిర్మిస్తున్నారు. ఈ ప్రాంతం విజయవాడ నగరానికి అవసరమైన అన్ని సౌకర్యాలకు కూడలికానుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని గొల్లపూడి ప్రాంతంలో హాల్ట్/శాటిలైట్ స్టేషన్ నిర్మించండి. దీనివల్ల విజయవాడ రైల్వేస్టేషన్‌లో రద్దీ తగ్గుతుంది’ అని కేంద్రమంత్రికి వివరించారు.



రైల్వేమంత్రి అశ్వినీవైష్ణవ్‌తో ఎంపీలు కేశినేని శివనాథ్, దగ్గుబాటి పురందేశ్వరి, ఇతర విజయవాడ ప్రతినిధులు

నీరు చేరకుండా చూడండి

కొండపల్లి రైల్వేస్టేషన్ నుంచి విజయవాడలోని కృష్ణా మిల్క్ యూనియన్ వరకు ఉన్న రైల్వేట్రాక్‌పై మురుగు, వర్షపునీరు చేరుతుండటంవల్ల భద్రతాపరమైన సమస్యలు తలెత్తుతున్నట్లు ఎంపీలు కేశినేని శివనాథ్, దగ్గుబాటి పురందేశ్వరిలు కేంద్రమంత్రికి తెలిపారు. చిన్నవర్షం వచ్చినా ఇక్కడ వర్షం నీరు చేరుతున్నట్లు చెప్పారు. దీని వల్ల రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని చెప్పారు. దీనిపై అధ్యయనం చేసి ట్రాక్ పక్కన డ్రైనేజ్ ఛానళ్లు, కల్వర్టులు నిర్మించి వర్షపునీరు వెళ్లిపోయేలా చూడాలని కోరారు. ఇందు కోసం వెంటనే నిధులు కేటాయించి త్వరగా పనులు పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు.

సరిహద్దులో ఎన్‌కౌంటర్.. ముగ్గురు మావోయిస్టుల మృతి

చర్ల, న్యూస్‌టుడే: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు సుక్మా జిల్లాలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మహిళ సహా ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. ఎస్పీ కిరణ్‌చవాన్ గురువారం వివరాలు వెల్లడించారు. ‘గొల్లపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో గోండిగూడ కొండల్లో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో డీఆర్‌జీ(డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్) బలగాలు కూంబింగ్ నిర్వహించాయి. ఈ క్రమంలో మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఘటనా స్థలంలో ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలతోపాటు ఆయుధాలు, పేలుడు పదార్థాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మృతులను కొంటా ఏరియా కమిటీ సభ్యుడు మడ్వి జోగా ఎలియాస్ మున్నా, కిష్టారం ఏరియా కమిటీ సభ్యుడు సోంది బండి, కిష్టారం ఎల్‌ఓసీ(లోకల్ ఆర్గనైజేషన్ స్క్వాడ్) కార్యదర్శి నుప్పోన్ బజ్జీగా గుర్తించాం’ అని ఎస్పీ వెల్లడించారు.

మార్చికల్లా కడప విమానాశ్రయ నిర్మాణం పూర్తి

లోక్‌సభలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు



ఈనాడు, దిల్లీ: కడప విమానాశ్రయ విస్తరణ పనులు వచ్చే ఏడాది మార్చి 31కల్లా పూర్తవుతాయని పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు తెలిపారు. లోక్‌సభలో గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో స్థానిక ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. తిరుపతి నుంచి గల్ఫ్ దేశాలకు విమానాలు, కడపలో ఫ్లైయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌టీఓ)ల ఏర్పాటు గురించి ఆయన అడిగిన ప్రశ్నలకూ స్పందించారు. “ఏయే గమ్యస్థానాల మధ్య విమానాలు అనుమతించాలన్న అంశంలో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక ఒప్పందం ఉండాలి. గల్ఫ్ దేశాలకు విమానాలు నడిపేందుకు మా శాఖ పూర్తి ప్రయత్నాలు చేస్తోంది. ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా సర్వీసులు ప్రారంభించడానికి ప్రయత్నిస్తాం” అని స్పష్టం చేశారు.

✦ ప్రస్తుతం అమలు చేస్తున్న ఉడాన్ పథకాన్ని మరో పదేళ్లు పొడిగిస్తున్నట్లు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అడిగిన మరో ప్రశ్నకు సమాధానంగా ఈ విషయం చెప్పారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడికి బాలశౌరి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పడంతో సభ్యులంతా సంఘీభావం ప్రకటిస్తూ బల్లలు చరిచారు.

యువతకు మార్గనిర్దేశం చేసే లక్ష్యంతో యువజనోత్సవం-2025

యువజన సర్వీసుల శాఖ కమిషనర్ భరణి వెల్లడి



వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేసి సదస్సును ప్రారంభించిన యువజన సర్వీసుల శాఖ కమిషనర్ భరణి. చిత్రంలో అంటాస్య ఇలుషినా, కేఎల్‌యూ రిజిస్ట్రార్ సుబ్బారావు, హబీబుల్లాఖాన్, సాయివిజయ్ తదితరులు

తాడేపల్లి, న్యూస్‌టుడే: యువతకు మార్గనిర్దేశం చేయాలనే లక్ష్యంతో పాటు వారిలో దాగిన ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్రస్థాయిలో ఉత్సవాన్ని నిర్వహించాలని సంకల్పించినట్లు యువజన సర్వీసుల శాఖ కమిషనర్ భరణి తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరం కేఎల్ డీమ్డ్ విశ్వ విద్యాలయంలో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి యువజనోత్సవం- 2025ను గురువారం కమిషనర్ భరణి, కేఎల్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ సుబ్బారావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా జానపద నృత్యాలు, గీతాలు, శాస్త్రీయ నృత్యాలు, సంగీతం, నాటికలు, చిత్రలేఖనం, కవిత్వం, వక్తృత్వం, కథారచన, క్విజ్, ఫొటోగ్రఫీ విభాగాల్లో యువతకు పోటీలు నిర్వహించారు. ఇక్కడ విజేతలుగా నిలిచిన వారికి జాతీయ స్థాయి ఉత్సవాల్లో అవకాశం కల్పిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రతిభావంతులను రాష్ట్ర యువతతో అనుసంధానం చేయడానికి గ్లోబల్, డయాస్పోరా కనెక్ట్ కార్యక్రమాన్ని రూపొందించినట్లు భరణి తెలిపారు. దీని ద్వారా యువతకు అంతర్జాతీయ స్థాయి మెంటార్‌షిప్ అందుతుందని పేర్కొన్నారు. తమకు మానవతా దృక్పథంతో కూడిన సహకారం, యువజన వ్యవహారాలు అత్యంత కీలకమైన అంశాలని రష్యన్ సెంటర్ ఫర్ సైన్స్ అండ్ కల్చర్ ప్రతినిధి అంటాస్య ఇలుషినా అన్నారు. రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో పాల్గొన్న ఆమె యువతను ఉద్దేశించి మాట్లాడారు. కేఎల్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ సుబ్బారావు, స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ సాయి విజయ్, యువజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వసుంధర

vasundhara@eenadu.in

ఒక్కరే వెళుతున్నారా..!



ప్రశాంతత కోసం ప్రయాణాల్ని ఆశ్రయిస్తున్న మహిళలు, అమ్మాయిల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. వీరిలో చాలామంది సోలో ట్రిప్పులకే ఓటేస్తున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. కొత్త స్నేహాలు, అనుభవాలు, స్వేచ్ఛ, సాధికారత కోసం వీటిని ఎంచుకుంటున్నారు. ఉద్దేశం బాగానే ఉంది కానీ, రక్షణ సంగతేంటి? అందుకే సోలో ట్రిప్పులకు వెళ్లేముందు ఈ అంశాల్ని తప్పక తెలుసుకోమంటున్నారు నిపుణులు.

- పాన్ ఇండియా సేఫ్టీ నంబర్ తెలుసా? అదేనండి 112. మనం ఎక్కడికెళ్లినా వైద్య, ఆరోగ్య, రక్షణ... వంటి అవసరాలు వచ్చినప్పుడు దీనికి కాల్ చేస్తే చాలు. డయల్ చేసే వీలులేకుంటే ఫోన్ పవర్ బటన్ నొక్కిపట్టుకున్నా... మీ సమాచారం సంబంధిత అధికారులకు అందుతుంది.
- సోలో ట్రిప్పులు చేసేటప్పుడు వీలైనంత వరకూ మీ ట్రాకింగ్ వివరాల్ని అయినవాళ్లతో పంచుకోవడం మంచిది. దీనివల్ల ఎవరో ఒకరు మీ కదలికల్ని ట్రాక్ చేస్తూ ఉంటారు. దీనికి సంబంధించి 360లైఫ్, ట్రాక్ మై లొకేషన్ వంటి చాలా అప్లికేషన్లు అందుబాటులోకి వచ్చాయి. వాటిని ఇన్‌స్టాల్ చేసుకుని ఆన్ చేస్తే సరి. లేదూ, నిర్ణీత సమయం నిర్ధారించుకుని వాట్సాప్ లైవ్‌ను షేర్ చేసినా మంచిదే.
- ఈ క్రమంలో కొన్నిసార్లు సిగ్నల్ లేని ప్రాంతాలకి వెళుతుంటాం. అలాంటప్పుడు డిజిటల్ డైరీని నిర్వహించండి. అంటే ఎక్కడికి, ఏ సమయంలో ఎలా రీచ్ అవ్వాలి అనుకుంటున్నాం అన్నది దానిలో రాసుకుని... తెలిసిన వాళ్లకి పంపండి. అప్పుడు మీరెక్కడికి వెళ్లినా అయినవాళ్లు మిమ్మల్ని సులువుగా చేరుకోగలరనే భరోసా ఉంటుంది.
- అలానే, మీ డబ్బులూ, క్రెడిట్-డెబిట్ కార్డులూ, గుర్తింపు కార్డులూ అన్నీ బ్యాగులో వేసుకోవడం మరచిపోకండి.



మీకు తెలుసా!

నవజాత శిశువుకి మసాజ్ చేయడంవల్ల జీర్ణ వ్యవస్థ మెరుగై, మలబద్ధకం ఉండదు. అంతేకాదు, ఇది వాళ్లలో బైలిరుబిన్ స్థాయుల్ని తగ్గించి కామెర్లు రాకుండా అడ్డుకుంటుంది.

సంకల్ప బలం ఉండాలే కానీ... శారీరక వైకల్యం విజయాల్ని ఆపలేదు... అందుకు నేహా బన్సల్ ఓ గొప్ప ఉదాహరణ... పదమూడేళ్ల వయసులో చక్రాల కుర్చీకే పరిమితమైనా... ఆమె కలలు కనడం ఆపలేదు. సీఏ ఫైనల్స్‌లో జాతీయ స్థాయిలో పదో స్థానాన్ని అందుకుని అగ్రశ్రేణి ఛార్టర్డ్ అకౌంటెంట్‌గా ఎదిగారు. ఆపై లెన్స్‌కార్ట్ కో-ఫౌండర్‌గా మారి ఆ సంస్థను యూనికార్న్‌గా మార్చడంలో కీలక పాత్ర పోషించారామె. తాజాగా హురున్-ఇండియా జాబితాలోనూ స్థానం సంపాదించుకున్నారు.

వీల్‌చైర్‌తో బోర్డ్ రూమ్‌కి!



నేహా

గత ఏడాది నేహా బన్సల్ తన అన్నయ్య పీయూష్ బన్సల్‌తో కలిసి లెన్స్‌కార్ట్‌లో 160 కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టి వార్తల్లో నిలిచారు. ఆ సంస్థ ఐపీఓకి వెళ్లడానికి ముందు తీసుకున్న ఈ సాహసోపేతమైన నిర్ణయం అందరినీ ఆశ్చర్యపరిచింది. అయితే, అది సంస్థ భవిష్యత్తుపై తనకున్న నమ్మకమేనంటారామె. నేహా వ్యూహాత్మక ఆలోచనల్ని అమలు చేయడంలో దిట్ట. ప్రస్తుతం ఈ సంస్థలో వర్తకం, లీగల్ అంశాల బాధ్యతల్ని చూస్తున్నారు.

దిల్లీలో పుట్టిపెరిగారామె. 13 ఏళ్ల వయసులో వెన్ను సంబంధిత సమస్య కారణంగా నేహా శరీరం కింది భాగమంతా అచేతనంగా మారింది. దీంతో చక్రాల కుర్చీకే పరిమితమయ్యారు. ఆడిపాడాల్సిన వయసులో కదల్లేకపోవడం ఆమెను ఎంతో బాధించింది. కానీ, కుటుంబం అండగా నిలవడంతో నెమ్మదిగా తనని తాను అంగీకరించడం మొదలుపెట్టారు. దృష్టినంతా చదువు మీదకు మళ్లించారు. బీకామ్ ఆనర్స్ చదివిన నేహా కళాశాల టాపర్ కూడా. అయితే, వైకల్యం ఉందన్న కారణంతో నేహాను క్యాంపస్ ఇంటర్వ్యూకి అనుమతించలేదట. ఇందుకు మొదట ఎంతో బాధపడినా... నిరాశపడకుండా తన లక్ష్యాన్ని మార్చుకుని సీఏ చేయాలనుకున్నారు. అనుకున్నట్లుగా చదివి... సీఏ ఫైనల్స్‌లో అఖిల భారత స్థాయిలో పదో ర్యాంకు సాధించారు. ఛార్టర్డ్ అకౌంటెంట్ అవ్వాలనే కలను నెరవేర్చుకున్నారు. ఈ ప్రయాణంలో ఎదురైన శారీరక, మానసిక, సామాజిక సవాళ్లను దాటి తనని తాను నిరూపించుకున్నారు. 'పరిపూర్ణ సామర్థ్యం ఉన్నప్పటికీ జీవితం మీద ప్రతికూలతతో ఉండటమే నిజమైన వైకల్యం' అంటారామె.

అన్నతో కలిసి...

తన సీఏ చదువు... జాగ్రత్తనూ, ముందు చూపుతో ఆలోచించే తత్వాన్నీ నేర్పిందంటారు నేహా. ఛార్టర్డ్ అకౌంటెంట్‌గా కెరియర్ ఆరంభించి... ప్రొఫెషనల్ ఫైనాన్స్, కార్పొరేట్ అడ్వైజరీగా పనిచేశారు. వినోద్‌కుమార్ అసోసియేట్స్‌లో భాగస్వామిగా ఉన్నారు. తర్వాత డీఎన్ఎస్ అడ్వైజర్స్ అనే సంస్థనూ స్థాపించారు. ఈ అనుభవంతో కార్పొరేట్ ఫైనాన్స్, టాక్సేషన్, గవర్నెన్స్‌లో తన నైపుణ్యాల్ని మెరుగుపరుచుకున్నారు. 2008లో అన్న పీయుష్ బన్సల్‌తో కలిసి లెన్స్‌కార్ట్.కామ్‌ను ప్రారంభించారు. ఇంటిదగ్గరే కంటి పరీక్షలు, పర్సనలైజ్డ్ సర్వీసులు అందిస్తూ, మధ్యవర్తిత్వం లేకుండానే తక్కువ ధరలో, స్టైల్ ఐవేర్ డిజైన్లను రిటైల్‌గా వినియోగదారుడికి అందించడమే లక్ష్యంగా దీన్ని ముందుకు నడిపించారు.

2500లకి పైగా స్టోర్లలతో...

వినియోగదారుల ముందు కనిపించే బ్రాండ్ ఫేస్ పీయుష్ అయితే, నేహా కంపెనీకి వెన్నెముక. హైస్టేక్ నిధుల సేకరణ, రెగ్యులేటరీ డిస్‌క్లోజర్స్, అంతర్జాతీయ కొనుగోళ్ల వంటి కీలక నిర్ణయాల్లో నేహా చురుగ్గా వ్యవహరించారు. ఈ-కామర్స్ వేదికగా మొదలైన ఈ వ్యాపారాన్ని ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 2500లకి పైగా స్టోర్‌లతో అతిపెద్ద సంస్థగా ఎదిగేలా వెనక ఉండి నడిపించారు. విదేశాల్లోనూ మాన్యుఫాక్చరింగ్ హబ్స్ పార్ట్‌నర్‌షిప్ తీసుకున్నారు. సప్లై చైన్ వ్యవస్థను ఇంటిగ్రేట్ చేశారు. ఈ ప్రయత్నం ధరనే కాదు... డెలివరీ చేసే టైమ్‌నీ తగ్గించింది. అంతేకాదు, నేహా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీపై దృష్టిపెట్టి ఏఐ పవర్డ్ ఐ టెస్ట్ నుంచి డేటా ఆధారిత ఇన్వెంటరీ ఫోర్‌కాస్టింగ్ వరకూ ఎన్నో మార్పులు తీసుకొచ్చారు. ఇలా ప్రతి దశలోనూ సరైన నిర్ణయాలతో ధైర్యంగా ముందడుగు వేయబట్టే... ప్రస్తుతం ఈ సంస్థ అంతర్జాతీయ స్థాయిలో తనదైన ముద్ర వేస్తోంది.

యూపీఎస్సీ నిర్వహించే పరీక్షల్లో... అత్యంత కష్టమైన వాటిల్లో ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీస్ (ఐఈఎస్) కూడా ఒకటి. దాన్ని తొలి ప్రయత్నంలోనే సాధించారు 22 ఏళ్ల ఇందుమతి. పేదరికం, హేళనలే తనలో పట్టుదలనీ, కసినీ పెంచాయంటున్న ఆమె... ఆ ప్రయాణాన్ని పంచుకున్నారిలా...

నాన్న కల... నా ర్యాంకు!



ఏదైనా సాధించడానికి అన్నిసార్లూ పేదరికమే అడ్డు కాదు. హేళనలూ, నిరుత్సాహమూ వెనకడుగు వేసేలా చేస్తాయి. కానీ నాలో మాత్రం అవి సాధించాలన్న పట్టుదలని పెంచాయి. మాది తిరుపతి. నాన్న కృష్ణమూర్తి లారీ డ్రైవర్. అమ్మ మాధవి, బర్డ్ ఆసుపత్రిలో అసిస్టెంట్. ఇద్దరూ కష్టపడుతూ కుటుంబాన్ని నెట్టుకొచ్చారు. నాన్నకి బాగా చదువుకుని ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని ఉండేదట. కానీ అది సాధ్యపడలేదు. దాన్ని నేను సాధిస్తే చూడాలనుకున్నారు. అందుకే 'అమ్మాయికి చదువెందుకు?' అని అందరూ ఎంత నిరాశపరిచినా నాకు మాత్రం 'నీకు నచ్చింది చదువుకో'మనే చెప్పేవారు. వాళ్ల మాటలు నాన్నని ఎంత బాధపెట్టాయో కానీ... నాలో కసిని పెంచాయి. కాబట్టే, పదో తరగతిలో 9.7 జీపీఏ, పాలిటెక్నిక్‌లో 93% మార్కులు సాధించా. దీంతో మంచి కళాశాలలో ఇంజినీరింగ్ సీటొచ్చింది. ఎలక్ట్రానిక్స్‌పై మక్కువతో బీటెక్‌లో ఈఈఈ చదవాలనుకున్నా. అయితే ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో మా స్కూలు హెడ్‌మాస్టర్ సాయం చేశారు. ఇక్కడా బాగా చదివి జేఎన్‌టీయూ కాకినాడ నుంచి బంగారు పతకం అందుకున్నా. అప్పుడే ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీస్ సాధించాలన్న కల ఏర్పడింది. దిల్లీలో కోచింగ్ తీసుకోవాలనుకున్నప్పుడూ డబ్బుల సమస్యే! అప్పుడు మా ప్రొఫెసర్లే డబ్బులు పోగుచేసి రూ.లక్ష అందించారు. అయితే అక్కడ ఉండటానికి కావాల్సిన ఖర్చులకు నాన్న మరింత కష్టపడాల్సి వచ్చింది.

తిరుమల ఘాట్‌రోడ్లలో నడుపుతూ... లారీ క్యాబిన్‌లో ఆయన పడే కష్టం ఎన్నోసార్లు కళ్లారా చూశా. అలాంటి నాన్న కష్టాన్నీ, ఇంతమంది నమ్మకాన్నీ వృథా చేయొద్దు అనుకున్నా. ఫోన్, సోషల్‌మీడియా, సినిమాలు అన్నీ పక్కనపెట్టి ఏడాదిపాటు పుస్తకమే లోకంగా గడిపా. 12గంటలు చదివేదాన్ని. పరీక్షల సమయంలో 15 గంటలు కష్టపడ్డా. అలా ఈ ఏడాది జూన్‌లో ప్రిలిమ్స్ రాశా. ఆపై మెయిన్స్‌నీ సాధించా. బాగానే రాసినా తెలియని ఆందోళన. ఇంటర్వ్యూ విషయంలోనూ అంతే! ఇంటర్వ్యూయర్లు ఇచ్చిన ప్రోత్సాహంతో అడిగిన ప్రశ్నలకు ఆత్మవిశ్వాసంతో సమాధానాలిచ్చా. సాధిస్తానని నమ్మకం ఉంది కానీ... 75వ ర్యాంకు సాధించా అని తెలిసినప్పుడు చాలా ఆనందమేసింది. నాన్న అయితే ఆ కబురు విని భావోద్వేగానికి గురయ్యారు. దేశవ్యాప్తంగా జరిగే పెద్ద ప్రాజెక్టుల్లో టెక్నికల్ హెడ్‌గా సేవలందించాలి. ఇదే నా ముందున్న ప్రధాన లక్ష్యం.

– వేల్పూరి వీర గంగాధర శర్మ, తిరుపతి

కొవిడ్‌లో భర్త పని పోయింది. ముగ్గురు పిల్లలతో బతుకు బండిని లాగడం కష్టమైంది. వంటనే జీవనాధారంగా మలుచుకోవాలనుకున్నారు భారతీ తక్కర్. అలా వంటింట్లో మొదలైన తన వ్యాపార ప్రయాణం ఇప్పుడు విదేశాలకూ చేరింది.

ఈమె గ్లోబల్ ఆంత్రప్రెన్యూర్!



భారతి

అహ్మదాబాద్‌లోని చాంద్‌ఖేడ్‌లో ఉంటారు భారతి. వయసు 57 ఏళ్లు. భర్త వినోద్. ఓ చిన్న కంపెనీలో లారీ డ్రైవర్‌గా పనిచేసేవారు. వీళ్లకు ముగ్గురు సంతానం. నిరుపేద కుటుంబం. పిల్లల చదువుల కోసం ఎన్నో కష్టాల్ని ఓర్చుకున్నారు. వాళ్లని ఉన్నత స్థానాల్లో నిలబెట్టాలనే ఆశయంతో రేయింబవళ్లు శ్రమించేవారు భారతి భర్త వినోద్. కొవిడ్ వరకూ అంతా బాగానే సాగింది. కానీ తర్వాతే వినోద్ ఉద్యోగం పోయింది. వెనకడుగు వేసి వాళ్ల గ్రామానికి వెళ్లిపోతే, పిల్లలకు చదువు దూరం అవుతుంది. ఇప్పటివరకూ పడిన శ్రమ అంతా వృథా అయిపోతుందని బాధపడుతున్న భర్తను చూసి...'మీరు కంగారు పడకండి. నేను ఏదోకటి చేస్తా అని ధైర్యం చెప్పా. కానీ నేను అప్పటి వరకూ ఇల్లు దాటిందే లేదు. చదువు కూడా అంతంత మాత్రమే. ఏం చేయాలో తెలియని పరిస్థితి. అప్పుడే ఫుడ్ బిజినెస్ మొదలుపెడితే బాగుంటుంది అనిపించింది. గుజరాతీ ప్రత్యేక వంటకమైన థెప్లాలు చాలా బాగా చేస్తా. ఇంట్లోవాళ్లు, బంధువులు అందరికీ నేను చేసే థెప్లాలంటే చాలా ఇష్టం. ఇంటికి ఎవరు వచ్చినా అడిగి మరీ చేయించుకుని తినేవారు. వాటిని తయారుచేసి విక్రయించాలి అనుకున్నా. అలా 2022లో వంటింట్లో సరకులతోనే మొదలైంది నా వ్యాపార ప్రయాణం' అనే భారతి వ్యాపారం తక్కువ సమయంలోనే మంచి ఆదరణను సంపాదించుకుంది.

ఉదయాన్నే లేచి...

రోజుకి 15 నుంచి 20 కిలోల థెప్లాలు తయారుచేస్తారు భారతి. ఇందుకు ఉదయాన్నే 5 గంటలకే లేస్తారు. మహారాష్ట్ర, దిల్లీల నుంచే కాకుండా అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్, దుబాయిల నుంచి పెద్ద మొత్తంలో ఆర్డర్లు వస్తుంటాయి. 'రెండేళ్ల క్రితం ఈ వ్యాపారం ప్రారంభించే ముందు పిల్లలు ఇంకా చదువుతున్నారు. పెద్దబ్బాయి సీఏ, చిన్నోడు ఇంజినీరింగ్ చివరి సంవత్సరంలో ఉన్నారు. అమ్మాయికి పెళ్లి చేసి పంపాం. ఇప్పుడు పెద్దబ్బాయి చదువు అయిపోయి, ఉద్యోగంలో స్థిరపడ్డాడు. 'ఇంకెందుకు నీకీ కష్టం వదిలేయమ్మా ఈ వ్యాపారం' అని చాలాసార్లు చెప్పాడు. అయినా దీన్ని కొనసాగిస్తున్నా. గృహిణినైన నాకు ఇంత గుర్తింపుని తెచ్చిపెట్టినదాన్ని వదిలేయడం ఇష్టం లేదు' అంటారు భారతి.

ఈటీవీ భారత్ — యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

'మసాబా'ని మెచ్చేస్తున్నారు!

నేటి ఫ్యాషన్







ఫ్యాషన్ ప్రపంచంపై కాస్త అవగాహన ఉన్నవాళ్లకైనా డిజైనర్ మసాబా గుప్తా పరిచయం అక్కర్లేదు. ఇక ఆవిడ డిజైన్లకు ప్రధాన మోడల్ ఎవరంటే ఆమె తల్లి, నటి నీనా గుప్తానే! వీళ్లిద్దరి కాంబినేషన్‌కి ప్రత్యేక అభిమానగణమే ఉంది. ఓసారి అలా నీనా చీర... దానికి జతగా నూడుల్ స్ట్రాప్ హాల్టర్ నెక్ బ్లవుజు వేసుకున్న ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. దానికి నెటిజన్లు ఫిదా అయ్యారు. ఆ తరవాతా అదే రకం బ్లవుజుల్లో మెరిశారామె. సంప్రదాయ వస్త్రానికి మోడరన్ టచ్ అంటూ ఫ్యాషన్ ప్రియులంతా ఆ డిజైన్‌పై మనసు పడ్డారు. 'మసాబా కట్', 'మసాబా బ్లవుజ్' అంటూ పేరు పెట్టి మరీ పాపులర్ చేశారు. ఈ ఫొటోలన్నీ అందుకు సాక్ష్యాలే! చీరలోనూ ఆధునిక ముద్ర వేయాలనుకునే అమ్మాయిలే ఎక్కువ. నేటితరం ఆసక్తికి తగ్గట్టుగా ఈ మసాబా కట్ కనిపించింది. కాబట్టే, తెగ ప్రయత్నించేస్తున్నారు. అయితే బ్లవుజులకే పరిమితం కాలేదు. డ్రెస్‌లకీ ప్రయత్నిస్తున్నారు. మీ సంగతేంటి? మీకూ నచ్చిందా? ఇంకేం ఈ రకం డిజైన్‌నీ ప్రయత్నించేయండి మరి!

డియర్ వసుంధర

అండాశయంలో సిస్టులు!

నాకు 30 ఏళ్లు. ఇటీవల పూర్తి బాడీ చెకప్ చేయించుకుంటే ఒక అండాశయంలో సిస్టులు ఉన్నాయని తేలింది. ఏంటివి? వీటివల్ల ఏమైనా సమస్యా? – ఓ సోదరి

మీ విషయంలో ఇది అనుకోకుండా తెలిసింది. ఏదైనా ఇబ్బంది వచ్చి, బయటపడలేదు కాబట్టి కంగారు అవసరం లేదు. మామూలుగా ఈ సిస్టులు 7 సెం.మీ. కంటే పెద్దగా ఉంటే సర్జరీ చేయాలి. 5 సెం.మీ. లోపు ఉంటే కొన్ని రోజులు మందులు వాడి చూడొచ్చు. తగ్గితే సరే! మందులతో తగ్గకపోతే వాటిని తరచూ స్కాన్ చేయించుకుంటూ గమనించుకోవాలి. అలాగే నొప్పి ఉన్నా వైద్యులను కలవాలి. అవి పగలడం, ఒకదానికొకటి ఒరుసుకోవడం వంటివి ఏమైనా జరిగితే తగిన చికిత్సని అందిస్తారు. సిస్టులు పెరగకుండా చిన్నగానే ఉండి, ఈ సమస్యలేమీ లేకపోతే పెద్దగా కంగారుపడాల్సిన పనిలేదు. మీవరకూ మందులు వాడితే సరిపోతుంది. నిజానికి ఈ చిన్న సిస్టులు చాలామందిలో కనిపించేవే. కాబట్టి, ఓసారి వైద్యులను సంప్రదించండి. వాళ్ల సూచన మేరకు తగిన చికిత్స తీసుకుంటే సమస్య తీరుతుంది.



డా. చీపురుపల్లి వసుంధర
గైనకాలజిస్ట్



ఒక అంశాన్ని మహిళలు భిన్నమైన కోణంలో చూడగలరు. లోతైన విశ్లేషణ, సహానుభూతిని జోడించి సందర్భోచితంగానూ ఆలోచిస్తారు. వైద్యసేవల రంగం సహజంగా మహిళలకు అనుకూలం. ఎందుకంటే ఈ రంగంలో అవసరమయ్యే కచ్చితత్వం, సహనం, మానవ సంబంధాలు, విలువలు... ఇవి మహిళల సహజ లక్షణాలు. అందుకే మా సంస్థలో సాంకేతిక, వ్యాపార విభాగాల్లో ఎక్కువ మంది మహిళలకి నాయకత్వ స్థానాల్లో చోటు ఉండేలా మార్పులు తెచ్చాం.

- వినీతా గుప్తా, సీఈఓ, లుపిన్


అందానికీ క్యారెట్..!



రోజంతా ఇంటి పనులు, ఉద్యోగం అంటూ పరుగులు పెట్టే మహిళలు తమ ఆరోగ్యాన్ని మాత్రం నిర్లక్ష్యం చేస్తుంటారు. మరి వారికి కావల్సిన పోషకాలన్నీ దొరికే క్యారెట్‌ను రోజువారీ ఆహారంలో భాగం చేసుకుంటే ఎన్ని ప్రయోజనాలు పొందొచ్చో తెలుసా?

- వయసు పెరిగే కొద్దీ ముఖంపై ముడతలు, గీతలు సాధారణమే, క్యారెట్ దీనికి మంచి పరిష్కారం. ఎ, కె, బీ6 విటమిన్లతోపాటు బయోటిన్, మినరల్స్ బీటా కెరోటిన్‌లు దీనిలో ఎక్కువగా ఉంటాయి. ఇవి చర్మానికి సహజ టానిక్‌లా పనిచేస్తాయి. విటమిన్ ఎ చర్మం పొడిబారడాన్ని తగ్గిస్తే... ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు వృద్ధాప్య ఛాయల్ని రానివ్వకుండా కాపాడతాయి.
- ఉద్యోగరీత్యా కంప్యూటర్లు, ఫోన్లతో గడిపే సమయం పెరిగిపోయింది. దీంతో కంటి సమస్యలు పెరుగుతున్నాయి. క్యారెట్‌లోని బీటా కెరోటిన్ మన శరీరంలోకి వెళ్లి విటమిన్-ఎగా మారుతుంది. ఇది కంటి చూపుని కాపాడుతుంది.
- బరువు తగ్గాలనుకునేవారికి ఇది మంచి ఎంపిక. దీనివల్ల ఆకలి తగ్గుతుంది. బరువు నియంత్రణలో ఉంటుంది. మహిళల్లో మెనోపాజ్ తరవాత గుండె సంబంధిత వ్యాధుల్నీ, రక్తపోటునీ నియంత్రిస్తుంది.
- ఇందులో ఉండే కెరోటినాయిడ్లు, ఫ్లేవనాయిడ్లు ఆరోగ్యానికి చాలా మంచివి. యాంటీఆక్సిడెంట్లు, పొటాషియం మెదడు, గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. రక్తపోటుని అదుపులో ఉంచుతాయి. ఒత్తిడిని దూరం చేస్తాయి. టాక్సిన్లను బయటకు పంపి కాలేయాన్ని శుభ్రపరుస్తాయి. అందుకే సలాడ్, కూర, సూప్, జ్యూస్‌ల రూపంలో క్యారెట్‌ను ఆహారంలో భాగం చేసుకుంటే ఆరోగ్యం మన సొంతం.

రంగవల్లిక



15 చుక్కలు
2 వరుసలు
9 వచ్చేవరకూ




ఎస్.మహేశ్వరి
కర్నూలు





నల్లబెల్లి మనోజ్ఞ
మంచిర్యాల

13 చుక్కలు
3 వరుసలు
3 వచ్చేవరకూ





కుక్కట్ల సువార్తా
హుజూర్ నగర్

13 చుక్కలు
7 వచ్చేవరకూ

మీ ముగ్గులు 9154091911 నంబరుకు వాట్సాప్ చేయొచ్చు.

మా చిరునామా:
వసుంధర, ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిల్మ్‌సిటీ,
అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్
మండలం,
రంగారెడ్డి జిల్లా,
తెలంగాణ - 501 512.
Email:vasundhara@eenadu.in

బంగారం - వెండి



18న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,36,210	1,24,000	2,03,702
విజయవాడ	1,32,940	1,23,600	2,07,600
ప్రొద్దుటూరు	1,32,300	1,21,720	1,99,000
రాజమహేంద్రవరం	1,34,840	1,23,600	2,24,000
విశాఖపట్నం	1,34,350	1,23,600	2,10,000
తమిళనాడు	-----	1,24,400	2,24,000

ఆ గ్రామ జనాభా 1,500.. మూణ్నెల్లలో 27,397 జననాలు!



ఇంటర్నెట్ డెస్క్: మహారాష్ట్రలోని యవత్మాల్ జిల్లా శేందుర్‌సని గ్రామంలో 1,500 జనాభా ఉండగా.. ఈ ఊరిలో మూడు నెలల్లో 27 వేలకు పైగా జననాలు నమోదవడం చూసి అధికారులు అవాక్కయ్యారు. ఈ గ్రామ పరిధిలో జనన, మరణాల నమోదు ఆలస్యమవుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో అధికారులు ఇటీవల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా రికార్డులు పరిశీలించగా.. ఆశ్చర్యకర విషయం బయటపడింది. ఈ ఏడాది సెప్టెంబరు - నవంబరు కాలంలో గ్రామ పరిధిలోని సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్‌లో (సీఆర్ఎస్) ఏకంగా 27,397 జననాలు నమోదైనట్లు గుర్తించారు. ఇదే సమయంలో ఏడు మరణాలు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఉదంతం చర్చనీయాంశంగా మారడంతో ప్రభుత్వం దర్యాప్తునకు ఆదేశించింది. సర్కారు సంక్షేమ పథకాలను పొందేందుకు లేదా అక్రమ కార్యకలాపాల కోసం ఈ నకిలీ జనన ధ్రువపత్రాలు సృష్టించి ఉండొచ్చని భావిస్తున్నారు. దర్యాప్తును సత్వరం పూర్తిచేసి నకిలీ నమోదులను తొలగించాలని భాజపా మాజీ ఎంపీ కిరీట్ సోమయ్య రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌ను కోరారు.

సేవకు ప్రతిరూపం ఈ టీచరమ్మ

ఈటీవీ భారత్: అనాథ శవాలకు అన్నీ తానై అంత్యక్రియలు చేస్తున్నారు ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పుర్ ఉపాధ్యాయురాలు పుష్పలత సింగ్ (45). ఇప్పటివరకు ఆమె 200 మందికి పైగా అనాథల అంత్యక్రియలు చేశారు. అనాథ మృతదేహం కనిపిస్తే పోలీసులు కూడా ఆమెకే అప్పగిస్తారు. సామాజిక సేవే లక్ష్యంగా అవివాహితగా మిగిలిపోయిన పుష్పలతను స్థానికులు 'అమ్మ' అని పిలుస్తారు. ఆమె సేవలకు గుర్తింపుగా 2024లో యూపీ గవర్నర్ ఆనందీబెన్ పటేల్ సత్కరించారు. అనాథల ఈ బాధ్యతను దేవుడు తనకు అప్పగించాడని చెప్పుకొనే పుష్పలత ఒక్కోసారి రోజుకు నాలుగైదు మృతదేహాలకు అంతిమ సంస్కారాలు చేసిన సందర్భాలు ఉన్నాయి. హిందూ మతస్థుల అంత్యక్రియలను ఆమె సంప్రదాయం ప్రకారం నిర్వహిస్తారు. చితాభస్మాన్ని కాశీలో గంగానదిలో కలుపుతారు. ముస్లిం సమాజానికి చెందినవారైతే ఖనన ప్రక్రియను పర్యవేక్షిస్తారు. పేదలకు దుప్పట్లు పంపిణీ, తలసేమియా రోగుల కోసం రక్తదాన శిబిరాల నిర్వహణ, 'అమ్మ థాలీ' పేరుతో అన్నదానం, వస్త్రదానం వంటి పలు సేవా కార్యక్రమాలను పుష్పలత కొనసాగిస్తున్నారు.



బస్తీ పిల్లలకు దుస్తుల పంపిణీలో పుష్పలత

ప్రముఖ శిల్పి రామ్ సుతార్ కన్నుమూత

ఐక్యతా విగ్రహాన్ని రూపొందించింది ఈయనే..



నొయిడా: ప్రముఖ భారత శిల్పి, పద్మభూషణ్ అవార్డు గ్రహీత రామ్ వాంజీ సుతార్ (100) కన్నుమూశారు. వయసు సంబంధిత అనారోగ్యం కారణంగా నొయిడాలోని తన నివాసంలో బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన విగ్రహం 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ' (సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్)తో పాటు స్టాచ్యూ ఆఫ్ ప్రాస్పరిటీ (కెంపెగౌడ)ల శిల్పాలను ఈయనే రూపొందించారు. పార్లమెంటు ముందు కూర్చొని ఉండే గాంధీ విగ్రహం, ఛత్రపతి శివాజీ విగ్రహం వంటి ఎన్నో ప్రసిద్ధ శిల్పాలకు రూపకర్త సుతార్. ఆయన మృతిపట్ల రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ సంతాపం వ్యక్తంచేశారు.



ఇతరుల కంటే మీ చిన్నారులు ముందుండాలంటే..

ప్రస్తుత కాలంలో పుస్తకాలు చదివేందుకు చిన్నపిల్లలు ఇష్టపడటం లేదు. వారి 10వ ఏట నుంచి 18 ఏళ్లు వచ్చే వరకూ నెలకు ఓ మంచి పుస్తకం చదివేలా మీ చిన్నారులను ప్రోత్సహించండి. ఇలా చేస్తే వారు కళాశాలకు వచ్చేసరికి తోటి వారితో పోలిస్తే చాలా ముందుంటారు.

– జోషువా డీ ఫిలిప్స్, ప్రొఫెసర్

ఒమన్‌తో భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

- సెపాపై వాణిజ్య మంత్రుల సంతకాలు
- ప్రధాని మోదీకి ఒమన్ అత్యున్నత పౌర పురస్కారం



ప్రవాస భారతీయులతో మోదీ

మస్కట్: వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా భారత్, ఒమన్ కీలక ముందడుగు వేశాయి. చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై గురువారం సంతకాలు చేశాయి. ఉభయ దేశాల వృద్ధికి ఇది అనేక అవకాశాలు కల్పిస్తుందని ఒమన్ పర్యటనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఆ దేశ సుల్తాన్ హైథమ్ బిన్ తారిక్‌తో ఆయన భేటీ అయ్యారు. రక్షణ, భద్రత, వాణిజ్యం-పెట్టుబడులు, ఇంధనం, వ్యవసాయం, సాంకేతికత, సంస్కృతి, ప్రజా సంబంధాల వంటి రంగాల్లో పరస్పర సహకారం పెంపుపై వారిద్దరూ చర్చించారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి విశేష కృషి చేసినందుకుగాను మోదీకి ఒమన్ అత్యున్నత పౌర పురస్కారమైన 'ఆర్డర్ ఆఫ్ ఒమన్'ను సుల్తాన్ హైథమ్ అందజేశారు.

ఒమన్‌లోని భారత సంతతి ప్రజలు, విద్యార్థులతో మస్కట్‌లో మోదీ ప్రత్యేకంగా సంభాషించారు. 21వ శతాబ్దపు భారత్ గొప్ప లక్ష్యాలను విధించుకుంటోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. వాటిని సాధించేందుకు పెద్ద, సత్వర నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతోందని.. నిర్ణీత కాలావధుల్లో ఫలితాలు రాబడుతోందని తెలిపారు

✦ మూడు దేశాల (జోర్డాన్, ఇథియోపియా, ఒమన్) పర్యటనను ముగించుకున్న ప్రధాని మోదీ గురువారం రాత్రి స్వదేశానికి తిరిగొచ్చారు.

ఆర్థిక డీఎన్‌ఏను మార్చుకున్నాం

'సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సెపా)' పేరుతో కుదుర్చుకున్న ఎఫ్‌టీఏపై ప్రధాని మోదీ, సుల్తాన్ హైథమ్‌ల సమక్షంలో భారత వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, ఒమన్ వాణిజ్య మంత్రి కయిస్ బిన్ మొహమ్మద్ అల్ యూసెఫ్ సంతకాలు చేశారు. ద్వైపాక్షిక సంబంధాలకు ఇది కొత్త విశ్వాసాన్ని, ఉత్తేజాన్ని ఇస్తుందని 'భారత్-ఒమన్ వాణిజ్య వేదిక' సదస్సులో ప్రసంగిస్తూ మోదీ పేర్కొన్నారు. గత 11 ఏళ్లలో దిల్లీ తన విధానాలనే కాకుండా, ఆర్థిక డీఎన్‌ఏను కూడా మార్చుకుందని ప్రధాని వ్యాఖ్యానించారు.

మహారాష్ట్రలో జైలుశిక్ష పడిన మంత్రి రాజీనామా

ముంబయి: మోసం, ఫోర్జరీ కేసులో రెండేళ్ల జైలుశిక్ష పడిన మహారాష్ట్ర ఎన్సీపీ మంత్రి మాణిక్‌రావు కొకాటే రాజీనామా చేశారు. ఆయన గురువారం తనకు రాజీనామా లేఖ సమర్పించారని, దానిని ఆమోదించి సీఎం దేవేంద్ర ఫడణవీస్‌కు పంపానని ఎన్సీపీ అధినేత, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తెలిపారు. ప్రభుత్వ గృహ నిర్మాణ పథకంలో భాగంగా ఇచ్చే ఇళ్లను తీసుకుని కొకాటే మోసానికి, ఫోర్జరీకి పాల్పడ్డారంటూ ట్రయల్ కోర్టు విధించిన రెండేళ్ల జైలుశిక్షను నాసిక్ జిల్లా సెషన్స్ కోర్టు సమర్థించింది. ఆయనను అరెస్టు చేయాలని బుధవారం కోర్టు ఆదేశాలిచ్చింది. దీంతో రాజీనామా చేశారు. క్రీడలు, యువజన సంక్షేమ, వక్ఫ్ శాఖల మంత్రిగా ఆయన ఉన్నారు.

భారీ కణుతుల తొలగింపు

ఒడిశాలోని సంబల్‌పుర్, మధ్య ప్రదేశ్‌లోని బుర్హాన్‌పుర్‌లలో వైద్యులు శస్త్ర చికిత్సలు చేసి భారీ కణుతులను తొలగించారు. ఓ వ్యక్తి గొంతు భాగంలోని 10 కేజీల కణితిని సంబల్‌పుర్‌లో తొలగించగా.. మహిళ పొట్టలోని 8 కేజీల కణితిని బుర్హాన్‌పుర్‌లో తీసివేశారు.

★ సంబల్‌పుర్‌లోని విమ్సర్ వైద్య కళాశాల ఆసుపత్రికి బలంగీర్ జిల్లా టిట్లాగఢ్‌కు చెందిన గోవింద రాణా అనే 58 ఏళ్ల వ్యక్తి వచ్చారు. ఆయన మెడపై 10 కేజీల కణితి ఉంది. 25 ఏళ్లుగా అది పెరుగుతున్నా ఆయన పట్టించుకోలేదు. తాజాగా అది పగిలిపోయి బ్లీడింగ్ అవుతుండటంతో అతడిని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యులు మంగళవారం 5 గంటలపాటు కష్టపడి శస్త్ర చికిత్స ద్వారా దానిని తొలగించారు.



భారీ కణితితో గోవింద రాణా

★ బుర్హాన్‌పుర్‌లోని నందకుమార్ సింగ్ చౌహాన్ జిల్లా ఆసుపత్రిలో వైద్యులు మరో అరుదైన శస్త్ర చికిత్స చేశారు. 57 ఏళ్ల ఉషా భాయి అనే మహిళ పొట్టలో నుంచి 8 కేజీల కణితిని తీసివేశారు. డాక్టర్ దర్పణ్ టోకే ఆధ్వర్యంలో వైద్యులు అత్యంత క్లిష్టమైన ఈ శస్త్ర చికిత్సను కొన్ని గంటలపాటు నిర్వహించారు.


– ఈటీవీ భారత్

27న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం

దిల్లీ: కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) భేటీ ఈ నెల 27న జరగనుంది. కేంద్ర ప్రభుత్వం ఎంజీఎన్ఆర్ఈజీఏను రద్దు చేసి కొత్త చట్టాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తుండటంపై, దేశంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై సమావేశంలో చర్చించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం ఎదురైన తర్వాత జరుగుతున్న మొదటి సీడబ్ల్యూసీ భేటీ ఇది.

ఏకసభ్య, ద్విసభ్య ధర్మాసనాలకూ అడ్‌హాక్ జడ్జీలు నేతృత్వం వహించవచ్చు

- 2021 తీర్పునకు సుప్రీంకోర్టు సవరణలు



దిల్లీ: అపరిష్కృత క్రిమినల్ కేసుల సత్వర విచారణ కోసం మాజీ న్యాయమూర్తులను తాత్కాలిక (అడ్‌హాక్) జడ్జీలుగా నియమించేందుకు 2021లో వెలువరించిన తీర్పులోని కొన్ని అంశాలను సుప్రీంకోర్టు తాజాగా సవరించింది. తాత్కాలిక జడ్జీలు ఏకసభ్య, ద్విసభ్య ధర్మాసనాలకు నేతృత్వం వహించవచ్చని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం.పంచోలీతో కూడిన త్రిసభ్య ధర్మాసనం గురువారం పేర్కొంది. రెగ్యులర్ జడ్జి నేతృత్వం వహించే ధర్మాసనంలో తాత్కాలిక (మాజీ) న్యాయమూర్తిని జూనియర్ పార్టనర్‌ను చేయడం తగదని అభిప్రాయపడింది. రెగ్యులర్ జడ్జీలతో ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలా, ఒకరు లేదా ఇద్దరు తాత్కాలిక జడ్జీలతో ధర్మాసనం ఏర్పాటు చేయాలా అన్నది అక్కడున్న పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నిర్ణయం తీసుకోవచ్చని తెలిపింది.

తాగడానికి నీళ్లే లేవు..

బాటిల్డ్ వాటర్ నాణ్యతపై పిటిషనా?

బాటిళ్లలో విక్రయిస్తున్న నీటికి అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలను పాటించడం లేదంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మన దేశంలోని చాలా ప్రాంతాల్లో ప్రజలకు కనీస తాగునీరే అందడంలేదని తెలిపింది. ఇది కేవలం 'లగ్జరీ వ్యాజ్యమే'నంటూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చితో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను తిరస్కరించింది. 'అమెరికా, జపాన్, ఈయూ మార్గదర్శకాలను మన దేశంలో ప్రవేశపెట్టగలమా? అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలను సందర్శించండి. అక్కడి ప్రజలు తాగునీటి కోసం ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారో చూడండి. అప్పుడు మీకు మన దేశం అంటే ఏంటో అర్థమవుతుంది' అని పిటిషనర్‌కు ధర్మాసనం సూచించింది.

చివరి ఓవర్లో సిక్సులు బాదినట్లు..!

- పదవీ విరమణకు ముందు జడ్జీలు చాలా తీర్పులిచ్చేస్తున్నారు
- ప్రస్తుత ధోరణిపై సుప్రీంకోర్టు వ్యాఖ్య

దిల్లీ: పదవీ విరమణ సమీపించిన జడ్జీలు వరుస పెట్టి పలు తీర్పులు ఇస్తున్న ధోరణిపై సుప్రీంకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. బ్యాటింగ్ చివరి ఓవర్లో ఆటగాళ్లు సిక్సర్లు బాదినట్లుగా ఈ వ్యవహారం ఉందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం. పంచోలి ధర్మాసనం పేర్కొంది. మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రిన్సిపల్ అండ్ డిస్ట్రిక్ట్ జడ్జి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. ఆ జడ్జి నవంబరు 30న పదవీ విరమణ చేయనుండగా హైకోర్టు పూర్తి ధర్మాసనం ఆయనను అదే నెల 19న విధుల నుంచి సస్పెండ్ చేసింది. వివాదాస్పదమైన తీర్పులు ఇచ్చారని పేర్కొంటూ పదవీ విరమణకు 10 రోజుల ముందు ఈ నిర్ణయం తీసుకుంది. దీనిని జిల్లా జడ్జి...సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. మధ్యప్రదేశ్‌లో న్యాయాధికారుల పదవీ విరమణ వయస్సును 61 ఏళ్లకు పెంచాలని నవంబరు 20న రాష్ట్ర ప్రభుత్వాన్ని తాము ఆదేశించినందున పిటిషనర్ (జడ్జి) 2026 నవంబరు 30 వరకు పదవిలో కొనసాగే అవకాశం ఉందని సీజేఐ తెలిపారు. హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించారు.

పొగమంచు గుప్పిట్లో దిల్లీ

- కఠిన నిబంధనలు అమల్లోకి..
- 27 విమానాలు రద్దు

దిల్లీ: దేశ రాజధాని దిల్లీ, చుట్టుపక్కల ప్రాంతాలను దట్టమైన పొగమంచు కప్పేసింది. అతి సమీపంలోని వాహనాలూ కనిపించని పరిస్థితి ఎదురవడంతో దిల్లీలోని చాలా ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఉదయం 6 గంటల సమయంలో రాజధానిని పొగమంచు కప్పేసినట్లు భారత వాతావరణ కేంద్రం (ఐఎండీ) వెల్లడించింది. ఇందిరాగాంధీ విమానాశ్రయంలో 100 మీటర్లకుపైగా దూరం ఉన్న వాహనాలూ కనిపించని పరిస్థితి ఎదురైందని తెలిపింది. పొగమంచు కారణంగా 27 విమానాలు రద్దుకాగా.. మరికొన్ని విమానాలు ఆలస్యంగా నడిచాయి. గురువారం దిల్లీలో వాయు నాణ్యత (ఏక్యూఐ) 373గా నమోదైంది. మరోవైపు వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు దిల్లీ ప్రభుత్వం తీసుకొచ్చిన కఠినమైన చర్యలు అమల్లోకి వచ్చాయి. కాలుష్య నియంత్రణ ధ్రువపత్రం (పీయూసీ) లేని వాహనాలకు దిల్లీ పెట్రోలు స్టేషన్లలో ఇంధనం అందించడం ఆపేశారు. దీంతో పెట్రోలు బంకులవద్ద పీయూసీలతో వాహనదారులు బారులు తీరారు. దిల్లీ బయట రిజిస్టరై.. బీఎస్-6 ప్రమాణాలు పాటించని ప్రైవేటు వాహనాల ప్రవేశాన్ని నిలిపివేశారు. ఈ నిబంధనలను కఠినంగా అమలు చేసేందుకు దిల్లీ సరిహద్దులవద్ద పోలీసు, రవాణాశాఖ బృందాలను మోహరించారు. దీనివల్ల సుమారు 12 లక్షల వాహనాలు ప్రభావితమవుతాయని అంచనా.

ప్చ్.. సంతృప్తికరంగా లేదు: భూపేందర్

దిల్లీలో ఏక్యూఐ 200 కంటే తక్కువగా నమోదైన రోజులు పెరిగినా పరిస్థితి సంతృప్తికరంగా లేదని కేంద్ర పర్యావరణ మంత్రి భూపేందర్ యాదవ్ పేర్కొన్నారు. అధికారులు మరింతగా కృషి చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గురువారం 'ఇండియా ఎకనామిక్ కాన్‌క్లేవ్' కార్యక్రమంలో మాట్లాడుతూ.. వాయు నాణ్యత విషయంలో లండన్ వంటి నగరాలు తీసుకుంటున్న చర్యలపై కేంద్ర ప్రభుత్వం ఓ అధ్యయనాన్ని చేపట్టిందని వెల్లడించారు.

ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం టైర్లలో సమస్య

- కొచ్చిన్‌లో అత్యవసర ల్యాండింగ్

కొచ్చిన్: సౌదీ అరేబియాలోని జెడ్డా నుంచి కోజికోడ్‌కు బయలుదేరిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం టైర్లలో సమస్య తలెత్తింది. దీంతో ముందు జాగ్రత్త చర్యగా దానిని కొచ్చిన్ విమానాశ్రయంలో దింపేశారు. 'జెడ్డా విమానాశ్రయంలో రన్‌వేపై ఉన్న వస్తువుల వల్ల టైర్లు దెబ్బతిన్నాయి. ఈ విమానంలో సుమారు 160 మంది ప్రయాణికులున్నారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. తనిఖీలో కుడివైపున్న రెండు టైర్లు పగిలిపోయాయని గుర్తించాం' అని ఓ అధికారి వెల్లడించారు.

వాయుసేనను కొనియాడిన రాజ్‌నాథ్

దిల్లీ: ఆపరేషన్ సిందూర్ భారత సైనిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గురువారం పేర్కొన్నారు. పాకిస్థాన్‌లోని పలు ఉగ్ర స్థావరాలపై దాడి అనంతరం పాక్ బాధ్యతారహితంగా స్పందించిందని, అందుకు భారత వాయుసేన దీటుగా సమాధానం ఇచ్చిందని ఆయన అన్నారు. వాయుసేన అత్యున్నత స్థాయి కమాండర్లను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఈ మాటలన్నారు. భారత వాయుసేన సాంకేతికంగా ముందంజలో ఉందని.. ఆత్మస్థైర్యం, వ్యూహాత్మకతల్లో అగ్రభాగాన నిలిచిందని రాజ్‌నాథ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేయడంలో వాయుసేన చూపిన కచ్చితత్వాన్ని, వేగాన్ని కొనియాడారు. శత్రువుల బలాలు-బలహీనతలపై అవగాహన ఉండటం విజయ సాధనకు బాటలు వేస్తుందన్నారు. త్రివిధ దళాల సమన్వయానికి ఆపరేషన్ సిందూర్ ఉదాహరణగా నిలిచిందన్నారు.



ఎయిర్‌ఫోర్స్ కాంక్లేవ్‌లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో వాయుసేనాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్

ఎన్నో విజయాలు సాధించా

- పతాక స్థాయికి ట్రంప్ స్వోత్కర్ష

న్యూయార్క్, వాషింగ్టన్: అక్రమ వలసల్ని, వివిధ దేశాల్లో 8 యుద్ధాలను నిలువరించడంలో తాను విజయం సాధించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ప్రపంచ దేశాలపై ప్రతీకార సుంకాలను పెంచబట్టే అమెరికా ఆర్థిక వ్యవస్థ వేగాన్ని పుంజుకుందని తెలిపారు. తమ ప్రభుత్వ చర్యలవల్లే మునుపెన్నడూ లేని రీతిలో దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతిని నమోదు చేస్తోందని వెల్లడించారు. ఈ ఏడాది ముగుస్తున్న సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. '11 నెలల కిందట దేశం పూర్తి అస్తవ్యస్త స్థితిలో ఉంది. అలాంటి స్థితిలో పాలనా పగ్గాలు చేపట్టిన నేను గందరగోళాన్ని సరి చేస్తున్నాను' అని పేర్కొన్నారు. గత జనవరిలో పగ్గాలు చేపట్టిన నాటి నుంచీ తాను సాధించిన విజయాలను ట్రంప్ ఏకరువు పెట్టారు. అక్రమ వలసదారుల్ని వెనక్కి పంపడం, ధరల్ని తగ్గించడం, అంతర్జాతీయ వివాదాల్ని నిర్మూలించడం, సుంకాల ద్వారా వందల కోట్ల డాలర్లు అమెరికాకు దక్కేలా చేయడం, ఉపాధి అవకాశాలు సృష్టించడం తాను సాధించిన విజయాల జాబితాలో ఉన్నాయని ట్రంప్ తెలిపారు. ప్రపంచం నలుమూలల నుంచి అమెరికాకు వలస వచ్చి స్థానికుల ఉద్యోగాలను కబళించి నివాస ధరల పెరుగుదలకు కారణమవుతున్న వారితో తాను సరైన రీతిలో వ్యవహరించానని చెప్పారు. తనకు ఇష్టమైన మాట 'టారిఫ్' అని పేర్కొన్నారు.



సైనికులకు బోనస్

క్రిస్మస్ సందర్భంగా అమెరికా సైనికులకు 1,776 డాలర్ల చొప్పున బోనస్ చెక్కు పంపుతున్నానని ట్రంప్ వెల్లడించారు. ఇందుకు కావాల్సిన నిధులు ఇతర దేశాలపై తాము విధించిన సుంకాల నుంచి సమకూరాయని తెలిపారు. 14.5 లక్షల మంది సైనికులకు 'వారియర్ డివిడెండ్' పేరుతో క్రిస్మస్ కానుక అందిస్తున్నట్లు వివరించారు. అమెరికాలో ప్రస్తుతం నెలకొన్న ద్రవ్యోల్బణానికి బాధ్యత తనకు పూర్వం అధ్యక్షుడిగా పని చేసిన జో బైడెన్‌దేనని ట్రంప్ ఆరోపించారు.

ప్రజల్లో అసంతృప్తి

అమెరికా ఆర్థిక వ్యవస్థను తాను బలోపేతం చేశానని ట్రంప్ చెబుతున్నా.. సాధారణ ప్రజానీకం అందుకు భిన్నమైన అభిప్రాయం కలిగి ఉన్నారు. విపరీతంగా పెరిగిపోయిన ధరలపై గుర్రుగా ఉన్నారు. ట్రంప్ సుంకాలు విధించడం మొదలయ్యాకే దేశంలో ధరలు పెరిగిపోయాయని, ఉద్యోగావకాశాలు తగ్గిపోయాయని అమెరికన్లు భావిస్తున్నట్లు అనేక సర్వే నివేదికలు తెలియజేస్తున్నాయి.

తైవాన్‌కు 1,110 కోట్ల డాలర్ల ఆయుధాల విక్రయం

అమెరికా నిర్ణయం.. చైనా ఆగ్రహం

వాషింగ్టన్: తైవాన్‌కు 1,110 కోట్ల డాలర్ల విలువైన ఆయుధాలను విక్రయించాలని అమెరికా నిర్ణయించింది. ఈ భారీ ఆయుధ విక్రయ ప్యాకేజీలో భాగంగా ఆ దేశానికి మధ్య శ్రేణి క్షిపణులు, శతఘ్నులు, డ్రోన్లను అందించనుంది. ఒకవైపు దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జాతినుద్దేశించి ప్రసంగిస్తుండగా మరోవైపు అమెరికా ప్రభుత్వం ఆయుధ విక్రయంపై ఈ ప్రకటన చేయడం గమనార్హం. ఈ విక్రయానికి అమెరికా కాంగ్రెస్ ఆమోదం తెలపాల్సి ఉంది. అయితే ట్రంప్ ప్రభుత్వ ఈ ప్రకటనపై చైనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తైవాన్‌ను తన భూభాగంగా పేర్కొంటున్న చైనా.. దాన్ని ఎలాగైనా చేజిక్కించుకుంటామని చెబుతున్న విషయం తెలిసిందే. ఈ పరిణామం తమకు, అమెరికాకు మధ్య కుదిరిన దౌత్య ఒప్పందాలకు విఘాతం కలిగిస్తుందని చైనా విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఇది చైనా సార్వభౌమాధికారానికి, భద్రతకు, ప్రాంతీయ సమగ్రతకు భంగం కలిగించి ప్రాంతీయ సుస్థిరతను భగ్నం చేస్తుందని పేర్కొంది.

బంగ్లాలో 2 భారత వీసా కేంద్రాల మూసివేత

ఢాకా: బంగ్లాదేశ్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని ముట్టడించేందుకు ఆందోళనలు జరిగిన నేపథ్యంలో భారత్ కీలక చర్యలు తీసుకుంది. అక్కడి రెండు వీసా కేంద్రాలను తాత్కాలికంగా మూసివేసింది. భద్రతా కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఢాకాలోని వీసా కేంద్రాన్ని ఇటీవల మూసివేయగా.. గురువారం దాన్ని తిరిగి తెరిచినట్లు సమాచారం.

అమెరికాలో ప్రయివేట్ జెట్ కూలి ఆరుగురి మృతి

రాలి: అమెరికాలోని ఉత్తర కరోలినా రీజినల్ ఎయిర్‌పోర్టులో ప్రయివేట్ జెట్ కూలి గురువారం ఆరుగురు మృతి చెందారు. ల్యాండింగ్ సమయంలో విమానం అదుపు తప్పినట్లు తెలుస్తోంది. నాస్కార్ మాజీ డ్రైవర్ గ్రెగ్ నడుపుతున్న కంపెనీకి చెందిన విమానం అని తెలుస్తోంది.

మసాలా బాండ్ల కేసులో కేరళ సీఎం విజయన్‌కు ఊరట

కొచ్చిన్: కేరళ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ బోర్డుకు (కేఐఐఎఫ్‌బీ) సంబంధించిన మసాలా బాండ్ల వ్యవహారంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు కేరళ హైకోర్టులో గురువారం ఊరట లభించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జారీ చేసిన షోకాజ్ నోటీసుకు సంబంధించిన తదుపరి చర్యలపై న్యాయస్థానం 3 నెలల స్టే విధించింది. కేరళలో మౌలిక వసతుల ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన నిధుల సమీకరణకు కేఐఐఎఫ్‌బీ 2019లో మసాలా బాండ్లు జారీ చేసింది. వాటి ద్వారా లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నుంచి సుమారు రూ.2,150 కోట్లు సమీకరించింది. ఈ నిధుల వినియోగంలో రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నిబంధనలను ఉల్లంఘించారని ఈడీ పేర్కొంది. దీనిపై నెల రోజుల్లోగా విజయన్, థామస్ ఐజాక్, అబ్రహాంలు వివరణ ఇవ్వాలని ఈ ఏడాది నవంబరులో జారీ చేసిన నోటీసుల్లో స్పష్టం చేసింది. వాటిని రద్దు చేయాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది.

మీకు ఓ వీడియో చూపిస్తాం.. మానవత్వం ఏమిటో చెప్పండి!

వీధి కుక్కలపై పిటిషన్ వేసిన వ్యక్తితో సుప్రీంకోర్టు

దిల్లీ: వీధి కుక్కల తొలగింపు చర్యల్లో భాగంగా దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) రూపొందించిన నిబంధనలు అమానవీయంగా ఉన్నాయంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. 'తదుపరి విచారణ సమయంలో మీకు ఓ వీడియో చూపిస్తాం. మానవత్వం అంటే ఏమిటో ప్రశ్నిస్తాం. అప్పుడు సమాధానం చెప్పండి' అంటూ జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. ఎంసీడీ నిబంధనలపై తక్షణమే విచారణ జరపాలన్న పిటిషనర్ అభ్యర్థనను తోసిపుచ్చింది. జనవరి 7న వాదనలు వింటామని తెలిపింది. అయితే, తాము కూడా ఓ వీడియో ప్రదర్శిస్తామని, నిబంధనలకు విరుద్ధంగా ఏమి జరుగుతుందో వెల్లడిస్తామని పిటిషనర్ తరఫు న్యాయవాది కపిల్‌సిబల్ పేర్కొన్నారు.

'సర్' అభ్యర్థనను పరిశీలించండి

ఉత్తర్‌ప్రదేశ్, కేరళలలో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) గడువును పొడిగించాలంటూ వచ్చిన అభ్యర్థనలను పరిశీలించాల్సిందిగా ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు గురువారం సూచించింది. ఉత్తర్‌ప్రదేశ్‌లో 25 లక్షల మంది పేర్లను ఓటరు జాబితాల నుంచి తొలగించారని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం దృష్టికి సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తీసుకొచ్చారు. ఇప్పటికే గడువును పొడిగించినట్లు ఈసీ తరఫు సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీ తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు 2027లో జరుగుతాయని, ఇప్పుడు హడావిడిగా 'సర్'ను ముగించాల్సిన అవసరం ఏముందని మరో న్యాయవాది ప్రశ్నించారు. సానుకూల దృష్టితో ఈసీ నిర్ణయం తీసుకోవాలని ధర్మాసనం సూచించింది. వివిధ రాష్ట్రాల్లో సర్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై తుది విచారణను జనవరి 6న చేపడతామంటూ కేసును వాయిదా వేసింది.

పురుషుల ఊపిరితిత్తుల్లోనే ఎక్కువగా విష వాయువులు

- దిల్లీలో నిర్వహించిన అధ్యయనంలో వెల్లడి

దిల్లీ: పని ప్రదేశం నుంచి ఇంటికి వస్తున్నప్పుడు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన వాహనాల్లో ఎక్కువ సేపు గడపటం, రద్దీ ప్రాంతాల్లో నడుచుకుంటూ వెళ్లడం తదితర కారణాల వల్ల దిల్లీలో మహిళల కంటే పురుషుల ఊపిరితిత్తుల్లోకి విష వాయువులు ఎక్కువగా వెళుతున్నాయని ఓ అధ్యయనం తేల్చింది. 2019-23 మధ్య రాజధాని ప్రాంతంలో ఉన్న 39 వాయు నాణ్యత పరిశీలక కేంద్రాల నుంచి సేకరించిన డేటాను అధ్యయనకర్తలు విశ్లేషించారు. దిల్లీకి చెందిన నేతాజీ సుభాష్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ, నొయిడాకు చెందిన ఎన్విరాన్‌మెంటల్ కన్సల్టెన్సీ ఇందులో పాలుపంచుకున్నాయి. ఊపిరితిత్తుల్లో పేరుకుపోతున్న కాలుష్య వాయువుల మోతాదుల్లో పురుషులు, మహిళల మధ్య ఉన్న తేడాను ఈ అధ్యయనం నొక్కి చెప్పింది. ఆ వివరాల ప్రకారం.. ఆరుబయట కూర్చుని ఉన్నప్పుడు మహిళలతో పోలిస్తే పురుషులు పార్టిక్యులేట్ మేటర్ (పీఎం) 2.5ను 1.4 రెట్లు, పీఎం 10 రేణువులను 1.34 రెట్లు ఎక్కువగా పీల్చుకుంటున్నారు. నడుస్తున్నప్పుడు ఈ భేదం 1.2 రెట్లుగా ఉంది. స్త్రీలతో పోలిస్తే పురుషులు గాలి పీల్చుకునే సామర్థ్యం ఎక్కువగా ఉండటమే ఈ వ్యత్యాసానికి కారణం. జెండర్‌తో సంబంధం లేకుండా కూర్చోవడంతో పోలిస్తే నడుస్తున్నప్పుడే కాలుష్య వాయువులను శ్వాసించడం ఎక్కువగా జరుగుతోంది. తద్వారా వీధుల్లో వ్యాపారాలు చేసేవారు, నడిచి వెళ్లేవారు అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో జీవిస్తున్నారని అధ్యయనకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయంతో పోలిస్తే ట్రాఫిక్ ఎక్కువగా ఉండే సాయంత్రం వేళల్లో ఊపిరితిత్తుల్లోకి చేరే పీఎం 2.5, పీఎం 10ల మోతాదు వరుసగా 39 శాతం, 23 శాతం అధికంగా ఉందని వారు పేర్కొన్నారు.

ఈ ఆరు విధానాలు.. గేమ్ ఛేంజర్లు

- ఉత్తమ విధానాలపై కలెక్టర్ల సదస్సులో ప్రజంటేషన్
- రాష్ట్రమంతా అమలు చేయాలని సీఎం ఆదేశాలు
- ఆరుగురు కలెక్టర్లకు ప్రత్యేక ప్రశంసలు
- వచ్చే సదస్సుకల్లా పది ఉత్తమ విధానాలు లక్ష్యం
- దేశమంతా మన నుంచే నేర్చుకోవాలని ఆకాంక్ష



పరిపాలనలో వినూత్న విధానాలు క్షేత్రస్థాయి నుంచే రావాలని, ఇందుకు కలెక్టర్లే చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఈసారి కలెక్టర్ల సదస్సులో సీఎం కొత్త పద్ధతిని అనుసరించారు. వివిధ జిల్లాల్లో అమలవుతున్న వినూత్న విధానాలను పరిశీలించేందుకు కమిటీ నియమించి, వాటిలో ఆరింటిని ఉత్తమమైనవిగా ఎంపిక చేశారు. గురువారం సదస్సులో వాటి గురించి వివరించే అవకాశం ఆయా కలెక్టర్లకే ఇచ్చారు. ఈ ఆరు విధానాలు 'గేమ్ ఛేంజర్లు' అవుతాయని ముఖ్యమంత్రి ప్రశంసించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు అక్కడికి వెళ్లి వాటిని పరిశీలించి, వారి జిల్లాల్లోనూ అమలు చేయాలని ఆదేశించారు. మెరుగైన విధానాలు రూపొందించిన కలెక్టర్లే, రాష్ట్రవ్యాప్తంగా అమలుకు ఛాంపియన్స్‌గా ఉంటూ, మార్గదర్శనం చేస్తారని తెలిపారు. వచ్చే సదస్సు నాటికి ఉత్తమ విధానాల సంఖ్య పదికి పెరగాలన్నారు. ఉత్తమ విధానాల వల్ల మనం సమానంగా మారుతామని, ఇతర రాష్ట్రాల వారు వచ్చి ఇక్కడ నేర్చుకుంటారని తెలిపారు. 'రిజిస్ట్రేషన్ శాఖలో చాలా మార్పు వచ్చింది. మంగళగిరిలో పవన్ అనే వ్యక్తికి 10 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ చేయగా, అతనికి వచ్చిన మెసేజ్‌ను సీఎంవోకు పంపించారు' అని సీఎం చదివి వినిపించారు. ఈ తరహాలో పనిచేస్తే దేశమంతా మన నుంచే నేర్చుకుంటుందని ఉదహరించారు.



సదస్సుకు హాజరైన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు

1 మెరికల్లా గిరిజన పిల్లలు

ప్రాజెక్టు: నిర్మాణ్ **జిల్లా:** అల్లూరి సీతారామరాజు

కలెక్టర్: దినేశ్‌కుమార్

లక్ష్యం: గిరిజన ప్రాంతాల్లోని ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే పటిష్ఠ పునాది వేసి, మంచి గ్రేడ్ సాధించేలా చూడటం. ప్రతిభావంతులను సూపర్-50 పేరుతో ఎంపికచేసి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధం చేయడం. మార్గదర్శనం పేరుతో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్.

అమలు విధానం: ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) పేరుతో ఈ కార్యక్రమం చేపట్టారు. తెలుగు, ఇంగ్లిష్, గణితంలో మే నెలలో పరీక్ష నిర్వహించి, ఫలితాల మేరకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పదో తరగతి విద్యార్థులకు జిల్లాస్థాయిలో పరీక్షపెట్టి, సూపర్-50లో భాగంగా 50 మందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వారిలో ఒక విద్యార్థి ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో 577 మార్కులతో రాష్ట్రంలోని ఆశ్రమ పాఠశాలల విభాగంలో మొదటి స్థానంలో నిలిచారు. 2023-24, 2014-25లో సూపర్-50లో శిక్షణ పొందిన విద్యార్థులంతా ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు.

సీఎం సూచన: కుప్పం నియోజకవర్గంలో 'విలువల బడి' పేరుతో నిత్యం గంటన్నర పాటు పిల్లలకు స్ఫూర్తిదాయక అంశాలు బోధిస్తున్నారు. దాన్నికూడా అన్నిచోట్లా అమలు చేయాలి.

2 ఆరోగ్యానికి మేలి మలుపు

ప్రాజెక్టు: ముస్తాబు **జిల్లా:** పార్వతీపురం మన్యం

కలెక్టర్: ప్రభాకర్‌రెడ్డి

లక్ష్యం: విద్యార్థుల్లో వ్యక్తిగత శుభ్రత, జబ్బు పడకుండా చూడటం. మంచి అలవాట్లు, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంచడం.

అమలు విధానం: ప్రతి తరగతి గదిలో 'ముస్తాబు కార్నర్' ఏర్పాటు చేశారు. వాటిలో అద్దం, దువ్వెన, తువాలు, సబ్బు, నెయిల్ కట్టర్, హ్యాండ్ వాష్, బకెట్ తదితరాలు ఉంచారు. ఇంటి దగ్గర సరిగ్గా తయారై రానివాళ్లను ముస్తాబు కార్నర్‌కి పంపించి ముఖం కడుక్కొని, తల దువ్వుకుని వచ్చాకే తరగతి గదిలోకి అనుమతిస్తున్నారు.

సీఎం సూచన: అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో 'ముస్తాబు'ను ప్రవేశపెడతాం. మొత్తం 79 లక్షల మంది విద్యార్థులున్నారు. వారి తల్లిదండ్రులను కూడా కలిపితే సుమారు 2 కోట్ల మందిని ఇది ప్రభావితం చేస్తుంది.

3 సారా తయారీ నుంచి 'మార్పు' వైపు

ప్రాజెక్టు: మార్పు **జిల్లా:** ఏలూరు

కలెక్టర్: వెట్రి సెల్వి

లక్ష్యం: నాటు సారా తయారుచేసే కుటుంబాలతో ఆ వృత్తి మాన్పించి, ప్రత్యామ్నాయ ఉపాధి చూపించడం. గౌరవప్రదంగా బతికేలా చేయడం.

అమలు విధానం: గత పదేళ్లుగా సారా తయారీలో ఉంటూ, కేసులు ఎదుర్కొంటున్న 226 కుటుంబాలను ఎంపికచేసి కౌన్సెలింగ్ ఇచ్చారు. 40 కుటుంబాలు ముందుకురాగా, వారికి రూ.31.40 లక్షల రుణం ఇప్పించారు. వారు పశువుల పెంపకం, మాంసం దుకాణం, కుండల తయారీ వంటి యూనిట్లు పెట్టుకొని, నెలకు రూ.8-15 వేల ఆదాయం పొందుతున్నారు.

సీఎం సూచన: మాదకద్రవ్యాలకు బానిసలైన వారికి కూడా ఉపాధి అవకాశాలు చూపిస్తే, వ్యసనాల నుంచి బయటపడతారు.

4 రైతులే ఛాంపియన్లు

ప్రాజెక్టు: ఛాంపియన్ ఫార్మర్స్

జిల్లా: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు **కలెక్టర్:** హిమాంశు శుక్లా

లక్ష్యం: అందుబాటులో ఉన్న జల వనరులతోనే సాగు విస్తీర్ణం పెంచడం. వరికి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడం. ఎరువులు, క్రిమిసంహారకాల వాడకం తగ్గించడం.

అమలు విధానం: 727 పంచాయతీల నుంచి ఒక్కో ఛాంపియన్ ఫార్మర్‌ను ఎంపిక చేశారు. జిల్లాలోని మధ్య ప్రాంతంలో మొక్కజొన్న, పశ్చిమ ప్రాంతంలో వేరుశనగ, నిమ్మ, డెల్టాలో వరికి బదులు సీవీడ్, ఆక్వా, అరటి, పొలం గట్లపై ఆయిల్‌పాం సాగును ప్రోత్సహించారు. యాంత్రీకరణ కింద 45 పరికరాలను రాయితీపై అందిస్తున్నారు.

సీఎం సూచన: రైతులు మూణ్నాలుగు రకాల పంటలు వేస్తారు. వాటిని వేర్వేరు విభాగాలు పర్యవేక్షిస్తాయి. వాటి మధ్య సమన్వయం లోపిస్తోంది. ఆ సమస్యకు ఇదొక పరిష్కారం. జిల్లా కేంద్రంగా వ్యవసాయ పరికరాల బ్యాంక్ ఏర్పాటుచేసి, రైతులు వాడుకునేలా పర్యవేక్షించాలి.

5 ఆహారం.. శుచిగా, శుభ్రంగా, రుచిగా

పథకం: మధ్యాహ్న భోజన పథకానికి ఆధునిక వంటశాలలు

జిల్లా: వైఎస్సార్ కడప

కలెక్టర్: చెరుకూరి శ్రీధర్

లక్ష్యం: మధ్యాహ్న భోజన పథకంలో శుచి, శుభ్రత, నాణ్యత, ప్రమాణాలు పెంచడం. పిల్లలకు పోషకాహారాన్ని అందించడం. పర్యావరణహిత వంటశాలలు.

అమలు విధానం: మండలానికి ఒక ఆధునిక వంటశాల ఏర్పాటు చేశారు. అక్కడే సౌర విద్యుత్, బయోగ్యాస్‌పై ఆహార పదార్థాలు వండి, పాఠశాలలకు పంపిస్తున్నారు. వంటవారికి పౌష్టికాహార నిపుణులతో శిక్షణ ఇప్పించారు. ప్రకృతి సేద్యం చేస్తున్న రైతుల నుంచే సరకులు కొంటున్నారు. గతంలో రేషన్ బియ్యం సరఫరాకు వాడిన వాహనాలను స్కూళ్లకు ఆహార పదార్థాల సరఫరాకు వినియోగిస్తున్నారు. ప్రస్తుతం రోజూ 136 స్కూళ్లలోని పది వేల మందికి భోజనం అందిస్తున్నారు. మరో 33 వంటశాలలు నిర్మాణంలో ఉన్నాయి. జనవరి 26 నాటికి జిల్లాలోని అన్ని పాఠశాలలకు ఈ వంటశాలల నుంచే ఆహారం పంపిస్తారు. దీన్ని నీతి ఆయోగ్ మెచ్చుకుని వంటశాలల నిర్మాణానికి రూ.2.5 కోట్లు ఇచ్చింది. ఒక్కో వంటశాల నిర్మాణానికి రూ.62 లక్షలు ఖర్చవుతోంది.

సీఎం సూచన: వంట దినుసుల్లో అన్యపదార్థాల్ని తొలగించేందుకు తితిదేలో వాడుతున్న ఏఐ ఆధారిత పరిజ్ఞానాన్ని పరిశీలించండి. పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయించండి. అవసరమైన సప్లిమెంట్లను ఆహారం ద్వారా ఇవ్వాలి. రక్తహీనతను నివారించాలి.

రాష్ట్రమంతా వంటశాలలు: ఈ స్మార్ట్ కిచెన్ ప్రాజెక్టు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు బాగా నచ్చిందని, దీనికి కేంద్రం సహకరిస్తుందని విద్యాశాఖ మంత్రి లోకేశ్ తెలిపారు. కలెక్టర్లు క్లస్టర్ల వారీగా స్థలం గుర్తిస్తే, రాష్ట్రమంతా వంటశాలలు నిర్మిద్దామని సూచించారు.

- ఈనాడు, అమరావతి

6 డిజిటల్ రూపంలో రెవెన్యూ రికార్డులు

ప్రాజెక్టు: రెవెన్యూ శాఖలో ఏఐ వినియోగం, రికార్డుల డిజిటలీకరణ

జిల్లా: అనంతపురం

కలెక్టర్: ఒ.ఆనంద్

లక్ష్యం: 10(1), 1బి, అర్‌హెచ్ కాపీ, సీలింగ్, డీకేటీ, డిస్ప్యూట్ రిజిస్టర్లు, కోర్టు వివాదాలు వంటి రికార్డుల డిజిటలీకరణ. వాటన్నింటినీ ఒకే వెబ్‌సైట్ ద్వారా ప్రజలకు అందుబాటులోకి తేవడం.

అమలు విధానం: మాన్యువల్ రికార్డులన్నింటినీ కేవలం రూ.3 లక్షల ఖర్చుతో స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో ఉంచారు. సర్వే నంబరు నమోదు చేయగానే డిజిటల్ కాపీలు అందుబాటులోకి వస్తాయి. ఫేజ్-2 ప్రాజెక్టు రూపొందిస్తున్నారు. ఇది రెవెన్యూ ఆఫీస్ టూల్. దీనిలో అధికారులు ఉత్తర్వులిచ్చిన వెంటనే వెబ్‌ల్యాండ్‌లో అప్‌డేట్ అవుతాయి.

సీఎం సూచన: రెవెన్యూ రికార్డుల్లో పారదర్శకత తెచ్చేందుకు ఇది దోహదం చేస్తుంది. రికార్డుల్ని ఎవరూ ట్యాంపరింగ్ చేయకుండా ఉపయోగపడుతుంది.

అక్టోబరు 2 నుంచి 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్' నిషేధం

ఈనాడు, అమరావతి: స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వచ్చే ఏడాది అక్టోబరు 2 నుంచి అన్ని నగరాలు, పట్టణాల్లోనూ 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్'ను ప్రభుత్వం నిషేధించనుంది. 17 పుర, నగరపాలక సంస్థల్లో ఇప్పటికే ప్రకటించి అమలు చేస్తున్నారు. మిగిలిన 96 పట్టణాల్లోనూ అమలు చేయనున్నట్లు కలెక్టర్ల సదస్సులో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ ప్రకటించారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై ఆయన ప్రజంటేషన్ ఇచ్చారు.

వ్యర్థాల సమస్యను సున్నా స్థాయికి తీసుకురావాలి

ఈనాడు, అమరావతి: వచ్చే మూడున్నరేళ్లలో స్వచ్ఛ కార్యక్రమాలు ఏమి చేయనున్నారో స్పష్టత కావాలని, తద్వారా వ్యర్థాల సమస్య సున్నా స్థాయికి తీసుకురావడం కీలకమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. స్వచ్ఛతకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఏటా ప్రకటించే అవార్డులన్నీ రాష్ట్రానికే రావాలని సూచించారు. కలెక్టర్ల సదస్సులో గురువారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ ప్రజంటేషన్ ఇచ్చిన అనంతరం సీఎం మాట్లాడారు. 'ప్రతి కలెక్టర్.. జిల్లాలో ఒక పట్టణంపై పూర్తిగా దృష్టిపెట్టాలి. నగరాలు, పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాలకూ అవార్డులు వచ్చేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేయండి' అని నిర్దేశించారు.

జీవవైవిధ్యంగా అమరావతి, తిరుమల

- 'అమరావతి, తిరుమలను జీవవైవిధ్యం ఉట్టిపడేలా (బయోడైవర్సిటీ) అభివృద్ధి చేయాలి. తిరుమలలో ప్రస్తుతం 89% ఉన్న పచ్చదనాన్ని వంద శాతానికి తీసుకెళ్లాలి.
- హైదరాబాద్‌లో రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో బయోడైవర్సిటీ అమలు విధానం బాగుంది. అక్కడ రెండు వేల మొక్కలున్నాయి. టిష్యూ కల్చర్ చేస్తున్నారు. కనుమరుగయ్యే మొక్కల జాతులను.. వాటి పూలు, ఆర్గాన్ల ద్వారా మళ్లీ సృష్టిస్తున్నారు. ఆ కేంద్రానికి ఒకసారి వెళ్లి చూడండని పక్కనే ఉన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు చంద్రబాబు సూచించారు.
- బయోడైవర్సిటీతో ప్రపంచంలోనే ఉత్తమ ప్రాంతంగా తిరుమలను తీర్చిదిద్దాలి. ఈ నెల 20న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోనూ ముస్తాబు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. దీన్ని లాజికల్‌గా ముందుకు తీసుకెళ్లాలి' అని సీఎం సూచించారు.

వంధ్యత్వ రేటు పెరగడంపై అధ్యయనం చేయిస్తాం

ఈనాడు, అమరావతి: జనాభాలో వంధ్యత్వం (ఇన్‌ఫెర్టిలిటీ రేట్) 7% నుంచి 10%గా ఉంది. జీవనశైలి మార్పు, ఊబకాయం, ఆలస్య వివాహాలు దీనికి కారణాలు. ఐవీఎఫ్‌కు రూ.లక్షల్లో ఖర్చవుతోంది. దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది' అని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. అన్ని కోణాల్లో దీనిపై పరిశీలిస్తామని సీఎం పేర్కొన్నారు. కుప్పంలో పనిచేస్తున్న ఏజెన్సీ కూడా దీనిపై అధ్యయనం చేస్తుందని తెలిపారు.

రాష్ట్రంలో ఫెర్టిలిటీ కళాశాల

- రాష్ట్రంలో సంతాన సాఫల్య వైద్య కళాశాల (ఫెర్టిలిటీ మెడికల్ కాలేజ్) ఏర్పాటు చేయనున్నట్లు వైద్యారోగ్య- కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ తెలిపారు. ఆరోగ్య యూనివర్సిటీ ద్వారా ఫెర్టిలిటీపై ప్రసూతి వైద్యులకు ఏడాది డిప్లొమా కోర్సులో శిక్షణ ఇచ్చి పదోన్నతులు, ప్రోత్సాహకాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

సచివాలయాల్లో దరఖాస్తుకు వీఆర్వోల సంతకాలు ఎందుకు?

ఈనాడు, అమరావతి: 'రాష్ట్రంలో రెవెన్యూ సమస్యల పరిష్కారం అంకెల్లో బాగానే కనిపిస్తున్నా ప్రజల సంతృప్తి లేదు. ఎందుకో కారణాలు అన్వేషించాలి. మొత్తం ఫిర్యాదుల్లో 85% పరిష్కారమైనట్లు లెక్కలు కనిపిస్తున్నాయి. సంతృప్తి స్థాయి 53 శాతమే కనిపిస్తోంది. అంటే రెవెన్యూ సమస్యల పరిష్కారం నాణ్యంగా జరగడం లేదని అర్థమవుతోంది. దీనిపై కలెక్టర్లు దృష్టి సారించాలి' అని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ అన్నారు. కలెక్టర్ల సదస్సులో రెవెన్యూ అంశాలపై చర్చ సందర్భంగా ఆయన ప్రజంటేషన్ ఇచ్చారు.

'కౌశలం'తో ఐటీ ఉద్యోగం

ఈనాడు, అమరావతి: ఐటీ, ఐటీ ఆధారిత సేవలు, గ్లోబల్ కేపబులిటీ సెంటర్లకు (జీసీసీ) అవసరమైన నైపుణ్య సిబ్బందిని గుర్తించేందుకు 'కౌశలం' పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటమనేని తెలిపారు. 'ఏఐ ఆధారంగా పనిచేసే పోర్టల్ ద్వారా ప్రైవేటు కంపెనీలకు అవసరమైన నైపుణ్య సిబ్బందిని గుర్తించే చర్యలు చేపట్టాం. డేటా ఆధారంగా అర్హత కలిగిన యువతను గుర్తించి, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. ఇప్పటికే సర్వే నిర్వహించి, చదివి ఉపాధి లేని వారి వివరాలతో డేటా రూపొందించాం. అర్హతకు తగిన ఉపాధి పొందని వారి వివరాలూ పోర్టల్‌లో ఉంచాం. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 24.14 లక్షల మందికి సంబంధించిన డేటా పోర్టల్‌లో ఉంది. వారిలో కోడింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్ పరిశీలించి, అర్హతల ఆధారంగా సుమారు 2.5 లక్షల మందికి పోర్టల్ ద్వారా ఇప్పటికే ఉపాధి అవకాశాలు కల్పించాం. వివిధ కంపెనీలతో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, పుణె, ముంబయిల్లో రోడ్‌షోలు నిర్వహిస్తాం. రాష్ట్రంలోని అన్ని కళాశాలల్లో కౌశలం పోర్టల్ ప్రారంభించే ఆలోచన ఉంది. డిసెంబరు నాటికి యువత విద్యార్హతలు, ఇతర వివరాలను కంపెనీలకు అందుబాటులోకి తేవాలన్నదే లక్ష్యం' అని పేర్కొన్నారు. రాబోయే మూడు నెలల్లో ప్రాజెక్టును పూర్తి స్థాయిలో కార్యాచరణలోకి తీసుకొస్తామని పేర్కొన్నారు.

4.5 లక్షల మందికి ఉపాధి కల్పించాం

రాష్ట్రంలో ఇప్పటివరకు 4.5 లక్షల మందికి ఉపాధి కల్పించినట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. వారి పేర్లు.. ఇతర వివరాలను డ్యాష్ బోర్డులో ఉంచాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ల సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. 'నైపుణ్య శిక్షణ అందించడం ముఖ్యమని కలెక్టర్లు గుర్తించాలి. సంప్రదాయ కోర్సుల మాదిరే స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లోనూ డిగ్రీలు పొందే అవకాశం ఉంటుంది. యువగళం ద్వారా 20 లక్షల మందికి ఐదేళ్లలో ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చాం. అందుకనుగుణంగా యువతను సన్నద్ధం చేయాలి. ఇతర దేశాల్లో ఉన్న ఉపాధి అవకాశాలనూ అందిపుచ్చుకునేలా శిక్షణ ఇవ్వాలి' అని అధికారులకు సూచించారు. నైపుణ్యం పోర్టల్ ద్వారా చేపట్టే కార్యక్రమాలు, ఉపాధి కల్పన, ప్రాథమిక, ఉన్నత విద్యలో సాధించిన పురోగతి గురించి మానవ వనరుల శాఖ కార్యదర్శి కోన శశిధర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

ఏఐ ఆధారంగా పనిచేసే 'నైపుణ్యం' పోర్టల్

ఏఐ ఆధారంగా రూపొందించిన 'నైపుణ్యం' పోర్టల్ పనితీరును పైలట్ ప్రాజెక్టు కింద మంగళగిరిలో 223 మందితో లైవ్ టెస్టింగ్ చేసినట్లు మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. 'దీని ద్వారా స్కిల్ సెన్సస్ కాన్వర్సేషన్ ఏఐ ఆధారంగా నిర్వహిస్తాం. రెండు దశల్లో దీని పనితీరు పరిశీలించబోతున్నాం. తొలుత లక్ష మందితో.. ఆ తర్వాత 50 లక్షల మందితో నిర్వహించబోతున్నాం. దీనికి అవసరమైన సహకారాన్ని ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించింది' అని పేర్కొన్నారు. ఒక ప్లంబర్ చేసిన ఇంటర్వ్యూనూ ప్రదర్శించి. . నైపుణ్య పోర్టల్ పనితీరును సీఎంకు వివరించారు. మూడున్నర నిమిషాల నిడివి ఉన్న వీడియోను సీఎం చంద్రబాబు ఆసక్తిగా తిలకించారు.

'మేడిన్ ఆంధ్రా' రావాలి

ఈనాడు, అమరావతి: ప్రతి జిల్లాలో అక్కడి ప్రత్యేక ఉత్పత్తులను గ్లోబల్ బ్రాండ్స్‌గా తయారు చేయగలిగితే.. వాటికి ప్రపంచ స్థాయిలో మార్కెట్ ఉంటుందని సీఎం చంద్రబాబు తెలిపారు. వీటికి రాష్ట్ర బ్రాండ్‌తో ఒకే పేరు పెడితే బాగుంటుందని పేర్కొన్నారు. కలెక్టర్ల సదస్సులో 'ప్రొడక్ట్ పర్ఫెక్షన్' అనే అంశంపై చంద్రబాబు మాట్లాడారు. ప్రతి జిల్లాలో కనీసం ఒకటి, లేదా వివిధ ప్రత్యేక ఉత్పత్తులను ఎంపిక చేయాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. అంతకు ముందు పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ మాట్లాడుతూ.. కలెక్టర్లు ఎంపిక చేసిన ఉత్పత్తులకు 'మేడిన్ ఆంధ్రా'గా బ్రాండింగ్ కల్పించాలని తెలిపారు. అరకు కాఫీ, ఏటికొప్పాక బొమ్మలు, అనంతపురం సిల్క్ చీరలు.. వంటి వాటికి ఇప్పటికే మేడిన్ ఆంధ్రా బ్రాండింగ్ ఉందని చెప్పారు. ఇదే విధంగా వివిధ రంగాల్లో తయారయ్యే ఉత్పత్తులను ఎంపిక చేయాలన్నారు. వాటికి రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఎలా మార్కెటింగ్ కల్పించాలన్నది చూస్తామని చెప్పారు.



సదస్సులో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు సత్యప్రసాద్, లోకేశ్‌ల మాటామంతి

స్వర్ణ పంచాయతీ పోర్టల్‌తో పెరిగిన ఆస్తిపన్ను ఆదాయం

ఈనాడు, అమరావతి: పంచాయతీరాజ్ శాఖ సంస్కరణల్లో భాగంగా ప్రారంభించిన స్వర్ణ పంచాయతీ పోర్టల్‌తో ఆస్తిపన్ను ఆదాయం రూ.135.24 కోట్లు పెరిగింది. 2024-25లో ఆస్తిపన్ను ఆదాయం రూ.622.40 కోట్లుగా ఉంది. పోర్టల్ ఏర్పాటు చేసి, ఆన్‌లైన్ చెల్లింపుల విధానం అమలు చేయడంతో 2025-26లో రూ.757.64 కోట్లకు పెరిగినట్లు కలెక్టర్ల సదస్సులో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ వెల్లడించింది. పన్ను పరిధిలోకి వచ్చిన ఇళ్లు, భవనాలు, దుకాణాల సంఖ్య కూడా 82.70 లక్షల నుంచి 88.17 లక్షలకు పెరిగింది. నగదు రహిత వసూళ్లకు వీలుగా చేసిన ఏర్పాట్లతో మంచి ఫలితాలొచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

రౌడీషీటర్లకు రాష్ట్ర బహిష్కరణ

- పదేపదే నేరాలకు పాల్పడుతుంటే పీడీ యాక్ట్
- శాంతిభద్రతలపై సమీక్షలో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: కరడుగట్టిన రౌడీషీటర్లను రాష్ట్రం నుంచి బహిష్కరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. పదే పదే నేరాలకు పాల్పడుతూ అలజడి సృష్టిస్తున్న రౌడీషీటర్లపై పీడీ యాక్ట్ ప్రయోగించి జైల్లో పెడతామన్నారు. వీటికి సంబంధించి ఎస్పీల నుంచి అందే ప్రతిపాదనలకు వెంటనే ఆమోదం తెలపాలని కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాల్లో రౌడీయిజం నియంత్రించే బాధ్యత కలెక్టర్, ఎస్పీలదేనని తేల్చిచెప్పారు. కలెక్టర్ల సదస్సులో గురువారం ఆయన పోలీసు ఉన్నతాధికారులు, ఎస్పీలు, కలెక్టర్లతో శాంతిభద్రతలపై సమీక్షించారు. 'నెల్లూరు లాంటి చోట్ల లేడీడాన్‌లు వస్తున్నారు. గంజాయి వ్యాపారం చేయటం, అడ్డమొస్తే చంపేయటం వంటివి సినిమాల్లో చూసేవాళ్లం. కానీ నిజంగా జరుగుతున్నాయి. అలాంటి అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాలి' అని ఆదేశించారు. సీఎం ఏమన్నారంటే..

అత్యుత్తమ ఆచరణలతో రావాలి

- తదుపరి కలెక్టర్ల సదస్సు నాటికి ప్రతి ఎస్పీ వారి జిల్లాల్లో జరిగే టాప్-3 నేరాలను గుర్తించి వాటి కట్టడికి ఎలాంటి అత్యుత్తమ ఆచరణలు అమలు చేశారో ఆ వివరాలతో రావాలి. అన్నింటికంటే బాగున్నవి ఎంపిక చేసి సదస్సులో ప్రదర్శిస్తాం. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తాం.
- శిక్షల శాతం పెరిగితేనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుంది. ఏదైనా కేసు వీగిపోయిందంటే తగిన ఫోరెన్సిక్ ఆధారాలు సమర్పించలేదని, దర్యాప్తు సరిగ్గా లేదని అర్థం. దీనికి దర్యాప్తు అధికారిని బాధ్యుణ్ని చేయాలి.
- శాంతిభద్రతలపై ప్రతి నెలా సమీక్షిస్తా. అధికారులు వైఫల్యాల్ని కప్పిపుచ్చకుండా వాటిని సరిదిద్దుకోండి. నేరానికి పాల్పడితే వెంటనే పోలీసులు పట్టుకుంటారనే భయం నేరగాళ్లలో కల్పించాలి.

ప్రతి రోడ్డు ప్రమాదాన్ని విశ్లేషించాలి

- రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు ఆత్మరక్షణ విద్య (సెల్ఫ్ డిఫెన్స్) నేర్పించాలి. వారితో ప్రదర్శనలు ఇప్పించాలి.
- ఆపరేషన్ ట్రేస్‌లో భాగంగా మహిళల అదృశ్యం కేసులను ఛేదించటం అభినందనీయం. ఆయా ఘటనల వెనుక వ్యవస్థీకృత ముఠాలున్నాయా అనే కోణంలోనూ విశ్లేషించాలి.
- ఎస్సీ, ఎస్టీలపై నేరాల నియంత్రణ కోసం గ్రామాల వారీగా డేటా తీసుకోవాలి. ఆయా గ్రామాల్లో ప్రజలకు కౌన్సెలింగ్ ఇవ్వాలి.
- రాష్ట్రంలో జరిగే ప్రతి రోడ్డు ప్రమాదాన్నీ విశ్లేషించాలి. హాట్‌స్పాట్లను గుర్తించి అక్కడ సమస్యలను పరిష్కరించాలి.
- ట్రాఫిక్ చలానాల ద్వారా వసూలయ్యే సొత్తులో కొంత మొత్తాన్ని రహదారి భద్రత పరికరాల కొనుగోలు కోసం జిల్లాలకు కేటాయించాలని విశాఖపట్నం సీపీ శంఖబ్రత బాగ్చీ విన్నవించగా జిల్లాకు రూ.కోటి చొప్పున మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు.
- జిల్లాకొక సైబర్ పోలీసుస్టేషన్, రాష్ట్ర స్థాయిలో సైబర్ ఫ్రాడ్ మిటిగేషన్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ పెండింగ్‌లో ఉందని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా సీఎం దృష్టికి తీసుకెళ్లగా.. వాటి ఏర్పాటుకు నిధులు, అనుమతులు వెంటనే మంజూరు చేయాలని ఆర్థిక శాఖాధికారులను ఆదేశించారు.

5.5 శాతం మేర నేరాలు తగ్గాయి..

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం 5.5 శాతం మేర నేరాలు తగ్గాయని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా చెప్పారు. మొత్తంగా 16 జిల్లాల్లో నేరాలు తగ్గగా..10 జిల్లాల్లో పెరిగాయని పేర్కొన్నారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీలపైన నేరాలు, అల్లర్లు గణనీయంగా తగ్గాయని వివరించారు. రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు స్వల్పంగా పెరిగాయన్నారు. ప్రాపర్టీ నేరాల్లో మార్పు లేదన్నారు. కలెక్టర్ల సదస్సులో భాగంగా శాంతిభద్రతలపై నిర్వహించిన సమీక్షలో ఆయన ఈ మేరకు ప్రజంటేషన్ ఇచ్చారు.

జనవరిలో రోడ్డు ప్రమాద మరణాల్లేకుండా కార్యక్రమాలు

ఈనాడు, అమరావతి: రహదారి ప్రమాదాల్లో మన రాష్ట్రం 8వ స్థానంలో ఉండగా, ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు 5 వరకు 6,990 మంది ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారు. గత ఏడాదితో పోలిస్తే 6.95 శాతం ఎక్కువ మంది చనిపోయారు. ఇలా మరణించిన వారిలో మూడింట ఒక వంతు ద్విచక్ర వాహనదారులే ఉన్నారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించడంపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని, జనవరి నెలను..రోడ్డుప్రమాద మరణాల్లేని నెలగా మార్చేందుకు ప్రతి జిల్లాలో కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు తెలిపారు.

సంక్రాంతి నుంచి అన్ని ప్రభుత్వ సేవలూ ఆన్‌లైన్‌లోనే

ఈనాడు, అమరావతి: 'వచ్చే ఏడాది జనవరి 15 నాటికి అన్ని ప్రభుత్వ శాఖల్లో, అన్ని ఫైళ్లూ ఆన్‌లైన్‌లోకి రావాల్సిందే. సంక్రాంతి నుంచి అన్ని ప్రభుత్వ సేవలూ ఆన్‌లైన్‌లోనే అందించాలి. పోలీసుశాఖలోనూ దీన్ని కచ్చితంగా అమలు చేయాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడే వారిని ఉపేక్షించవద్దని.. ఎన్డీయేలోనూ అలాంటి వారిని తాము ప్రోత్సహించడం లేదని స్పష్టం చేశారు. కలెక్టర్ల సదస్సు ముగింపు సందర్భంగా గురువారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ..'వైకాపా పాలనలో దెబ్బతిన్న ఏపీ బ్రాండ్‌ను కూటమి ప్రభుత్వం వచ్చాక పునరుద్ధరించాం..రూ.21 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇది రికార్డు. వీటన్నిటిని గ్రౌండ్‌చేయాలి' అని సూచించారు.

అప్పులు రూ.1.26 లక్షల కోట్లకు పెంచిన వైకాపా

'వైకాపా ప్రభుత్వ పాలనలో ఇంధనశాఖను భ్రష్టుపట్టించారు. ప్రజాప్రయోజనాల కోసం సౌర విద్యుత్‌ను అందుబాటులోకి తెస్తే.. వైకాపా ప్రభుత్వంలో దాన్ని వాడకుండా క్యాపిటల్ కాస్ట్ కింద రూ.9 వేల కోట్లు చెల్లించారు. యూనిట్ విద్యుత్‌ను రూ.14 చొప్పున కొన్నారు' అని చంద్రబాబు ధ్వజమెత్తారు. 'టారిఫ్ రూపంలోనే రూ.32,166 కోట్లు పెంచారు. రూ.49,596 కోట్లు అప్పులు తెచ్చారు. అప్పులు, బిల్లుల పెంపు కలిపితే రూ.81,762 కోట్ల భారం వేశారు. వారి అసమర్థ పాలన కారణంగా అప్పు రూ.1,25,633 కోట్లకు పెరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.11,321 కోట్లు తగ్గించాం. ఇంకా ఒక్క ఇంధనశాఖలోనే రూ.1,14,352 కోట్ల అప్పు ఉంది' అని తెలిపారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికల ముందు చెప్పాం. పెంచకుండానే వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రయత్నిస్తున్నాం' అని పేర్కొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలపై స్పష్టమైన దిశానిర్దేశం

ముగిసిన కలెక్టర్ల సదస్సు

ఈనాడు, అమరావతి: "ప్రజల సంతృప్తే మీ పనితీరుకు గీటురాయి. నంబర్లను నమ్మను. ఆకస్మిక తనిఖీలకు వస్తాను" అంటూ రెండు రోజుల సదస్సులో జిల్లా కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో బుధ, గురువారాల్లో రెండు రోజులపాటు జరిగిన సదస్సులో... కూటమి ప్రభుత్వ ప్రాధాన్యతలను ముఖ్యమంత్రి విస్పష్టంగా చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతి మూడు నెలలకు క్రమం తప్పకుండా కలెక్టర్ల సదస్సు నిర్వహిస్తోంది. ఇప్పుడు జరిగింది ఐదో సదస్సు. ఇకపై స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మాదిరిగానే, స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్‌కు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని, దాని ఆధారంగా అధికారులకు ర్యాంకులు కేటాయిస్తామని సీఎం తెలిపారు.

ఈసారి సదస్సులో మరో కొత్త విధానం అమలు చేశారు. క్షేత్రస్థాయిలో కలెక్టర్లు అమలు చేస్తున్న ఆరు ఉత్తమ విధానాల్ని ఎంపిక చేసి... వారిచేతే ప్రజంటేషన్ ఇప్పించారు. అవి వినూత్నంగా ఉండటంతో ఆయన వారిని ప్రత్యేకంగా ప్రశంసించారు. వాటిని రాష్ట్రం మొత్తం అమలు చేయాలని ఆదేశించారు. కొత్త ఆవిష్కరణలు క్షేత్రస్థాయి నుంచే రావాలంటూ ప్రోత్సహించారు. 22ఏ వంటి దీర్ఘకాలంగా ఉన్న సమస్యల పరిష్కారంపై కలెక్టర్లకు ఆయన ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు.



సదస్సుకు హాజరైన కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులు

సమయపాలనకు ప్రాధాన్యం

ఒకప్పుడు కలెక్టర్ల సదస్సులు ఉదయం 9.30-10 గంటలకు మొదలై రాత్రి 10-11 గంటల వరకు జరిగేవి. ఈసారి సదస్సును కొంచెం అటూ ఇటూగా అనుకున్న సమయానికి ముగించారు. బుధవారం ఉదయం 10.10 గంటలకు మొదలై రాత్రి 8 గంటలకు ముగిసింది. గురువారం ఉదయం 9.30కి ప్రారంభించి, సాయంత్రం 6 గంటలకు ముగించారు.

స్పష్టమైన లక్ష్యాలతో సమీక్ష

జీఎస్‌డీపీ, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధన, పది సూత్రాల అమలు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, కీలక పనితీరు సూచీలు (కేపీఐ), ఇ-ఫైల్స్ పరిష్కారం, వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజాస్పందన, సంతృప్తస్థాయి కేంద్రంగా కలెక్టర్ల సదస్సు జరిగింది. ఫైల్స్ క్లియరెన్స్‌లో వెనుకబడిన కలెక్టర్ల పేర్లు చదువుతూ, కారణమేంటని సీఎం ప్రశ్నించారు. కేంద్ర ప్రాయోజిత పథకాల కింద వచ్చిన నిధుల్ని ఖర్చు చేయడంలో వెనుకబడినవారి జాబితాను ప్రదర్శించి, కారణాలు ఆరా తీశారు. జనవరి 15 లోగా నిధులు ఖర్చు చేయాలని గడువు విధించారు. పెట్టుబడుల ఒప్పందాల్ని ఆచరణలోకి తేవడంలో కలెక్టర్ల పాత్రను గుర్తు చేశారు. ఏపీఐఐసీ ఆధీనంలోని 82 వేల ఎకరాల భూముల్ని 22(ఎ)లో ఉంచడం వల్ల పరిశ్రమలకు భూముల కేటాయింపునకు ఇబ్బంది ఏర్పడుతోందని, వెంటనే ఆ అంశాన్ని మంత్రివర్గం ముందుకు తీసుకురావాలని సూచించారు.

EENADU Vol: 52, Issue: 129 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

Cheil 29914/25

ఈనాడు సినిమా

అంతర్జాతీయ ప్రమాణాలతో... 'డెకాయిట్'



మృణాల్, అడివి శేష్

"విరామం వచ్చినా పర్వాలేదు... ప్రేక్షకులకు మంచి సినిమా అందించాలన్నదే నా తపన. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందుతున్న 'డెకాయిట్' విషయంలో మేమంతా గర్వపడుతున్నాం'' అన్నారు అడివి శేష్. ఆయన కథానాయకుడిగా... షానియల్ డియో దర్శకత్వంలో రూపొందుతున్న సినిమానే 'డెకాయిట్'. మృణాల్ ఠాకూర్ కథానాయిక. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషించారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. గురువారం హైదరాబాద్‌లో టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కథానాయకుడు అడివి శేష్ మాట్లాడుతూ "ఎక్కడికి పోయాడు? ఏం చేస్తున్నాడు? అంటూ నా గురించి ఎక్స్‌లో చర్చ జరుగుతోంది (నవ్వుతూ). నేను ఎక్కడికీ పోలేదు. ఈ సినిమానే చేస్తున్నా. ఇలా చాలా పెద్ద సినిమా. తెలుగు, హిందీ భాషల్లో చేశాం. నేను, షానియల్ కలిసి రాశాం. తను నా స్నేహితుడు. మేం అమెరికాలో పెరిగాం. తను మన సంస్కృతిని అర్థం చేసుకుని, నేను తన సంస్కృతిని అర్థం చేసుకుని ఒక హైబ్రిడ్ సినిమా చేశాం. అనురాగ్ కశ్యప్ మాకు మార్గనిర్దేశనం చేశారు. మృణాల్ అద్భుతమైన నటనని ఇందులో చూస్తారు. ఈ సినిమా అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందడానికి కారణం నిర్మాత సుప్రియ. సునీల్, జాన్వి ఈ సినిమాని మరింత ముందుకు తీసుకెళుతున్నారు. ప్రేక్షకుల మనసుల్లో ఎప్పటికీ గుర్తుండిపోయే పాత్రల్లో నటించడమే నా లక్ష్యం'' అన్నారు. మృణాల్ ఠాకూర్ మాట్లాడుతూ "నా మనసుకు దగ్గరైన సినిమా ఇది. హృదయం పెట్టి పనిచేశా. 'సీతారామం' సినిమాని స్వప్నతో, ఇప్పుడు సుప్రియ... మహిళా నిర్మాతలతో కలిసి సినిమా చేయడం చాలా బాగుంది. శేష్ పాత్ర చాలా బాగుంటుంది. ఈ సినిమాకోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నా'' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "14 ఏళ్ల కిందట కాలిఫోర్నియాలో శేష్ అన్నను కలిసినప్పుడు ఒక కథ గురించి మాట్లాడుకున్నాం. అక్కడ మొదలైన ప్రయాణం ఈ సినిమా వరకూ చేరింది. నేను ఈ దేశంలో ఉండటానికి కారణం ఆయనే. ఆయన మార్గనిర్దేశకత్వంలోనే ఈ సినిమా చేశా'' అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత జాన్వి నారంగ్, సుప్రియ యార్లగడ్డ. ఎడిటర్ పవన్‌కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇతిహాసాలన్నీ.. అసంపూర్ణమైన ప్రేమ గురించే



కార్తిక్, అనన్య పాండే

"కొందరు భవిష్యత్తు గురించి ఆలోచించండి అంటారు. మరికొందరేమో గతాన్ని దృష్టిలో ఉంచుకొని నడుచుకోండని చెప్తారు. కానీ ప్రస్తుత క్షణాల్ని ఎంజాయ్ చేయాలని నేను నమ్ముతాన''ని అంటున్నారు బాలీవుడ్ హీరో కార్తిక్ ఆర్యన్. ఇదంతా ఆయన నటించిన 'తూ మేరీ మై తేరా మై తేరా తూ మేరీ' చిత్రం కోసమే. కార్తిక్, అనన్య పాండే జంటగా సమీర్ విద్వాన్స్ తెరకెక్కించారు. ఈ రొమాంటిక్ కామెడీ డ్రామా ఈ నెల 25న రానుంది. ఈ నేపథ్యంలోనే ఇన్‌స్టా వేదికగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. "కథలు, గాథలు, ఇతిహాసాలు.. ఇవన్నీ అసంపూర్ణమైన ప్రేమ గురించే" లాంటి సంభాషణలతో ఓ వైపు ప్రేమకథను చూపిస్తూనే. భారతీయ వివాహ వ్యవస్థ గురించి ప్రేక్షకుల్ని ఆలోచింపజేసేలా ఆసక్తికర సన్నివేశాలతో సాగుతోందీ ట్రైలర్. జాకీ ష్రాఫ్, నీనా గుప్తా తదితరులు కీలక పాత్రలు పోషించారు. ధర్మ ప్రొడక్షన్స్ నిర్మించింది.

నాకు 'మగధీర'లా.. రోషన్‌కి 'ఛాంపియన్' – రామ్‌చరణ్



నాగ్ అశ్విన్, ప్రదీప్, స్వప్న దత్, అనస్వర రాజన్, రామ్‌చరణ్. రోషన్, అశ్వనీదత్, ప్రియాంకా దత్, శ్రీకాంత్

"ఛాంపియన్' సినిమా యాక్షన్ టచ్‌తో సాగే ఓ చిన్న 'లగాన్' చిత్రంలా కనిపిస్తోంది. అందులో క్రికెట్ కనిపిస్తే.. ఇందులో ఫుట్‌బాల్ ఆట ఉంది'' అన్నారు కథానాయకుడు రామ్‌చరణ్. రోషన్ హీరోగా ప్రదీప్ అద్వైతం తెరకెక్కించిన చిత్రమే 'ఛాంపియన్'. జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్స్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ నిర్మించాయి. అనస్వర రాజన్ కథానాయిక. నందమూరి కల్యాణ్ చక్రవర్తి కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా ఈనెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే హీరో రామ్‌చరణ్ గురువారం రాత్రి ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఈ చిత్ర పోస్టర్‌లో రోషన్‌ని చూస్తుంటే ఒక యురోపియన్ యాక్షన్ హీరోలా ఉన్నాడు. నాకు 'మగధీర' ఎంత పెద్ద హిట్టయ్యిందో.. రోషన్‌కి 'ఛాంపియన్' అంత పెద్ద హిట్టవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా. 1938 కాలంలో జరిగే చిత్రమిది. ఈ టీజర్‌లో రెండు మూడు క్లిప్స్ చూసినప్పుడు నటుడిగా రోషన్‌లోని పరిణతి కనిపించింది. దర్శకుడు ప్రదీప్ వల్లే అలాంటి నటన సాధ్యమైంది'' అన్నారు. హీరో రోషన్ మాట్లాడుతూ.. "నేను చాలా ఏళ్ల తర్వాత సినిమా చేస్తున్నా. ఇది మన తెలుగు వారి చరిత్ర.. బైరాన్‌పల్లి చరిత్ర. ఆ ఊరిలో ఉన్న వీరుల చరిత్ర. నాకీ సినిమాని.. మైఖేల్ విలియమ్స్ పాత్రని ఇచ్చినందుకు దర్శకుడు ప్రదీప్‌కి ఎప్పటికీ రుణపడి ఉంటాను'' అన్నారు. ఈ కార్యక్రమంలో అశ్వనీదత్, నాగ్ అశ్విన్, ప్రియాంకా దత్, స్వప్నదత్, శ్రీకాంత్, ప్రదీప్ అద్వైతం, అనస్వర, సంతోశ్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

వాయిదా వల్ల మానసికంగా చాలా నలిగిపోయాం!

'అఖండ', 'అఖండ 2' చిత్రాలు తనకు జీవితంలో స్వీయ నియంత్రణను, మనశ్శాంతిని అందివ్వడంతో పాటు బాధ్యతను పెంచాయని చెప్పారు సంగీత దర్శకుడు తమన్. ఇలా శివుడి చిత్రాలకు పని చేయడం వల్ల మానసికంగా చాలా శుద్ధి అవుతుందని తెలిపారు. విజయవంతమైన 'అఖండ' సినిమాకి కొనసాగింపుగా నందమూరి బాలకృష్ణ - బోయపాటి శ్రీను కలయికలో రూపొందిన చిత్రమే 'అఖండ 2: తాండవం'. ఈ చిత్రం ప్రస్తుతం థియేటర్లలో సందడి చేస్తున్న నేపథ్యంలో గురువారం విలేకర్లతో ముచ్చటించారు తమన్.



తమన్

❒ "ఈ ఏడాది నాకు ప్రత్యేకంగా గుర్తుండిపోతుంది. 'గేమ్ ఛేంజర్', 'డాకు మహారాజ్', 'ఓజీ', 'అఖండ 2' వరుసగా చాలా మంచి చిత్రాలు పడ్డాయి. 'ది రాజాసాబ్'తో సంక్రాంతి బరిలోనూ సందడి చేయనున్నా. 'అఖండ 2' విడుదల విషయంలో కొన్ని సమస్యలు ఎదురైనప్పటికీ మేమెక్కడా అధైర్య పడలేదు. ఎందుకంటే బోయపాటి శ్రీను ఆషామాషీ మనిషి కాదు. ఈరోజుల్లో కమర్షియల్ చిత్రాల్ని అందర్నీ నమ్మించగలిగేలా నిలబెట్టడమే చాలా కష్టం. అలాంటిది సనాతన ధర్మాన్ని మూల కథాంశంగా తీసుకుని.. బాలకృష్ణ లాంటి మాస్ స్టార్‌తో దాన్ని కమర్షియల్‌గా చెప్పడమనేది చాలా పెద్ద విషయం. సినిమా చేస్తున్నప్పుడే దీంట్లో అన్నీ బాగా కుదిరాయి అనిపించింది".

❒ "అఖండ'లో శివుడి అంశం అందర్నీ ఆశ్చర్యపరిచింది. దాన్ని అంత గొప్పగా చూపిస్తామని ఎవరూ ఊహించలేదు. దీంతో ఈ రెండో భాగాన్ని ఇంకెంత స్థాయిలో చూపిస్తామోనన్న ఆసక్తి, అంచనాలు ప్రేక్షకుల్లో ఏర్పడిపోయాయి. నిజానికి సీక్వెల్ చిత్రాలకి హైప్ పరంగా ఇది కలిసొచ్చేదే అయినా మరోవైపు ఒకింత శాపం కూడా. సినీప్రియుల్లోని ఈ అంచనాల్ని దృష్టిలో పెట్టుకుని తొలి భాగాన్ని మించి గొప్ప అనుభూతి పంచిచ్చేలా సినిమాని సరిగ్గా ల్యాండ్ చేయడమన్నది చాలా సవాల్‌తో కూడుకున్న పనే. దాన్ని బాలకృష్ణతో కలిసి బోయపాటి శ్రీను విజయవంతంగా చేసి చూపించగలిగారు. అందుకే ఈ చిత్ర విజయం ప్రధానంగా వాళ్లిద్దరికే దక్కుతుంది".

❒ "అఖండ 2'తో పోలిస్తే 'అఖండ'కి సంగీతమందించడమే నాకు ఎక్కువ సవాల్‌గా అనిపించింది. కాకపోతే నేనెక్కువ ప్రయోగాలు చేసింది మాత్రం ఈ రెండో భాగానికే. అఖండ తాండవం.. అనే క్యాప్షన్‌కు తగ్గట్లుగా థియేటర్లలో ప్రేక్షకుల్ని ఎలా తాండవమాడించేలా చేయొచ్చనే దానిపై చాలా వర్క్ చేశాం. కనకవ్వ.. సర్వేపల్లి సిస్టర్స్.. ఐశ్వర్య - సౌందర్య.. ఇలా దాదాపు కొత్త గాయకుల్ని పరిచయం చేసే ప్రయత్నం చేశా.. ఈ చిత్ర పాటలు, బ్యాగ్రౌండ్ స్కోర్‌ను పూర్తి చేయడానికి నాకు 73రోజులు పట్టింది. ఒక్క 'జాజికాయ' పాట మినహా దీంట్లోని మిగతా గీతాలన్నింటినీ సినిమా చూసుకుంటూనే చేశాం. ఈ చిత్ర విషయంలో నేనెక్కడా ఏఐ సాయం తీసుకోలేదు. ఈ చిత్ర ప్రయాణంలో నేను ఆద్యంతం శివాలజీని నమ్ముకున్నా (నవ్వుతూ)".

❒ "ఆఖరి నిమిషంలో 'అఖండ 2' వాయిదా పడటం వల్ల మేమందరం మానసికంగా చాలా నలిగిపోయాం. అలాంటి పరిస్థితి ఎదురవుతుందని మేమెవ్వరూ ఊహించలేదు. చివరి నిమిషం వరకు ఎదురు చూసి సినిమాని ఆపాలని వాళ్లు ముందే ప్రణాళికతో ఉన్నట్లున్నారు. ఒకవేళ మేము సెప్టెంబరు 25న విడుదల చేయాలనుకున్నా.. వాళ్లు ఇదే పని చేసేవారేమో. మా బాధంతా అభిమానుల గురించే. వాళ్లంతా ఎంతో దూరం నుంచి వచ్చి.. థియేటర్లను ముస్తాబు చేసి.. ప్రీమియర్స్‌కు సిద్ధమయ్యారు. కానీ, చివరి నిమిషంలో వాయిదాతో వాళ్లంతా నిరాశగా వెనుదిరగడం బాధించింది. అయితే మా చిత్రం ఎప్పుడు విడుదలైనా దాని బలం దానికి ఉందని మా అందరికీ గట్టి నమ్మకం. ఆ నమ్మకమే ఈరోజు నిజమైంది. ప్రస్తుతం ఓ సినిమా విడుదలవుతుందంటే సామాజిక మాధ్యమాల్లో చాలా విద్వేషం ఎదురవుతోంది. డిజాస్టర్, బాయ్‌కాట్ అని ట్రెండ్ చేస్తున్నారు. నిజానికి అంత ద్వేషం అవసరం లేదు. అదంతా తగ్గాలని నా కోరిక. మనమంతా ఒక్కటి అన్నట్లు కలిసి ఉండాలన్నదే నా తాపత్రయం".

❒ "ప్రభాస్ 'ది రాజాసాబ్' సినిమా నుంచి త్వరలో మరో మూడు పాటలు విడుదల కానున్నాయి. వచ్చే వారం హైదరాబాద్‌లో ఓ భారీ ప్రచార వేడుక నిర్వహించనున్నాం. అలాగే నేను ప్రస్తుతం బాలకృష్ణ 111వ చిత్రానికి సంగీతమందిస్తున్నా. దీనికోసం గోపీచంద్ మలినేని చాలా పెద్ద స్పాన్ ఉన్న కథ సిద్ధం చేశారు. అందులో బాలయ్యతో ఓ పాట పాడించేందుకు అవకాశముంది. ఇంకా దీని గురించి ఆయనతో మాట్లాడలేదు".

ఈ విజయాన్ని ఊహించలేదు



విక్రాంత్ మాస్సే

"2024వ సంవత్సరం నేను పడిన కష్టానికి ప్రతిఫలాన్నిచ్చింది. అందుకే గతేడాదిని ఎప్పటికీ సంతోషంగా గుర్తుంచుకుంటాన''ని అంటున్నారు విక్రాంత్ మాస్సే. 2023లో విడుదలైన 'ట్వెల్త్ ఫెయిల్' సినిమాతో జాతీయ స్థాయిలో ఉత్తమ నటుడిగా నిలిచి.. పలు పురస్కారాల్ని, ప్రశంసల్ని సొంతం చేసుకున్నారీయన. ప్రస్తుతం కథల ఎంపికలో ఆచితూచి అడుగులేస్తున్న విక్రాంత్ ఓ ఇంటర్వ్యూలో పాల్గొని 'ట్వెల్త్ ఫెయిల్' సినిమా గురించి ఆనాటి సంగతుల్ని గుర్తుచేసుకున్నారు. "నిజం చెప్పాలంటే ఆ సినిమా విడుదలైనప్పుడు ఇంతటి విజయాన్ని అందుకుంటామని ఊహించలేదు. ఇది 2023 ఆఖర్లో థియేటర్లలోకి వచ్చింది. దీన్ని ప్రేక్షకులు ఆదరించే సమయానికి మేము 2024కి వచ్చేశాం. అందుకే నాకు గతేడాది చాలా ప్రత్యేకం. ఇది హిందీ సినిమాకూ గొప్ప సంవత్సరాల్లో ఒకటని నేను భావిస్తున్నాన''ని అన్నారు. ప్రస్తుతం 'వైట్' చిత్రంతో బిజీగా గడుపుతున్నారు విక్రాంత్.

కథానాయిక అంటే అందంగానే కనిపించాలా?

"ఒక సినిమాలో భిన్న గెటప్పుల్లో కనిపించే అవకాశం నటులకు చాలా తక్కువసార్లు వస్తుంటుంది. అలాంటి అరుదైన అవకాశం నాకు 'గుర్రం పాపిరెడ్డి' సినిమాతో లభించింది'' అన్నారు ఫరియా అబ్దుల్లా. 'జాతిరత్నాలు' సినిమాతో తెలుగు ప్రేక్షకుల మనసుల్లో చిట్టిగా నిలిచిపోయిన కథానాయిక ఈమె. ఇటీవల నరేశ్ అగస్త్యతో కలిసి చేసిన సినిమానే 'గుర్రం పాపిరెడ్డి'. మురళీ మనోహర్ దర్శకత్వం వహించగా, వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మించారు. ఈ చిత్రం ఈరోజే ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా ఫరియా గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. ఆ విషయాలివీ...



ఫరియా అబ్దుల్లా

"నాకు హాస్య ప్రధానమైన సినిమాలంటే ఎంతో ఇష్టం. అలాంటి సినిమాల్లో నటించే అవకాశాలు వచ్చిన ప్రతిసారీ కాదనకుండా నటిస్తున్నా. 'గుర్రం పాపిరెడ్డి' కథ వినగానే ఇందులో హాస్యం ఎలా ఉంటుందో ఊహించగలిగా. థ్రిల్లింగ్ అంశాలూ ఉంటాయి. ఈ తరహా డార్క్ కామెడీ సినిమాలు చాలా బాగుంటాయి. ఇందులో నేను సౌధామిని అనే యువతిగా కనిపిస్తా. డాక్టర్ చదువుకోవాలనుకుని, నర్స్‌గా పనిచేసే అమ్మాయి సౌధామిని. ఆ క్రమంలోనే గుర్రం పాపిరెడ్డి పరిచయమై ఆమె కథని మార్చేస్తాడు. తన గ్యాంగ్‌తో కలిసి సౌధామిని ఒక దోపిడీలో భాగం కావాల్సి వస్తుంది. ఆ తర్వాత ఏం జరిగిందన్నది తెరపైనే చూడాలి. దర్శకుడు మురళీమనోహర్, నిర్మాతలూ సినిమా అంటే తపన ఉన్న వ్యక్తులు. ఎక్కడా రాజీపడకుండా అనుకున్నట్టుగానే చిత్రాన్ని తెరపైకి తీసుకొచ్చారు".

❒ "ఈ సినిమాలో రెండు గెటప్పుల్లో కనిపిస్తా. ప్రాస్థెటిక్ మేకప్‌తో ఓ గెటప్‌లో కనిపిస్తా. వేసవిలో రోజూ గంటకుపైగా సమయం కేటాయించి ఆ మేకప్ వేసుకుని, రోజంతా నటించాల్సి వచ్చేది. అదంతా ఒక అనుభవం. నటులు ప్రతి ఒక్కరికీ అలాంటి అనుభవం ఉండాలని కోరుకుంటా. ఆ గెటప్‌లోనే సెట్‌లో బ్రహ్మానందంకి ఎదురుపడ్డా. కానీ ఆయన గుర్తు పట్టలేకపోయారు. 'జాతిరత్నాలు' చిట్టిని అని ప్రత్యేకంగా చెప్పాల్సి వచ్చింది. అప్పుడు ఆయన ఆశ్చర్యపోయారు. చిట్టి పాత్రకీ, సౌధామిని పాత్రకీ మధ్య ఎలాంటి పోలికలు ఉండవు. చిట్టి అమాయకురాలైతే, సౌధామిని మాత్రం తెలివైన అమ్మాయి. నరేశ్ అగస్త్య మంచి సహనటుడు. తనలోనూ మంచి రచయిత ఉన్నాడు. నాకూ భవిష్యత్తులో దర్శకత్వం చేయాలని ఉంది. దాంతో సెట్‌లో సమయం దొరికినప్పుడల్లా మా ఆలోచనల్ని పంచుకునేవాళ్లం. అలా ఒక స్క్రిప్ట్ తయారవుతోంది".

❒ "ఏదోటి చెయ్... అనే డైలాగ్‌తో ఈ సినిమాలో సందడి చేస్తుంటా. నా వ్యక్తిగత జీవితంలో నేను తరచూ అనుకునే మాట... 'ఏదో ఒకటి చేయాలి...' అని! సినిమాలో హీరో ఉన్నట్టు వ్యక్తిగత జీవితంలో నా పక్కన ఎవ్వరూ ఉండరు కదా, ఏం చేసినా నేనే చేయాలి కాబట్టి, 'ఏదో ఒకటి చేయాలి...' అనుకుంటూ నాకు నేను ప్రేరణ పొందుతుంటా. అన్ని రకాల జానర్స్ సినిమాల్లో నటించాలనేది నా కోరిక. హీరోయిన్ అంటే అందంగానే కనిపించాలా... ఏంటీ? అందుకే యాక్షన్ హీరోయిన్, సీరియల్ కిల్లర్... ఇలా చీకటి కోణాల్ని ఆవిష్కరించే పాత్రలన్నా ఇష్టమే. చిట్టి తర్వాత అందుకు దీటైన పాత్రలు రాలేదనే అసంతృప్తి నాలో ఎప్పుడూ లేదు. ఒక సినిమా చేశాక దాన్నుంచి పూర్తిగా బయటికొచ్చి పని చేస్తుంటా. ప్రస్తుతం 'భగవంతుడు', 'గాయపడ్డ సింహం' తదితర చిత్రాల్లో నటిస్తున్నా".

శంబాల సంగీత ప్రయాణం ప్రత్యేకం!



శ్రీచరణ్

"ప్రేక్షకుల్ని ఒక కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లే 'శంబాల' కోసం ఆస్ట్రేలియా, మెక్సికో నుంచి తెప్పించిన కొన్ని ప్రత్యేకమైన వాయిద్య పరికరాల్ని ఉపయోగించి సంగీతం సమకూర్చాం'' అన్నారు శ్రీచరణ్ పాకాల. థ్రిల్లర్ సినిమాలకి పెట్టింది పేరైన సంగీత దర్శకుడు ఈయన. తన కెరీర్‌లో యాభై సినిమాల మైలురాయికి చేరువయ్యారు. ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానున్న 'శంబాల' ఆయనకు 49వ చిత్రం. ఆది సాయికుమార్ కథానాయకుడిగా... యుగంధర్ ముని దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. ఈ సందర్భంగా శ్రీచరణ్ పాకాల గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటిస్తూ.. "విజ్ఞాన శాస్త్రానికీ, నమ్మకానికీ మధ్య జరిగే కథ ఇది. పురాణాలతో ముడిపడిన ఇలాంటి ఓ థ్రిల్లర్ కథకు స్వరాలు సమకూర్చడం ఎంతో ప్రత్యేకం. ఇందులో మొత్తం నాలుగు పాటలు ఉన్నాయి. మా బృందం ఎంతో తపనతో చేసిన సినిమా ఇది. 'శంబాల' నాకు 49వ చిత్రం అయితే, 'అనుమానపు పక్షి' యాభయ్యో సినిమా. ఈ రెండూ నాకు ఎంతో ప్రత్యేకం. థ్రిల్లర్ సినిమాల్లో సంగీతం ప్రేక్షకుల్ని కథలోకి తీసుకెళ్లడమే కాకుండా, అప్పుడప్పుడూ వాళ్లని తప్పుదారి పట్టిస్తూ ఆశ్చర్యపరుస్తూ ఉండాలి. అప్పుడే ప్రేక్షకుడిలో ఉత్కంఠ మొదలవుతుంది. నేను వాయిద్య పరికరాల కంటే కూడా మౌత్ పర్కషన్స్ (నోటితో చేసే శబ్దాలు), విభిన్నమైన సౌండ్స్‌తో నేపథ్య సంగీతం అందించడానికి ప్రయత్నిస్తుంటా'' అన్నారు.

భయపెడుతూనే.. నవ్వించే జిన్



చిన్మయ్ రామ్

"ప్రేక్షకులు పెట్టే డబ్బులకు సరిపడా వినోదాన్ని అందించే సినిమా 'జిన్'' అన్నారు దర్శకుడు చిన్మయ్ రామ్. ఆయన దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అమిత్ రావ్, పర్వేజ్ సింబా, ప్రకాశ్ తుమినాడ్, సంగీత ప్రధాన పాత్రలు పోషించారు. నిఖిల్ ఎం గౌడ నిర్మించారు. ఈ సినిమా ఈరోజు విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు చిన్మయ్ మాట్లాడుతూ.. "చాలా కొత్త కాన్సెప్ట్‌తో రూపొందిన హారర్ చిత్రమిది. థియేటర్లో కూర్చున్న ప్రేక్షకుణ్ని భయపెడుతూనే ఆద్యంతం అలరిస్తుంది. దీన్ని ఆదరిస్తే 'జిన్ 2' చేయాలన్న ఆలోచనలో ఉన్నాం. ఇప్పటికే స్క్రిప్ట్ కూడా సిద్ధమైంది. ఈ సినిమా చేస్తున్నప్పుడు మాకు చాలా వింత అనుభవాలు ఎదురయ్యాయి. ఇదంతా జిన్ ప్రభావమేనని మా టీమ్ అనుకునేవాళ్లు'' అన్నారు.

క్లైమాక్స్ భావోద్వేగభరితం



బుచ్చిబాబు, అనూప్ రూబెన్స్, పాయల్

అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ ప్రధాన పాత్రధారులుగా ఫణి ప్రదీప్ ధూళిపూడి తెరకెక్కించిన చిత్రం 'బ్యాడ్ గాళ్స్'. శశిధర్ నల్ల, ఇమ్మడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేశ్ నిర్మించారు. రేణు దేశాయ్ ప్రత్యేక పాత్ర పోషించింది. మొయిన్, రోహన్ సూర్య ముఖ్య పాత్రల్లో నటించారు. ఈ సినిమా ఈనెల 25న రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల దర్శకుడు బుచ్చిబాబు సానా ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఈ కథ నాకు తెలుసు. క్లైమాక్స్ చాలా భావోద్వేగభరితంగా ఉంటుంది. దీనికి అనూప్ రూబెన్స్ మంచి పాటలిచ్చారు'' అన్నారు.

ఉంగరాల జుట్టు వల్ల అవకాశాలు కోల్పోయా!



తాప్సీ

బాల్యంలో తన జుట్టు అంతగా నచ్చకపోయేదని అంటోంది అందాల తార తాప్సీ. వైవిధ్యమైన కథలతో ప్రేక్షకుల్ని అలరించే కథానాయికీమె. వ్యక్తిగత విషయాల గురించి అభిమానులతో తక్కువగా పంచుకునే ఈ భామ.. తన ఉంగరాల జుట్టు కారణంగా కెరీర్ తొలినాళ్లలో చాలా సవాళ్లు ఎదుర్కొన్నట్లు తెలిపింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న తాప్సీ మాట్లాడుతూ.. "ప్రారంభ రోజుల్లో ప్రతి దర్శకుడు నా జుట్టును స్ట్రెయిట్ చేయించుకోమని చెప్పేవారు. ఎందుకంటే నా రింగుల జుట్టు కేవలం యాక్షన్ పాత్రలకే సరిపోతుందని, మంచి అమ్మాయి పాత్రలకు పనికిరాదనేది వారి అభిప్రాయం. అందుకే కొన్ని పరిస్థితుల్లో దర్శకులు చెప్పినట్లు జుట్టును స్ట్రెయిట్ చేయించుకునేదాన్ని. అవకాశాలు కూడా కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి. రోజులు గడుస్తున్న కొద్దీ.. నా హెయిర్‌ను ఎలా సెట్ చేసుకోవాలో నేర్చుకొని.. దాన్ని ప్రేమించడం మొదలు పెట్టా. నెమ్మదిగా దర్శకులకూ నా జుట్టు ఎంత ప్రత్యేకమైనదో గ్రహించేలా చేశా. ఇప్పుడు నేను ఏ పాత్రలో నటించినా.. నా సహజమైన రింగుల జుట్టునే ఉంచమని కోరుతున్నారు. సినిమాల్లోనే కాదు.. కొన్ని బ్రాండ్లు నాతో పనిచేయడానికి ఆసక్తి చూపినా.. నా జుట్టును ఇష్టపడలేదు. కానీ నాకు ఉంగరాల జుట్టు ఒక వరమని అర్థం చేసుకోవడానికి కొంత సమయం పట్టింద''ని చెప్పుకొచ్చింది.

మరో కొత్త జోడీ రెడీ?



సల్మాన్ ఖాన్



కృతి సనన్


తేరే ఇష్క్ మే' చిత్రంతో ఇటీవలే తెరపై సందడి చేసింది బాలీవుడ్ కథానాయిక కృతి సనన్. ఇందులో ప్రేమికురాలిగా అలరించిన ఈమె.. ఇప్పుడు మరో కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. సల్మాన్ ఖాన్ హీరోగా 'కిక్ 2' రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ చిత్రంలో కథానాయికగా కృతిసనన్‌ను ఎంపిక చేసే పనిలో ఉందట చిత్రబృందం. "నిర్మాత సాజిద్ నడియాడ్‌వాలా.. ఈ సినిమాను త్వరలో సల్మాన్ పుట్టిన రోజు సందర్భంగా అధికారికంగా ప్రకటించనున్నారు. మరోవైపు సల్మాన్ సరసన నటించడానికి కృతి సనన్ అయితేనే సరిగ్గా సరిపోతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే.. బాలీవుడ్‌లో మరో కొత్త జంట తెరపైకి వచ్చే అవకాశాలున్నాయ''ని సల్మాన్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి కృతి 'కిక్ 2'లో సందడి చేస్తుందో లేదో తెలుసుకోవాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.



ఖాతాదారు ప్రమేయం లేకుండా.. డీమ్యాట్ ఖాతా నుంచి షేర్ల బదిలీ

- డీపీ తప్పునకు డిపాజిటరీ సంస్థ బాధ్యత వహించాల్సిందే
- వడ్డీతో పాటు పరిహారం చెల్లించాలి
- బాంబే హైకోర్టు సంచలన తీర్పు

భర్త చనిపోయి పుట్టెడు శోకంలో ఉన్న ఒక మహిళను స్టాక్‌మార్కెట్ వ్యవస్థలోని కొన్ని విభాగాలు తీవ్ర ఇబ్బందులకు గురి చేశాయి. అయినా ఆమె పట్టువిడకుండా పోరాడి న్యాయం దక్కించుకున్నారు. తన భర్త, తనకు ఉన్న డీమ్యాట్ ఖాతాలోని షేర్లను తన ప్రమేయం లేకుండా బదిలీ చేసి, తమను మోసం చేశారని, ఆ షేర్లను తిరిగి ఇప్పించాలని, కాబట్టి తమకు న్యాయం చేయాలంటూ' ఆమె ఎక్కని గడప లేదు, కొట్టని తలుపు లేదు. చివరికి న్యాయస్థానం ఆమె మొర ఆలకించింది. న్యాయం ఆమె వైపే ఉందని నిర్ధారించింది. డీపీలు (డిపాజిటరీ పార్టిసిపెంట్స్) చేసే తప్పులు, నిర్లక్ష్యపూరిత చర్యలకు డిపాజిటరీలు బాధ్యత వహించాల్సిందేనని బాంబే హైకోర్టు తీర్పు చెప్పింది. ఆమెకు చెందాల్సిన షేర్ల విలువ రూ.86 లక్షలను, 9% వడ్డీతో కలిపి చెల్లించాలని ఆదేశించింది.



ఈ ఉదంతం పూర్వాపరాలు ఇలా ఉన్నాయి

ముంబయికి చెందిన దక్షా నరేంద్ర భవిసార్ 2018లో బీఆర్‌హెచ్ వెల్త్ క్రియేటర్స్ అనే డిపాజిటరీ సేవల సంస్థ వద్ద డీమ్యాట్ ఖాతా తెరిచారు. సీడీఎస్ఎల్ (సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ లిమిటెడ్) కు ఈ సంస్థ డిపాజిటరీ పార్టిసిపెంట్‌గా సేవలు అందిస్తోంది. ఆ డీమ్యాట్ ఖాతాలో, తమ కొనుగోలు చేసిన షేర్లను భద్రపరుచుకున్నారు. తర్వాత ఆమె భర్త కాలం చేశారు. ఖాతా తెరిచే సమయంలోనే తన భర్తతో కలిసి ఆమె బీఆర్‌హెచ్ వెల్త్ వ్యవహారాలకు సంబంధించిన 'పవర్ ఆఫ్ అటార్నీ' మీద సంతకాలు చేశారు. దాన్ని ఆధారంగా చేసుకుని, బీఆర్‌హెచ్ వెల్త్ ఆ ఖాతాలోని షేర్లను తన సొంత క్లియరింగ్/ ట్రేడింగ్ మెంబర్ ఖాతాలకు బదిలీ చేసింది. తర్వాత ఆ షేర్లను తనఖా పెట్టి, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి రుణం తీసుకుంది. కానీ ఆ అప్పు తిరిగి చెల్లించలేదు. దీంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఆ షేర్లను స్వాధీనం చేసుకుని, విక్రయించింది. బీఆర్‌హెచ్ వెల్త్ ఇదే విధంగా దాదాపు 9,493 మంది మదుపరుల షేర్లను తమ సొంత ఖాతాలకు మళ్లించి, ఆ షేర్లను తనఖా పెట్టి, అప్పులు తీసుకుని ఎగవేసింది.

- ఈనాడు, హైదరాబాద్

ఇంత పోరాటం

తమ ఖాతాలోని షేర్లు మాయమైపోవడంతో.. దక్షా నరేంద్ర భవిసార్ తొలుత నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ)ని ఆశ్రయించారు. ఎక్స్ఛేంజీ ద్వారా షేర్ల విక్రయాలు జరిగినందు వల్ల, ఈ విషయంలో తాము చేయగలిగింది ఏదీ లేదని ఎన్ఎస్ఈ బదులిచ్చింది. దీనిపై ఆమె సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. బీఆర్‌హెచ్ వెల్త్ సీడీఎస్ఎల్ డీపీగా ఉన్న సమయంలో షేర్ల అక్రమ బదిలీ, వాటిని అప్పు తీసుకోవడం జరిగినందున.. దీనికి సీడీఎస్ఎల్ బాధ్యత వహించి, కోల్పోయిన షేర్ల విలువను బాధితురాలికి చెల్లించాలని ట్రైబ్యునల్ తీర్పు ఇచ్చింది.

● ఈ తీర్పును బాంబే హైకోర్టులో సీడీఎస్ఎల్ సవాలు చేసింది. బీఆర్‌హెచ్ వెల్త్ బ్రోకర్‌గా మాత్రమే వ్యవహరించిందని, అందుకు సీడీఎస్ఎల్ బాధ్యత వహించవలసిన అవసరం లేదని పేర్కొంది. ఆ షేర్లను బీఆర్‌హెచ్ వెల్త్, డీమ్యాట్ ఖాతా నుంచి తనఖా పెట్టి అప్పు తీసుకున్నందున, క్లయింటు నుంచి రుణ అభ్యర్థన దరఖాస్తు అవసరం లేదని పేర్కొంది.

● ఈ వాదనలను హైకోర్టు న్యాయమూర్తి తిరస్కరించారు. ఎటువంటి విక్రయం జరగకుండానే షేర్లను బదిలీ చేశారు. బీఆర్‌హెచ్ వెల్త్ డీపీగా ఉండటం వల్లనే ఇది సాధ్యమైందని న్యాయమూర్తి పేర్కొన్నారు. డిపాజిటరీస్ చట్టంలోని సెక్షన్- 16 ప్రకారం, డీపీ నిర్లక్ష్య చర్యల వల్ల కలిగే నష్టాలకు డిపాజిటరీ సమాధానం చెప్పాలని, చట్టబద్ధమైన భద్రత (ఇండెమ్నిటీ) వర్తిస్తుందని స్పష్టం చేశారు. బీఆర్‌హెచ్ వెల్త్ మోసం చేసినట్లు స్పష్టంగా కనిపిస్తోందని, షేర్ల బదిలీతో ప్రారంభమైన ఈ మోసం 'తనఖా పెట్టడం, అప్పు తీసుకోవడం, తిరిగి చెల్లించకపోవడం' వరకు కొనసాగినట్లు వివరించారు. ఆవిధంగానే దాదాపు 9,493 మంది ఖాతాదార్ల షేర్లను తన డీపీ అయిన బీఆర్‌హెచ్ వెల్త్ బదిలీ చేస్తుంటే, దానికి సీడీఎస్ఎల్ అనుమతి ఇచ్చిందని వ్యాఖ్యానించారు. అందువల్ల ట్రైబ్యునల్ తీర్పును సమర్థిస్తూ, బాధితురాలైన దక్షా నరేంద్ర భవిసార్‌కు షేర్ల విలువ మొత్తం రూ.86 లక్షలను, 9% వడ్డీతో కలిపి చెల్లించాలని సీడీఎస్ఎల్‌ను ఆదేశించారు.

ఇది మేల్కొలుపు

స్టాక్ బ్రోకర్లు, డిపాజిటరీలు, డీపీలు చేసే తప్పుల వల్ల నష్టపోయిన మదుపరులకు ఈ తీర్పు ఎంతో మేలు చేస్తుందని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. బీఆర్‌హెచ్ వెల్త్ క్రియేటర్స్, కార్వీ స్టాక్‌బ్రోకింగ్, అనుగ్రహ.. వంటి సంస్థల చర్యల వల్ల నష్టపోయిన ఎంతో మందికి దారి చూపుతుందని పేర్కొంటున్నాయి.

ఎంటార్ టెక్‌కు రూ.310 కోట్ల కైగా అణు విద్యుత్తు రియాక్టర్ ఆర్డర్

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఎంటార్ టెక్నాలజీస్‌కు, కర్ణాటకలో కైగా అణువిద్యుత్తు ప్లాంట్‌కు సంబంధించిన న్యూక్లియర్ రియాక్టర్ల ఆర్డర్ లభించింది. దీని విలువ రూ.310 కోట్లు. హైదరాబాద్‌కే చెందిన ఎంఈఐఎల్ గ్రూపు నుంచి ఈ ఆర్డర్ దక్కించుకుంది. కైగా అణువిద్యుత్తు ప్లాంట్‌కు సంబంధించిన రూ.194 కోట్ల ఆర్డర్ ఈ సంస్థకు కొద్ది రోజుల క్రితమే లభించింది. దీనికి అదనంగా రూ.310 కోట్ల ఆర్డర్ లభించిందని, 2030 ఫిబ్రవరి నాటికి ఈ ఆర్డర్లు పూర్తి చేయాల్సి ఉందని ఎంటార్ టెక్నాలజీస్ ఎండీ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

3 కొత్త మోడళ్లు తెస్తాం: నిస్సాన్

వచ్చే 14-16 నెలల్లో 3 కొత్త మోడళ్లు ఆవిష్కరించడం ద్వారా, భారత్‌లో మరింతగా విస్తరిస్తామని జపాన్ వాహన దిగ్గజం నిస్సాన్ గురువారం వెల్లడించింది. కొత్తగా తీసుకురాబోతున్న 7-సీట్ల ఎంపీవీ (బహుళ వినియోగ వాహనం) మోడల్‌కు 'గ్రావిటే' పేరు ఖరారు చేసినట్లు తెలిపింది. 2026-27లో విక్రయాల నెట్‌వర్క్‌ను 155 నుంచి 250 విక్రయశాలలకు తీసుకెళతామని పేర్కొంది. గ్రావిటేని 2026 ప్రారంభంలో, మధ్యస్థాయి స్పోర్ట్స్ వినియోగ వాహనం (ఎస్‌యూవీ) టెక్టాన్‌ను 2026 మధ్యలో, మరో 7 సీట్ల ఎస్‌యూవీ మోడల్‌ను 2027 ప్రారంభంలో విడుదల చేస్తామని వెల్లడించింది.

జనవరి నుంచి 2% ధరల పెంపు: ఎంజీ మోటార్: జనవరి 1 నుంచి తన వాహన ధరలను 2% వరకు పెంచనున్నట్లు జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ తెలిపింది. మోడల్, వేరియంట్ బట్టి ధరల పెంపు ఉంటుంది. ఉత్పత్తి ఖర్చులు పెరుగుతుండటంతో పాటు, రూపాయి మారకపు విలువ తదితర కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

పార్లమెంటరీ స్థాయీ సంఘానికి సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్ బిల్లు

దిల్లీ: సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్ బిల్లును, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. మరింత పరిశీలన కోసం స్థాయీ సంఘానికి ఈ బిల్లును పంపాలని ప్రతిపాదించారు. బిల్లును సభలో ప్రవేశపెట్టే దశలోనే అరుణ్ నెహ్రూ (డీఎంకే), మనీష్ తివారీ (కాంగ్రెస్) వ్యతిరేకించారు. ఒకే సంస్థకు ఎక్కువ అధికారాలు ఇచ్చేలా ఉన్న ఈ బిల్లు, అధికారాల విభజన సూత్రానికి విరుద్ధమని విమర్శించారు.

సెబీ బోర్డులో సభ్యుల సంఖ్య 15కు పెంపు!: సెబీ బోర్డులో సభ్యుల సంఖ్యను ప్రస్తుత 9 నుంచి 15కు (ఛైర్‌పర్సన్ సహా) విస్తరించడం ద్వారా దాని నియంత్రణ యంత్రాంగాన్ని బలోపేతం చేయడానికి సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్ బిల్లు ప్రయత్నిస్తుంది.

కోడి గుడ్లు

19న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)
(100కు రూపాయలలో)

హైదరాబాద్	650
వరంగల్	652
విజయవాడ	700
తూ/ప గోదావరి	675
విశాఖపట్నం	675
చిత్తూరు	688

రిలయన్స్ కన్జూమర్ ప్రోడక్ట్స్ చేతికి ఉదయమ్స్ ఆగ్రో ఫుడ్స్

రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన ఎఫ్‌ఎమ్‌సీజీ విభాగం రిలయన్స్ కన్జూమర్ ప్రోడక్ట్స్ (ఆర్‌సీపీఎల్), తమిళనాడుకు చెందిన ఉదయమ్స్ ఆగ్రో ఫుడ్స్‌లో మెజారిటీ వాటా సొంతం చేసుకుంది. ఉదయమ్స్ ప్రమోటర్లు ఎస్ సుధాకర్, ఎస్ దినకర్ మైనారిటీ వాటాతో కొనసాగుతారు. దేశ వినియోగదార్లకు అందుబాటు ధరల్లో, అంతర్జాతీయ నాణ్యతతో ఉత్పత్తులను అందించడానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని ఆర్‌సీపీఎల్ పేర్కొంది. ఈ కొనుగోలు అనంతరం టాటా కన్జూమర్ ప్రోడక్ట్స్‌తో పాటు, ఐడీ ఫ్రెష్, ఓర్క్లాకు చెందిన ఎమ్‌టీఆర్‌లకు ఆర్‌సీపీఎల్ పోటీనివ్వనుంది. మూడు దశాబ్దాలకు పైగా 'ఉదయమ్' బ్రాండ్ కింద బియ్యం, సుగంధ ద్రవ్యాలు, స్నాక్స్, ఇడ్లీ పిండి వంటి వాటిని ఉదయమ్స్ ఆగ్రో ఫుడ్స్ తమిళనాడులో విక్రయిస్తోంది.


పసిడి బాండ్లపై 366% ప్రతిఫలం

2017-18లో జారీ చేసిన 12వ విడత సార్వభౌమ పసిడి బాండ్ల (ఎస్‌జీబీ) తుది రిడెమ్షన్ ధరను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గురువారం ప్రకటించింది. ఒక్కో గ్రాము ధరను రూ.13,245గా నిర్ణయించింది. ఈ నెల 15, 16, 17 తేదీల్లో 999 స్వచ్ఛత కలిగిన బంగారం, సగటు ధర ఆధారంగా ఈ బాండ్లకు తుది ధరను ఆర్‌బీఐ వెల్లడించింది. 2017 డిసెంబరు 18న జారీ చేసిన ఈ పసిడి బాండ్ల ధర అప్పట్లో గ్రాముకు రూ.2,840. అంటే మదుపర్లకు ఒక్కో గ్రాముపై రూ.10,405 (366%) ప్రతిఫలం లభించింది. ఈ బాండ్లపై ఏటా లభించిన 2.5% వడ్డీ అదనం.

ఏఎం గ్రీన్, మిత్సుయ్ భాగస్వామ్య ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఏఎం గ్రీన్, జపాన్ దిగ్గజ సంస్థ మిత్సుయ్ అండ్ కంపెనీ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇంధన విభాగంలో సహకారంతో పాటు గ్రీన్ అల్యూమినియం విభాగంలో సంయుక్తంగా పెట్టుబడులు పెట్టడం, కలిసి పనిచేయడం ఈ ఒప్పంద ఉద్దేశం. దీని ప్రకారం ఏఎం గ్రీన్ చేపట్టే గ్రీన్ అల్యూమినియం ప్రాజెక్టుల్లో మిత్సుయ్ పెట్టుబడులు పెడుతుంది. ఏఎం గ్రీన్ అనుబంధ సంస్థ ఏఎం గ్రీన్ మెటల్స్ 1 మిలియన్ టన్నుల సామర్థ్యం గల అల్యూమినియం స్మెల్టర్‌ను నిర్మిస్తోంది. దీంతో పాటు 2 మి.టన్నుల అల్యూమినా రిఫైనరీ, మైనింగ్ సామర్థ్యాన్ని సమకూర్చుకుంటోంది. దీనిపై ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఏఎం గ్రీన్‌ను గ్రీన్‌కో సంస్థ వ్యవస్థాపకులైన అనిల్ చలమలశెట్టి, మహేష్ కొల్లి నెలకొల్పారు. 2030 నాటికి 5 మి.టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలని ఈ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.

సిమెంటు ఉత్పత్తిదార్ల సంఘం అధ్యక్షుడిగా పార్థ్ జిందాల్



ఈనాడు, హైదరాబాద్: సిమెంటు ఉత్పత్తిదార్ల సంఘం (సీఎంఏ) అధ్యక్షుడిగా జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ ఎండీ పార్థ్ జిందాల్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా జేకే సిమెంట్ ఎండీ రాఘవ్‌పత్ సింఘానియాను ఎన్నుకున్నారు. గురువారం జరిగిన సీఎంఏ వార్షిక సభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. దాదాపు 60 సంవత్సరాలుగా కార్యకలాపాలు సాగిస్తున్న సీఎంఏకు అధ్యక్షుడిగా ఎన్నికైన అతిపిన్న వయస్కుడు పార్థ్ జిందాల్ (35). కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తూ, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు అండగా నిలుస్తామని పార్థ్ తెలిపారు.

ఎయిర్‌టెల్ ఎండీ, సీఈఓగా శాశ్వత్ శర్మ

జనవరి 1న బాధ్యతల స్వీకరణ



దిల్లీ: భారతీ ఎయిర్‌టెల్ మేనేజింగ్ డైరెక్టరు (ఎండీ), ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ)గా శాశ్వత్ శర్మ 2026 జనవరి 1న బాధ్యతలు చేపట్టనున్నారు. అయిదేళ్ల పాటు ఆయన ఈ పదవిలో ఉంటారు. 'ప్రస్తుతం శాశ్వత్ శర్మ ఎయిర్‌టెల్ వినియోగదారు వ్యాపార విభాగానికి నేతృత్వం వహిస్తున్నారు. మిగతా అన్ని వ్యాపార విభాగాలు, కార్యకలాపాలను లోతుగా అర్థం చేసుకునేందుకు, ప్రస్తుత ఎండీ గోపాల్ విత్తల్‌తోనూ కలిసి పనిచేశారు. ఇంతకుముందు ఎయిర్‌టెల్‌కు సీఓఓగానూ శర్మ బాధ్యతలు నిర్వహించారని స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఎయిర్‌టెల్ తెలిపింది.

ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్‌గా గోపాల్ విత్తల్

ప్రస్తుతం ఎండీ, వైస్‌ఛైర్మన్ హోదాలో ఉన్న గోపాల్ విత్తల్ 2026 జనవరి 1 నుంచి భారతీ ఎయిర్‌టెల్‌కు ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. కంపెనీ, దాని అనుబంధ సంస్థలను పర్యవేక్షిస్తారు. ఈయన కూడా కొత్త హోదాలో అయిదేళ్లుంటారు. 'కంపెనీ వృద్ధి జోరును గోపాల్, శాశ్వత్ ఇద్దరూ కలిసి ముందుకు తీసుకెళ్తారనడంలో సందేహం లేద'ని భారతీ ఎయిర్‌టెల్ ఛైర్మన్ సునీల్ భారతీ మిత్తల్ తెలిపారు. భారతీ ఎయిర్‌టెల్ గ్రూపునకు ముఖ్య ఆర్థిక అధికారిగా (సీఎఫ్ఓ) సౌమెన్ రాయ్ నియమితులయ్యారు. ఈయన నాలుగేళ్లుగా భారతీ ఎయిర్‌టెల్ భారత కార్యకలాపాల విభాగానికి సీఎఫ్ఓగా ఉన్నారు. భారతీ ఎయిర్‌టెల్ ఇండియాకు సీఎఫ్ఓగా అఖిల్ గార్గ్ నియామకానికీ బోర్డు ఆమోదం తెలిపింది. గార్గ్, సౌమెన్ తమ కొత్త బాధ్యతలను 2026 జనవరి 1న చేపడతారు.

4 నెలల్లో 40 లక్షల వార్షిక ఫాస్ట్‌ట్యాగ్ పాసుల జారీ

దిల్లీ: ఈ ఏడాది ఆగస్టు నుంచి (నాలుగు నెలల్లో) సుమారుగా 40 లక్షల వార్షిక ఫాస్ట్‌ట్యాగ్ పాస్‌లు జారీ చేసినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరి తెలిపారు. 2026 కల్లా దేశవ్యాప్తంగా ఆటోమేటిక్ టోల్ కలెక్షన్ పద్ధతి అమలు కానున్నట్లు వెల్లడించారు. వార్షిక టోల్‌పాస్ కింద ఒకేసారి రూ.3,000 చెల్లిస్తే, ఒకే టోల్‌కి సుమారు రూ.15 చొప్పున. 200 టోల్ ప్లాజాలను దాటే అవకాశం ప్రైవేట్ కార్లకు ఈ పాస్ వల్ల కలుగుతోంది. విడిగా అయితే ఇందుకు రూ.15,000 వరకు అవుతుంది. 2026 కల్లా దేశంలోని జాతీయ రహదారులపై ఉన్న 1,050 టోల్ ప్లాజాల్లో, వాహనం ఆగకుండానే ఆటోమేటిక్ టోల్ కలెక్షన్ జరగడానికి ఆధునాతన కృత్రిమ మేధ (ఏఐ) వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

6% పెరిగిన యాక్సెంచర్ ఆదాయం

దిల్లీ: ఐటీ సేవలు, కన్సల్టింగ్ సంస్థ యాక్సెంచర్.. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) సెప్టెంబరు-నవంబరు త్రైమాసికంలో 18.7 బిలియన్ డాలర్ల (దాదాపుగా రూ.1,68,000 కోట్ల) ఆదాయాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25) ఇదే త్రైమాసిక ఆదాయంతో పోలిస్తే ఇది 6% ఎక్కువ. సంస్థ సెప్టెంబరు - ఆగస్టును ఆర్థిక సంవత్సరంగా పరిగణిస్తుంది. స్థూల లాభం 32.9% నుంచి 33.1 శాతానికి పెరిగిందని పేర్కొంది. అమెరికా నుంచి ఆదాయం 4% పెరిగి 9.08 బిలియన్ డాలర్లకు, ఐరోపా, పశ్చిమాసియా, ఆఫ్రికా (ఈఎంఈఏ) ఆదాయం 8% పెరిగి 6.94 బి.డాలర్లకు, ఆసియా పసిఫిక్ ఆదాయం 7% పెరిగి 2.73 బి.డాలర్లకు చేరినట్లు సంస్థ తెలిపింది.

✦ కొత్త బుకింగ్‌లు 12% పెరిగి, 20.9 బిలియన్ డాలర్లకు చేరాయి.

ఒమన్‌తో ఒప్పందం.. ఇదీ లాభం

● మన ఎగుమతుల్లో 98 విభాగాలపై సుంకం ఉండదు ● మారిటైం, ఇంధనంలో వ్యూహాత్మక ప్రయోజనాలు



భారత్, ఒమన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) వల్ల మన దేశం ఎగుమతి చేస్తున్న ఉత్పత్తుల్లో 98 రకాలకు ఇకపై సుంకం ఉండదు. ఒమన్‌కు ఎగుమతి అవుతున్న 99.38% భారత వస్తువులకు ప్రయోజనం ఏర్పడింది. 2026 జనవరి-మార్చి నుంచి అమల్లోకి వచ్చే ఈ ఒప్పందం వల్ల, భారత్‌కు వ్యూహాత్మక స్థిరీకరణ లభిస్తుందని మేధో సంస్థ జీటీఆర్ఐ అభిప్రాయపడింది. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య విలువ తక్కువగా ఉన్నా, కీలక మారిటైం, ఇంధన కారిడార్ రూపేణ ప్రయోజనం లభిస్తుందని తెలిపింది. ఈ దేశ సరిహద్దు స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్‌ను తాకుతుంది. ఆసియా కంపెనీల చమురు వాణిజ్యానికి ఇది ప్రధాన మారిటైం చెక్‌పాయింట్‌గా ఉంది.

1	అమెరికా తర్వాత ఒమన్‌తో ఎఫ్‌టీఏ కుదుర్చుకున్న తొలి దేశం భారతే.
3	జీసీసీ దేశాల్లో మనకు ఒమన్ మూడో అతిపెద్ద ఎగుమతి గమ్యస్థానంగా ఉంది.
2 బి. డాలర్లు	వచ్చే 2–3 ఏళ్లలో పెరిగే ద్వైపాక్షిక వాణిజ్య విలువ
10.5 బి. డాలర్లు	ప్రస్తుతం భారత్–ఒమన్ ద్వైపాక్షిక వాణిజ్యం విలువ

మనకేమిస్తారంటే: కార్మికులు అధికంగా పనిచేసే రంగాలైన రత్నాభరణాలు, జౌళి, తోలు, పాదరక్షలు, స్పోర్ట్స్ వస్తువులు, ప్లాస్టిక్స్, ఫర్నిచరు, వ్యవసాయ ఉత్పత్తులు, ఇంజినీరింగ్ ప్రోడక్ట్స్, ఔషధాలు, వైద్య పరికరాలు, వాహనాలపై టారిఫ్‌ను ఒమన్ పూర్తిగా రద్దు చేస్తుంది. వీటిపై ప్రస్తుతం 5-100% టారిఫ్ విధిస్తోంది.

మనమేమిస్తామంటే: ఖర్జూరాలు, మార్బుల్, పెట్రో రసాయనాల వంటి ఒమన్ ఉత్పత్తులపై టారిఫ్‌ను మన దేశం తగ్గిస్తుంది. మొత్తం టారిఫ్ లైన్ల (12,556)లో 77.79% వరకు పన్ను సరళీకరణ ఉంటుంది.

వీటికి వర్తించదు: ఒమన్‌కు పంపే సునిశిత ఉత్పత్తులపై ఒప్పందం వర్తించదు. ముఖ్యంగా డెయిరీ, టీ, కాఫీ, రబ్బరు పొగాకు, పసిడి, వెండి బులియన్-ఆభరణాలు, పాదరక్షలు, స్పోర్ట్స్‌వేర్, ప్రాథమిక లోహాల స్క్రాప్ వంటి ఒమన్ వస్తువులకు మినహాయింపులుండవు.

మరింత సులువుగా వృత్తి నిపుణులు వెళ్లొచ్చు

ఈ ఒప్పందం కింద ఒమన్‌కు వెళ్లే కాంట్రాక్టు సర్వీస్ సప్లయర్లు ప్రస్తుత 90 రోజులకు బదులు 2 ఏళ్ల వరకు అక్కడ ఉండొచ్చు. మరో రెండేళ్ల పొడిగింపునకూ అవకాశం ఉంది. అకౌంటెన్సీ, టాక్సేషన్, ఆర్కిటెక్చర్, వైద్య-అనుబంధ సేవల వంటి కీలక రంగాల్లోని వృత్తి నిపుణులు మరింత సులువుగా ఒమన్‌కు వెళ్లి, అక్కడ నివసించడానికి వీలవుతుంది. ఒమన్ ప్రధాన సేవల రంగాల్లో భారత కంపెనీలు 100% ఎఫ్‌డీఐ పెట్టొచ్చు. ఒమన్‌లో 6000కు పైగా కంపెనీలు భారతీయులవే. వీటిలో ఇపుడు 50% వరకు తమ భారతీయ కార్యాలయం నుంచి సిబ్బందిని నియమించుకునేందుకు (ఇంట్రా ఆఫీస్ ట్రాన్స్‌ఫర్స్) వెసులుబాటు కలిగింది. అంతక్రితం ఇది 20 శాతంగా ఉంది. ఒమన్‌లో 7 లక్షల మంది భారతీయులున్నారు. ఏటా ఒమన్ నుంచి 2 బి. డాలర్ల మేర భారత్‌కు వారు పంపుతున్నారు.

భారత సర్వీసు ప్రొవైడర్లకు భారీ అవకాశం: కంప్యూటర్ సంబంధిత సేవలు, వ్యాపార, వృత్తిపర సేవలు, ఆడియో-వీడియో సేవలు, పరిశోధన-అభివృద్ధి, విద్య, ఆరోగ్య సేవలకు ఒమన్ మద్దతు ఇస్తుంది. ఒమన్ అంతర్జాతీయ సేవల దిగుమతుల విలువ 12.52 బి. డాలర్లు (సుమారు రూ.1.13 లక్షల కోట్లు) ఉండగా.. అందులో భారత వాటా 5.31 శాతమే. కాబట్టి భారత సర్వీసు ప్రొవైడర్లకు భారీ అవకాశాలు ఉన్నట్లే.

అరబిందోలో యూఎస్ఎఫ్‌డీఏ తనిఖీలు

ఈనాడు, హైదరాబాద్: అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ ఏపీఎల్ హెల్త్‌కేర్‌కు చెందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని యూనిట్-4ను అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) బృందం ఈ నెల 8 నుంచి 17 వరకు తనిఖీ చేసింది. 5 అభ్యంతరాలను గుర్తించి, 'ఫారమ్ 483' జారీ చేసింది. త్వరలోనే వీటిని సరిదిద్ది, మళ్లీ యూఎస్ఎఫ్‌డీఏకు నివేదిస్తామని అరబిందో ఫార్మా వెల్లడించింది.

సైయెంట్ సెమీకండక్టర్స్‌కు కైనటిక్ టెక్నాలజీస్‌లో మెజార్టీ వాటా

ఈనాడు, హైదరాబాద్: సైయెంట్ సెమీకండక్టర్స్, కైనటిక్ టెక్నాలజీస్ అనే సంస్థలో 93 మిలియన్ డాలర్ల (సుమారు రూ.830 కోట్ల)కు మెజార్టీ వాటా కొనుగోలు చేసింది. దీని వల్ల సెమీకండక్టర్ల మార్కెట్లో బహుముఖంగా విస్తరించే అవకాశం కలుగుతుందని సైయెంట్ సెమీకండక్టర్స్ పేర్కొంది.

నిధుల సమీకరణ యత్నాల్లో గ్రాన్యూల్స్

ఈనాడు, హైదరాబాద్: గ్రాన్యూల్స్ ఇండియా తన విస్తరణ అవసరాల కోసం మూలధన నిధులు సమీకరించనుంది. ఇందులో భాగంగా ప్రిఫరెన్షియల్ అలాట్‌మెంట్ పద్ధతిలో ఈక్విటీ షేర్లు జారీ చేయనుంది. 'షేరు జారీ ధర, ఎన్ని షేర్లు జారీ చేయాలి, ఎంత మొత్తం సమీకరించాలి' అనే అంశాలపై ఈ నెల 23న జరిగే బోర్డు డైరెక్టర్ల సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటారు.

అధ్వాన పరిస్థితి ముగిసింది

ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్



ఇండిగో విమాన సర్వీసులు స్థిరపడ్డాయని, అధ్వాన స్థితి ముగిసినట్లేనని కంపెనీ సీఈఓ పీటర్ ఎల్బర్స్ తెలిపారు. పైలట్ల కొరత, నెట్‌వర్క్ ఇబ్బందులతో ఈ నెల మొదటివారంలో భారీ సంఖ్యలో ఇండిగో విమాన సర్వీసులు రద్దయిన సంగతి తెలిసిందే. పైలట్లు, సిబ్బంది పనిగంటలకు సంబంధించి, నూతన నిబంధనల అమలుకు ప్రభుత్వం ఫిబ్రవరి వరకు గడువు ఇవ్వాక, తమ విమాన నెట్‌వర్క్‌ను దాదాపుగా పునరుద్ధరించినట్లు సిబ్బందికి పంపిన వీడియో సందేశంలో పీటర్ ఎల్బర్స్ వివరించారు. విమానాలు నిలిచిపోవడానికి మూల కారణాలు పరిశీలించి, సంస్థ పునర్నిర్మాణంపై దృష్టి పెట్టామని స్పష్టం చేశారు. గురువారం 2,200 విమాన సర్వీసులు నడిపామన్నారు. ఇటీవలి సంక్షోభానికి కారణాలు సమీక్షిస్తూనే, నెట్‌వర్క్‌ను సాధారణ స్థితికి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని, సర్వీసుల రద్దు వల్ల ఇబ్బంది పడిన ప్రయాణికులకు పరిహారం చెల్లిస్తున్నామని అన్నారు.

తుఫాను నుంచి బయటకు వచ్చాం: తుఫాను పరిస్థితులను దాటుకుని మళ్లీ పుంజుకునే దశలో ఉన్నామని ఎల్బర్స్ తెలిపారు. గత రెండు వారాలు చాలా సవాళ్లు ఎదుర్కొన్నామని, నెట్‌వర్క్ పునరుద్ధరణకు పైలట్లు, క్యాబిన్ సిబ్బంది, విమానాశ్రయ బృందాలు, ఆపరేషన్స్ కంట్రోల్, కస్టమర్ సర్వీస్ ఉద్యోగులు చాలా కృషి చేశారని వెల్లడించారు. క్లిష్టమైన పరిస్థితుల నుంచి తక్కువ సమయంలో కోలుకోవడం కంపెనీ నిర్వహణ సూత్రాల బలానికి నిదర్శనమన్నారు.

ఇండిగోపై సీసీఐ దర్యాప్తు: పలు మార్గాల్లో అకస్మాత్తుగా భారీ సంఖ్యలో ఇండిగో విమాన సర్వీసులు రద్దుకావడంపై దర్యాప్తు చేయాలని నిర్ణయించినట్లు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) గురువారం పేర్కొంది. 2002 కాంపిటీషన్ చట్టం నిబంధనల కింద తమ దర్యాప్తు జరుగుతుందని వివరించింది.

హల్దీరామ్‌లో ఎల్ క్యాటర్టన్‌కు వాటా

హల్దీరామ్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నట్లు, కొంత వాటా తీసుకున్నట్లు అమెరికాకు చెందిన ప్రైవేటు ఈక్విటీ సంస్థ ఎల్ క్యాటర్టన్ వెల్లడించింది. హల్దీరామ్ విలువను ఎంతగా పరిగణించి, ఎంత మొత్తం పెట్టుబడి పెట్టిందో వెల్లడించలేదు. అయితే తాజా ఒప్పందం హల్దీరామ్ విలువను 10 బి.డాలర్లు (సుమారు రూ.90,000 కోట్లు)గా పరిగణించి, జరిగిందని తెలుస్తోంది.

ఎఫ్ఐఐ కొనుగోళ్లు.. రూ.595.78 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు.. రూ.2700.36 కోట్లు

విదేశీ మార్కెట్ల ప్రతికూల సంకేతాల ప్రభావంతో స్టాక్ మార్కెట్ వరుసగా నాలుగో రోజూ నష్టాల్లోనే ముగిసింది. అమెరికా- భారత్ వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి మార్కెట్ సెంటిమెంటును దెబ్బతీస్తోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 18 పైసలు పెరిగి 90.20 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు ధర 0.18% పెరిగి 59.79 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.39,000 కోట్లు తగ్గి రూ.465.79 లక్షల కోట్ల (5.17 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

విదేశీ సంకేతాలు పడేశాయ్

వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి ప్రభావం కూడా

సెన్సెక్స్ ▼ 78	నిఫ్టీ ▼ 3
84482	25816

ఒడుదొడుకులే: బీఎస్ఈ సెన్సెక్స్ (క్రితం ముగింపు 84,559.65) ట్రేడింగ్ స్వల్పనష్టాల్లో 84,518.33 పాయింట్ల వద్ద ఆరంభమైంది. ఒకదశలో 84,238.43 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదుచేసింది. మళ్లీ లాభాల్లోకి వచ్చి 84,780.19 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదుచేసింది. అయితే మదుపర్లు అమ్మకాలకు దిగడంతో, చివరకు 77.84 పాయింట్లు నష్టపోయి 84,481.81 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 3 పాయింట్లు తగ్గి 25,815.55 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,726.30 వద్ద కనిష్ఠాన్ని, 25,902.35 వద్ద గరిష్ఠాన్ని ఈ సూచీ నమోదుచేసింది.

13 కంపెనీల షేర్లు లాభాల్లో: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 13 మినహా మిగతావి నష్టాల్లో ముగిశాయి. సన్‌ఫార్మా 2.77%, టాటా స్టీల్ 1.26%, పవర్‌గ్రిడ్ 1.19%, ఏషియన్ పెయింట్స్ 0.91%, ఎన్‌టీపీసీ 0.82%, భారతీ ఎయిర్‌టెల్ 0.79%, ఎల్అండ్‌టీ 0.75% నష్టపోయాయి. టీసీఎస్ 1.94%, టెక్ మహీంద్రా 1.68%, ఇన్ఫోసిస్ 1.51%, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 0.43% లాభపడ్డాయి.

✦ **4 షేర్లలో ఎఫ్అండ్‌ఓ ట్రేడ్లు:** బజాజ్ హోల్డింగ్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్, ప్రీమియర్ ఎనర్జీస్, స్విగ్గీ, వారీ ఎనర్జీస్ సెక్యూరిటీల్లో ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ ట్రేడ్లు ఈనెల 31 నుంచి అందుబాటులో ఉంటాయని సెబీ తెలిపింది. మార్కెట్ లాట్, ఇతర వివరాలను ఈనెల 30న వెల్లడిస్తామంది.



రూ.10,000 ముఖ విలువతోనూ బాండ్ల జారీ

రూ.10,000 ముఖ విలువతోనూ బాండ్ల జారీకి అనుమతినిస్తూ సంబంధిత నిబంధనలను సెబీ సరళీకరించింది. ఈ బాండ్లకు స్థిర గడువు ఉండాలి. జీరో కూపన్ కావచ్చు.. లేదంటే వడ్డీ ఆర్జనకు కావచ్చు.. తక్కువ ముఖ విలువతో డెట్ సెక్యూరిటీస్‌ల జారీకి ఈ నిర్ణయం దోహదం చేస్తుందని సెబీ తన సర్క్యులర్‌లో తెలిపింది.

సంక్షిప్తంగా

✦ పశ్చిమ బెంగాల్‌లో 3 కొత్త హోటళ్ల ఏర్పాటు చేసే యోచనలో ఐటీసీ ఉంది. ఇందుకోసం డార్జిలింగ్, కుర్సియాంగ్, సుందర్‌బాన్స్‌లో స్థలాన్వేషణ చేపడుతున్నట్లు **ఐటీసీ** ఛైర్మన్ సంజీవ్ పురి తెలిపారు.

✦ రొమ్ము కేన్సర్ ఔషధం డేటోపొటామాబ్ డెరక్స్‌టెకాన్‌ను భారత్‌లో విక్రయించేందుకు సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ) అనుమతి ఇచ్చిందని **ఆస్ట్రాజెనెకా ఫార్మా** తెలిపింది.

✦ జీఎస్‌టీని చెల్లించాల్సిన దాని కంటే తక్కువగా కట్టిందని ఆరోపిస్తూ **ఐసీఐసీఐ బ్యాంక్‌**కు రూ.238 కోట్ల నోటీసును అధికారులు పంపించారు.

✦ **ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు** (ఆర్ఆర్‌బీ) అన్నింటికీ ఏకరీతి గుర్తింపు ఉండేలా, ఒక బ్రాండుగా కనిపించేందుకు కొత్త లోగోను ఆర్థిక శాఖ ఆవిష్కరించింది. 'ఒక రాష్ట్రంలో ఒక్కటే ఆర్ఆర్‌బీ' సూత్రాన్ని అనుసరించి 11 రాష్ట్రాలు/ కేంద్ర పాలిత ప్రాంతాల్లో 26 ఆర్ఆర్‌బీలను ఆర్థిక శాఖలోని ఆర్థిక సేవల విభాగం విలీనం చేసిన సంగతి తెలిసిందే.

✦ **బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్** కీలక వడ్డీ రేటును 4% నుంచి 0.25% తగ్గించి, 3.75 శాతానికి పరిమితం చేసింది.

✦ 909 కిలోల వరకు బరువున్న చిన్న పెట్రోలు వాహనాల (కార్ల)కు కార్పొరేట్ యావరేజ్ ఫ్యుయెల్ ఎఫిషియెన్సీ (కేఫ్) ప్రమాణాల నుంచి మినహాయింపు ఇవ్వడాన్ని **టాటా మోటార్స్** వ్యతిరేకిస్తోంది.

సిరి

siri@eenadu.net

మీ ఖాతా ఎవరు వాడుతున్నారు?

మ్యూల్ ఖాతాలు..! ఇప్పుడు దేశవ్యాప్తంగా అలజడి సృష్టిస్తున్నాయి. సైబర్ నేరం ఎప్పుడు.. ఎక్కడ జరిగినా పోలీసులకు ప్రథమంగా చిక్కేవి ఈ మ్యూల్ ఖాతాల వివరాలే. దర్యాప్తు సంస్థలకు చిక్కుతున్న నిందితుల్లో చాలామంది మ్యూల్ ఖాతాలు ఇచ్చినవారే. కమీషన్లకు ఆశపడి కొందరు.. తెలిసిన వ్యక్తులు అడిగారని ఇంకొందరు బ్యాంకు ఖాతాలు అడ్డగోలుగా ఇచ్చేస్తున్నారు. చివరకు పోలీసులకు చిక్కి లబోదిబోమంటున్నారు. సీబీఐ గణాంకాల ప్రకారం.. దేశవ్యాప్తంగా 700 బ్యాంకు శాఖల్లో 8.5 లక్షల మ్యూల్ ఖాతాలు తెరిచినట్లు గుర్తించారు. ఆర్‌బీఐ ప్రారంభించిన మ్యూల్ హంటర్ టూల్ ప్రతినెలా 20 వేల ఖాతాలను గుర్తిస్తోంది. వాస్తవానికి ఇంతకుమించి కొన్ని లక్షల్లో మ్యూల్ అకౌంట్లు ఉన్నాయని అంచనా. ఇది కమీషన్లకు ఆశపడేవారికి.. సైబర్ నేరగాళ్లకు సంబంధించిన వ్యవహారమని మనం అనుకోవడానికి వీల్లేదు. తెలిసో.. తెలియకో బ్యాంకు ఖాతాలున్నవారిలో చాలామంది మ్యూల్స్‌గా మారిపోతున్నారు. ఈ నేపథ్యంలో మ్యూల్ ఖాతాలు.. దాని వెనకున్న ఇబ్బందులు చూద్దాం..!

సైబర్ మోసాలు చేసేందుకు నేరగాళ్లు.. ప్రజల నుంచి కొట్టేసిన డబ్బుతో లావాదేవీలు చేసేందుకు తమ పేరుతో ఉండే బ్యాంకు ఖాతాలకు బదులు ఇతరులవి ఉపయోగిస్తుంటారు. పోలీసులు బ్యాంకు ఖాతా వివరాలు, లావాదేవీల ఆధారంగా తమ ఉనికిని గుర్తించి అరెస్టు చేస్తారనే ఉద్దేశంతో.. నేరగాళ్లు పన్నే పన్నాగం ఇది. ఒకరి పేరుతో ఉన్న ఖాతాలను.. ఇంకొకరు నేరం కోసం వినియోగించడాన్నే మ్యూల్ ఖాతాలు అంటారు. ఈ మ్యూల్ ఖాతాల్లోనూ రెండు రకాలు. సైబర్ నేరగాళ్లు సాధారణ ప్రజలకు కమీషన్ ఇచ్చి.. వారి ఖాతాలు ఉపయోగించడం ఒకెత్తు. ఇతరులకు తెలియకుండా వారి గుర్తింపు పత్రాలతో ఖాతాలు తెరిచి లావాదేవీలు నిర్వహించడం ఇంకో సమస్య.

ఏం జరుగుతోంది..?

మూడేళ్లుగా సైబర్ నేరాలు పెరగడం.. మోసగాళ్లు చిక్కకపోవడానికి ప్రధాన కారణం మ్యూల్ అకౌంట్లని తేలింది. బ్యాంకు ఖాతాలు తెరిచిన వెంటనే, హఠాత్తుగా భారీ మొత్తంలో నగదు జమ, విత్‌డ్రా అవడంపై బ్యాంకులు నిఘా పెంచాయి. ఆకస్మికంగా డబ్బు జమయితే వాటిని అనుమానాస్పద ఖాతాలుగా గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చేవి. ఈ ఖాతాల మీద నిఘా పెరగడంతో.. సైబర్ నేరగాళ్లు కొత్త పంథా ఎంచుకున్నారు. గతంలో కొన్ని ప్రాంతాలకే పరిమితమైన మ్యూల్ ఖాతాలను వ్యవస్థీకృతంగా దేశవ్యాప్తంగా విస్తరించారు. చిన్న మొత్తాల్లో జరిగే మోసాల కోసం సేవింగ్స్ ఖాతాలు, పెద్ద మొత్తంలో జరిగే మోసాల కోసం కరెంటు ఖాతాలు ఉపయోగించడం మొదలుపెట్టారు. టెలిగ్రామ్ ద్వారా దేశవ్యాప్తంగా నిరుద్యోగులు, గృహిణులు, వివిధ వర్గాలను సంప్రదిస్తున్నారు. చిన్న చితకా పనులు చేసుకునేవారి వివరాలతో కరెంటు ఖాతాలు తీస్తున్నారు. వాస్తవానికి కరెంటు ఖాతాలు తెరవాలంటే వ్యాపార సంస్థ ఉండాలి. నిర్ణీత మొత్తంలో వ్యాపారం జరిగినట్లు ఆధారాలు, జీఎస్టీ నంబరు వంటివి తప్పనిసరి. ఇవేవీ లేకుండా మధ్యవర్తులు, కమీషన్ ఏజెంట్ల ద్వారా బ్యాంకు సిబ్బందిని ప్రలోభపెడుతున్నారు. ఖాతాలు తెరిచి యథేచ్ఛగా ఉపయోగిస్తున్నారు. సేవింగ్స్ ఖాతాల కోసం చిరుద్యోగులు, నిరుద్యోగులకు వలేస్తున్నారు. ఒక సైబర్ నేరంపై దర్యాప్తు చేస్తున్న తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు ఒక బ్యాంకు శాఖలో ఆరు కరెంటు ఖాతాల వివరాలు చిక్కాయి. వీటిలో నెలల వ్యవధిలోనే రూ.175 కోట్ల లావాదేవీలు జరిగినట్లు గుర్తించింది. ఖాతాదారులు ఇద్దరు ఆటోడ్రైవర్లని గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమకు కమీషన్ ఆశచూపి కొందరు ఈ ఖాతాలు తెరిపించారని.. తాము ఖాతాలు ఉపయోగించడం లేదని చెప్పారు. పోలీసులు లోతుగా దర్యాప్తు చేయగా బ్యాంకు మేనేజర్ పాత్ర కూడా తేలడంతో అరెస్టు చేశారు.

ఇవీ జాగ్రత్తలు

రెండేళ్ల క్రితం వరకూ ఖాతాలిచ్చే మ్యూల్స్‌ను చూసీచూడనట్లు వదిలేసేవారు. ఆ తర్వాత మ్యూల్స్‌నూ పోలీసులు చట్టం ముందు నిలబెడుతున్నారు. కాబట్టి..

✦ తెలిసిన వ్యక్తులు, తెలియని వ్యక్తులు ఎవరైనా సరే ఇతరుల అవసరాల కోసం బ్యాంకు ఖాతాలు ఇవ్వకూడదు. డబ్బు జమ చేసి విత్‌డ్రా చేసుకుంటామని చెప్పినా నమ్మొద్దు.

✦ సంబంధం లేకున్నా మన ఖాతాల్లో ఆకస్మికంగా డబ్బు జమవ్వడం, వెంటనే విత్‌డ్రా అవ్వడం వంటివి జరిగితే వెంటనే సదరు బ్యాంకును సంప్రదించాలి. యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లు మార్చాలి. మరింత సందేహముంటే పోలీసులను సంప్రదించాలి.

✦ మన పేరుతో ఎన్ని ఖాతాలున్నాయో బ్యాంకుల్లో తెలుసుకోవచ్చు. ఫోన్ నంబరు, పాన్, ఓటర్‌ఐడీ, ఆధార్ తదితర గుర్తింపు పత్రాలతో బ్యాంకును సంప్రదిస్తే తనిఖీ చేసి ఖాతాల వివరాలు చెబుతారు. కనీసం ఆరు నెలలకోసారి క్రెడిట్ బ్యూరోల దగ్గర్నుంచి క్రెడిట్ నివేదిక తీసుకోవడమూ మంచిది.

తెలియని ఖాతాల నుంచి డబ్బు జమైతే

✦ స్నేహితులు, ఇతర వ్యక్తులు లావాదేవీల కోసం బ్యాంకు ఖాతా వివరాలు అడిగినప్పుడు ఇస్తుంటారు. ఇలాంటి సందర్భాల్లో అవతలి వ్యక్తులు సైబర్ నేరాల ద్వారా కొట్టేసిన డబ్బు జమ చేయించడానికి వాడే అవకాశాలున్నాయి.

✦ పోలీసులు సైబర్ నేరాల మీద దర్యాప్తు చేసినప్పుడు డబ్బు జమైన బ్యాంకు ఖాతాదారుడినే ప్రశ్నిస్తారు. తమకు సంబంధం లేదని చెబితే కుదరదు. లావాదేవీతో సంబంధంలేకున్నా చట్టపరమైన ప్రక్రియను ఎదుర్కోవాల్సిందే.

✦ పరిచయం లేని, అసలే మాత్రం సంబంధం లేని వ్యక్తుల ఖాతాలు, యూపీఐ యాప్‌ల (ఫోన్‌పే, జీపే తదితరాలు) నుంచి నగదు జమవుతుంటుంది. ఇలా జమయ్యే డబ్బు సైబర్ నేరగాళ్లు పంపి ఉండొచ్చు. గుర్తుతెలియని ఖాతాల నుంచి డబ్బు జమైతే.. ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించొద్దు.

✦ సంబంధిత బ్యాంకును, అవసరమైతే పోలీసులను సంప్రదించాలి. లేకపోతే సైబర్ నేరంలో పాత్ర కింద బ్యాంకు ఖాతాను 'ఫ్రీజ్' చేస్తారు. దీనివల్ల ఖాతాలో సొంత సొమ్మునూ తీసుకునేందుకు వీలుండదు.



✦ సంచార్ సాథీ పోర్టల్‌లోకి వెళ్లి.. మీ పేరుతో ఎన్ని మొబైల్ నంబర్లు ఉన్నాయో చూసుకోండి. మీకు సంబంధం లేనివి ఉంటే, వెంటనే వాటిపై ఫిర్యాదు చేయండి.

✦ ఇటీవలి కాలంలో యువతని ఉద్యోగాల పేరుతో సంప్రదిస్తున్నారు. ఉద్యోగం ఇచ్చామంటూ బ్యాంకు ఖాతా, ఇతర రహస్య వివరాలు సేకరించి వాటితో లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్‌లో వచ్చే ఉద్యోగ ప్రకటనల్ని నమ్మొద్దు.

– రాజేష్ పాల, హైదరాబాద్

ఆర్థిక భారం తగ్గించుకోండి..

2025 ముగింపు దశకు చేరుకుంది. కొత్త ఏడాదికి స్వాగతం పలికేందుకు మనం సిద్ధమవుతున్నాం. సాధారణంగా కొత్త సంవత్సరంలో ఆరోగ్యమో, ఉద్యోగంలో వృద్ధి ఇలాంటివాటిపైనే చాలా మంది తీర్మానాలు తీసుకుంటారు. కానీ, ఈసారి మీ ఆర్థికారోగ్యంపై దృష్టి పెట్టండి. ముఖ్యంగా అధిక వడ్డీల భారం నుంచి బయటపడి, కొత్త ఏడాదిని ఆనందంగా ప్రారంభించేందుకు ఆరోగ్య పరీక్షల మాదిరిగా ఒక ఆర్థిక తనిఖీ చేపట్టండి.

1) ముందుగా మీకున్న అప్పులన్నింటినీ ఒక చోట రాయండి. గృహ, వాహన, వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డు బాకీలు.. ఇలా అన్నింటినీ జాబితాలో రాయండి.

- ఏ రుణంపై ఎంత వడ్డీ రేటు ఉంది?
- నెలవారీ ఈఎంఐ ఎంత చెల్లిస్తున్నాం?
- ఇంకా ఎంత వ్యవధి మిగిలి ఉంది? అనే విషయాలను తెలుసుకోండి. దీనివల్ల ఏ అప్పును తొందరగా తీర్చాలనే స్పష్టత వస్తుంది.

2) అప్పుల జాబితాలో అధిక వడ్డీ ఉన్న రుణాలను గుర్తించండి. సాధారణంగా క్రెడిట్ కార్డులు, వ్యక్తిగత రుణాలు, 'బై నౌ పే లేటర్' పథకాలపై వడ్డీ రేట్లు చాలా ఎక్కువగా (18–40 శాతం) ఉంటాయి.

- మీ దగ్గర ఉన్న మిగులు మొత్తంతో ముందుగా ఈ అధిక వడ్డీ రుణాలను తీర్చేయండి. దీనివల్ల వడ్డీ భారం గణనీయంగా తగ్గుతుంది.

3) చాలామంది చేసే తప్పు క్రెడిట్ కార్డు బాకీని చెల్లించకపోవడం. ఇది మనల్ని నెమ్మదిగా అప్పుల ఊబిలోకి నెట్టివేస్తుంది.

- వీలైనంత త్వరగా మొత్తం బాకీని తీర్చేయండి.
- మీ దగ్గర డబ్బులు లేకపోతే తక్కువ వడ్డీకి వ్యక్తిగత రుణం తీసుకోండి. ఫిక్స్‌డ్ డిపాజిట్ ఉంటే ఓవర్ డ్రాఫ్ట్ తీసుకొని, క్రెడిట్ కార్డు బాకీని తీర్చేయడం ఉత్తమం.

4) ఏడాది చివర లేదా పండుగలకు వచ్చే బోనస్, ఇన్సెంటివ్ లాంటి వాటిని విలాసాలకు కాకుండా అప్పులు తీర్చేందుకు వాడొచ్చు.

- ముఖ్యంగా గృహరుణం వంటి దీర్ఘకాలిక రుణాల్లో కొంత మొత్తం ముందస్తుగా చెల్లిస్తే, అసలు తగ్గి, భవిష్యత్తులో వడ్డీ భారం భారీగా తగ్గితుంది.

5) మీకు వేర్వేరు చోట్ల చిన్నచిన్న అప్పులు ఎక్కువగా ఉంటే, వాటన్నింటినీ నిర్వహించడం కష్టంగా ఉంటుంది.

- తక్కువ వడ్డీ ఉన్న వ్యక్తిగత రుణం లేదా ఆస్తిపై తనఖా రుణం తీసుకోవచ్చు. దీనివల్ల పది రకాల ఈఎంఐల గందరగోళం పోయి, ఒకే ఈఎంఐ చెల్లిస్తే సరిపోతోంది.



6) అప్పులు తీర్చాలనే తొందరలో మీ దగ్గర ఉన్న అత్యవసర నిధిని మొత్తం వాడేయొద్దు. అనుకోని ఆపద వస్తే మళ్లీ అప్పు చేయాల్సి వస్తుంది. కాబట్టి, 3–6 నెలల ఖర్చులకు సరిపడా డబ్బును పక్కన పెట్టి, మిగిలిన మొత్తాన్ని మాత్రమే రుణాలను చెల్లించేందుకు వాడాలి.

- కొత్త ఏడాదిలో అప్పులు చేయకుండా ఉండటమే నిజమైన విజయం. మీ ఖర్చులను అదుపులో ఉంచుకుంటూ, పాత బాకీలను తీర్చేస్తే 2026లో మీ ఆర్థిక ప్రయాణం సాఫీగా సాగుతుంది.

పాన్.. రద్దు కానీయొద్దు

మీ శాశ్వత ఖాతా సంఖ్య (పాన్)ను ఆధార్‌తో అనుసంధానం చేసుకున్నారా? డిసెంబరు 31లోపు ఈ పనిని పూర్తి చేయండి. లేకపోతే మీ పాన్ పూర్తిగా రద్దయ్యే అవకాశం ఉంది.

ఆర్థిక లావాదేవీల్లో పాన్ కీలకం. ఈ నేపథ్యంలో నకిలీ పాన్‌లను నిరోధించేందుకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఆధార్‌తో అనుసంధానం చేయడం తప్పనిసరి చేసింది. ఎప్పుడో తీసుకున్న పాన్, లేదా ఆధార్ ఎన్‌రోల్మెంట్ ఐడీ ద్వారా పాన్ తీసుకున్న వారు తప్పనిసరిగా డిసెంబరు 31లోగా పాన్-ఆధార్ అనుసంధానం చేసుకోవాల్సిందే.

ఏం అవుతుంది?

నిర్ణీత గడువులోగా ఈ రెండింటినీ అనుసంధానం చేయకపోతే జనవరి 1, 2026 నుంచి మీ పాన్ కార్డు రద్దవుతుంది. దీనివల్ల అనేక ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతాయి.

- ఆదాయపు పన్ను రిటర్నులు (ఐటీఆర్) దాఖలు చేయలేరు.
- మీకు రావాల్సిన పన్ను రిఫండ్లు నిలిచిపోతాయి.
- బ్యాంకు లావాదేవీలు, మ్యూచువల్ ఫండ్లు తదితర పెట్టుబడులపై అధిక టీడీఎస్ (మూలం వద్ద పన్ను కోత) విధిస్తారు.
- రూ.50,000 కంటే ఎక్కువ విలువైన లావాదేవీలు చేయడం కష్టమవుతుంది.
- డీమ్యాట్ ఖాతాను ప్రారంభించేందుకు కేవైసీ (మీ ఖాతాదారు గురించి తెలుసుకోండి) ప్రక్రియను పూర్తి చేయలేరు.
- రుణాలు తీసుకోవడంలోనూ ఇబ్బందులు తలెత్తుతాయి.

ఏం చేయాలి?

ఆదాయపు పన్ను శాఖ వెబ్‌సైట్‌ను సందర్శించి 'లింక్ ఆధార్' ఆప్షన్ ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేయండి.

- ఒకవేళ ఇప్పటికే మీరు ఆధార్-పాన్ అనుసంధానం చేసి ఉంటే, 'పాన్ ఆధార్ లింక్ స్టేటస్' ద్వారా తెలుసుకోవచ్చు.
- ఇప్పుడు ఆధార్-పాన్ అనుసంధానం కోసం రూ.1,000 రుసుముగా చెల్లించాల్సి వస్తుంది. చివరి నిమిషం వరకూ వేచి చూడకుండా, ఇప్పుడే ఈ పని పూర్తి చేయండి. పాన్‌ను రద్దు కాకుండా చూసుకోండి.

పెద్ద కంపెనీల షేర్లలో

కొత్త పథకం

కోటక్ మహీంద్రా మ్యూచువల్ ఫండ్, కొత్తగా కోటక్ నిఫ్టీ నెక్ట్స్ 50 ఈటీఎఫ్ అనే మ్యూచువల్ ఫండ్ పథకాన్ని ఆవిష్కరించింది. ఈ పథకం ఎన్ఎఫ్ఓ ముగింపు తేదీ వచ్చే నెల 1. ఎన్ఎఫ్ఓలో కనీసం రూ.5,000 పెట్టుబడి పెట్టాలి. నిఫ్టీ 100లోని 50 కంపెనీలతో నిఫ్టీ 50 సూచీని రూపొందించారు. మిగిలిన 50 షేర్లు నెక్ట్స్ నిఫ్టీ 50 సూచీలో ఉంటాయి. ఇవి కూడా లార్జ్ క్యాప్ తరగతికి చెందిన కంపెనీలే ఉంటాయి. నిఫ్టీ నెక్ట్స్ ఇండెక్స్ ప్రస్తుతం గత 10 ఏళ్ల సగటు పీఈ మల్టిపుల్ అయిన 29.9 కంటే ఎంతో తక్కువగా ట్రేడ్ అవుతోంది. అందువల్ల నెక్ట్స్ నిఫ్టీలో పెట్టుబడి పెట్టేందుకు ఇది మంచి సమయం అని నిపుణుల విశ్లేషణ. ఇది పాసివ్ విధానంలో నిర్వహించే పథకం. కాబట్టి, నిర్వహణ వ్యయాలూ తక్కువగా ఉంటాయి.

బంగారంలో మదుపు

బంగారంపై పెట్టుబడి అవకాశాన్ని కలిగించే ఉద్దేశంతో ది వెల్త్ కంపెనీ మ్యూచువల్ ఫండ్ కొత్తగా ఒక గోల్డ్ ఈటీఎఫ్ పథకాన్ని తీసుకొచ్చింది. ది వెల్త్ కంపెనీ గోల్డ్ ఈటీఎఫ్, అనే ఈ పథకం ఎన్ఎఫ్ఓ ముగింపు తేదీ ఈ నెల 22. ఎన్ఎఫ్ఓలో కనీసం రూ.5,000 పెట్టుబడి పెట్టాలి. ప్రధానంగా భౌతిక బంగారంలో పెట్టుబడి పెట్టే పథకం ఇది. లండన్ బులియన్ మార్కెట్ అసోసియేషన్ (ఎల్‌బీఎంఏ) గుడ్ డెలివరీ స్టాండర్డ్స్ ప్రకారం 99.5 శాతం శుద్ధత కల బంగారాన్ని మాత్రమే కొనుగోలు చేస్తారు. ఈ పథకం యూనిట్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో (బీఎస్ఈ, ఎన్ఎస్ఈ) నమోదు చేస్తారు. బంగారాన్ని సొంతంగా కొనుగోలు చేసిన పక్షంలో దాన్ని భద్రపరచటం, అవసరం అయినప్పుడు విక్రయించడం పెద్ద సమస్య. బంగారాన్ని కొనేటప్పుడు జీఎస్టీ, మేకింగ్ ఛార్జీలు, తరుగు.. చెల్లించాల్సి వస్తుంది. గోల్డ్ మ్యూచువల్ ఫండ్ పథకాల్లో ఇలాంటి సమస్యలు ఉండవు. ఇది ఈటీఎఫ్ (ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్) పథకం కాబట్టి, క్రయవిక్రయాలు ఎంతో సులువుగా నిర్వహించవచ్చు. దేశీయ మార్కెట్లో బంగారం ధర ఈ పథకం పనితీరుకు ప్రామాణికంగా ఉంటుంది.

'వేతనం' ఆగిపోవద్దు

ఇంటి పెద్ద మరణిస్తే ఆ కుటుంబం బాధ ఎవరూ తీర్చలేరు. భావోద్వేగపరంగానే కాకుండా, ఆర్థికంగానూ ఆ కుటుంబం దిక్కు తోచని పరిస్థితికి చేరుకుంటుంది. అందుకే ఇలాంటి ఆపద సమయంలో ఆదుకునే 'టర్మ్ పాలసీ' ఒకటి ఉండాలని ఆర్థిక నిపుణులు సూచిస్తుంటారు. బీమా మొత్తాన్ని ఒకేసారి తీసుకోవడం మంచిదా? లేకపోతే 'వేతనం'లాగా వచ్చేలా నెలనెలా ఆదాయంలా తీసుకోవాలా? అనే సందేహం చాలామందిలో ఉంటుంది.

టర్మ్ ఇన్సూరెన్స్ తీసుకున్న పాలసీదారుడు మరణిస్తే, పాలసీ విలువను బట్టి, నామినీకి రూ.50లక్షలు, రూ.కోటి లేదా అంతకు మించి చేతికి అందుతాయి. కానీ, ఇక్కడే ఒక చిక్కు ఉంది. పెద్ద మొత్తంలో డబ్బు వస్తే ఏం చేయాలో కుటుంబ సభ్యులకు తెలియకపోతే? సరైన అవగాహన లేకుండా ఎక్కడైనా తప్పుడు పెట్టుబడులు పెడితే పరిస్థితి ఏమిటి? ఇలాంటి భయాలు లేకుండా చూసేదే 'ఇన్‌కం రిప్లేస్‌మెంట్ టర్మ్ ప్లాన్'.

ఇది ఎలా పనిచేస్తుంది? దీనివల్ల లాభాలేమిటో తెలుసుకుందాం.



ఏమిటిది?

సాధారణ టర్మ్ పాలసీలో క్లెయిం మొత్తాన్ని బీమా కంపెనీ ఒకేసారి నామినీకి చెల్లిస్తుంది. కానీ, ఇన్‌కం రీప్లేస్‌మెంట్ పాలసీ పనిచేసే విధానం భిన్నంగా ఉంటుంది.

- బీమా మొత్తాన్ని ఒకేసారి కాకుండా.. నెలవారీ వేతనంలా కొన్నేళ్లపాటు నామినీకి చెల్లిస్తారు.
- పాలసీదారుడి మరణానంతరం ఆగిపోయిన 'జీతాన్ని' ఇది భర్తీ చేస్తుంది. కాబట్టి, దీన్ని ఆదాయ భర్తీ పథకంగా పిలుస్తుంటారు.

ఎలా పనిచేస్తుంది?

ఉదాహరణకు ఒక వ్యక్తి రూ.కోటి విలువైన ఇన్‌కం రిప్లేస్‌మెంట్ టర్మ్ ప్లాన్ తీసుకున్నారనుకుందాం. దురదృష్టవశాత్తూ అతను/ఆమె మరణిస్తే.. బీమా కంపెనీ ఆ రూ.కోటిని ఒకేసారి నామినీకి ఇవ్వదు. దానికి బదులుగా రాబోయే 10 లేదా 15 ఏళ్లపాటు నెలకు నిర్ణీత మొత్తాన్ని అందిస్తుంది. పాలసీ తీసుకునేప్పుడే ఎంత చెల్లించాలి అనేది పాలసీదారుడు నిర్ణయించుకోవాల్సి ఉంటుంది.

రకాలున్నాయి..

పూర్తి నెలవారీ ఆదాయం: అంటే బీమా పరిహారం మొత్తం పూర్తిగా నెలవారీ వాయిదాల్లోనే అందుతుంది.

ఏకమొత్తం, నెలవారీ ఆదాయం: ఉదాహరణకు రూ.కోటి పాలసీ ఉందనుకుందాం. పాలసీదారుడు మరణించిన సందర్భంలో రూ.50లక్షలు ఏకమొత్తంగా చెల్లిస్తుంది. మిగతా 50 శాతం 10-15 ఏళ్లపాటు నెలవారీ ఆదాయంగా ఇస్తుంది. అప్పులు తీర్చేందుకు ఏకమొత్తం, ఇంటి ఖర్చుల కోసం నెలవారీ ఆదాయం.. ఈ విధంగానూ పాలసీని ఎంచుకోవచ్చు.

పెరిగే ఆదాయం: కాలక్రమేణా ద్రవ్యోల్బణ ప్రభావంతో ధరలు పెరుగుతుంటాయి. దానికి తగ్గట్టుగా ఆదాయం ఉండాలి.. కాబట్టి, ఏటా వచ్చే మొత్తాన్ని 5 లేదా 10 శాతం పెరిగే విధంగానూ పాలసీని ఎంపిక చేసుకోవచ్చు. ఉదా.. మొదటి ఏడాది నెలకు రూ.50 వేలు వస్తే, రెండో ఏడాది రూ.55,000, మూడో ఏడాది రూ.60,000 ఇలా పెరుగుతూ వెళ్తుంది. ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొనేందుకు ఇది సరైన మార్గం.

ఎవరికి?

- ఆర్థిక అవగాహన లేకపోతే కుటుంబ సభ్యులకు పెద్ద మొత్తంలో డబ్బును నిర్వహించడం సాధ్యం కాకపోవచ్చు. ఇలాంటప్పుడు టర్మ్ పాలసీలో ఈ విధానాన్ని ఎంచుకోవడం మేలు.
- ఇంటి అద్దె, పిల్లల స్కూలు ఫీజులు, నిత్యావసరాల వంటి నెలవారీ ఖర్చులకు ఏ ఇబ్బందీ ఉండదు.
- ఒకేసారి చేతికి డబ్బు వస్తే తెలిసీ, తెలియక ఖర్చు చేసే ప్రమాదం ఉంది. నెలనెలా వస్తే, ఆ అవకాశం ఉండదు.
- మార్కెట్ పరిస్థితులు, వడ్డీ రేట్లు ఎలా ఉన్నా.. బీమా కంపెనీ నెలనెలా హామీ ఇచ్చిన ఆదాయాన్ని ఇస్తుంది. కాబట్టి, ఇబ్బంది ఉండదు.

సురక్షిత పథకాలు మేలేనా?

మార్గదర్శి

నెలకు రూ.15 వేల చొప్పున కాస్త సురక్షితంగా ఉండే పథకాల్లో మదుపు చేయాలనే ఆలోచనతో ఉన్నాను. నా వయసు 56. మరో 6 ఏళ్ల తర్వాత ఈ డబ్బుతో నాకు అవసరం ఉంటుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో మంచి రాబడి వచ్చేలా ఎలాంటి పథకాలను ఎంచుకోవాలి? - విజయ్‌కుమార్

ఇప్పుడు పెట్టుబడి పెట్టిన డబ్బును మీ పదవీ విరమణ అవసరాల కోసం ఉపయోగించుకోవాలని ఆలోచిస్తున్నట్లు అర్థం అవుతోంది. ఈ ఆరేళ్ల పెట్టుబడి సమయంలో మంచి రాబడి వచ్చే విధంగా మదుపు చేసుకోవాలి. ప్రస్తుతం సురక్షిత పథకాలు దాదాపు 7 శాతం వరకే రాబడినిస్తున్నాయి. భవిష్యత్తులో ఇది కాస్త తగ్గే అవకాశమూ ఉంది. కాస్త నష్టభయం ఉన్నా బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్, హైబ్రిడ్ ఈక్విటీ, మల్టీ అసెట్ లాంటి ఫండ్లను పరిశీలించండి. సురక్షితమైన పథకాలతో పోలిస్తే, వీటిలో రాబడి కాస్త అధికంగా వచ్చే అవకాశం ఉంది. డబ్బు జమైన తర్వాత ఎస్‌డబ్ల్యూపీ విధానంలో మీకు నెలనెలా డబ్బు వచ్చేలా ఏర్పాటు చేసుకోవచ్చు.

నేను ఒక దుకాణాన్ని నడిపిస్తున్నాను. స్థిరంగా ఆదాయం అంటూ ఉండదు. నాకు టర్మ్, ఆరోగ్య బీమా పాలసీలు ఇస్తారా? ఎవరిని సంప్రదించాలి? నెలకు రూ.5వేల వరకూ పెట్టుబడి పెట్టాలంటే ఏం చేయాలి? - నరేందర్

చిరువ్యాపారి కాబట్టి, మీరు చెప్పినట్లు క్రమం తప్పకుండా ఆదాయం ఉండకపోవచ్చు. మీ నెలవారీ ఖర్చులను బట్టి, 12 నెలలకు సరిపోయేంత డబ్బు మీ దగ్గర ఉండాలి. ఇటీవలి కాలంలో ఆరోగ్య సంరక్షణ ఖర్చులు చాలా అధికంగా ఉంటున్నాయి. కాబట్టి, రూ.5లక్షల వరకూ మీ కుటుంబానికి అంతటికీ వర్తించేలా బీమా తీసుకోవాలి. అదే విధంగా మీ వార్షికాదాయానికి కనీసం 12 రెట్ల వరకూ టర్మ్ ఇన్సూరెన్స్ తీసుకోవాలి. సాధారణంగా ఆదాయపు పన్ను రిటర్నులను బట్టి, టర్మ్ ఇన్సూరెన్స్ ఇస్తారు. ఒకసారి మీ దగ్గర్లో ఉన్న ఏదైనా బీమా సంస్థను సంప్రదించండి. మీరు మదుపు చేయాలనుకుంటున్న రూ.5వేలను కనీసం అయిదేళ్లకు మించి పెట్టుబడి పెట్టాలనుకుంటే, ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేయండి. స్వల్పకాలానికి కావాలనుకుంటే రికరింగ్ డిపాజిట్ చేసుకోండి.

– తుమ్మ బాల్‌రాజ్, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

జేబులో రూపాయికి ఏఐ రక్ష

వచ్చిన జీతం వచ్చినట్లే ఆవిరైపోతోందా? ఎన్ని లెక్కలు వేసుకున్నా.. నెలాఖరుకు వచ్చే సరికి చేతిలో డబ్బు మిగలడం లేదా? మీ ఆర్థిక ప్రణాళికలో 'కృత్రిమ మేధ (ఏఐ)' తోడు కావాల్సిందే. ఇప్పుడు ఎక్కడ చూసినా ఏఐ విప్లవాత్మక మార్పులు తెస్తోంది. కేవలం ఖర్చులను రాసుకోవడమే కాదు.. 'వద్దు.. ఈ ఖర్చులు చేయొద్దు.. వచ్చే వారం బీమా ప్రీమియం చెల్లించాలి!'... అని హెచ్చరించే స్థాయికి చేరింది. వ్యక్తిగత బడ్జెటింగ్ విషయంలో ఏఐ మనకు ఎలా సహాయం చేస్తుందో వివరంగా చూద్దాం..

సాధారణంగా మనం బడ్జెట్ వేసుకోవడం అంటే.. గత నెలలో ఏం ఖర్చు చేశామో చూసుకుంటాం. కానీ, ఏఐ దీనికి భిన్నంగా ఆలోచిస్తుంది.

- మీ గత ఆరు నెలల ఖర్చుల తీరును గమనించి, వచ్చే నెలలో మీ ఆర్థిక పరిస్థితి ఎలా ఉండబోతోందో ఇది అంచనా వేస్తుంది.
- జూన్‌లో మీ పిల్లల స్కూలు ఫీజుల ఖర్చులు ఉంటాయి. ఏఐ మిమ్మల్ని ఈ విషయంపై ఏప్రిల్ నుంచే అప్రమత్తం చేస్తుంది. 'వచ్చే రెండు నెలల్లో భారీ ఖర్చు ఉంది. కాబట్టి, షాపింగ్ తగ్గించండి' అంటూ ముందుగానే హెచ్చరిస్తుంది. ఇది సంప్రదాయ బడ్జెటింగ్ యాప్‌లతో సాధ్యం కాదు.
- ఆర్థిక నిపుణులు ఎప్పుడూ చెప్పే సూత్రం.. సంపాదనలో 50 శాతం అవసరాలు, 30 శాతం కోరికలు, 20 శాతం పెట్టుబడులకు కేటాయించాలని. దీన్ని ఆచరణలో పెట్టడం కష్టం. కానీ, ఏఐ ఆధారిత యాప్‌లను వాడితే.. మీ జీతం పడగానే.. మీరు నిర్దేశించిన మొత్తాలను వేర్వేరు భాగాలుగా మార్చేస్తాయి. దీనివల్ల మీరు ఖర్చు చేయడానికి నిర్ణయించుకున్న మొత్తాన్నే అందుబాటులో ఉంచుతుంది.
- చాలా సందర్భాల్లో మనకు తెలియకుండానే చిన్నచిన్న మొత్తాలు ఖర్చవుతుంటాయి. కొన్ని సబ్‌స్క్రిప్షన్లను మనం వాడం. కానీ, ఆటో-రెన్యూవల్ అయిపోతుంటాయి. ఇలాంటి వాటిని ఏఐ గుర్తించి, మిమ్మల్ని అప్రమత్తం చేయగలదు.
- మీరు ఆన్‌లైన్‌లో ఏదైనా కొనాలని అనుకుంటే, దాని ధర గతంతో పోల్చి చూసి, మీరు సరైన మొత్తానికే కొంటున్నారా లేదా విశ్లేషిస్తుంది.
- ఒత్తిడిలో ఉన్నప్పుడు లేదా ఆనందంలో ఉన్నప్పుడు కొనుగోళ్లు చేయడం చాలామందికి అలవాటు. ఏఐ మీ ఖర్చుల సమయాన్ని, సందర్భాన్ని బట్టి, మీ మానసిక స్థితిని అర్థం చేసుకోగలదు. మీరు అర్ధరాత్రి వేళల్లో ఆన్‌లైన్ షాపింగ్ యాప్స్ ఎక్కువగా వాడుతుంటే.. 'ఇది అనవసరపు ఖర్చు కావచ్చు.. ఒకసారి ఆలోచించండి' అనే నోటిఫికేషన్ పంపి, మిమ్మల్ని అప్రమత్తం చేస్తుంది.
- కారు కొనాలి.. ఇల్లు కట్టాలి.. అని అనుకుంటాం. కానీ, దానికి ఎంత జమ చేస్తున్నామో ఎప్పుడూ చూసుకోం. ఏఐ ఆధారిత యాప్‌లో మీరు ఒక లక్ష్యాన్ని అనుకొని, దానికి డబ్బు జమ చేయాలని చెబితే.. అది మీ ఖాతాలో మిగిలిన చిల్లరనూ ఆ లక్ష్యం కోసం నిర్దేశించిన ఖాతాలోకి మళ్లిస్తుంది. ఉదాహరణకు మీరు రూ.490కి సరకులు కొన్నారనుకుందాం. దాన్ని రూ.500లుగా మార్చి, ఆ రూ.10ని మీ కారు కొనుగోలు ఫండ్‌లోకి మళ్లిస్తుంది.



నమ్మకమైనవే...


ఏఐ ఒక అద్భుతమైన సాంకేతికత. కానీ, మీ ఆర్థిక సమాచారం భద్రతా ముఖ్యమే.

- కేవలం ఆర్‌బీఐ గుర్తింపు పొందిన లేదా పేరున్న బ్యాంకులకు సంబంధించిన ఏఐ టూల్స్ మాత్రమే వాడాలి.
- యాప్ ఇన్‌స్టాల్ చేసేటప్పుడు అది మీ మొబైల్‌కు వచ్చే సంక్షిప్త సందేశాలను చదివేందుకు (ఖర్చులను లెక్కించేందుకు) అనుమతి అడుగుతుంది. ఈ విషయంపై మీకు అవగాహన ఉండాలి.
- ఏఐ సలహా ఇస్తుంది. కానీ, అంతిమంగా డబ్బును ఖర్చు చేయాలా? వద్దా? అనేది మీ విచక్షణపైనే ఆధారపడి ఉంటుంది.

ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తూ.. శరీర సమతౌల్యాన్ని రక్షిస్తూ..

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

బయాలజీ



జీవులన్నింటిలో శరీర పెరుగుదల, నిర్వహణల కోసం వాయువులు, పోషకాల రవాణా ప్రక్రియ అనేది ఒక అవశ్యక జీవక్రియ. జీవుల్లో పదార్థాల రవాణా కోసం ప్రత్యేక అవయవ వ్యవస్థ ఉంటుంది. దీన్నే ప్రసరణ వ్యవస్థ అంటారు. రక్తాన్ని ద్రవరూప కణజాలం అంటారు. రక్తంలోని ద్రవరూప భాగాన్ని/కణ బాహ్య ద్రవ భాగాన్ని ప్లాస్మా అంటారు. ఈ ప్రసరణ వ్యవస్థ అనేది అన్ని జీవుల్లో ఒకే రకంగా ఉండదు. రక్తం గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని హెమటాలజీ అంటారు.

రక్త ప్రసరణ వ్యవస్థ

జీవి శరీరంలోని అన్ని భాగాలకు రక్తాన్ని పంపిణీ చేయడం, అక్కడి నుంచి రక్తాన్ని తిరిగి సేకరించడం అనేది రక్త ప్రసరణ వ్యవస్థ విధిలో భాగం. ఈ ప్రక్రియ సక్రమంగా జరగడానికి అవసరమైన అవయవాలు, నాళాలు, కవాటాలతో నిర్మితమైన ఓ సంక్లిష్ట జాలక వ్యవస్థను రక్త ప్రసరణ వ్యవస్థగా పేర్కొంటారు.

ముఖ్య విధులు:

ఆహారం నుంచి గ్రహించిన పోషకాలను, ఊపిరితిత్తుల నుంచి ఆక్సిజన్‌ను శరీరంలోని ప్రతి కణానికి చేరవేయడం.

- కణాల్లో ఉత్పత్తి అయ్యే కార్బన్ డైఆక్సైడ్, ఇతర వ్యర్థ పదార్థాలను సేకరించి, వాటిని విసర్జక అవయవాలకు (ఊపిరితిత్తులు, మూత్రపిండాలు) రవాణా చేయడం.
- తెల్ల రక్త కణాల ద్వారా శరీరాన్ని వ్యాధికారక క్రిముల నుంచి రక్షించడం.
- శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తూ శరీరాన్ని సమతౌల్యం చేయడం.

రక్త ప్రసరణ వ్యవస్థ - రకాలు

జంతువుల్లో ప్రధానంగా రెండు రకాల ప్రసరణ విధానాలు ఉంటాయి. అవి:

వివృత రక్త ప్రసరణ వ్యవస్థ:

ఈ విధానంలో రక్తం (హీమోలింఫ్) రక్త నాళాలకు మాత్రమే పరిమితమై ప్రవహించదు.

- గుండె రక్తాన్ని నాళాల ద్వారా నేరుగా శరీర కుహరం లేదా సైనస్‌లు అనే ఖాళీల్లోకి పంప్ చేస్తుంది.
- రక్త నాళాల నుంచి బయటకు వచ్చిన రక్తం నేరుగా కణజాలాలను చేరి వాటితో పోషకాలు, వాయువుల మార్పిడి చేస్తుంది.
- హృదయం లేదా గుండె సాధారణంగా పొడవైన, నాళికాకార నిర్మాణంలో ఉండి, రక్తం వెనక్కి ప్రవహించకుండా ఆపే కవాటాలను కలిగి ఉంటుంది.
- ఈ వ్యవస్థలో రక్త ప్రవాహ వేగం, పీడనం తక్కువగా ఉంటాయి.

సంవృత రక్త ప్రసరణ వ్యవస్థ:

ఈ విధానంలో రక్తం ఎల్లప్పుడూ ఒక క్రమబద్ధమైన రక్త నాళాల జాలకానికి పరిమితమై ఉంటుంది.

- గుండె నుంచి రక్తం ధమనులు - కేశనాళికలు - సిరల ద్వారా ప్రవహిస్తుంది.
- రక్తం, కణజాలం మధ్య మార్పిడి కేశనాళికల ద్వారా జరుగుతుంది. రక్తం నేరుగా కణజాలంతో కలవదు.
- రక్త ప్రవాహ వేగం, పీడనం ఎక్కువగా ఉండి, రక్తం వేగంగా రవాణా అవుతుంది.

వివిధ జంతు వర్గాలు - రక్త ప్రసరణ వ్యవస్థలు

పరిణామ క్రమంలో ప్రోటోజోవా లాంటి సరళ జీవుల నుంచి సంక్లిష్ట జీవులైన క్షీరదాల వరకు రక్త ప్రసరణ వ్యవస్థ నిర్మాణంలో గణనీయమైన అభివృద్ధి కనిపిస్తుంది.

ప్రోటోజోవా, పొరిఫెరా

ఈ వర్గాల్లో అసలైన ప్రసరణ వ్యవస్థ ఉండదు.

ప్రోటోజోవా: కణం లోపల సైటోప్లాస్మిక్ కదలిక ద్వారా పోషకాలు, వాయువుల రవాణా జరుగుతుంది. ఇవి ఉపరితలం నుంచి సాధారణ వ్యాపనం ద్వారా ఆక్సిజన్‌ను గ్రహిస్తాయి, వ్యర్థాలను విడుదల చేస్తాయి.

ఉదా: అమీబా, పారామీషియం

పొరిఫెరా: జల ప్రసరణ వ్యవస్థ ఉంటుంది. నీరు ఆస్టియా ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తుంది. స్పాంజికా కుహరం ద్వారా ప్రవహించి, ఆస్క్యులమ్ ద్వారా బయటకు వెళ్తుంది. ఈ ప్రవాహమే ఆహారం, ఆక్సిజన్, వ్యర్థాలను రవాణా చేస్తుంది.

ఉదా: స్పాంజికలు

అనెలిడా

వీటిలో మూసివేసిన రక్త ప్రసరణ వ్యవస్థ ఉంటుంది.

గుండె/హృదయం: అయిదు జతల పార్శ్వ నాళాలు మిథ్యా గుండెలు లేదా వలయాకారపు నాళాలుగా పని చేస్తాయి. ఇవి రక్తాన్ని పృష్ఠ నాళం నుంచి ఉదర నాళం వైపు నెడతాయి.

రక్త నాళాలు: ఇవి మూడు భాగాలుగా విభజితమై ఉంటాయి. అవి:

- **పృష్ఠ రక్త నాళం:** ప్రధానంగా రక్తాన్ని ముందు వైపునకు (గుండె వైపు) పంపిస్తుంది.
- **ఉదర రక్త నాళం:** రక్తాన్ని శరీరంలోని అన్ని భాగాలకు సరఫరా చేస్తుంది.
- **కేశనాళికలు:** దేహ కణజాలంలో వాయువుల మార్పిడికి సహాయపడతాయి.

ప్రసరణ ద్రవం (రక్తం): ఇందులో హీమోగ్లోబిన్ అనే శ్వాస వర్ణకం ప్లాస్మాలో (ఎర్ర రక్త కణాల్లో కాదు) కరిగి ఉంటుంది.

పక్షులు, క్షీరదాలు

ఇది ప్రధానంగా సంవృత రక్త ప్రసరణ వ్యవస్థ. ద్విగుణ ప్రసరణ సంపూర్ణంగా ఉంటుంది.

గుండె: నాలుగు గదులు ఉంటాయి. రెండు కర్ణికలు (కుడి, ఎడమ), రెండు జఠరికలు (కుడి, ఎడమ) ఉంటాయి.

ప్రసరణ మార్గం: జఠరిక పూర్తిగా విభజితమై ఉండటం వల్ల ఆక్సిజన్ ఉన్న రక్తం (ఎడమ వైపు), ఆక్సిజన్ లేని రక్తం (కుడి వైపు) ఎప్పటికీ కలవవు.

పుపుస ప్రసరణ: ఆక్సిజన్ లేని రక్తం కుడి గుండె భాగం నుంచి ఊపిరితిత్తులకు వెళ్లి శుద్ధి అవుతుంది.

దైహిక ప్రసరణ: ఆక్సిజన్ ఉన్న రక్తం ఎడమ గుండె భాగం నుంచి శరీరంలోని అన్ని భాగాలకు సరఫరా అవుతుంది.

రక్త నాళాలు: బాగా అభివృద్ధి చెందిన ధమనులు, సిరలు, కేశనాళికలు ఉంటాయి.

ప్రసరణ ద్రవం (రక్తం): ఇందులో న్యూక్లియస్ లేని ఎర్ర రక్త కణాలు (క్షీరదాలు) ఉంటాయి. శరీరం స్థిరమైన అధిక శక్తి అవసరాలను తీర్చడానికి వీలు కల్పిస్తుంది.

ఉదా: పక్షులు, మనుషులు, ఆవులు

ఆర్థ్రోపోడా

వీటిలో వివృత రక్త ప్రసరణ వ్యవస్థ ఉంటుంది.

గుండె: సాధారణంగా పృష్ఠ భాగంలో ఉండే గొట్టం లాంటి నిర్మాణం. దీనికి పక్కన ఆస్టియా అనే రంధ్రాలు ఉంటాయి. దీని ద్వారా రక్తం తిరిగి గుండెలోకి ప్రవేశిస్తుంది.

రక్త నాళాలు: రక్త నాళాలు పూర్తిగా అభివృద్ధి చెంది ఉండవు. రక్తం దేహ కుహరంలోకి విడుదల అవుతుంది.

ప్రసరణ ద్రవం: దీన్ని హీమోలింఫ్ అంటారు. ఇది దేహ కుహరంలోకి వచ్చి కణాలను నేరుగా ముంచి, వాయువులు, పోషకాలను రవాణా చేస్తుంది. (కానీ కీటకాల్లో మాత్రం ఇలా జరగదు. వీటిలో ఆక్సిజన్ రవాణా వాయునాళ వ్యవస్థ ద్వారా జరుగుతుంది.) శ్వాస వర్ణకం ఉండకపోవచ్చు లేదా హీమోసయనిన్ ఉండవచ్చు.

ఉదా: కీటకాలు, సాలీడు, రొయ్యలు

చేపలు



రచయిత

డా.కొర్లాం సాయివెంకటేష్, అసిస్టెంట్ ప్రొఫెసర్

వీటిలో సంవృత రక్త ప్రసరణ వ్యవస్థ కనిపిస్తుంది. ఏక ప్రసరణ రక్త ప్రసరణ వ్యవస్థగా ఉంటుంది.

గుండె: ఒక కర్ణిక, ఒక జఠరికతో కూడిన రెండు గదులు మాత్రమే ఉంటాయి.

ప్రసరణ మార్గం: గుండె కేవలం ఆక్సిజన్ లేని రక్తాన్ని మాత్రమే స్వీకరించి, మొప్పలకు పంపిస్తుంది. మొప్పల్లో రక్తం ఆక్సిజన్‌ను గ్రహిస్తుంది. అక్కడి నుంచి నేరుగా శరీర భాగాలకు సరఫరా అవుతుంది. తిరిగి ఆక్సిజన్ లేని రక్తం గుండెకు చేరుతుంది. ఈ విధంగా రక్తం గుండె ద్వారా ఒకసారి మాత్రమే ప్రవహిస్తుంది.

రక్తం: ఎర్ర రక్త కణాలు, హీమోగ్లోబిన్‌తో కూడిన రక్తం ఉంటుంది.

ఉభయచరాలు

ప్రధానంగా సంవృత రక్త ప్రసరణ వ్యవస్థ ఉంటుంది. ద్విగుణ ప్రసరణ అసంపూర్ణంగా ఉంటుంది.

గుండె: రెండు కర్ణికలు, ఒక జఠరికతో కూడిన మూడు గదుల గుండె ఉంటుంది.

ప్రసరణ మార్గం: కుడి కర్ణిక ఆక్సిజన్ లేని రక్తాన్ని స్వీకరిస్తుంది. ఎడమ కర్ణిక ఆక్సిజన్ ఉన్న రక్తాన్ని (ఊపిరితిత్తులు/చర్మం నుంచి) స్వీకరిస్తుంది. రెండు రకాల రక్తం ఒకే జఠరికలో కలిసిపోతుంది. ఫలితంగా శరీరానికి సరఫరా అయ్యే ఆక్సిజన్ సహిత రక్తం కొంతవరకు మిశ్రమంగా ఉంటుంది. కాబట్టి ఇది అసంపూర్ణ ద్విగుణ ప్రసరణ వ్యవస్థ.

ఉదా: కప్ప

Word of the Day 865

Dissuade

Telugu meaning: నిస్తేజపరచు, విరమింపజేయు

English meaning: The word dissuade (డిస్వ్యేడ్) is a verb that means to persuade someone not to do something.

Synonyms: Discourage, Restrain

Antonyms: Encourage, Motivate

Usage: **1.** The teacher tried to dissuade the students from skipping classes by explaining its long-term consequences.

2. Friends often attempt to dissuade impulsive decisions that may lead to regret later.

నోటిఫికేషన్స్

ప్రొఫెసర్ పోస్టులు

ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) నొయిడా ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 21. అర్హులైన అభ్యర్థులు 2025, డిసెంబరు 24న ఇంటర్వ్యూకు హాజరుకావొచ్చు.

ఆపరేటర్ పోస్టులు

హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) ఆపరేటర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 156. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసేందుకు చివరి తేదీ 2025 డిసెంబరు 25.

యాక్ట్ అప్రెంటిస్ పోస్టులు

న్యూదిల్లీలోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్ (ఆర్ఆర్‌సీ) - నార్తర్న్ రైల్వే పరిధిలోని డివిజన్/ వర్క్‌షాప్/ యూనిట్లలో యాక్ట్ అప్రెంటిస్ శిక్షణ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 4,116. దరఖాస్తు రుసుము రూ.100. అర్హులైన అభ్యర్థులు 2025 డిసెంబరు 24లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (డిసెంబరు 19) చివరి తేదీ

- ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్ (ఏఎఫ్ క్యాట్) 01/2026. ఇంటర్/ప్లస్ 2, డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.
- బామర్ లారీలో అసిస్టెంట్ మేనేజర్, జూనియర్ ఆఫీసర్ పోస్టులు. డిప్లొమా, గ్రాడ్యుయేట్ డిగ్రీ, ఎంబీఏ, పీజీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.
- ఐఐటీ దిల్లీలో ప్రాజెక్ట్ సైంటిస్ట్ ఉద్యోగాలు. బీటెక్/ ఎంటెక్/ ఎమ్మెస్సీ/ ఎంసీఏ/ పీహెచ్‌డీలో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.
- బీఆర్ఐసీ - ఎన్ఐబీలో రిసెర్చ్ అసోసియేట్ పోస్టులు. పీహెచ్‌డీ ఉత్తీర్ణతతోపాటు పనిఅనుభవం ఉన్నవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ఉపేంద్రనాథ్ బ్రహ్మచారి

శాస్త్రవేత్తలు విశేషాలు



ఈయన భారతదేశానికి చెందిన ప్రముఖ వైద్యులు, శాస్త్రవేత్త. ట్రాపికల్ మెడిసిన్ (ఉష్ణమండల వైద్యం)లో అనేక ప్రయోగాలు చేశారు. ప్రజారోగ్యాన్ని కాపాడే అనేక ఆవిష్కరణలు చేశారు. ముఖ్యంగా పరాన్నజీవి కారణంగా సోకే కాలా-అజార్ వ్యాధికి ప్రభావవంత చికిత్స అయిన 'యూరియా స్టిబమైన్'ను కనుక్కున్నారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఆయన పేరు మారుమోగింది. దేశవ్యాప్తంగా అనేకమంది ప్రాణాలను కాపాడటంలో ఇది సఫలీకృతమైంది. వైద్యశాస్త్రంలో అనేక పర్యాయాలు ఆయన నోబెల్ పురస్కారానికి నామినేట్ అయ్యారు. వైద్య రంగంలో ఆయన చేసిన పరిశోధనలు నేటికీ అనేకమందికి మార్గదర్శకం. డిసెంబరు 19న ఉపేంద్రనాథ్ బ్రహ్మచారి జయంతి సందర్భంగా ఆయన జీవితంలోని ముఖ్య విషయాల గురించి తెలుసుకుందాం..!

బాల్యం - విద్యాభ్యాసం

ఉపేంద్రనాథ్ బ్రహ్మచారి 1873, డిసెంబరు 19న ప్రస్తుత పశ్చిమ బెంగాల్‌లోని బుర్ద్వాన్ జిల్లాలోని సర్దంగా గ్రామంలో జన్మించారు. పాఠశాల విద్యను బిహార్‌లోని జమాల్‌పూర్‌లో ఉన్న ఈస్టర్న్ రైల్వే బాయ్స్ హై స్కూల్‌లో పూర్తి చేశారు.


- 1893లో హూగ్లీ మొహ్సిన్ కాలేజీ నుంచి గణితం, రసాయన శాస్త్రంలో ఆనర్స్‌తో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీ పొందారు.

చివరగా: ఈయన కనిపెట్టిన 'యూరియా స్టిబమైన్' లక్షలాది ప్రజల ప్రాణాలను నిలబెట్టింది. ఇప్పటికీ ట్రాపికల్ డిసీజెస్ తగ్గించడంలో ఇది కీలకంగా ఉంది. అయితే వలస రాజ్య పాలన కారణంగా అంతర్జాతీయ స్థాయిలో ఆయనకు తగిన గుర్తింపు దక్కలేదనేది వాస్తవం. ఆయన 1946, ఫిబ్రవరి 6న కోల్‌కతాలో మరణించారు.

ఉపేంద్రనాథ్ బ్రహ్మచారి వృత్తి జీవిత విశేషాలు, యూరియా స్టిబమైన్ ఆవిష్కరణ, పొందిన అవార్డులు - గౌరవాలు తదితర సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - రసాయనశాస్త్రం

లోహసంగ్రహణశాస్త్రం



మన నిత్యజీవితంలో లోహాలు చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. బంగారం, వెండి, ప్లాటినం తదితర లోహాలను ఆభరణాల తయారీలో వాడతారు. రాగి, అల్యూమినియం లాంటి లోహాలను విద్యుత్ తీగల తయారీలో ఉపయోగిస్తారు. మరికొన్ని లోహాలను వంటపాత్రలు, గృహోపయోగ వస్తువుల తయారీలో విరివిగా వినియోగిస్తారు.

ధాతువు నుంచి ముడిలోహ సంగ్రహణం

ఒక లోహాన్ని దాని ధాతువుల నుంచి సంగ్రహించడం అనేది ఆ లోహ చర్యాశీలతపై ఆధారపడి ఉంటుంది.

- సోడియం, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, అల్యూమినియం లాంటి అధిక చర్యాశీలత ఉన్న లోహాల లోహ ధాతువులను సాధారణ క్షయకరణ పద్ధతులను ఉపయోగించి లోహ నిష్కర్షణ చేయలేం. ఈ లోహాలను సంగ్రహించేందుకు వాటి ద్రవరూప సమ్మేళనాలను విద్యుద్విశ్లేషణ చేస్తారు.

ప్రకృతిలో లోహాల ఉనికి

భూపటలంలో అత్యంత విస్తారంగా లభించే లోహం అల్యూమినియం. లోహాల్లో తర్వాతి విస్తృతిని ఇనుము ఆక్రమిస్తుంది.

లోహ ఖనిజాలు, ముఖ్యమైన ధాతువులు - రసాయన ఫార్ములాలు, లోహక్షయ నివారణ పద్ధతులు, లోహ శుద్ధి మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

'Veda of magical formulas' also known as..

Current Affairs

1. The Reserve Bank of India's Monetary Policy Committee met in early December 2025 for a bi-monthly review that was notable for its position in the financial calendar. Which of the following correctly describes this meeting?

A) 57th meeting and 4th bi-monthly review of FY 2025-26 chaired by Shaktikanta Das
B) 58th meeting and 5th bi-monthly review of FY 2025-26 chaired by Sanjay Malhotra
C) 59th meeting and final bi-monthly review of FY 2024-25 chaired by Sanjay Malhotra
D) 58th meeting and 6th bi-monthly review of FY 2025-26 chaired by Urjit Patel

2. At the ISSF World Cup Final - Doha 2025, an Indian shooter delivered a record-equalling performance in a pistol event. Which of the following correctly describes this achievement?

A) Simranpreet Kaur won gold in Women's 25 m Pistol, scoring 41/50 and equalling a junior world record.
B) Manu Bhaker won gold in Women's 10 m Air Pistol with a new Olympic record.
C) Esha Singh secured silver in Women's 25 m Pistol by breaking the Asian record.
D) Rahi Sarnobat won bronze in Women's 25 m Pistol with a finals record score.

3. Which financial institution recently became the first Payments Bank in India to receive in-principle approval from the Reserve Bank of India to convert into a Small Finance Bank, thereby gaining the ability to lend and accept higher deposits?

A) Paytm Payments Bank
B) India Post Payments Bank
C) Airtel Payments Bank
D) Fino Payments Bank

4. December 16 is observed as which internationally recognized day?

A) Human Rights Day
B) International Migrants Day
C) International Volunteer Day
D) Vijay Diwas

History

5. Which Veda is sometimes called the "Veda of magical formulas?"

A) Atharvaveda B) Shukla Yajurveda
C) Rig-Veda D) Krishna Yajurveda

6. Which Delhi Sultan attempted to shift the capital from Delhi to Daulatabad for administrative centralisation?

A) Firoz Shah Tughlaq
B) Muhammad Bin Tughlaq
C) Alauddin Khilji D) Balban

SSC Exams Special

General Awareness

7. Which of the following systems of Indian philosophy uphold the ideology of Charvakism, Ajivika, Jainism and Buddhism?

A) Orthodox System of Indian Philosophy
B) Unorthodox System of Indian Philosophy
C) Both A & B
D) None of the above

8. Which of the following features most clearly distinguishes the later Vedic political structure from the early Vedic system?

A) Emergence of hereditary kingship and large territorial states
B) Complete disappearance of popular assemblies
C) Absence of ritual authority of priests
D) Exclusive use of iron technology for warfare

Polity

9. The Constitution permits Parliament to regulate the use of official language for specific purposes even after the expiry of the initial language transition period. This provision primarily reflects which constitutional principle?

A) Supremacy of the Constitution
B) Doctrine of severability
C) Principle of cooperative federalism
D) Flexibility in language policy through parliamentary law

10. Which feature of the Indian Constitution most clearly differentiates an ordinance issued by the President from a bill passed by Parliament?

A) Ordinance ceases to operate if not approved by Parliament within a fixed time
B) Ordinance cannot amend any existing law
C) Ordinance is issued only during national emergency
D) Ordinance does not require executive advice

11. The concept of "double government" at the provincial level under the Government of India Act, 1919, was mainly characterized by which arrangement?

A) Complete control of provinces by elected ministers
B) Division of subjects into reserved and transferred categories
C) Joint responsibility of Governor and legislature
D) Abolition of central supervision over provinces

12. Which situation would most appropriately justify the invocation of Article 356, according to constitutional practice and judicial interpretation?

A) Failure of a state government to pass the budget
B) Loss of majority proved only through media reports
C) Breakdown of constitutional machinery demonstrated on the floor of the House
D) Delay in conducting local body elections

Scan the QR code for Key

These model questions were prepared by subject experts.

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు



◆ భారత దేశపు ఏ దిగ్గజ జావెలిన్ త్రోయర్, రెండు సార్లు ఒలింపిక్ పతక విజేతకు ఇటీవల భారత ప్రభుత్వం టెరిటోరియల్ ఆర్మీలో గౌరవ లెఫ్టినెంట్ కల్నల్ హోదాను ప్రదానం చేసింది?
జ: నీరజ్ చోప్రా

◆ దేశంలో రియల్-టైమ్ వరద అంచనా వ్యవస్థను ప్రారంభించిన మొదటి నగరంగా ఇటీవల ఏది ఘనత సాధించింది?
జ: చెన్నై (పట్టణ విపత్తు నిర్వహణను బలోపేతం చేస్తూ చెన్నై రియల్-టైమ్ ఫ్లడ్ ఫోర్‌కాస్టింగ్, స్పేషియల్ డెసిషన్ సపోర్ట్ సిస్టమ్‌ను పూర్తిగా అమలుచేసిన మొదటి భారతీయ నగరంగా అవతరించింది.)


◆ ఏటా ప్రపంచ నిరాయుధీకరణ వారోత్సవాలను ఎప్పుడు నిర్వహిస్తారు?
జ: అక్టోబరు 24-30 వరకు (ఐరాస దినోత్సవం సందర్భంగా ప్రపంచ నిరాయుధీకరణ సమస్యలపై అవగాహన, శాంతి, భద్రత, స్థిరమైన అభివృద్ధి పెంపొందించడమే లక్ష్యంగా ఈ వారోత్సవాలను నిర్వహిస్తారు.)

◆ న్యూయార్క్‌కు చెందిన గ్లోబల్ ఫైనాన్స్ సంస్థ ఏ భారత బ్యాంక్‌కు 'వరల్డ్స్ బెస్ట్ కన్స్యూమర్ బ్యాంక్ 2025' అవార్డును ప్రదానం చేసింది? (ఈ పురస్కారంతోపాటు 'భారత దేశంలో 'ఉత్తమ బ్యాంకు' పురస్కారాన్ని ఇది గెలుచుకుంది.)
జ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మరింత సమాచారం

అధిక అసహజ కాంతితో అనర్థాలు!

నగరాలు, పట్టణాల్లో రాత్రిళ్లు అధిక ప్రకాశవంతమైన వీధిలైట్లు మిరుమిట్లు గొలుపుతుంటాయి. వాణిజ్య భవనాలు, హోర్డింగుల్లో ఏర్పాటు చేసిన వెలుగులు జిగేల్‌మనిపిస్తుంటాయి. సహజమైన చీకటిని, వాతావరణాన్ని, అవసరానికి మించి భంగపరిచే ఈ చర్యలే కాంతి కాలుష్యానికి కారణమై మానవాళితో పాటు మిగతా ప్రాణులకూ ముప్పుగా మారాయి. నిద్రను, ప్రశాంతతను ఆటంకపరుస్తూ అనేక ఆరోగ్య సమస్యలను సృష్టిస్తున్నాయి. పక్షులు, తాబేళ్లు, కీటకాలు తదితర ప్రాణుల ఉనికికే ప్రశ్నార్థకం చేస్తున్న ఈ పర్యావరణ సమస్యపై పోటీ పరీక్షార్థులకు తగిన అవగాహన ఉండాలి. కాంతి కాలుష్య కారకాలు, ప్రభావాలు, నివారణ చర్యలతో పాటు చుట్టూ ఉద్భవిస్తూ, హానికరంగా పరిణమిస్తున్న వివిధ రకాల కిరణాలు, వాటితో ఉన్న ప్రమాదాలనూ తెలుసుకోవాలి.



జనరల్ స్టడీస్ - పర్యావరణ అంశాలు

కాంతి కాలుష్యం

ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలన్నింటిలోనూ కాంతి కాలుష్యం సమస్యగా మారుతోంది. అధికస్థాయి కాంతి ప్రభావానికి మనిషి గురికావడమే కాంతి కాలుష్యం. నగరాల్లోని ఇళ్లల్లో, వీధుల్లో, వాణిజ్య సముదాయాల వద్ద విపరీత స్థాయిలో విద్యుత్తు దీపాలను వినియోగించడం వల్ల బయటి వాతావరణంలో కృత్రిమ కాంతి పెరిగిపోయి కాంతి కాలుష్యం ఏర్పడుతోంది.

'సిటీస్ ఎట్ నైట్స్' పేరుతో ప్రపంచ వ్యాప్తంగా వివిధ నగరాల్లో కాంతి కాలుష్యం ఏ స్థాయిలో ఉందో అంచనా వేసేందుకు అంతరిక్ష పరిశోధకులు 2014లో ఒక ప్రాజెక్టు చేపట్టారు. ప్రధానంగా స్పెయిన్, కెనడా శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో మొదలైన ఈ కార్యక్రమంలో భాగంగా రాత్రిపూట అంతరిక్ష పరిశోధనా కేంద్రం నుంచి భూమి మీద నగరాలను పలు కోణాల్లో సుమారు 1.5 లక్షల ఫొటోలు తీశారు. రాత్రిపూట నగరాల్లో ఏ స్థాయిలో కాంతి ఉత్పన్నమవుతోంది, ఎక్కడి నుంచి అత్యధికంగా కాంతి వస్తోందో అంచనా వేశారు.



కాంతి కాలుష్య కారకాలు: అవసరం లేకపోయినప్పటికీ భవనాలను విపరీతంగా కాంతిమంతం చేయడం, వీధిదీపాలను సరిగా ఏర్పాటుచేయకుండా ఎక్కువ సామర్థ్యం కలిగి ఉన్నాయంటూ ఉపయోగిస్తున్న ఎల్‌ఈడీ లైట్లు అధిక కాంతి కాలుష్యానికి కారణమవుతున్నాయి. ఎల్‌ఈడీ లైట్లు ఎక్కువగా నీలం, ఆకుపచ్చ వెలుతురును విడుదల చేస్తాయి. దాంతో అర్ధరాత్రి వరకు కూడా ఆకాశం కాంతిమంతంగానే ఉంటోంది. భారీ భవన వాణిజ్య సముదాయాల్లో లైట్ల వినియోగం విపరీతంగా పెరగడం, వాణిజ్య హోర్డింగులను నియంత్రణకు మించి అనుమతించడం, టీవీలు, మొబైల్స్ తదితరాల్లో కాంతిమంతమైన తెరలను వినియోగించడం లాంటి చర్యలన్నీ అనర్థదాయకాలే.



కాంతి కాలుష్య నివారణ చర్యలు

కాంతి కాలుష్య నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలేవీ తీసుకోవడం లేదు. ఇప్పటికైనా కేంద్ర పర్యావరణ అడవుల మంత్రిత్వ శాఖ, దాని విభాగాలు కాంతి కాలుష్యాన్ని అరికట్టడానికి ప్రత్యేక నియమ నిబంధనలను రూపొందించాలి. ముందుగా ప్రజల్లో కాంతి కాలుష్య కారకాలు, వాటి హానికర ప్రభావాలపై అవగాహన పెంచాలి. అధిక కాంతి కాలుష్యానికి కారణమవుతున్న ఎల్‌ఈడీ లైటింగ్ వ్యవస్థను సక్రమంగా వినియోగించడంపై చర్యలు తీసుకోవాలి. ఎల్‌ఈడీ ఆధారిత మొబైల్, ల్యాప్‌టాప్, టీవీల ద్వారా వచ్చే సమస్యలను ప్రచారం చేయాలి.

◆ రాత్రి నిద్రపోవడానికి గంట ముందు నుంచి ఏ రకమైన కాంతిమంతమైన స్క్రీన్‌లు చూడకుండా ప్రజలు జాగ్రత్త పడాలి. ముఖ్యంగా పిల్లలు నిద్రపోవడానికి కనీసం గంట ముందు వరకు టీవీలతో గడపకుండా చూసుకోవాలి. విద్యుత్తు దీపాలు, వాణిజ్య సముదాయాల్లో వినియోగించే లైటింగ్ వ్యవస్థల కాంతి నేల మీదకు మాత్రమే ప్రసరించే విధంగా ఉండాలి. ఇందుకోసం లైటింగ్ వ్యవస్థల పైభాగాల్లో హుడ్ ఏర్పాటు చేయాలి.



కాంతి కాలుష్య ప్రభావాలు

కాంతి కాలుష్యం వల్ల సహజ కాంతి తీరుతెన్నులు మారిపోతున్నాయి. ఫలితంగా వాతావరణం, జీవజాలం దెబ్బతింటున్నాయి. నిద్ర పోయే ముందు స్మార్ట్‌ఫోన్లు, ట్యూబ్‌లైట్లు, కంప్యూటర్ల మీద ఉండే ఎల్‌ఈడీ స్క్రీన్‌లు చూడటం ద్వారా నిద్రలేమి సమస్యలు వస్తాయి. సాధారణంగా శరీరంలో నిద్ర మెలకువలను మెదడులోని పీనియల్ గ్రంథి నుంచి విడుదలయ్యే మెలటోనిన్ అనే హార్మోన్ నియంత్రిస్తుంది. రాత్రిపూట అధిక కాంతి ప్రభావానికి గురికావడం ద్వారా ఆ హార్మోన్ విడుదల తగ్గుతుంది. ఫలితంగా నిద్రలేమి సమస్య వస్తుంది. అధిక కాంతి ప్రభావానికి గురైతే ఆతృత, చికాకు, కోపం, గగుర్పాటు, ఆందోళన, తలనొప్పి లాంటి లక్షణాలు ఏర్పడతాయి. దీర్ఘకాలిక కాంతి కాలుష్యానికి గురైతే ఊబకాయం వస్తుంది. లైంగికసామర్థ్యం తగ్గుతుంది. నిద్రలేమి సమస్య పెరుగుతుంది.



◆ సాధారణంగా తెల్లవారుజామున వాతావరణం స్వచ్ఛంగా అనిపించడానికి కారణం గాలిలోని నైట్రేట్ అణువులు. అయితే రాత్రి గాలిలోకి కాంతి అధికంగా విడుదలవడం ద్వారా ఈ నైట్రేట్ అణువుల పనితీరు 7% వరకు దెబ్బతింటుంది. దాంతో కాలుష్యం తగ్గే అవకాశం లేకపోవడంతో, గాలిలో ఓజోన్ సంబంధిత కాలుష్య కారకాలు 5% పెరిగి, అలర్జీల లాంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. కాంతి కాలుష్యం ద్వారా అంతరిక్ష పరిశోధకులకు కూడా పలు సమస్యలు ఎదురవుతున్నాయి. ఆకాశం వైపు కాంతిని ఎక్కువగా విడుదల చేస్తుండటం ద్వారా ఏర్పడే గ్లేర్ (మసక మెరుపు) ఫలితంగా ఆకాశం స్పష్టంగా కనిపించదు. ఫలితంగా పాలపుంతలను, అంతరిక్షాన్ని అధ్యయనం చేయడంలో ఇబ్బందులు ఎదురవుతాయి.

◆ వన్యజాతులపై కూడా కాంతి కాలుష్య ప్రభావాన్ని గుర్తించారు. పరభక్షక జంతువులు ఎక్కువగా రాత్రిపూట సంచరిస్తాయి. పర్యావరణంలో కళేబరాలను చీల్చే పారిశుద్ధ్య కార్మికజీవులు కూడా రాత్రిపూట చురుగ్గా ఉంటాయి. అయితే కాంతి కాలుష్యం వీటి జీవన విధానాన్ని దెబ్బతీస్తుంది. రాత్రుళ్లు ఒడ్డుకు వచ్చి గుడ్లు పెట్టే సముద్ర తాబేళ్లు తీరం వద్దకు రాలేకపోతున్నాయి. సాధారణంగా తీరం వద్ద నాచును తినే డాల్ఫిన్‌లు కాంతి కాలుష్య ప్రభావంతో తీరం వైపు రాకపోవడంతో అక్కడ నాచు విపరీతంగా పెరిగి, నీటి స్వభావం మారుతోంది. రాత్రిపూట సంతానవృద్ధిని నిర్వహించే కప్పలు, సీతాకోకచిలుకలు తదితర జీవులు, రాత్రిపూట మాత్రమే పరాగసంపర్కానికి గురయ్యే పుష్పాలు కాంతి కాలుష్యానికి తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. వాటి జీవితచక్రాలు దెబ్బతిని భవిష్యత్తులో పూర్తిగా అంతరించే ప్రమాదం కూడా ఉంటుంది.





రచయిత: ఈదుబిల్లి వేణుగోపాల్

సీనియర్ ఇంటర్ రసాయన శాస్త్రం - ద్రావణాలు

ఫైనల్ పరీక్షలు 2026 - ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు

2 మార్కులు

1. **రౌల్ట్ నియమాన్ని రాయండి.**

జ: రౌల్ట్ నియమం(బాష్పశీల ద్రావితం): బాష్పశీల ద్రవాల ద్రావణంలోని ప్రతి అనుఘటక పాక్షిక బాష్పపీడనం, అనుఘటకం మోల్ భాగానికి అనులోమానుపాతంలో ఉంటుంది.

2. **హెన్రీ నియమాన్ని రాయండి.**

జ: హెన్రీ నియమం: స్థిర ఉష్ణోగ్రత వద్ద ద్రవంలో వాయువు ద్రావణీయత, ద్రవం లేదా ద్రావణం ఉపరితలంపై ఉన్న వాయువు పాక్షిక పీడనానికి అనులోమానుపాతంలో ఉంటుంది. లేదా బాష్ప స్థితిలోని వాయువు పాక్షిక పీడనం (p) ద్రావణంలోని వాయువు మోల్ భాగానికి (x) అనులోమానుపాతంలో ఉంటుంది.

$P = K_H \times x$

$\therefore K_H$ = 'హెన్రీ నియమ స్థిరాంకం'

3. **ఎబులియోస్కోపిక్ స్థిరాంకం అంటే ఏమిటి?**

జ: ఎబులియోస్కోపిక్ స్థిరాంకం: అబాష్పశీల ద్రావితం కలిగి ఉన్న ఒక మోలాల్ ద్రావణంలో పరిశీలించిన బాష్పీభవన స్థాన నిమ్నతను 'ఎబులియోస్కోపిక్ స్థిరాంకం' లేదా 'మోలాల్ నిమ్నత స్థిరాంకం' అంటారు.

4. **క్రయోస్కోపిక్ స్థిరాంకం అంటే ఏమిటి?**

జ: అబాష్పశీల ద్రావితం కలిగి ఉన్న ఒక మోలాల్ ద్రావణంలో పరిశీలించిన ఘనీభవన స్థాన నిమ్నతను 'క్రయోస్కోపిక్ స్థిరాంకం' లేదా 'మోలాల్ నిమ్నత స్థిరాంకం' అంటారు.

5. **ద్రవాభిసరణ పీడనాన్ని నిర్వచించండి.**

జ: ద్రవాభిసరణ పీడనం: ద్రవాభిసరణం జరగకుండా ద్రావణంపై కలగజేసే పీడనాన్ని 'ద్రవాభిసరణ పీడనం' అంటారు.

6. **ఐసోటోనిక్ ద్రావణాలు అంటే ఏమిటి?**

జ: 'ఒక స్థిర ఉష్ణోగ్రత వద్ద ఉన్న ద్రావణాల్లో ద్రవాభిసరణ పీడనం సమానంగా ఉన్నట్లయితే వాటిని 'ఐసోటోనిక్ ద్రావణాలు' అంటారు. ఉదా: సెలైన్ (0.9% (WV) $NaCl$ ద్రావణం)తో రక్తం ఐసోటోనిక్‌గా ఉంటుంది.

7. **వాంట్‌హాఫ్ గుణకం (i) అంటే ఏమిటి?**

జ: వాంట్ హాఫ్ గుణకం (i): 'ప్రయోగం ద్వారా నిర్ణయించిన కణాధార ధర్మం విలువ, లెక్కించిన కణాధార ధర్మం విలువల నిష్పత్తిని వాంట్ హాఫ్ గుణకం (i) అంటారు.

8. **సాపేక్ష బాష్పపీడన నిమ్నత అంటే ఏమిటి?**

జ: సాపేక్ష బాష్పశీల ద్రావితం కలిగిన ఒక ద్రావణంలో బాష్పపీడన నిమ్నతకు, శుద్ధ ద్రావణి బాష్పపీడనానికి ఉన్న నిష్పత్తిని సాపేక్ష బాష్పపీడన నిమ్నత అంటారు.

సాపేక్ష బాష్ప పీడన నిమ్నత $= \frac{P_0 - P_s}{P_0}$

$P_0 - P_s$ = బాష్పపీడనం నిమ్నత P_0 = శుద్ధ ద్రావణి బాష్పపీడనం

మరికొన్ని ప్రశ్నలు-జవాబులు

రచయిత: పి.త్రినాథ రాజా

తరంగాల తాకిడితో తయారయ్యే వంతెనలు!

భూమిపై నిరంతరం పని చేసే అంతర్జనిత, బహిర్జనిత శక్తుల ప్రభావంతో పర్వతాలు, పీఠభూములు, మైదానాలు, లోయలు, ఎడారులు, తీర ప్రాంతాలు, హిమానీనదాలు సహా అగ్నిపర్వతాలు తదితర భూస్వరూపాలు ఏర్పడుతుంటాయి. భూ ఉపరితలంపై ఆ భౌగోళిక ఆకారాలతోపాటు నదీ ప్రవాహాలు, సముద్ర తరంగాలు, భూగర్భ జలాలు సృష్టించే వివిధ స్వరూపాలూ కనిపిస్తుంటాయి. విభిన్న భౌగోళిక పరిస్థితులను, సుందర ప్రకృతి దృశ్యాలను ఆవిష్కరించే అలాంటి స్వరూపాలు, ప్రపంచవ్యాప్తంగా వాటి విస్తరణ తీరుపై పోటీ పరీక్షార్థులకు స్థూల అవగాహన ఉండాలి. ప్రకృతి శక్తుల ప్రభావం, క్రమక్షయంతో దేశంలో రూపుదిద్దుకున్న వైవిధ్యభరిత భూస్వరూపాల గురించి తెలుసుకోవాలి.



ప్రపంచ భూగోళ శాస్త్రం

ప్రధాన భూస్వరూపాలు

1. కింది వాటిలో పర్వతాలకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.
   ఎ) కాలిడోనియన్ పర్వతాలు దాదాపుగా 430-380 మిలియన్ ఏళ్ల కిందట ఏర్పడి ఉంటాయని భూగోళ శాస్త్రవేత్తలు భావిస్తారు.
   బి) ఆల్ఫైన్ పర్వతాలు దాదాపుగా 65 మిలియన్ సంవత్సరాల కిందట ఆవిర్భవించాయని అంచనా.
   సి) ప్రికాంబ్రియన్ పర్వతాలు దాదాపుగా 4 బిలియన్ ఏళ్ల కిందట ఆవిర్భవించాయని భావిస్తున్నారు.
   డి) హెర్సినియన్ పర్వతాలు సరాసరిగా 340 నుంచి 225 మిలియన్ సంవత్సరాల మధ్య ఆవిర్భవించి ఉంటాయని శాస్త్రవేత్తల అంచనా.
   1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
   2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
   3) ఎ, బి, సి, డి సరైనవి.
   4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

2. కింది వాటిని జతపరచండి.

పర్వతాలు	దేశాలు
ఎ) అల్టై పర్వతాలు	1) ఉత్తర అమెరికా
బి) ఆల్గోమెన్ పర్వతాలు	2) స్వీడన్
సి) స్కాండవేనియన్ పర్వతాలు	3) చైనా, మంగోలియా
డి) రాకీ పర్వతాలు	4) అమెరికా, కెనడా

   1) ఎ-3, బి-4, సి-2, డి-1 2) ఎ-1, బి-2, సి-3, డి-4
   3) ఎ-1, బి-4, సి-3, డి-2 4) ఎ-1, బి-3, సి-2, డి-4

3. కింది వాటిలో క్రమక్షయ పర్వతాలకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.
   ఎ) అవశిష్ట పర్వతాలు ప్రధానంగా బాహ్యజనిత కారణాలైన పవనాలు, నదుల ప్రవాహ చర్యలతో ఏర్పడతాయి.
   బి) మన దేశంలోని ఆరావళి పర్వతాలు ప్రపంచంలోనే అతిపురాతన అవశిష్ట పర్వతాలు.
   సి) పరిశిష్ట పర్వతాలు ప్రధానంగా పీఠభూములు, మైదానాలు క్రమక్షయానికి లోనయ్యే క్రమంలో ఏర్పడతాయి.
   డి) గుజరాత్‌లోని గిర్ కొండలు, ఝార్ఖండ్‌లోని రాజమహల్ కొండలు పరిశిష్ట పర్వతాలకు చెందినవి.
   1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు
   2) ఎ, బి, సి, డి సరైనవి
   3) ఎ, బి సరైనవి; సి, డి సరికావు
   4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు



4. కింది వాటిని జతపరచండి.

అగ్ని పర్వతాలు	ఖండాలు
ఎ) మౌంట్‌బోనా	1) ఆసియా
బి) చింబరాజో	2) యూరప్
సి) వెసువియస్	3) ఉత్తర అమెరికా
డి) కుచలస్కియా	4) దక్షిణ అమెరికా

   1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-1, బి-2, సి-3, డి-4
   3) ఎ-1, బి-4, సి-3, డి-2 4) ఎ-3, బి-4, సి-2, డి-1

5. కింది వాక్యాలను సరిచూడండి.
   ఎ) పర్వతాంతర పీఠభూములు.. పర్వతాలకు మధ్యన ఉంటూ ప్రపంచంలో ఎత్తయిన పీఠభూముల రకానికి చెందినవిగా ఉంటాయి.
   బి) దేశంలో లడ్డాఖ్ పీఠభూమి.. కారాకోరం, లడ్డాఖ్ పర్వతాల మధ్య విస్తరించి ఉంటుంది.
   సి) పర్వతపాద పీఠభూములకు ఒకవైపున పర్వతాలు సరిహద్దుగా ఉండి విస్తరించి ఉంటాయి.
   డి) దేశంలో విస్తరించిన మాల్వా పీఠభూమి.. పర్వత పాద పీఠభూమిగా ఉంటూ పశ్చిమ వైపున ఆరావళి పర్వతాలను సరిహద్దుగా కలిగి ఉంటుంది.
   1) ఎ, బి, సి, డి సరైనవి.
   2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
   3) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
   4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

6. కింది వాటిని జతపరచండి.

పీఠభూమి	సరిహద్దు పర్వతాలు
ఎ) పెటగోనియన్	1) కున్‌లున్‌షాన్
బి) పామీర్	2) రాకీ పర్వతాలు
సి) కొలరాడో	3) కారాకోరం
డి) టిబెట్	4) ఆండీస్ పర్వతాలు

   1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-1, బి-2, సి-3, డి-4
   3) ఎ-3, బి-4, సి-2, డి-1 4) ఎ-1, బి-3, సి-2, డి-4

7. పీఠభూములకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.



   ఎ) దేశంలో దక్కన్ పీఠభూమిని లావా పీఠభూముల రకానికి చెందినదిగా గుర్తిస్తారు.
   బి) ద్వీపకల్ప పీఠభూమిని ఖండాంతర్గత పీఠభూమి రకానికి చెందినదిగా గుర్తిస్తారు.
   సి) చోటానాగపూర్ పీఠభూమి ప్రధానంగా కలశ పీఠభూమి రకానికి చెందింది.
   డి) బుందేల్‌ఖండ్, బాగేల్‌ఖండ్ పీఠభూములు అవశిష్ట పీఠభూమి రకానికి చెందినవి.
   1) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
   2) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
   3) ఎ, బి, సి, డి సరైనవి.
   4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

8. కింది వాటిలో హిమానీనద భూస్వరూపాలకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.



   ఎ) ఖండాంతర్గత హిమానీనదాలను ఐస్ షీట్స్ అంటారు. ఇవి వేల కిలోమీటర్లు వ్యాపించి ఉంటాయి.
   బి) హిమానీనదాల్లో కొన్ని 50,000 చ.కి.మీ.ల కంటే తక్కువ వైశాల్యంలో విస్తరించి ఉంటే వాటిని ఐస్ క్యాప్స్ అనికూడా పిలుస్తారు.
   సి) అంటార్కిటికాలోని బటర్ పాయింట్ హిమానీనదం గిరిపాద హిమానీనదానికి ఉదాహరణ.
   డి) ఎరిట్, కాల్, హిమగర్తాలు లాంటివి హిమానీనదాల క్రమక్షయ చర్యల వల్ల ఏర్పడతాయి.
   1) ఎ, బి, సి, డి సరైనవి.
   2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
   3) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
   4) ఎ, సి సరైనవి; బి, డి సరికాదు.

9. కింది వాటిని జతపరచండి.

అగ్నిపర్వతం	దేశం
ఎ) మానకియ	1) ఈక్వెడార్
బి) కటమాయి	2) ఇటలీ
సి) ఎట్నా	3) అలస్కా
డి) కోటోపాక్సీ	4) హవాయి

   1) ఎ-1, బి-2, సి-3, డి-4 2) ఎ-4, బి-3, సి-2, డి-1
   3) ఎ-1, బి-4, సి-2, డి-3 4) ఎ-3, బి-4, సి-2, డి-1

10. కింది వాటిని జతపరచండి.

జాబితా - 1	జాబితా - 2
ఎ) రోచెమౌటిని	1) అంతర్భూజాలం
బి) దుముకుడు గుంతలు	2) పవనాలు
సి) బార్కన్స్	3) నదులు
డి) కందకాలు	4) హిమానీనదం

   1) ఎ-1, బి-2, సి-3, డి-4 2) ఎ-3, బి-4, సి-2, డి-1
   3) ఎ-4, బి-3, సి-2, డి-1 4) ఎ-1, బి-4, సి-3, డి-2

11. కింది వాటిలో సముద్ర భూస్వరూపాలకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.
   ఎ) సముద్ర గుహలు, బ్లోహోల్స్, సీ స్టాక్స్ అనేవి ప్రధానంగా సముద్ర క్రమక్షయ భూస్వరూపాల్లో భాగంగా ఏర్పడతాయి.
   బి) బారియర్స్, లాగూన్, సోల్స్ ప్రధానంగా సముద్ర నిక్షేపణ చర్యల వల్ల ఏర్పడతాయి.
   సి) సముద్ర తీరప్రాంతంలోని శిలలు నిత్యం తరంగాల తాకిడికి లోనవుతూ అందులో మెత్తని శిలాపదార్థం శైథిల్యం చెందగా మిగిలింది ఒక వంతెన ఆకారంలో ఉంటే వాటిని 'సముద్ర కృత వంతెనలు' అంటారు.
   డి) బారియర్స్ సహజంగా నాలుక ఆకారంలో ఒకవైపు నేలభాగాన్ని అంటుకుని ఉంటూ, వేరొక కొన సముద్రంలోకి వ్యాపించి ఉంటే దాన్ని 'స్పిట్' అని పిలుస్తారు.
   1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
   2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
   3) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.
   4) ఎ, బి, సి, డి సరైనవి.

12. కింది వాటిలో సరికాని జతలను గుర్తించండి.
   ఎ) పుట్టగొడుగు శిలలు - నదులు
   బి) సహజ లెవీలు - హిమానీనదాలు
   సి) స్పర్స్ - నదులు
   డి) యార్డంగ్స్ - పవనాలు
   1) ఎ, బి, సి 2) ఎ, బి
   3) సి, డి 4) ఎ, బి, సి, డి


13. కింది వాటిలో సరైన జతలను గుర్తించండి.
   ఎ) నదులు - పాట్‌హోల్స్
   బి) పవనాలు - జ్యూగెన్స్
   సి) సముద్ర అలలు - తేనెపట్టు శిల
   డి) అంతర్భూజలం - స్టాలిగ్‌మైట్
   1) ఎ, బి, సి 2) ఎ, బి, డి
   3) ఎ, బి 4) సి, డి

14. కింది వాక్యాలను సరిచూడండి.
   ఎ) బాల్సన్‌లు అంటే ఎడారి ప్రాంతంలో తాత్కాలికంగా ప్రవహించే నదులు. తమ చుట్టూ కొండలు లేదా ఎత్తయిన ఇతర భూస్వరూపాల కారణంగా ఆ నీరు లోతట్టు ప్రాంతంలోకి ప్రవహించగా ఏర్పడే సరస్సులు.
   బి) యువాల అనే భూస్వరూపం అంతర్భూజల క్రమక్షయ ప్రక్రియ వల్ల ఏర్పడింది.
   సి) సున్నపురాళ్ల అంతర్భూజలం లేదా వర్షపు నీటిలో కరుగుతూ పల్లపు ప్రదేశంగా ఏర్పడితే వాటిని 'సింక్‌హోల్' అంటారు.
   డి) ఆర్టీజియన్ బావులు ప్రధానంగా అంతర్భూజల క్రమక్షయ చర్యల కారణంగా ఏర్పడతాయి.



   1) ఎ, బి, సి, డి సరైనవి.
   2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
   3) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
   4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

15. కింది వాక్యాలను సరిచూడండి.
   ఎ) హిమగర్తాలు ప్రధానంగా హిమానీనదాలు పర్వతాల నుంచి జాలువారే క్రమంలో ఏర్పడిన భూస్వరూపాలు.
   బి) హిమగర్తాలు రెండు లేదా మూడు పక్కపక్కన ఏర్పడే క్రమంలో కత్తి లాంటి ఆకారంలో భూస్వరూపం ఏర్పడితే దాన్ని 'ఎరిట్' అంటారు.
   సి) ఫియార్డ్స్, కాల్, హర్న్ అనేవి ప్రధానంగా హిమానీనద క్రమక్షయ చర్యల కారణంగా ఏర్పడతాయి.
   డి) హిమానీనదాలు ప్రవహించే లోయలు 'యూ' ఆకారంలో ఉంటాయి. కానీ వాటి ఏర్పాటులో హిమానీనదాల పాత్ర పాక్షికంగా ఉంటుంది.
   1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
   2) ఎ, బి, సి, డి సరైనవి.
   3) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.
   4) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.



రచయిత: బండ్ల శ్రీధర్

సమాధానాలు

1-3, 2-1, 3-2, 4-4, 5-1, 6-1, 7-3, 8-1, 9-2, 10-3, 11-4, 12-2, 13-2, 14-1, 15-2.

నీతీశ్ చేసిన దాంట్లో తప్పేముంది: కేంద్ర మంత్రి

దిల్లీ: మహిళా డాక్టర్ హిజాబ్ లాగడంతో బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్‌పైన విపక్షాలు తీవ్రంగా విమర్శలు గుప్పిస్తున్నాయి. వెంటనే ఆయన బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండు చేస్తున్నాయి. ఈ విషయంపై కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ స్పందించారు. 'అపాయింట్‌మెంట్ తీసుకోవడానికి వచ్చి మొహం చూపిస్తే తప్పేముంది.. ఆమె ఉద్యోగం కోసం వెళ్లారు. పాస్‌పోర్టు కోసం వెళ్తే మొహాన్ని చూపించరా.. విమానాశ్రయానికి వెళ్లినప్పుడు చూపిస్తారు కదా.. నీతీశ్ చేసిన దాంట్లో తప్పేముంది' అంటూ ఆయన చర్యను సమర్థించారు. నీతీశ్ తీరుతో బాధితురాలు వైద్య వృత్తిని చేపట్టేందుకు నిరాకరించారంటూ వస్తున్న వార్తలపైనా ఆయన స్పందించారు. 'ఆమె ఉద్యోగాన్ని తిరస్కరించినా, నరకానికి వెళ్లినా.. అది ఆమె నిర్ణయం' అంటూ అసహనం వ్యక్తం చేశారు. అయితే నీతీశ్ చర్యను పశ్చిమాసియా దేశాలు మూకుమ్మడిగా విమర్శించాయి. అది ముస్లిం సంప్రదాయాలను అవహేళన చేయడమేనని పేర్కొన్నాయి. నీతీశ్, గిరిరాజ్ సింగ్‌లపై ప్రతిపక్ష నేతలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

కోర్టులు, బ్యాంకులకు బాంబు బెదిరింపులు

ముంబయి: మహారాష్ట్రలోని ముంబయి, నాగ్‌పుర్‌లలో పలు కోర్టులు, బ్యాంకులు, దుకాణ సముదాయాలకు గురువారం బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో ముంబయిలోని హైకోర్టుతోపాటు పలు కోర్టుల్లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. పోలీసులు, బాంబు తనిఖీ బృందాలు సోదాలు నిర్వహించి ఉత్తుత్తి బెదిరింపులేనని తేల్చారు. మధ్యాహ్నం 2 గంటలకు ఆర్‌డీఎక్స్ పేలుతుందని ఇజ్రాయెల్ ఐపీ అడ్రస్ కలిగిన ఈమెయిల్ ఖాతా నుంచి గురువారం ఉదయం ఈమెయిళ్లు వచ్చాయి. హైకోర్టు, సెషన్స్ కోర్టు, దక్షిణ ముంబయిలోని మజ్గావ్, ఎస్ప్లనేడ్, బాంద్రా, అంధేరీల్లోని స్థానిక కోర్టులకు ఈ బెదిరింపులు అందాయి. అధికారులు వెంటనే ఆ ప్రాంతాలను ఖాళీ చేయించారు. అయితే పోలీసులు ఎక్కడా ఎలాంటి అనుమానాస్పద వస్తువులనూ గుర్తించలేదు. నాగ్‌పుర్ ధర్మాసనం భవనం సహా పలు కోర్టులకూ బెదిరింపులు వచ్చాయి. హైకోర్టు కార్యకలాపాలకు దాదాపు గంటపాటు అంతరాయం కలిగిందని ముంబయి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నితిన్ ఠక్కర్ తెలిపారు.

అణు పరీక్షలు చేసి తీరుతాం

- అమెరికా ఇంధనశాఖ మంత్రి

వియెన్నా: అణు పరీక్షల్ని పునరుద్ధరిస్తామంటూ తమ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనను అమెరికా రాయబారి వియెన్నాలో అమెరికా దౌత్య ప్రతినిధి హోవార్డ్ సాలమన్ సమర్థించారు. రష్యా, చైనా, ఉత్తర కొరియాలు రెచ్చగొట్టే విధంగా అణ్వాయుధ విధానాలు కొనసాగిస్తున్న నేపథ్యంలో తామూ అణు పరీక్షల్ని పునరుద్ధరించక తప్పదని సాలమన్ అన్నారు. ఇటీవల జరిగిన అణ్వస్త్ర పరీక్ష నిషేధ సంస్థ సన్నాహక కమిషన్ సమావేశంలో ఆయన ఈ మాటలన్నారు. "అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నట్టుగా ఈ విషయంలో అమెరికా ప్రత్యర్థులతో సమానంగా ఉంటుంది. అణ్వాయుధ పరీక్షల అంశంలో ప్రత్యర్థులు తీసుకుంటున్న చర్యల పట్ల పారదర్శకత పట్ల మాకున్న నిబద్ధత అనుగుణంగా ముందుకు సాగుతాం" అని ఆయన తెలిపారు. "రష్యా చైనాలు అణ్వస్త్ర పరీక్షల మారటోరియంను ఉల్లంఘిస్తున్నాయని 2019 నుంచీ అమెరికా ఆరోపిస్తోంది. అవి రహస్యంగా చేస్తున్నాయి" అని సాలమన్ వెల్లడించారు. నాటి నుంచీ అమెరికా లేవనెత్తుతున్న ఆందోళన నేటికీ పరిష్కారం కాలేదన్నారు.

తల్లిదండ్రులను చంపి, ముక్కలుగా కోసి.. నదిలో పడేశాడు

జౌన్‌పుర్ (యూపీ): ఉత్తర్‌ప్రదేశ్‌లోని జౌన్‌పుర్ జిల్లా జఫ్రాబాద్ పోలీస్‌స్టేషను పరిధిలోని అహ్మద్‌పుర్ గ్రామంలో రిటైర్డ్ రైల్వే ఉద్యోగి ఇంట్లో జరిగిన దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ కలహాలు, డబ్బు కారణంగా తలెత్తిన వివాదం ముదిరి తల్లిదండ్రులను హత్యచేసిన కుమారుడు.. వారి మృతదేహాలను రంపంతో ముక్కలుగా కోసి గోమతి నదిలో పడేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నెల 8 నుంచి తన తండ్రి శ్యామ్ బహదూర్ (62), తల్లి బబిత (58)ను లేక లేదని నిందితుడు అంబేశ్ నాటకమాడాడు. పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన తనయుడి తీరుపై అనుమానం వచ్చిన పోలీసులు విచారించగా అసలు విషయం బయటపడింది. మృతదేహాలను గోనెసంచుల్లో కుక్కి కొంత భాగం నదిలో పడేసినట్లు తెలిపారు. హత్యల అనంతరం మృతదేహాలను ముక్కలుగా కోసి ప్లాస్టిక్ సంచుల్లో నింపి కారులో తీసుకువెళ్లి గోమతి నదిలో పడేసినట్లు విచారణలో ఒప్పుకొన్నాడు. తర్వాత తల్లిదండ్రులు కనిపించడం లేదని తన సోదరికి చెప్పాడు. ఫోను స్విచ్ఛాఫ్ చేసుకొని తానూ అదృశ్యమయ్యాడు. అనుమానం వచ్చిన సోదరి బహదూర్ కుమార్తె డిసెంబరు 13న పోలీసులను ఆశ్రయించారు. ఆ తర్వాత ఇంటికి తిరిగి వచ్చిన అంబేశ్ తన నేరాన్ని అంగీకరించడంతో డిసెంబరు 16న పోలీసులు అతడిని అరెస్టు చేశారు.

ఇంటి అద్దె అడిగేందుకు వెళితే చంపేశారు

గాజియాబాద్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియాబాద్‌లో ఇంటి అద్దె అడిగేందుకు వెళ్లిన మహిళను కిరాయిదారులు దారుణంగా హత్య చేశారు. దీపిక శర్మ (48), ఉమేశ్‌శర్మ దంపతులకు ఔరా చిమేరా సొసైటీలో రెండిళ్లు ఉన్నాయి. వాటిలో రెండో ఫ్లాటును అజయ్ గుప్తా (35), ఆకృతి గుప్తా (33) అనే జంటకు అద్దెకిచ్చారు. గడువు దాటినా వారి నుంచి అద్దె వసూలు కాకపోవడంతో అడుగుదామని బుధవారం సాయంత్రం వెళ్లిన దీపిక రాత్రి దాకా తిరిగి రాలేదు. అనుమానం వచ్చిన పనిమనిషి మెట్లమీదుగా వెళ్లి అక్కడి వెతకగా ఆగ్రహిత దారుణం బయటపడింది. దీపికను హత్య చేసిన అజయ్ దంపతులు ఓ ఎర్రటి బ్యాగులో మృతదేహాన్ని కుక్కి, తరలించే ప్రయత్నంలో ఉండగా పనిమనిషి బంధువుల సాయంతో పోలీసులకు సమాచారం ఇచ్చింది. రాత్రి 11:15 గంటలకు అందిన సమాచారం మేరకు ఘటనాస్థలికి చేరుకొని అజయ్, ఆకృతిలను అరెస్టు చేసినట్లు నంద్‌గ్రామ్ ఏసీపీ ఉపాసనా పాండే తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

చౌకగానో.. ఉచితంగానో హెచ్‌పీవీ వ్యాక్సిన్

క్యాన్సర్ రోగుల్లో మనది మూడో స్థానం • పార్లమెంటులో వెల్లడించిన జితేంద్ర సింగ్



దిల్లీ: గర్భాశయ ముఖద్వార సంబంధ క్యాన్సర్‌ను నివారించే హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను ఎక్కువమందికి ఉచితంగానో, చౌకధరలోనో అందించడానికి కేంద్రం ప్రయత్నిస్తోందని ప్రధానమంత్రి కార్యాలయ సహాయమంత్రి జితేంద్ర సింగ్ చెప్పారు. ప్రపంచంలో క్యాన్సర్ బాధితుల సంఖ్య పరంగా చైనా, అమెరికా తర్వాత మన దేశం మూడోస్థానంలో ఉందని, 2040 నాటికి దేశంలో క్యాన్సర్ రోగుల సంఖ్య ఏటా 20 లక్షలకు చేరే అవకాశం ఉందని వెల్లడించారు. గురువారం రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో అనుబంధ ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. ప్రపంచంలో ఇప్పుడు ఏటా 2 కోట్ల మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని, వీరిలో 15 లక్షల మంది భారతీయులేనని తెలిపారు. ఒకప్పుడు జీవిత చరమాంకంలో వచ్చే క్యాన్సర్ వంటివి ఇప్పుడు చిన్నవయసులోనే సోకుతున్నాయని, హృద్రోగాలదీ ఇదే పరిస్థితి అని చెప్పారు.

✦ ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వం పొందడానికి కేంద్రం అత్యంత ప్రాధాన్యమిస్తోందని విదేశీ వ్యవహారాల శాఖ సహాయమంత్రి కీర్తి వర్ధన్‌సింగ్ రాజ్యసభలో తెలిపారు. సంస్కరణల్ని కోరుకుంటున్న ఇతర కూటములు, దేశాలతో కలిసి ఈ దిశగా అన్ని ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు.

✦ రష్యా సైనిక దళాల్లో పనిచేస్తున్న 26 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం అందిందని, మరో 50 మంది విడుదలకు ప్రయత్నాలన్నీ చేస్తున్నామని ప్రభుత్వం తెలిపింది.

'పీఎం, సీఎంల తొలగింపు'లపై కమిటీకి గడువు పెంపు

తీవ్ర నేరాభియోగాల్లో అరెస్టయి నెలలోగా బెయిల్ రాకపోతే ప్రధాని, ముఖ్యమంత్రులు, కేంద్ర/ రాష్ట్ర మంత్రులను పదవుల నుంచి తొలగించే బిల్లుపై నివేదిక సమర్పణకు పార్లమెంటరీ సంయుక్త సంఘానికి మరింత గడువునిస్తూ లోక్‌సభ నిర్ణయించింది. బడ్జెట్ సమావేశాల చివరి వారంలోగా కమిటీ నివేదిక సమర్పిస్తుంది.

✦ ఏటా రోడ్డు ప్రమాదాల్లో 1.80 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్న దృష్ట్యా దానిపై ప్రత్యేక చర్చ చేపట్టాలని రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అభిప్రాయపడ్డారు. రోడ్డు ప్రమాదాలపై ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు.

విమాన టికెట్ ధరలకు కళ్లెం వేస్తాం




అసాధారణ పరిస్థితులు తలెత్తినప్పుడు విమానయాన సంస్థలు అవకాశవాద ధోరణితో టికెట్ ధరలు పెంచేస్తుండటాన్ని అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఉడాన్ రూట్లలో ధరల పరిమితి అమల్లో ఉందని చెప్పారు.

ప్రజాస్వామ్యంలో మూకస్వామ్యమా?: చౌహాన్



లోక్‌సభ వాయిదాపడిన తర్వాత భాజపా ప్రధాన కార్యాలయంలో కేంద్రమంత్రి చౌహాన్ విలేకరులతో మాట్లాడుతూ- సభలో విపక్షాలు అమర్యాదకరంగా ప్రవర్తించాయన్నారు. ప్రజాస్వామ్యాన్ని మూకస్వామ్యంగా మార్చి దౌర్జన్యానికి పాల్పడ్డాయని ఆరోపించారు. బల్లలెక్కి నిరసన తెలపడం, పత్రాలు చించేయడం గాంధీ ఆదర్శాలను చంపేయడం కాదా అని ప్రశ్నించారు. విపక్షాల తీరు తననెంతో బాధకు గురిచేసిందన్నారు. పార్లమెంటు కీలక సమావేశాల సమయంలో లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ పార్లమెంటుకు రాకుండా జర్మనీకి వెళ్లడం బాధాకరమని అన్నారు. ప్రజాస్వామ్యంలో విపక్షానికి, విపక్షనేతకు ఎంతో ప్రాధాన్యం ఉందని, రాహుల్ మాత్రం ఆ ప్రాముఖ్యాన్ని, పదవికున్న హుందాతనాన్ని తగ్గించుకుంటున్నారని విమర్శించారు. ఉపాధి హామీ బిల్లులో రామ్‌జీ అని ఉంటే తప్పేమిటన్నారు.

బోండీ బీచ్‌లో ఉగ్రవాదిని అడ్డుకున్న పోలీసులకు అమన్‌దీప్ సింగ్ సాయం



మెల్‌బోర్న్: ఉగ్రవాదులు కాల్పులు జరుపుతుంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని అక్కడి నుంచి పరుగెత్తడం మినహా మనం ఏ సాహసమూ చేయలేం. ఎవరైనా అలాగే భయపడతారు. కానీ ఆస్ట్రేలియాలోని బోండీ బీచ్‌లో మాత్రం ఉగ్రవాదులను అడ్డుకోవడానికి కొంత మంది ప్రయత్నించారు. అందులో అహ్మద్ అనే వ్యక్తి ఒక ఉగ్రవాదిని వెనుక నుంచి వెళ్లి పట్టుకుని హీరోగా నిలిచారు. ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అలాగే ఉగ్రవాదులను అడ్డుకుంటున్న పోలీసులకు సాయం చేసి భారత సంతతికి చెందిన 34 ఏళ్ల అమన్‌దీప్ సింగ్-బోలా ఆదర్శంగా నిలిచారు. న్యూజిలాండ్, భారత తల్లిదండ్రులకు జన్మించిన అమన్‌దీప్.. వంతెనపై నుంచి కాల్పులు జరుపుతున్న ఉగ్రవాదిని అడ్డుకునేందుకు వెళ్లిన పోలీసులకు అండగా నిలిచారు. ఆయనా వారితోపాటు వెళ్లి ఉగ్రవాదిని కింద పడేసేందుకు ప్రయత్నించారు. 'నేను ఉగ్రవాదిపైకి లంఘించా. అతడి చేతులను గట్టిగా పట్టుకున్నా. అతడిని వదలొద్దని పోలీసు అధికారి నాకు సూచించారు. దీంతో అలాగే పట్టుకున్నా' అని అమన్‌దీప్ వివరించారు. ఉగ్రవాదులను పట్టుకోవడానికి సాయం చేయాలనుకున్నానని, సాయం కావాల్సిన వారికి సాయం అందించాలనుకున్నానని తెలిపారు. తాను బీచ్‌లో కూర్చుని కబాబ్‌లను తింటున్నానని, తొలుత కాల్పులను బాణసంచా పేలుళ్లుగా భావించానని పేర్కొన్నారు. పోలీసు అధికారి.. ఉగ్రవాదిని కాల్చారని, అ తర్వాత అతడిపై కూర్చుని గట్టిగా పట్టుకున్నానని వివరించారు.

సిడ్నీ ఉగ్ర దాడిపై దర్యాప్తులో భారత బృందం!

ఇంటర్నెట్ డెస్క్: ఆస్ట్రేలియాలో ఉగ్ర దాడిపై దర్యాప్తు జరుపుతున్న అక్కడి అధికారులకు సాయం చేసేందుకు ఓ బృందాన్ని పంపించాలని భారత్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఉగ్ర దాడి నిందితుల్లో ఒకడైన సాజిద్ భారత పాస్‌పోర్టును కలిగి ఉండటంతోపాటు హైదరాబాద్‌కు చెందిన వాడని తెలంగాణ డీజీపీ వెల్లడించిన నేపథ్యంలో దర్యాప్తులో భాగం కావాలని భారత్ భావిస్తోందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ దర్యాప్తు బృందంలో రాష్ట్ర పోలీసు విభాగాలు, కేంద్ర నిఘా సంస్థలకు చెందిన అధికారులు ఉంటారని వెల్లడించాయి.

కర్మశ్రీ పథకానికి మహాత్మా గాంధీ పేరు: మమత

కోల్‌కతా: జాతీయ ఉపాధి హామీ పథకం పేరును 'వీబీ- జీ రామ్ జీ'గా మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా మండిపడ్డారు. కొన్ని రాజకీయ పార్టీలు జాతీయ నేతలను గౌరవించకపోయినా, తాము గౌరవిస్తామని అన్నారు. తమ రాష్ట్ర ప్రభుత్వ ఉపాధి హామీ పథకం 'కర్మశ్రీ'కి మహాత్మా గాంధీ పేరు పెట్టనున్నట్లు ప్రకటించారు. "కేంద్ర ఉపాధి హామీ పథకం పేరు మార్చాలని నిర్ణయించినందుకు సిగ్గుపడుతున్నా. ఎందుకంటే.. నేనూ ఈ దేశ పౌరురాలినే. మనం ఇప్పుడు జాతిపితను కూడా మరచిపోతున్నాం" అని ఓ కార్యక్రమంలో దీదీ వ్యాఖ్యానించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రానికి వచ్చే నిధులను కేంద్రం అడ్డుకుంటోందని ఆరోపించారు. కర్మశ్రీ పథకం కింద లబ్ధిదారులకు 75 రోజులపాటు పని కల్పిస్తున్నామని, భవిష్యత్తులో దీనిని 100 రోజులకు పెంచే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు.

✦ వీబీ- జీ రామ్ జీ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ అన్నారు. ఈ బిల్లు గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా భూస్థాపితం చేస్తుందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఏ కోణం నుంచి చూసినా వంద రోజుల పనిదినాలను 125గా పెంచడమన్నది మోసమని అవగతం అవుతుందన్నారు. బిల్లును పూర్తిగా చదివిన వారికెవరికైనా అది కొద్ది రోజుల్లోనే ముగిసిపోతుందని అర్థమవుతుందని మీడియాతో పేర్కొన్నారు.

56 వేల మంది పాక్ బిచ్చగాళ్లను తిప్పి పంపిన సౌదీ

ఇంటర్నెట్ డెస్క్: పాకిస్థాన్‌కు చెందిన బిచ్చగాళ్ల ముఠాలు ప్రభుత్వ నిషేధాజ్ఞలను ధిక్కరించి విమానాల్లో విదేశాలకు వెళ్లి భిక్షాటన సాగిస్తున్నాయి. ఈ సంవత్సరం సౌదీ అరేబియా 56 వేల మంది పాకిస్థానీ బిచ్చగాళ్లను వెనక్కు పంపింది. భిక్షాటన కోసం విదేశాలకు వెళ్లేందుకు విమానం ఎక్కిన మరో 66 వేల మందిని పాకిస్థాన్ ఫెడరల్ విచారణాధికారులు స్వదేశంలోనే నిలిపేశారు. కేవలం భిక్షాటన కోసమే విదేశాలకు వెళ్లే పాకిస్థానీలు పలు దేశాల్లో సమస్యగా మారారు. సౌదీ అరేబియా ఇస్లాం మత పవిత్ర క్షేత్రం కావడంతో అక్కడికి ప్రపంచం నలుమూలల నుంచి సందర్శకులు వస్తుంటారు. ఇదే అదనుగా పాక్ బిచ్చగాళ్లు సౌదీలో ముఠాలుగా ఏర్పడి సందర్శకుల నుంచి దానధర్మాలు పొందుతున్నారు. భిక్షాటనకై విదేశాలకు వెళ్తున్నట్టుగా అనుమానించిన 66,154 మందిని ఈ సంవత్సరం విమానాల నుంచి దించేసినట్టు పాక్ జాతీయ విచారణ సంస్థ తెలిపింది. ఈ నేపథ్యంలో వేలాది మంది పౌరుల్ని విదేశాలకు వెళ్లకూడని వారిగా పేర్కొంటూ ఎగ్జిట్ కంట్రోల్ లిస్టును పాక్ ప్రభుత్వం ప్రకటించింది. పాక్ నుంచి బిచ్చగాళ్ల వలసలు కేవలం గల్ఫ్ దేశాలకే పరిమితం కాలేదని, ఆఫ్రికా, ఐరోపా దేశాలతోపాటు కాంబోడియా, థాయ్‌లాండ్‌లకూ సమస్యగా మారిందని తెలుస్తోంది. ఈ బిచ్చగాళ్లు పర్యాటక వీసాలను దుర్వినియోగం చేసి భిక్షాటనకు పాల్పడుతున్నట్టు గుర్తించామని ఎఫ్ఐఏ డైరెక్టర్ జనరల్ రిఫాత్ ముఖ్తార్ పేర్కొన్నారు.

తీవ్ర నేరాల్లో బెయిలుకు ఆర్థిక సాయం కుదరదు

- పేద ఖైదీలపై కేంద్రం స్పష్టీకరణ

దిల్లీ: పేద ఖైదీలకు బెయిలు కోసం అందజేసే నగదు సాయాన్ని తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారికి ఇవ్వబోమని కేంద్రం స్పష్టం చేసింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఎంపవర్డ్, ఓవర్‌సైట్ కమిటీలు దీనిని పరిగణనలోకి తీసుకోవాలని గురువారం కేంద్ర హోంశాఖ సూచించింది. దీంతోపాటు ఈ ఖైదీలకు ఎంపవర్డ్ కమిటీ అందజేసే సాయం పరిమితిని రూ.40వేల నుంచి రూ.లక్షకు పెంచింది. ✦ తాజా మార్గదర్శకాల ప్రకారం.. ఉగ్రవాదం, వరకట్న హత్యలు, అత్యాచారాలు, మానవ అక్రమ రవాణా, పోక్సో కేసులు నమోదైన వారికి ఆర్థిక సాయం ఉండదు. ✦ ఇప్పటిదాకా అవినీతి నిరోధక చట్టం, మనీ లాండరింగ్, ఎన్‌డీపీఎస్ చట్టం, ఉపా చట్టాల కింద కేసులు నమోదైన వారికే ఈ సాయం అందేది కాదు.

ఫుడ్ కంపెనీలపై ఐటీ దాడులు

ఓ పరిశ్రమలో సహ భాగస్వామిగా శిల్పాశెట్టి

ముంబయి: ఆదాయపన్ను శాఖ అధికారులు ముంబయిలోని దాదాపు 24 ఆహార, పానీయాల కంపెనీలపై దాడులు నిర్వహించారు. ఇందులో ఓ పరిశ్రమకు ప్రముఖ నటి శిల్పాశెట్టి సహ భాగస్వామిగా ఉన్నారు. పన్ను ఎగవేత ఆరోపణల మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. బుధవారం ప్రారంభించిన దాడులు గురువారం కూడా కొనసాగాయి. ఈ దాడులకు శిల్పాశెట్టిపై ఉన్న పోలీసు కేసులతో సంబంధం లేదని ఐటీ అధికారులు స్పష్టం చేశారు.

ఆర్థిక భద్రత భాగస్వామ్యం బలోపేతం దిశగా సాగుతున్నాం: అమెరికా

వాషింగ్టన్: భారత్‌తో ఆర్థిక భద్రత భాగస్వామ్యం బలోపేత దిశగా చర్చలు సాగుతున్నాయని అమెరికా వెల్లడించింది. ఆ దేశాన్ని అత్యంత కీలకమైన వ్యూహాత్మక భాగస్వామిగా తమ దేశం పరిగణిస్తోందని అమెరికా ఆర్థిక వ్యవహారాల అండర్ సెక్రటరీ జాకబ్ హెల్‌బర్గ్ పేర్కొన్నారు. ఇటీవల వాషింగ్టన్‌లో సిలికాన్ సప్లై చైన్‌పై జరిగిన కీలక సమ్మిట్‌లో భారత్‌కు చోటు కల్పించకపోవడం వెనుక ఇరుదేశాల మధ్య దౌత్య ఉద్రిక్తతలే కారణమన్న వాదనలను ఆయన తోసిపుచ్చారు. భారత్‌తో కలిసి పని చేయడానికి తాము సుముఖంగా ఉన్నట్లు చెప్పారు. అమెరికా గత వారం ప్రారంభించిన వ్యూహాత్మక 'పాక్స్ సిలికా' కూటమిలో భారత్ భాగస్వామిగా లేకపోవడంపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు బుధవారం ఆయన స్పందించారు. భారత్, అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందాలకు సంబంధించిన చర్చలు, సరఫరా గొలుసుల భద్రతా సంభాషణలు పూర్తిగా భిన్నమైనవని తెలిపారు. ఆ రెండింటికీ ఏ సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆర్థిక భద్రత అంశాలపై ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింత బలపరిచేందుకు ప్రస్తుతం భారత అధికారులతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఫిబ్రవరిలో భారత్‌లో జరగనున్న ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌కు హాజరుకానున్నట్లు వెల్లడించారు.

మెదడులోనే కదలికల లెక్క!

దిల్లీ: మనం ఎంత దూరం, ఎంతసేపు నడిచామో.. ప్రయాణించామో గణించే కణాలు మెదడులోని హిప్పోక్యాంపస్‌లో ఉంటాయి. జ్ఞాపక శక్తికి, మార్గ నిర్దేశానికీ హిప్పో కాంపస్ కీలకం. అల్జీమర్స్ వ్యాధికి గురైన తొలిదశలో వ్యక్తులు బాగా పరిచిత ప్రదేశాల్లో తాము ఎంత దూరం వచ్చామో.. ఎక్కడకు చేరుకున్నామో గ్రహించలేక తికమకపడుతుంటారు. ఈ సమస్యకు మూలం ఎక్కడుందో కనిపెట్టడానికి అమెరికన్ శాస్త్రజ్ఞులు ఎలుకలపై ప్రయోగం చేశారు. సాధారణంగా ఎలుక నిర్ణీత ప్రదేశానికి చేరుకుంటే తీపి గుళికను బహుమానంగా ఇవ్వడం ప్రయోగాల్లో పరిపాటి. ఈ ప్రయోగాల్లో దారి వెంట కొన్ని గుర్తులు ఏర్పాటు చేశారు. తాజా పరిశోధనలో అలాంటి దృశ్యపరమైన గుర్తులేమీ లేకుండా దాదాపు చీకట్లో నడిచిన వాతావరణాన్ని కల్పించారు. ఆ పరిస్థితిలో ఎలుక ముందుకు కదలగానే ఒక గ్రూపులోని కణాలు క్రియాశీలమయ్యాయి. అవి నడిచిన దూరాన్ని గణించాయి. మరో గ్రూపులోని కణాలు ఎలుక కదిలినప్పుడు మందకొడిగా ఉన్నా అది ముందుకు వెళ్లే కొద్దీ మళ్లీ చురుకుగా మారాయి. అలా గణించిన దూరాన్ని బట్టి మెదడు తాను ఎంతసేపు పయనించిందీ అంచనా వేసుకుంటుంది. ఈ పరిశోధన ముమ్ముందు అల్జీమర్స్ వ్యాధి బాధితులకు చికిత్స విధానాల రూపకల్పనకు తోడ్పడుతుందని భావిస్తున్నారు.

పట్టు వ్యర్థాల నుంచి సబ్బు తయారీ

ఈటీవీ భారత్: ఎరి సిల్క్ అనే ప్రత్యేక పట్టు అస్సాంలో పేరెన్నికగన్నది. సాధారణంగా పట్టు తయారీ ప్రక్రియలో పట్టు గూళ్లను మరిగే నీటిలో వేస్తారు. ఈ క్రమంలో పట్టు పురుగులు మరణించడం అనివార్యం. అయితే ఎరి పట్టు తయారీలో అలా పురుగుల్ని చంపాల్సిన అవసరం ఉండదు. అందుకే దీన్ని అహింస పట్టు అని పిలుస్తారు. ఈ ప్రత్యేక పట్టుతో మెఖేలా చాదోర్, చెలాంగ్ అనే ప్రత్యేక వస్త్రాలతోపాటు శాలువాలు నేస్తారు. ఇన్నాళ్లూ అస్సాంకు ఈ పట్టు ఒక గర్వకారణంగా నిలిచింది. అయితే ఈ పట్టు తయారు చేశాక మిగిలిపోయే వ్యర్థాల నుంచి సబ్బుల్ని తయారు చేయవచ్చని తాజాగా కనుగొన్నారు. గౌతం డేనియల్ రాయ్ చౌధరి అనే యువ ఔత్సాహికుడి కృషి ఫలితంగా ఇది సాధ్యమైంది. ఎరి పట్టు తయారు చేసిన తర్వాత మిగిలిన వ్యర్థాల నుంచి సబ్బును ఉత్పత్తి చేసిన తొలి వ్యక్తిగా రాయ్ చౌదరి ఖ్యాతి గడించారు. ఈ సబ్బుకు ఇప్పటికే విస్తృత ప్రాచుర్యం, ఆదరణ లభించాయి. ఈ సబ్బును ఐరోపా, జపాన్, థాయ్‌లాండ్, సింగపూర్ వంటి దేశాలకూ ఎగుమతి చేయాలని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు.

దిల్లీ పేలుడు కేసులో మరో నిందితుడి అరెస్టు

దిల్లీ: ఎర్రకోట వద్ద పేలుడుకు కారణమైన ఉమర్ ఉన్ నబీకి సన్నిహిత సహచరుడైన యాసిర్ అహ్మద్ దార్ అనే నిందితుడిని అరెస్టు చేసినట్లు గురువారం ఎన్ఐఏ అధికారులు తెలిపారు. ఈ నేరంతో ప్రత్యక్షంగా అతడికి ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైందని పేర్కొన్నారు. ఈ పేలుడు ఘటనలో కీలక కుట్రదారుడైన ముఫ్తీ ఇర్ఫాన్‌తోనూ అతడికి సన్నిహిత సంబంధాలున్నాయని అధికారులు తెలిపారు. శ్రీనగర్‌లోని శోపియాన్ జిల్లాకు చెందిన యాసిర్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) బృందం అదుపులోకి తీసుకుంది. దీంతో ఈ కేసులో అరెస్టయిన వారి సంఖ్య 9కి చేరింది. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా ఈ నెల 26వ తేదీ వరకూ ఎన్ఐఏ కస్టడీ విధించింది. అతడిని విచారించేందుకు ఎన్ఐఏ చేసిన విజ్ఞప్తిని ప్రత్యేక జడ్జి అనుమతించారు. కోర్టులో విచారణకు మీడియాను అనుమతించలేదు.

హసీనాకు ఆశ్రయం కొనసాగించాలి

- స్థాయీ సంఘం సిఫార్సు

దిల్లీ: బంగ్లాదేశ్ మాజీ ప్రధాన మంత్రి షేక్ హసీనాకు (78) మానవతా దృక్పథంతో ఆశ్రయం కొనసాగించాలని విదేశీ వ్యవహారాలపై ఏర్పాటైన పార్లమెంటరీ స్థాయీ సంఘం సిఫార్సు చేసింది. కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ నేతృత్వంలోని ఈ సంఘం తన నివేదికను గురువారం పార్లమెంటుకు సమర్పించింది. బంగ్లాదేశ్‌లో ప్రధాని పదవిని కోల్పోయిన హసీనా భారత్ వచ్చి ఇక్కడే ఉంటున్నారు. హసీనాను తమకు అప్పగించాలని భారత్‌ను బంగ్లాదేశ్ ప్రభుత్వం డిమాండు చేస్తోంది. ఆపదలో ఉన్నవారికి ఆశ్రయమివ్వడం భారతదేశ నాగరికతలోనే ఉందని, వారిపట్ల మానవతా దృక్పథంతో వ్యవహరిస్తామని, తదనుగుణంగా హసీనాకు మన గడ్డపై ఆశ్రయమిస్తూనే ఉండాలని స్థాయీ సంఘం సిఫార్సు చేసింది. అదే సమయంలో మన గడ్డపై ఆమె రాజకీయ కార్యకలాపాలు చేపట్టకుండా నివారించాలని సూచించింది.

పర్యాటక వీసాలకు 10 నెలల సమయం

- అమెరికా కాన్సులేట్లలో పరిస్థితి ఇదీ..: కేంద్రం

దిల్లీ: మన దేశంలోని అమెరికన్ కాన్సులేట్లలో పర్యాటక వీసాల ఇంటర్వ్యూలకు 10 నెలలు వేచి ఉండాల్సి వస్తోందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. నవంబరు 20వ తేదీ నాటికి ఈ పరిస్థితి ఉందని తెలిపింది. పర్యాటక వీసా ఇంటర్వ్యూలకు హైదరాబాద్‌లో తక్కువ నెలలు, ముంబయిలో ఎక్కువ నెలలు పడుతుందా అని ఓ సభ్యుడు ప్రశ్నించారు. రాజ్యసభలో గురువారం విదేశీ వ్యవహారాలశాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ దీనిపై లిఖితపూర్వక సమాధానమిచ్చారు. అమెరికా జాతీయ భద్రత దృష్ట్యా ఆలస్యమవుతోందని రాయబార కార్యాలయం వెల్లడించినట్లు ఆయన వివరించారు. మంత్రి వెల్లడించిన వివరాల ప్రకారం..

✦ పర్యాటక వీసా ఇంటర్వ్యూకు దిల్లీలోని రాయబార కార్యాలయంలో 10 నెలలు, చెన్నై కాన్సులేట్‌లో 3 నెలలు, హైదరాబాద్, కోల్‌కతాల్లో 5 నెలలు, ముంబయిలో 9.5 నెలలు పడుతోంది. ✦ ఎఫ్ (విద్యార్థులు), ఎం (వొకేషనల్, చదువేతర), జే (ఎక్స్ఛేంజ్) వీసాల ఇంటర్వ్యూలకు దిల్లీలో 15 రోజుల సమయం పడుతోంది. ✦ ఎఫ్, ఎం, జె వీసా ఇంటర్వ్యూలకు కోల్‌కతాలో 2.5 నెలలు, ముంబయిలో 3 నెలలు, హైదరాబాద్‌లో 2.5 నెలలు, చెన్నైలో 2 నెలలు పడుతోంది. ✦ హెచ్ (ప్రత్యేక వృత్తులు), ఎల్ (కంపెనీలో అంతర్గత బదిలీలు), ఓ (అసాధారణ ప్రతిభావంతులు), పీ (అథ్లెట్లు, కళాకారులు, ఎంటర్‌టైనర్లు), క్యూ (సాంస్కృతిక మార్పిడి) వీసాల ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్లు దిల్లీ రాయబార కార్యాలయం, కోల్‌కతా కాన్సులేట్లలో అందుబాటులో లేవు. ✦ హెచ్, ఎల్, ఓ, పీ, క్యూ వీసాల ఇంటర్వ్యూలకు ముంబయి, చెన్నైల్లో ఒక నెల, హైదరాబాద్‌లో 2 నెలలు పడుతోంది.

యావజ్జీవ ఖైదును నిర్ధారించాల్సింది రాజ్యాంగ కోర్టులే: సుప్రీం

దిల్లీ: సడలింపునకు వీల్లేని యావజ్జీవ శిక్షను విధించే అధికారం రాజ్యాంగ న్యాయస్థానాలైన సుప్రీం, హైకోర్టులకు మాత్రమే ఉంటుందని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. విధించిన శిక్షను తగ్గించే అధికారం కానీ, ఆ దండనను మార్చే అధికారం కానీ సెషన్స్ కోర్టులకు ఉండదని జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ కె.వినోద్ చంద్రన్ ధర్మాసనం గురువారం స్పష్టం చేసింది. ఖైదీలకు శిక్షా కాలం తగ్గింపు, శిక్ష మార్పు అధికారం భారతీయ శిక్షా స్మృతి ప్రకారం ప్రభుత్వాలేదనని తెలిపింది. తనతో శారీరక సంబంధానికి నిరాకరించిందనే కోపంతో విధవరాలిని సజీవ దహనం చేసిన వ్యక్తి కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

తనయుడికి కారుణ్య మరణం కోరుతున్న తల్లిదండ్రులతో సుప్రీం ధర్మాసనం భేటీ 13న

దిల్లీ: పన్నెండేళ్లకు పైగా అచేతన స్థితిలో ఉన్న తమ కుమారుడికి కారుణ్య మరణం ప్రసాదించాలని కోరిన వృద్ధ దంపతులతో సుప్రీంకోర్టు ధర్మాసనం జనవరి 13న భేటీ కావాలని నిర్ణయించింది. హరీశ్ రాణా(31) అనే యువకుడు 2013లో ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి కోమాలోనే ఉన్న అతనికి కృత్రిమ ప్రాణాధార వ్యవస్థల ద్వారా శ్వాస, ఆహారం అందిస్తున్నారు. శరీరంలో ఎటువంటి కదలికలు లేని రాణా కోలుకునే అవకాశం చాలా తక్కువని రెండు వైద్య బృందాలు సుప్రీంకోర్టుకు నివేదించాయి. ఆ యువకుడి స్థితి చాలా విషాదకరమని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ కె.వి.విశ్వనాథన్ ధర్మాసనం పేర్కొంది. 'అతడిని ఎప్పటికీ ఇలానే ఉంచలేం' అని గురువారం వ్యాఖ్యానించింది. తుది నిర్ణయం తీసుకునే ముందు యువకుడి తల్లిదండ్రులను కలుస్తామని వెల్లడించింది.

అపరాధాన్ని నిరూపిస్తేనే పరోక్ష సాక్ష్యానికి విలువ

దిల్లీ: క్రిమినల్ కేసుల్లో నిందితుడి నేరాన్ని నిర్ధారించేందుకు పరోక్ష సాక్ష్యాన్ని వాడుకోవచ్చని, అయితే ఆ సాక్ష్యం అనుమానం రేకెత్తించేదిగా కాకుండా అపరాధాన్ని కచ్చితంగా నిరూపించేదిగా ఉండాలని సుప్రీంకోర్టు గురువారం పేర్కొంది. 2004లో జరిగిన ఒక హత్యకేసుకు సంబంధించి నిందితునికి కింది కోర్టు విధించిన యావజ్జీవ కారాగార శిక్షను రద్దుచేస్తూ అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. కేవలం పరోక్ష సాక్ష్యాల ఆధారంగా నేర నిర్ధారణ జరగాల్సిన కేసుల్లో.. చివరిసారిగా బాధితుడితో కలిసి ఉండగా చూశాం కాబట్టి నిందితుడు అపరాధం చేశాడన్న వాదన సరికాదని జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రల ధర్మాసనం వ్యాఖ్యానించింది. నిందితుడి అమాయకత్వాన్ని కాక అతని అపరాధాన్ని కచ్చితంగా రుజువు చేసేదిగా ఉన్న పరోక్ష సాక్ష్యమే నేర నిర్ధారణకు ప్రాతిపదిక కాగలదన్నది న్యాయశాస్త్రంలో కీలక సూత్రమని ధర్మాసనం పేర్కొంది.

హైకోర్టు సీజేలుగా ఐదుగురికి పదోన్నతి

- సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు

దిల్లీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని కొలీజియం.. దేశంలోని వివిధ హైకోర్టుల్లో పనిచేస్తున్న ఐదుగురు న్యాయమూర్తులకు హైకోర్టుల చీఫ్ జస్టిస్‌లుగా పదోన్నతి కల్పించాలని సిఫార్సు చేసింది. పేర్లను గురువారం కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ మనోజ్ కుమార్ గుప్తాకు ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి కల్పించాలని ప్రతిపాదించింది. ఉత్తరాఖండ్ ప్రధాన న్యాయమూర్తి వచ్చేనెల 9న పదవీ విరమణ పొందనున్నారు. బాంబే హైకోర్టుకు చెందిన జస్టిస్ రేవతీ పి మోహితే డేరెకు మేఘాలయ చీఫ్ జస్టిస్‌గా, బాంబే హైకోర్టుకు చెందిన జస్టిస్ ఎం.ఎస్.సోనక్‌కు ఝార్ఖండ్ సీజేగా ఉన్నతి కల్పించాలని సిఫార్సు చేశారు. కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.మొహమ్మద్ ముస్తాక్‌ను సిక్కిం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, ఒరిస్సా హైకోర్టుకు చెందిన జస్టిస్ సంగం కుమార్ సాహూను పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని కొలీజియం సిఫార్సు చేసింది. మేఘాలయ హైకోర్టు సీజే జస్టిస్ సౌమెన్ సేన్‌ను కేరళ హైకోర్టుకు బదిలీ చేయాలని ప్రతిపాదించింది.

దెబ్బతిన్న తివాచీ నగరం భదోహీ: రాహుల్

దిల్లీ: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన అధిక సుంకాలతో భారత్‌లోని అనేక చిన్న పరిశ్రమలు, వ్యాపారాలు దెబ్బతింటున్నాయని, అయినా ప్రధాని మోదీ చేతులు ముడుచుకుని కూర్చున్నారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఉత్తర్ ప్రదేశ్‌లో మోదీ నియోజకవర్గమైన వారణాసికి దగ్గర్లోని భదోహీలో తివాచీ పరిశ్రమ దెబ్బతిందని, ఆ పరిశ్రమ పాకిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్‌లకు తరలిపోతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం జర్మనీలో పర్యటిస్తున్న రాహుల్ గురువారం ఫేస్‌బుక్ వేదికగా స్పందించారు. భదోహీ తివాచీ తయారీదారులతో తాను పార్లమెంటు ఆవరణలో జన్ సంసద్‌ను (ప్రజా పార్లమెంటు) నిర్వహించిన వీడియోను ఆయన పోస్టు చేశారు. ఇంత జరుగుతున్నా మోదీ ప్రభుత్వం తగు విధానాలతో, కార్యాచరణ పథకంతో ముందుకు రావడం లేదని విమర్శించారు. ప్రభుత్వం ఇకనైనా పంథా మార్చాలని సూచించారు.

హెజ్‌బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు

బీరుట్: లెబనాన్ దక్షిణ, ఈశాన్య ప్రాంతాల్లోని హెజ్‌బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ గురువారం వైమానిక దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో మందు గుండు గోదాములు, ఉగ్రవాద శిక్షణ శిబిరాలు, ఇతర మౌలిక వసతులు ధ్వంసమయ్యాయని ఇజ్రాయెల్ తెలిపింది. హెజ్‌బొల్లాను నిరాయుధీకరించి సరిహద్దులను లెబనాన్ సైన్యానికి అప్పగించడానికి పారిస్‌లో సమావేశం జరగనుంది. దానికి మద్దతుగానే గురువారం ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు హెజ్‌బొల్లా స్థావరాలపై విరుచుకుపడ్డాయి.



అక్రమ వలసదారుల్ని అడ్డుకోవడానికి అమెరికాలోని అరిజోనాలో నిర్మితమవుతున్న సరిహద్దు గోడ



శ్రీవారి ఆలయం ఎదుట జస్టిస్ దుప్పల వెంకటరమణ, కుటుంబ సభ్యులు తదితరులు

శ్రీవారిని దర్శించుకున్న జస్టిస్ దుప్పల వెంకటరమణ

తిరుమల, న్యూస్‌టుడే: మధ్యప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ గురువారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారి మూలమూర్తిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

పంచాయతీరాజ్‌లో పెండింగ్ బిల్లుల చెల్లింపులకు రూ.200 కోట్లు

ఈనాడు, అమరావతి: పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం ప్రభుత్వం రూ.200 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు గురువారం బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ ఇచ్చింది. ఉపాధి హామీ పథకం, రోడ్ డెవలప్‌మెంట్ ఫండ్, ఆర్థిక సంఘం, స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ఇతరత్రా పద్దుల కింద చేపట్టిన పనులకు బిల్లుల చెల్లింపుల కోసం ఈ నిధులు ఖర్చు చేయాలని ప్రభుత్వం పేర్కొంది.

సచివాలయాల్లో ఉద్యోగుల బదిలీ గడువు పొడిగింపు

ఈనాడు, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల్లో స్పౌజ్ ఆధారంగా ఉద్యోగుల అంతర్ జిల్లాల బదిలీలకు గడువు ఈ నెల 22 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మొదట ప్రకటించిన మార్గదర్శకాల ప్రకారం గడువు నవంబరు 30తో ముగిసింది. ప్రాసెస్ పూర్తి చేసే క్రమంలో జాప్యమైనందున, గడువు పొడిగించాలన్న సచివాలయాల శాఖ డైరెక్టర్ ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించింది.

ధాన్యం రవాణా, డీలర్ల మార్జిన్ కింద రూ.133.94 కోట్లు విడుదల

ఈనాడు, అమరావతి: ఆహార భద్రత పథకం కింద అంతర్రాష్ట్ర ఆహార ధాన్యాల రవాణా, డీలర్ల మార్జిన్ కింద ప్రభుత్వం రూ.133.94 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు పరిపాలన అనుమతి ఇస్తూ పౌరసరఫరాలశాఖ ఎక్స్‌అఫిషియో కార్యదర్శి సౌరభ్‌గౌర్ ఉత్తర్వులు ఇచ్చారు.

కాంపౌండింగ్ అథారిటీగా డ్రగ్ కంట్రోల్ డీజీ

ఈనాడు, అమరావతి: ఔషధ నియంత్రణ సంస్థ పరిపాలన విభాగం డైరెక్టర్ జనరల్ (డీజీ)కి నిర్దిష్టమైన మైనర్ నేరాలకు జరిమానా విధించి, కేసులు పరిష్కరించే అధికారం ప్రభుత్వం కల్పించింది. ఈ మేరకు డీజీని 'కాంపౌండింగ్ అథారిటీ'గా నియమిస్తూ వైద్యారోగ్య- కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

బీసీలకు దేశవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్ చేయాలి

రాజ్యసభలో ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్

ఈనాడు, దిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో మాదిరే దేశవ్యాప్తంగా ఓబీసీ విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్ని అమలు చేయాలని భాజపా ఎంపీ ఆర్.కృష్ణయ్య కేంద్రప్రభుత్వాన్ని కోరారు. గురువారం రాజ్యసభలో మాట్లాడుతూ.. "తెలుగు రాష్ట్రాల్లో సుదీర్ఘ పోరాటం అనంతరం అక్కడి ప్రభుత్వాలు స్కాలర్‌షిప్‌లతోపాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్ని ప్రవేశపెట్టి పూర్తి ఫీజులు చెల్లిస్తున్నాయి. తద్వారా బీసీ విద్యార్థులు ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో చదువుకుంటున్నారు. అలాంటి పథకాలు అందరికీ అందేలా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను దేశమంతా అమలు చేయాలి" అని విన్నవించారు.

కవాటం మార్చేదే కాదు... మరమ్మతుతోనూ ఉత్తమ ఫలితాలు

డాక్టర్ లోకేశ్వరరావు సజ్జా



ఈనాడు, హైదరాబాద్: గుండె కవాటం మార్చేదే కాదు.. మరమ్మతుతోనూ ఉత్తమ ఫలితాలు వస్తాయని తన అధ్యయనంలో వెల్లడైనట్లు హైదరాబాద్‌లోని స్టార్ ఆసుపత్రికి చెందిన సీనియర్ కన్సల్టెంట్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ సజ్జా లోకేశ్వరరావు తెలిపారు. హృద్రోగులపై జరిపిన అధ్యయనాన్ని ఇటీవల న్యూయార్క్‌లో జరిగిన అమెరికన్ అసోసియేషన్ ఫర్ థొరాసిక్ సర్జరీ(ఏఏటీఎస్) కాన్ఫరెన్స్‌లో సమర్పించారు. అధ్యయన వివరాలను గురువారం మీడియాకు విడుదల చేశారు. మైట్రల్ వాల్వు అనేది గుండెలోని ఎడమ ఆట్రియం(పైగది), ఎడమ వెంట్రికల్(కింద గది) మధ్య ఉండే రెండు ఆకుల ఆకారంలో కూడిన కవాటం(వాల్వు). ఇది రక్తాన్ని ఒకే దిశలో ప్రవహించేలా (ఆట్రియం నుంచి వెంట్రికల్‌కి) చేస్తుంది. కొందరిలో మైట్రల్ వాల్వు పాడైపోయి సన్నగిల్లడం(మైట్రల్ స్టెనోసిస్), లేదా రిగర్జిటేషన్(లీకేజ్) వంటి సమస్యలు తలెత్తినప్పుడు రక్త ప్రవాహంలో ఆటంకం ఏర్పడుతుంది. హృద్రోగ ముప్పుకు దారితీస్తుంది. ఇలాంటి రోగులకు అత్యవసరమైనప్పుడు వాల్వు మార్చివేస్తున్నారు. కృత్రిమ వాల్వు అమర్చుతున్నారు. ఎక్కువ వయసు, ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నవారికి వాల్వు మార్పిడికి బదులు మైట్రల్ వాల్వు రిపేరు చేస్తున్నారు. అయితే దీని వల్ల తక్కువ ప్రయోజనం ఉంటుందనే భావన ఇప్పటివరకు వైద్యుల్లో ఉంది. రెండు రకాల చికిత్సలు పొందిన 212 మంది రోగులపై దాదాపు రెండు దశాబ్దాలుగా తాను జరిపిన అధ్యయనంలో అది నిజం కాదని తేలిందని డాక్టర్ సజ్జా లోకేశ్వరరావు తెలిపారు. మైట్రల్ వాల్వు మరమ్మతు చేసిన వారిలో... 212 మంది రోగుల్లో 172 (81.1%) మంది 20 ఏళ్ల జీవన కాలం ఉందన్నారు. 70 ఏళ్లు దాటిన వారితోపాటు ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి వాల్వు మార్పిడి కంటే మైట్రల్ వాల్వు మరమ్మతు చేయడం శ్రేయస్కరమని డాక్టర్ సజ్జా వివరించారు.

అమరావతి క్వాంటమ్ వ్యాలీలో ప్రాజెక్టుల ఏర్పాటుకు అనుమతి

- ప్రోత్సాహకాలు నిర్దేశిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

ఈనాడు, అమరావతి: అమరావతి క్వాంటమ్ వ్యాలీలో (ఏక్యూవీ) ప్రాజెక్టులు ఏర్పాటు చేసే సంస్థలకు అనుమతులు, ప్రోత్సాహకాలను నిర్దేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీ కింద ప్రోత్సాహకాలు చెల్లించేందుకు అనుమతించింది. మూలధన పెట్టుబడిలో 75 శాతానికి మించకుండా ప్రోత్సాహకాల కింద సంస్థలకు చెల్లించేందుకు అనుమతి ఇచ్చింది. సంస్థ కల్పించిన ఒక్కో నియామకానికి 100 చదరపు అడుగుల చొప్పున స్థలాన్ని కేటాయించేందుకు అంగీకరించింది. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్) ద్వారా ప్రోత్సాహకాలు చెల్లించే రోజు లెక్కించిన సంస్థ విలువ ఆధారంగా.. రాష్ట్ర క్వాంటమ్ మిషన్‌కు సంస్థలో ఈక్విటీ కింద ఇవ్వాలని నిర్దేశించింది. క్వాంటమ్ స్టార్టప్‌లకు సలహాలు, మార్గదర్శకత్వం, నిధులు సమకూర్చడంలో ఆర్‌టీఐహెచ్ దాని హబ్ అండ్ స్పోక్స్ నమూనాలో క్వాంటమ్ ఎకోసిస్టమ్ అభివృద్ధి చేస్తుందని పేర్కొంది.

✦ క్యూపీఏఐ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుమతి. క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు కోసం 2,500 చదరపు అడుగుల స్థలం కేటాయింపునకు అంగీకారం.

✦ క్వాంటమ్ హార్డ్‌వేర్ సదుపాయాలు కల్పించేందుకు నోస్ట్రడామస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుమతి. ఆ సంస్థకు 5 ఎకరాల ఏపీఐఐసీ భూములను మార్కెట్ ధరపై 70 శాతం రాయితీపై అందించేందుకు అనుమతి మంజూరు.

✦ ఫార్టీటూ (42) టెక్నాలజీ ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేసే ప్రాజెక్టుకు క్వాంటమ్ పాలసీ కింద ప్రోత్సాహకాలు చెల్లించేందుకు అనుమతి. ఆ సంస్థ నిర్వహించే టెస్ట్‌బెడ్‌ల కోసం 2 వేల చదరపు అడుగులు కేటాయించేందుకు నిర్ణయం.

✦ క్యూబిటెక్ స్మార్ట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఏపీఐఐసీ ద్వారా 2.5 ఎకరాలు కేటాయించేందుకు అనుమతి. ఆ భూముల మార్కెట్ ధరలో 70 శాతం రాయితీ కింద అందించేందుకు అంగీకారం.

✦ సెంటెల్లా సైంటిఫిక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు క్వాంటమ్ పాలసీ కింద ప్రోత్సాహకాలు చెల్లించేందుకు అంగీకారం.

✦ క్యూక్లేవోయెన్స్ క్వాంటమ్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతి.

✦ ఏక్యూవీలో సైబ్రానెక్స్ టెక్నాలజీస్ అండ్ కన్సల్టెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతి. సంస్థకు చెల్లించే ప్రోత్సాహకాలకు సంబంధించి నేషనల్ క్వాంటమ్ మిషన్ గ్రాంట్‌తో పోల్చి సిఫారసు చేయాలని ఐటీ శాఖకు ఆదేశం.

పోలవరం తొలిదశలో.. 33.62% కుటుంబాలకు పునరావాసం పూర్తి

- అవసరమైన భూమిలో 83% ఇప్పటికే సేకరణ
- నిర్వాసితుల హక్కులకు రక్షణ కల్పించాలి
- పార్లమెంటు స్థాయీసంఘం సిఫార్సు



ఈనాడు, దిల్లీ: పోలవరం ప్రాజెక్టు తొలిదశ కింద 41.15 మీటర్ల ఎత్తులో నీరు నిల్వ చేస్తే.. ముంపు పరిధిలోని 33.62% కుటుంబాలకు మాత్రమే ఇప్పటివరకు భౌతికంగా, ఆర్థికంగా పునరావాస చర్యలు పూర్తి చేసినట్లు పార్లమెంటు స్థాయీసంఘం పేర్కొంది. ఇందుకోసం అవసరమైన భూమిలో 83.57% సేకరించినట్లు వెల్లడించింది. 2024 నవంబర్ వరకు జరిగిన సహాయ, పునరావాస చర్యలపై అధ్యయనం చేసిన ఒడిశా కాంగ్రెస్ సభ్యుడు సప్తగిరి శంకర్ ఉల్కా నేతృత్వంలోని గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవహారాల స్థాయీ సంఘం గురువారం పార్లమెంటుకు నివేదిక సమర్పించింది. 2024 నవంబర్ 30 నాటికి మొత్తంగా ప్రాజెక్టు నిర్మాణం 53.47% పూర్తయినట్లు తెలిపింది.

'తొలిదశలో 41.15 మీటర్ల ఎత్తువరకు నీళ్లు నిలిపేలా, 2026 మార్చి నాటికి ప్రాజెక్టు కట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, సాంకేతిక సవాళ్ల దృష్ట్యా ఆ గడువును మరో ఏడాది పొడిగించినట్లు కేంద్ర జలశక్తి శాఖ తెలిపింది. దీన్ని కేంద్ర క్యాబినెట్ కూడా ఆమోదించింది. ఆర్‌అండ్‌ఆర్ పూర్తిగా రాష్ట్ర స్థాయిలోనే జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్.. భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ అధికారులతో కలిసి అన్ని వ్యవహారాలు పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ-ఎల్ఏఆర్ఆర్ఎం పేరుతో వెబ్‌సైట్ రూపొందించి.. భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్‌కు కార్యకలాపాలను డిజిటల్ రూపంలో నిర్వహిస్తోంది' అని ఆ నివేదిక పేర్కొంది.

ముంపు బాధితుల హక్కులకు భద్రత

పోలవరం నిర్వాసిత కుటుంబాలకు పూర్తిభద్రత కల్పించాలని స్థాయీసంఘం సిఫార్సు చేసింది. 'ప్రాజెక్టు కింద మునిగిపోయే వాటిలో గ్రామాలు, నివాస ప్రాంతాలు, వ్యవసాయ, పోడు, సాగు భూములు, నది ఒడ్డున ఉండే తోటలు, ఫెర్రీ ఘాట్లు, ఇసుక తిన్నెలు, సీజనల్ పంటలు, పశువులు మేసే పచ్చిక బయళ్లు, సూక్ష్మ అటవీ ఉత్పత్తుల సేకరణ జోన్లు, శ్మశానాలు, పాఠశాలలు, రోడ్లు వంటివి ఉన్నాయి. ముంపు జాబితాలో గిరిజన ఆవాసాలు, సీజనల్ పోడు భూములను ఆలస్యంగా చేర్చారు. కోల్పోతున్న పంట భూములు, ఆస్తుల విలువనూ తగ్గించి చూపారు. 2013 భూసేకరణ చట్టం నిబంధనలను నిర్వాసితులందరికీ వర్తింపజేయాలి. కొత్తగా పునరావస స్థలాలు సిద్ధమయ్యేంత వరకూ బాధితులను అక్కడికి తరలించవద్దు. తరలింపు ఖర్చులు కూడా చెల్లించడంతో పాటు, కొత్త ప్రాంతాల్లో అన్నిరకాల సదుపాయాలు కల్పించాల'ని స్థాయీసంఘం నివేదిక పేర్కొంది. బాధితుల జీవనోపాధి పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని సూచించింది. గిరిజనుల సాంస్కృతిక గుర్తింపునకు రక్షణ కల్పించాలని, అటవీ వనరులు వాడుకునేలా అనుమతివ్వాలని పేర్కొంది.

సహాయ, పునరావాస కార్యక్రమాల కోసం కావాల్సిన భూమి, అందుకయ్యే వ్యయం వివరాలు..

వివరం	కావాల్సింది ఎకరాల్లో	వ్యయం (రూ.కోట్లలో)	సేకరించింది	వ్యయం (రూ.కోట్లలో)	చేయాల్సింది	వ్యయం (రూ.కోట్లలో)
ప్రాజెక్టు మొత్తానికి	1,67,765.13	12,096.24	1,13,124.17	5,534.52	54,640.96	6,561.72
తొలిదశ వరకు	1,00,099.58	6,233.62	83,659.10	3,853.35	16,440.48	2,830.27

భౌతికంగా, ఆర్థికంగా సహాయ, పునరావాస స్వరూపం ఇదీ

దశ	మొత్తం		ఆర్‌అండ్‌ఆర్ పూర్తయింది		ఇంకా మిగిలింది	
	కుటుంబాలు	ఖర్చు (రూ.కోట్లలో)	కుటుంబాలు	ఖర్చు (రూ.కోట్లలో)	కుటుంబాలు	ఖర్చు (రూ.కోట్లలో)
41.15మీటర్ల వరకు	38,060	6,665.95	12,797	1,922.68	25,263	4,743.27
41.15 మీటర్ల పైన	67,946	14,708.25	0	133.25	67,946	14,575.00
మొత్తం	1,06,006	21,374.20	12,797	2,055.93	93,209	19,318.27

రైడెన్ డేటా సెంటర్ పర్యవేక్షణకు స్టీరింగ్ కమిటీ

- ఐటీ శాఖ కార్యదర్శి ఛైర్మన్‌గా 16 మందితో ఏర్పాటు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: విశాఖపట్నంలో ఏర్పాటు కానున్న గూగుల్ ఏఐ డేటా సెంటర్ ప్రాజెక్టు పర్యవేక్షణకు ఐటీ శాఖ కార్యదర్శి ఛైర్‌పర్సన్‌గా, ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సమన్వయకర్తగా ఎగ్జిక్యూటివ్ స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీలో ప్రతినిధులుగా ఐటీ, ఇంధన, మున్సిపల్, జలవనరులు, రెవెన్యూ, వాణిజ్య పన్నులు, ఆర్థిక, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, ఏపీ ఫైబర్‌నెట్, ఏపీఐఐసీ, ఏపీఈడీబీ, రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, నోటిఫైడ్ పార్ట్‌నర్‌లు అదాని ఇన్‌ఫ్రా, అదాని కనెక్స్, ఎన్‌ఎక్స్‌ట్రా, ఎయిర్‌టెల్ సంస్థల ప్రతినిధులు, కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ తరఫున ఒక్కొక్కరు ఉంటారని పేర్కొంది. ప్రాజెక్టు ఏర్పాటులో వచ్చే ఇబ్బందులు, వివిధ శాఖల మధ్య సమన్వయం, ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులను పర్యవేక్షించేందుకు ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కమిటీ 2026 డిసెంబరు 31 వరకు అమలులో ఉంటుందని.. అవసరమైతే గడువు పొడిగించే అంశాన్ని పరిశీలించనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

- విశాఖలో 1,000 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్.. కొన్ని గుర్తించిన సంస్థలతో కలిసి రూ.87,520 కోట్ల పెట్టుబడితో ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రతిపాదించింది. దీనికోసం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో 480 ఎకరాలను అదాని ఇన్‌ఫ్రా (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, ఇతర నోటిఫైడ్ పార్ట్‌నర్లకు బదిలీ చేయాలని రైడెన్ కోరింది.

కమిటీ ఏర్పాటు లక్ష్యం

- ఏఐ హబ్ ప్రాజెక్టు ముందుకు తీసుకెళ్లేందుకు సమయానుకూలంగా కమిటీ సమన్వయం చేస్తుంది. వివిధ శాఖల మధ్య సమన్వయం చేస్తుంది. ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రోత్సాహకాల గురించి పర్యవేక్షిస్తుంది.
- సింగిల్ విండో విధానంలో భూములు, పర్యావరణ, మున్సిపల్, ప్రాజెక్టు ఏర్పాటుకు ఇతర అనుమతులు.
- వివిధ శాఖల మధ్య ఉన్న అడ్డంకులను గుర్తించి వాటిని పరిష్కరించడంలో ప్రాథమికంగా పనిచేస్తుంది.
- కమిటీ స్థాయిలో గుర్తించిన సమస్యలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లి 14 రోజుల్లో పరిష్కరించేలా చూస్తుంది.
- భాగస్వామ్య పక్షాల మధ్య సమన్వయం చేస్తుంది.
- నెలలో రెండు సార్లు సమావేశమై ప్రాజెక్టుల మధ్య ఇబ్బందులను గుర్తిస్తుంది.

నౌహీరాషేక్‌కు హైకోర్టు రూ.5 కోట్ల జరిమానా

ఈనాడు, హైదరాబాద్: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జప్తు చేసిన ఆస్తుల వేలానికి సంబంధించి సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చినప్పటికీ తిరిగి ఇక్కడ పిటిషన్ వేసిన హీరా గ్రూపుతోపాటు ఆ సంస్థ ఎండీ నౌహీరాషేక్‌పై గురువారం హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసి రూ.5 కోట్ల భారీ జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని 8 వారాల్లో ప్రధానమంత్రి సహాయ నిధికి చెల్లించాలని సంచలన ఉత్తర్వులు జారీ చేసింది. అధిక రాబడుల ఆశచూపి ఏపీ, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో ప్రజల నుంచి రూ.వేల కోట్ల పెట్టుబడులు సేకరించి మోసం చేశారంటూ నౌహీరాషేక్ పలు క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. ఈ కేసుల ఆధారంగా ఈడీ రంగంలోకి దిగి హీరా గ్రూపునకు చెందిన పలు ఆస్తులను జప్తు చేసింది. ఇందులో 59 ఆస్తులకు ఈ నెల ఈడీ నిర్వహిస్తున్న వేలాన్ని సవాలు చేస్తూ నౌహీరాషేక్ గురువారం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ నగేశ్ భీమపాక దీనిపై విచారణ చేపట్టగా పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఆస్తుల జప్తును ఈడీ అప్పీలేట్ అథారిటీ ధ్రువీకరించకుండానే వేలం నిర్వహించడం చట్టవిరుద్ధమన్నారు. ఈడీ నిర్ణయించిన బిడ్డింగ్ ధరలు మార్కెట్ ధర కంటే తక్కువగా ఉన్నాయన్నారు. ఈడీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. వేలానికి సంబంధించి ఇప్పటికే సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఒకసారి సుప్రీంకోర్టు తేల్చిన అంశంపై మళ్లీ పిటిషన్‌లు వేసి కోర్టు సమయాన్ని వృథా చేస్తున్నారని వ్యాఖ్యానించారు. నిబంధనల ఉల్లంఘన లేనపుడు ఎందుకు వేశారని ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు సరైన సమాధానమివ్వకపోవడంతో రూ.5 కోట్ల జరిమానా చెల్లించాలని ఆదేశిస్తూ పిటిషన్‌ను కొట్టివేశారు. దీంతో నౌహీరాషేక్ ఆస్తుల వేలానికి గ్రీన్‌సిగ్నల్ లభించింది. కాగా తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటివరకు ఇదే అత్యంత భారీ జరిమానాగా చెప్పొచ్చు. గతంలో ఇదే హైకోర్టు ఓ కేసులో వాస్తవాలను తొక్కిపెట్టి పిటిషన్ దాఖలు చేసినందున అత్యధికంగా రూ.కోటి జరిమానా విధించింది.



సహపంక్తి మేత

సాధారణంగా అడవుల్లో జంతువులు వాటివాటి జాతులతోనే కలిసి తిరుగుతాయి. కలిసి మేస్తాయి. శాకాహార జంతువులైనా.. వేరే వాటితో సాధారణంగా కలవవు. తెలంగాణలోని మంచిర్యాల జిల్లా కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలో వేర్వేరు జాతులకు చెందిన వన్యప్రాణులు ఇలా ఒకచోట కలిసి సందడి చేశాయి. కల్పకుంట సమీపంలో అడవి పందులు, జింకలు, మనుబోతులు కలిసి మేస్తుండగా అటవీశాఖ అధికారి కెమెరాలో బంధించారు. ఇలా అరుదుగా జరుగుతుంటుందని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, జన్నారం

ట్రైబ్యునల్ అవార్డు వచ్చే వరకు కృష్ణా జలాల్లో సగం వాటా ఇవ్వాలి

- శ్రీశైలం ఆనకట్ట దిగువన గొయ్యి వెంటనే పూడ్చండి
- 14 అంశాలతో తెలంగాణ.. కృష్ణా బోర్డు సమావేశం ఎజెండా



ఈనాడు, హైదరాబాద్: కృష్ణా ట్రైబ్యునల్ అవార్డు వచ్చే వరకు కృష్ణా జలాల్లో సగం వాటాను తెలంగాణకు ఇవ్వాలంటూ మరోమారు గళం వినిపించేందుకు తెలంగాణ సిద్ధమవుతోంది. వచ్చే నెల 12న జరగనున్న 21వ కృష్ణా బోర్డు సమావేశంలో డిమాండ్లను వినిపించనుంది. ఈ మేరకు బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం 14 అంశాలతో ఎజెండాను అందజేసింది.

ఎజెండాలోని పలు అంశాలు...

■ కృష్ణా జలాలను తెలంగాణ, ఏపీలకు 50:50 నిష్పత్తిలో కేటాయించాలి. ప్రస్తుతం ఉన్న 66:34 నిష్పత్తిలో కాకుండా కేడబ్ల్యూడీటీ-2 అవార్డు వెలువడే వరకు సమాన వాటాలు అమలు చేయాలి. ఏపీ ఈ నెల ఒకటో తేదీ నాటికి 533 టీఎంసీలను, తెలంగాణ 116 టీఎంసీలను వినియోగించుకున్నాయి. పోతిరెడ్డిపాడు నుంచి 190 టీఎంసీలను బేసిన్ అవతలి అవసరాలకు ఏపీ తీసుకెళ్లింది. ఆ రాష్ట్రం లెక్కకు మించి తీసుకెళ్లిన నేపథ్యంలో శ్రీశైలం, సాగర్‌లో ఉన్న నీళ్లను తెలంగాణకు కేటాయించాలి.

■ పోలవరం- నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్ట్ నిర్మాణానికి ఏపీ డీపీఆర్ టెండర్లు పూర్తిచేసింది. తదుపరి ప్రక్రియను అమలు చేయకుండా ఆ రాష్ట్రాన్ని నిలువరించాలి.

■ 2023, నవంబరు 29న నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడివైపు భాగాన్ని ఏపీ తన అధీనంలోకి తీసుకుంది. విభజన చట్టం ప్రకారం ప్రాజెక్టు నిర్వహణ బాధ్యత తెలంగాణకు ఉంది. డ్యాం సేఫ్టీ చట్టాన్ని అనుసరించి ఆనకట్ట నిర్వహణ పనులు చేపట్టాల్సి ఉన్న నేపథ్యంలో నిర్వహణ బాధ్యత తెలంగాణకు అప్పగించాలి.

■ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌తోపాటు కేసీ కాలువ, ఎస్సార్బీసీ, గాలేరు-నగరి పథకాల నుంచి ఏపీ మళ్లిస్తున్న జలాల లెక్కలను తేల్చడానికి టెలీమెట్రీలు ఏర్పాటు చేయాలి. 19వ బోర్డు సమావేశంలో రెండు, మూడు దశల్లో టెలీమెట్రీల ఏర్పాటుపై చర్చించాం. ఈ మేరకు తెలంగాణ ఇప్పటికే నిధులు కేటాయించింది.

■ శ్రీశైలం డ్యాం దిగువన ఏర్పడిన గొయ్యి పెరుగుతోంది. దీని మరమ్మతులకు కేంద్రం డ్రిప్ పథకం కింద రూ.15 కోట్లు కేటాయించింది. ఏటా గొయ్యి పెరుగుతోందని అధ్యయనాలు చెబుతున్నాయి. వెంటనే చర్యలు తీసుకోవాలి. అనుమతించిన దానికి మించి రోజుకు 8 టీఎంసీలు తరలించేలా నిర్మిస్తున్న శ్రీశైలం కుడి ప్రధాన కాలువ లైనింగ్‌ను అడ్డుకోవాలి. రాయలసీమ ఎత్తిపోతల పథకం కింద అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలను యథాతథ స్థితికి తీసుకువచ్చేలా బోర్డు చూడాలి.



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న తెదేపా, భాజపా ఎంపీలు

రామ్మోహన్‌నాయుడికి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రుల జన్మదిన శుభాకాంక్షలు

ఈనాడు, దిల్లీ: పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ''పౌర విమానయాన రంగంలో సంస్కరణల కోసం కృషి చేస్తున్న యువ నాయకుడు రామ్మోహన్‌నాయుడుకి ఆయురారోగ్యాలు ఇవ్వాలని ప్రార్థిస్తున్నా'' అని ప్రధాని ఎక్స్‌లో పేర్కొన్నారు. ''ఆయన కృషి వల్ల విమాన కనెక్టివిటీ పెరిగి, దేశ వృద్ధి ఆకాంక్షలకు ఊతమిస్తోంది. ఆయన ఆయురారోగ్యాలతో దేశానికి నిరంతరం సేవ చేయాలని కోరుకుంటున్నా'' అని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆకాంక్షించారు. వీరితో పాటు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజూ, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. పార్లమెంటు భవనంలోని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో కూటమి ఎంపీలు కేక్ కత్తిరించి రామ్మోహన్‌నాయుడికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

రామ్మోహన్‌నాయుడికి చంద్రబాబు శుభాకాంక్షలు



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడికి కేక్ తినిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు పుట్టినరోజు సందర్భంగా సీఎం చంద్రబాబు 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో పరిపూర్ణజీవితం గడపాలని ఆకాంక్షించారు.

మాజీ ఎమ్మెల్యే బంధువంటూ బెదిరిస్తున్నారు

తెదేపా గ్రీవెన్స్‌లో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: మార్కాపురం పట్టణానికి చెందిన ఓ హోంగార్డు తనకు ఇంటి స్థలం ఇప్పిస్తానని చెప్పి రూ.20 వేలు తీసుకుని మోసం చేశారని.. డబ్బులు అడిగితే మాజీ ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి బంధువునని బెదిరిస్తున్నారని షేక్ అల్లాబక్షు ఫిర్యాదు చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో వివిధ సమస్యలతో వచ్చిన బాధితుల నుంచి ఏపీ నాటక అకాడమీ కార్పొరేషన్ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ వినతులు స్వీకరించారు.

✦ రైతు భరోసా కేంద్రానికి స్థలం ఇవ్వలేదన్న కోపంతో వీఆర్వో తన భూమిని ఓ రౌడీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించారని, ఆ వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి, కొబ్బరిచెట్లు, బావి ధ్వంసం చేశారని శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం తెప్పలవలస గ్రామానికి చెందిన సత్యనారాయణమూర్తి అర్జీ ఇచ్చారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని వాపోయారు.

✦ తమ పేరున ఉన్న భూమి ఆన్‌లైన్‌లో ఇతరుల పేర్లతో చూపిస్తున్నందున రెండు విడతలుగా అన్నదాత సుఖీభవ అందలేదని బాపట్ల జిల్లా యద్దనపూడికి చెందిన నాగేశ్వరరావు వినతి అందించారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు హైకోర్టు సీజేకు ఆహ్వానం

ఈనాడు, అమరావతి: ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో జనవరి 3, 4, 5 తేదీల్లో శ్రీ సత్యసాయి స్పిరిచ్యువల్ సిటీ ప్రాంగణంలో నిర్వహించే మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను ఆహ్వానించినట్లు ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ వెల్లడించారు. ఈ సభలకు న్యాయమూర్తులు జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ బి.కృష్ణమోహన్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లను కూడా ఆహ్వానించినట్లు తెలిపారు.

ఏపీ టెట్ పేపర్ 2ఏ ప్రాథమిక కీ విడుదల

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్)- 2025లో భాగంగా నిర్వహించిన పేపర్-2 ఏ పరీక్షల ప్రాథమిక కీ విడుదల చేసినట్లు ఏపీ టెట్ కన్వీనర్ ఎం.వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ఈనెల 10న ఉదయం, మధ్యాహ్నం జరిగిన పేపర్-2ఏ తెలుగు భాష పరీక్ష, 11న ఉదయం నిర్వహించిన పేపర్-2 మైనర్ లాంగ్వేజ్ పరీక్షల ప్రాథమిక కీని అభ్యర్థులు టెట్ అధికారిక వెబ్‌సైట్ https://tet2dsc.apcfss.in లో పొందవచ్చని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 24 వరకు అభ్యర్థులు తమ లాగిన్‌తో ప్రాథమిక కీపై అభ్యంతరాలు ఏమైనా ఉంటే తెలియజేయవచ్చని తెలిపారు.

డ్రామాను తలపించేలా వైకాపా కోటి సంతకాల సేకరణ: ఎంపీ కలిశెట్టి

ఈనాడు, దిల్లీ: వైద్య కళాశాలల పీపీపీ విధానానికి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ చేసినట్లు వైకాపా చేసిన వ్యవహారం డ్రామాను తలపించిందని విజయనగరం తెదేపా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆరోపించారు. తొలి నుంచీ దొంగ వ్యవహారాలు అలవాటైన ఆ పార్టీ నేతలు ఇప్పుడు అదే అలవాటులో భాగంగా దొంగ సంతకాలు చేసి ప్రజలను మభ్యపెట్టే కొత్త డ్రామాకు తెరతీశారని ధ్వజమెత్తారు. గురువారమిక్కడ అప్పలనాయుడు ఈ అంశంపై ఏపీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు.

తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలిగా జస్టిస్ రాధారాణి



ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలిగా జస్టిస్ డా.గురజాల రాధారాణి నియమితులయ్యారు. జస్టిస్ జైస్వాల్ పదవీ విరమణ చేసిన 22 నెలల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఆమెను ఈ పదవిలో నియమించింది. జస్టిస్ రాధారాణి తెలంగాణ హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేసి గత జూన్ 26న పదవీ విరమణ చేశారు. రాష్ట్ర వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలిగా ఆమె పేరును ఎంపిక కమిటీ సిఫారసు చేయగా... హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆమోదించి ప్రభుత్వానికి పంపారు. దీంతో ఆమెను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జస్టిస్ రాధారాణి 67 ఏళ్ల వయసు వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఉమ్మడి రాష్ట్రంలోని తెనాలిలో 1963 జూన్ 29న ఆమె జన్మించారు. ఏలూరు సీఆర్ రెడ్డి లా కళాశాలలో న్యాయశాస్త్రంలో పట్టభద్రురాలయ్యారు. ఉస్మానియా న్యాయ కళాశాల నుంచి ఎల్ఎల్ఎం పట్టా సాధించారు. అక్కడి నుంచే మేధోహక్కుల సంపత్తి చట్టానికి సంబంధించి డిప్లొమా సర్టిఫికేట్ పొందారు. దేశంలో ఫొరెన్సిక్, దర్యాప్తు విభాగాల పనివిధానాలపై పరిశోధన చేసి డాక్టరేట్ అందుకున్నారు. కొంతకాలంపాటు విజయవాడ, ఏలూరు, హైదరాబాద్‌లలో న్యాయవాదిగా పనిచేసిన అనంతరం సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. అనంతరం అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పదోన్నతి పొంది... రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ హోదాలో పనిచేశారు. 2009లో గ్రేడ్-2 జిల్లా జడ్జీగా నియమితులై పలు న్యాయస్థానాల్లో అదనపు జిల్లా జడ్జి, జిల్లా జడ్జి హోదాల్లో పనిచేశారు. రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి... 2021లో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా ఎంపికయ్యారు. రవాణాశాఖలో అదనపు కమిషనర్ హోదాలో పనిచేసి పదవీవిరమణ పొందిన సీఎల్ఎన్ గాంధీకి రాధారాణి సతీమణి. వీరికి ఇద్దరు పిల్లలు చేతన, మానవి. వీరిలో ఒకరు విదేశాల్లో అటార్నీగా.. మరొకరు వైద్యురాలిగా సేవలందిస్తున్నారు.

డీప్‌టెక్‌తో హైఎండ్ ఉద్యోగాలు

ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటమనేని

ఈనాడు, అమరావతి: డీప్‌టెక్‌లో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా యువతను తీర్చిదిద్దడమే లక్ష్యమని ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటమనేని అన్నారు. 'సాధారణ కోడింగ్ ఉద్యోగాలతో పోలిస్తే డీప్‌టెక్ ద్వారా ఏడెనిమిది రెట్లు అధికంగా జీతాలు పొందే అవకాశం ఉంది. ఈ సాంకేతికతను ఇప్పటికే ఆర్టీజీఎస్, ఏఐలో వినియోగిస్తున్నాం. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా డీప్‌టెక్ ఇన్నోవేషన్, క్వాంటమ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ), ఆర్‌ఐడీఎఫ్ డీప్‌టెక్ ఫండ్, కేంద్ర ఐటీ శాఖల సహకారంతో స్టార్టప్‌లను ప్రోత్సహిస్తాం' అని పేర్కొన్నారు. కలెక్టర్లు ఇన్నోవేషన్ ఛాలెంజ్‌లు, ఇన్నోవేషన్ థీమ్ ఫెస్టివల్స్‌ను నిర్వహించాలని సూచించారు.

సాకారం కానున్న క్వాంటమ్ వ్యాలీ

'క్వాంటమ్ వ్యాలీ, డ్రోన్ సిటీ, స్పేస్ సిటీ వంటి సాంకేతిక ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తున్నాం. వచ్చే జనవరిలో అమరావతి క్వాంటమ్ వ్యాలీకి శంకుస్థాపన చేసి. 2027 నాటికి పూర్తి చేస్తాం. 2030 నాటికి క్వాంటమ్ కంప్యూటింగ్‌లో 5 వేల మంది నిపుణులను సిద్ధం చేస్తాం. 100 క్వాంటమ్ స్టార్టప్‌లను ప్రోత్సహించాలన్నది లక్ష్యం. అమరావతిలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్, ఇతర ప్రాంతాల్లో స్పోక్ సెంటర్లు ఏర్పాటు చేశాం' అని భాస్కర్ పేర్కొన్నారు.

విద్యుత్ ధర తగ్గిస్తాం

• యూనిట్ రూ.4 కంటే తక్కువే ఉండాలి • కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు



సదస్సులో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. వేదికపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు అనగాని సత్యప్రసాద్, లోకేశ్, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా

ఈనాడు, అమరావతి: వినియోగదారులకు తక్కువ ధరకే విద్యుత్‌ను అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు నిర్దేశించారు. ఇందుకు విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. గురువారం కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. ఇంధన ప్రాజెక్టులను రానున్న ఆరు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ వ్యయాన్ని తగ్గించేందుకు చేపట్టిన చర్యలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

విద్యుత్ ప్రాజెక్టుల పూర్తిపై దృష్టి

రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులకు యూనిట్ విద్యుత్‌ను రూ.3.70కే అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పేర్కొన్నారు. 'తక్కువ ధరకు విద్యుత్ అందించాలనేది ప్రభుత్వ లక్ష్యం. దీనికి అనుగుణంగా సౌర, పవన, పంప్డ్ స్టోరేజ్, హైడ్రో విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాం. గ్రిడ్ నిర్వహణకు మాత్రమే థర్మల్ విద్యుత్‌ను వినియోగించాలి. రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, క్లీన్ ఎనర్జీ టెక్నాలజీలను ప్రోత్సహిస్తున్నాం. ఇందుకు గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీని ఏర్పాటు చేశాం. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిని ప్రోత్సహించే లక్ష్యంతో ఒక సలహా మండలి ఉంది. దేశవ్యాప్తంగా ఉన్న నిపుణులతో సమావేశమై.. రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్రంలో వినియోగదారే.. ఉత్పత్తిదారు అనే విధానాన్ని తీసుకువచ్చేలా పనిచేస్తున్నాం. సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులు, ఫీడర్ స్థాయిలో మినీ సౌర విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో మైక్రో గ్రిడ్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ఆ ప్రాంతానికి అవసరమైన విద్యుత్‌ను అక్కడే ఉత్పత్తి చేసి వినియోగించడం వల్ల పంపిణీ, సరఫరా నష్టాలు తగ్గుతాయి' అని వివరించారు.

ఈ ప్రాజెక్టులు పూర్తయితే..

◆ 2024-25ను బేస్ సంవత్సరంగా తీసుకుంటే.. యూనిట్ విద్యుత్ వ్యయం రూ.5.19గా ఉంది. దీన్ని 2025-26లో యూనిట్ విద్యుత్ వ్యయాన్ని రూ.4.80కు తగ్గించాలన్నది ప్రభుత్వ ఆలోచన. వచ్చే మూడు నెలల్లో యూనిట్ వ్యయాన్ని రూ.4.80కు తీసుకొస్తాం. ◆ ఈ ప్రాజెక్టులు మొత్తం పూర్తయితే వచ్చే మూడు సంవత్సరాల్లో విద్యుత్ కొనుగోలు వ్యయంలో రాష్ట్రానికి సుమారు రూ.4,635 కోట్లు ఆదా అవుతుందని అంచనా. దీనివల్ల విద్యుత్ టారిఫ్ యూనిట్ రూ.4 లోపు ఉంటుంది. యూనిట్ టారిఫ్ రూ.3.70గా సీఎం నిర్దేశించారు' అని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వివరించారు.

విద్యుత్ వ్యయాన్ని తగ్గించేందుకు చేపట్టిన చర్యలు

'పీఎం కుసుమ్ పథకం కింద ఫీడర్ స్థాయిలో రూఫ్‌టాప్ ప్రాజెక్టుల ఏర్పాటు ద్వారా వ్యవసాయానికి తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ అందించాలన్నది లక్ష్యం. 2.93 లక్షల వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించి మినీ ప్రాజెక్టుల ద్వారా 1,162.80 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చాం.

◆ ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు ఉచిత విద్యుత్‌ను అందించేందుకు వీలుగా 1,198.21 మెగావాట్ల రూఫ్‌టాప్ ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తున్నాం. 27.59 లక్షల మంది బీసీ వినియోగదదారులు రూఫ్‌టాప్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసుకునేందుకు నిర్ణయం తీసుకున్నాం. అన్ని ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, కళాశాలలపై రూఫ్‌టాప్ ప్రాజెక్టుల ఏర్పాటు.

◆ విద్యుత్ లోడ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ (బెస్) ఏర్పాటు చేస్తున్నాం. సుమారు 3 వేల మెగావాట్ అవర్ బెస్ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తున్నాం.

బంగారు కుటుంబాలను మార్గదర్శులతో మ్యాపింగ్ చేయాలి

ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్

ఈనాడు, అమరావతి: విజన్-2047 లక్ష్యాల్లో ఒకటైన జీరో పావర్టీ సాధన కోసం అమలు చేస్తున్న పీ-4 కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడంలో క్షేత్రస్థాయిలో గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బంది పూర్తిస్థాయిలో భాగస్వాములు కావడం లేదని ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ తెలిపారు. దీనివల్ల ఇప్పటికే 10 లక్షల బంగారు కుటుంబాలకు సాయం అందించేందుకు ముందుకు వచ్చిన లక్ష మంది మార్గదర్శులను గుర్తించినా.. ఫలితం లేకుండా పోతోందని వెల్లడించారు. మార్గదర్శులు, బంగారు కుటుంబాలను మ్యాపింగ్ చేయకపోవడంతో పీ-4 మిషన్ లక్ష్య సాధనలో తగిన స్పందన రావడం లేదని పేర్కొన్నారు. ఈ 10 లక్షల బంగారు కుటుంబాలను లక్ష మంది మార్గదర్శులతో మ్యాపింగ్ చేసే కార్యక్రమాన్ని వచ్చే జనవరి-మార్చిలోగా పూర్తి చేయాలని కలెక్టర్లకు నిర్దేశించారు. ఇందులో ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లదే కీలక భూమికని స్పష్టం చేశారు. కలెక్టర్ల సమావేశంలో రెండో రోజు విజన్-2047 సాధనకు 10 సూత్రాల అమలుపై చర్చ సందర్భంగా... వాటిలో ఒకటైన జీరో పావర్టీ మిషన్‌కు నాయకత్వం వహిస్తున్న పీయూష్‌కుమార్ ప్రజంటేషన్ ఇచ్చారు. కుటుంబ ఆదాయం, ఇతర కారణాలను విశ్లేషించి ఇప్పటివరకు 21 లక్షల బంగారు కుటుంబాలను ఎంపిక చేశామని, వీటిని ఐదు రకాలుగా విభజించామని తెలిపారు.

జీరో పావర్టీ మిషన్ లక్ష్యాలు..: రాష్ట్రంలో పేదరికాన్ని సంపూర్ణంగా నిర్మూలించడం ● సమ్మిళిత అభివృద్ధిలో పీ-4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్) నమూనాను బలోపేతం చేయడం ● అర్హులైన కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సంతృప్తస్థాయిలో అందేలా చేయడం ● నైపుణ్యాభివృద్ధి ద్వారా పీ-4 ఫ్రేమ్‌వర్క్ కింద కుటుంబాలను వృద్ధి యూనిట్లుగా మార్చడం ● ప్రతి ఇంటికీ లక్ష్యంగా ఎంత మద్దతునివ్వాలనే దానికోసం ఆయా కుటుంబాలు ఏస్థాయి పేదరికంలో ఉన్నాయనేది గుర్తించి స్కోర్ కేటాయించడం.

ప్రజల్లో అంత సంతృప్తి లేదు.. దృష్టి సారించాం

రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్

ఈనాడు, అమరావతి: 'రాష్ట్రంలో రెవెన్యూ సమస్యల పరిష్కారం అంకెల్లో బాగానే కనిపిస్తున్నా ప్రజల సంతృప్తి లేదు. ఎందుకో కారణాలు అన్వేషించాలి. మొత్తం వచ్చిన ఫిర్యాదుల్లో 85% పరిష్కారమైనట్లు లెక్కలు కనిపిస్తున్నాయి. సంతృప్తి స్థాయి 53 శాతమే కనిపిస్తోంది. అంటే రెవెన్యూ సమస్యల పరిష్కారం నాణ్యంగా జరగడం లేదని అర్థమవుతోంది. దీనిపై కలెక్టర్లు దృష్టి సారించాలి' అని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ అన్నారు. వివరాలు ఆయన మాటల్లోనే..

◆ 'రెవెన్యూ అంశాలపై దరఖాస్తులు, ఫిర్యాదులు ఇచ్చేందుకు ప్రజలు వెళుతుంటే సచివాలయాల్లో లేదు. వీఆర్వో సంతకం పెట్టించుకుని రండి.. సర్వేయర్ సంతకం తీసుకుని రండి అని చెబుతున్నారు. దరఖాస్తు చేసుకునేందుకు వాళ్ల సంతకాలు ఎందుకు? గ్రామ సచివాలయాల స్థాయిలోనే మ్యుటేషన్లు, పట్టాదారు పాసుపుస్తకాల కేసులు 30 శాతం మేర తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు. చివరి తేదీ వరకు పెండింగులో ఉంచి ఏదో కారణం చూపి తిరస్కరిస్తున్నారు. వెళ్లి అడిగితే మళ్లీ దరఖాస్తు చేసుకో అంటారు. ఎందుకు ఇలా చేయడం? దీనిపై మేం గట్టిగా దృష్టి పెడతాం. ◆ ఆర్టీజీఎస్ సర్వే ప్రకారం..సరిగ్గా సమస్యలు పరిష్కరించని ఫిర్యాదుల శాతం 34 నుంచి 8.29 శాతానికి వచ్చింది. నిరంతరం అనుశీలన వల్ల అధికారుల్లో చెయ్యాలి అనే భావన వచ్చింది. ◆ ఫీడ్ బ్యాక్ తీసుకునేందుకు 34 వేల మందికి ఫోన్లు చేస్తే... బాగుంది, పర్వాలేదు అన్నది 53.39 శాతం, బాగోలేదన్నవారు 46.61శాతం ఉన్నారు.

రెవెన్యూ క్లినిక్‌లు: మన్యం జిల్లాలో కలెక్టర్ ప్రభాకర్ రెవెన్యూ క్లినిక్‌లు పెట్టారు. నాలుగైదు ప్రత్యేక డెస్కులు పెట్టారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే పరిశీలిస్తారు. సమస్యను ఎలా పరిష్కరించవచ్చో వారు ఒక రిపోర్టు తయారు చేస్తారు. ఆ తర్వాత దాని ఆధారంగా పరిష్కరిస్తారు. పోస్టుమార్టం చేయడం కన్నా ఇది బాగుంది. మన్యం జిల్లాలో 94 కేసులు ఇలా తీసుకుంటే వాటిని బాగా పరిష్కరించారని తేలింది. పిటిషనర్లలో 100% సంతృప్తి నెలకొంది. దీనిని అధ్యయనం చేసి ఇతర జిల్లాల్లోనూ అమలు చేస్తాం. బాపట్ల కలెక్టర్ కూడా కొంత వర్క్ చేశారు. ఏలూరు జిల్లాలోనూ బాగా చేసినట్లు మంత్రి మనోహర్ చెప్పారు.

20 నుంచి అన్ని పాఠశాలల్లో 'ముస్తాబు'

రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో ఈ నెల 20 నుంచి విద్యార్థుల పరిశుభ్రతకు 'ముస్తాబు' కార్యక్రమం అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. క్యాన్సర్ రోగులు, దివ్యాంగులు సహా అధిక అవసరాలున్న వారిని ఆదుకునేందుకు వీలుగా ప్రతి జిల్లాలోనూ ఇన్‌ఛార్జి మంత్రి, కలెక్టర్ ఆధ్వర్యంలో 200 కొత్త పింఛన్లు మంజూరు చేసే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు.

కలెక్టర్లు రెవెన్యూ వసూళ్లను సమీక్షించాలి

• ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: 'రెవెన్యూ వసూళ్లపై కలెక్టర్లు కూడా దృష్టి సారించాలి. గతంలో వసూళ్లు ఎలా ఉన్నాయి.. ఈ ఏడాది లక్ష్యం ఎంత.. తదితర వివరాలు జిల్లాలవారీగా మీకు ఆర్థిక శాఖ అధికారులు పంపుతారు. వాటిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రెవెన్యూ వసూళ్లు పెరిగేలా చూడాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్లను ఆదేశించారు. రెవెన్యూ ఆర్జన శాఖలపై సీఎం గురువారం కలెక్టర్ల సదస్సులో సమీక్షించారు. 'కొన్ని కంపెనీలు ఇక్కడ కార్యకలాపాలు సాగిస్తూ.. వేరే రాష్ట్రాల్లో రిజిస్టర్ అయి ఉంటున్నాయి. అందువల్ల పన్నుల ప్రయోజనం మనకు దక్కడం లేదు. ఇందుకు సంబంధించి ఉత్తర్వులు ఇవ్వాలని గతంలోనే చెప్పా. వెంటనే ఆ జీవో ఇచ్చి ఆయా కంపెనీలు ఇక్కడ పనిచేస్తే రాష్ట్రానికే ఆదాయం వచ్చేలా చూడాలి. జిల్లా కలెక్టర్లు సైతం ఎవరెవరు ఇలా వ్యవహరిస్తున్నారో పరిశీలించాలి' అని పేర్కొన్నారు.

సగం రాబడి సాధించాం..

ఈ ఆర్థిక సంవత్సరంలో వసూళ్ల లక్ష్యం రూ.1,34,000 కోట్లు కాగా, ఇప్పటికే సగం రాబడి సాధించామని ఆర్థిక శాఖ కార్యదర్శి వాడ్రేవు వినయ్‌చంద్ పేర్కొన్నారు. ఇక మిగిలింది మూడున్నర నెలలు మాత్రమేనని, అన్ని రెవెన్యూ ఆర్జన శాఖలు, కలెక్టర్లు దృష్టి సారించాలని ఆయన సూచించారు. కిందటి ఆర్థిక సంవత్సరంతో.. ఈ ఆర్థిక సంవత్సరం తొలి రెండు త్రైమాసికాలను పోల్చితే.. ఈసారి మంచి స్థితిలోనే ఉన్నామని చెప్పారు. అప్పటి కన్నా రాబడి పెరిగిందని, వాణిజ్య పన్నుల్లో కొంత తక్కువ ఉందని, నవంబరులో జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల కొంతమేర తగ్గుదల కనిపించిందని వెల్లడించారు. అబ్కారీలో తప్ప మిగిలిన అన్ని రెవెన్యూ ఆర్జన శాఖల్లోనూ మునుపటి కన్నా పరిస్థితి మెరుగ్గా ఉందన్నారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల విభాగంలో 66% లక్ష్యాలు సాధించామని, గనుల్లో 45% రాబడి వచ్చిందని వివరించారు.

ఎన్టీఆర్ కమిషనరేట్‌లో 10 వేల సీసీ కెమెరాలు

ఈనాడు, అమరావతి: దొంగతనాలు, దోపిడీలు తదితర నేరాలు రాష్ట్రంలోనే అత్యధికంగా ఎన్టీఆర్ కమిషనరేట్ పరిధిలో 32.9 శాతం మేర తగ్గాయి. దాని కోసం అవలంబించిన అత్యుత్తమ ఆచరణలను పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖర్‌బాబుతో సీఎం చెప్పించారు. 'కమిషనరేట్ పరిధిలో ప్రజల సహకారంతో 10 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఎక్కడ నేరం జరిగినా, నేరగాడు ఏదో ఒక సీసీ కెమెరాలో చిక్కాల్సిందే. కమిషనరేట్ పరిధిలో ప్రాపర్టీ నేరాల ఛేదన రేటు 84 శాతం. ఏదైనా నేరం జరిగితే 36 గంటల్లో నేరగాళ్లను పట్టుకుంటున్నాం' అని వివరించారు.

'ఇష్టానుసారంగా ట్రాఫిక్ చలానాలు విధించి వేధించటం సరికాదు. ప్రజలకు అవగాహన కల్పించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా ప్రోత్సహించాలి' అని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు.

భవన నిర్మాణ అనుమతుల జారీలో విశాఖ మొదటి స్థానం

ఈనాడు, అమరావతి: ప్రభుత్వం భవన నిర్మాణ అనుమతులు సులభతరం చేసిన తర్వాత అవి జారీ చేయడంలో విశాఖపట్నం జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. ఈ ఏడాది ఇప్పటివరకు ఆ జిల్లాలో 6,352 కొత్త నిర్మాణాలకు అనుమతులు ఇచ్చింది. గుంటూరు (2,991 అనుమతులు), కృష్ణా (2,205) జిల్లాలు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. భవన నిర్మాణ అనుమతుల్లో కూటమి ప్రభుత్వం పెద్దఎత్తున సంస్కరణలు తీసుకొచ్చింది. ప్రత్యేకించి అక్రమ వసూళ్లు, అవినీతికి ఆస్కారం లేకుండా స్వీయ ధ్రువీకరణ కార్యక్రమం కింద అనుమతులు సులభతరం చేసింది. 123 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో ఈ ఏడాది ఇప్పటివరకు 26,232 నిర్మాణాలకు అనుమతులిచ్చారు. వీటి ద్వారా ఫీజుల కింద రూ.849.23 కోట్ల ఆదాయం వచ్చింది.

లేఔట్ల అనుమతుల్లో గుంటూరు..: ఈ ఏడాది ఇప్పటివరకు 271 లేఔట్లకు అనుమతులు ఇచ్చి గుంటూరు జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. విశాఖపట్నం(98), తూర్పు గోదావరి (76) జిల్లాలు ఆ తర్వాత రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 905 లేఔట్లకు అనుమతులిచ్చారు. వీటి ద్వారా పట్టణ స్థానిక సంస్థలు, పట్టణాభివృద్ధి సంస్థలకు ఫీజుల కింద రూ.91.37 కోట్ల ఆదాయం వచ్చింది. ఇప్పటి వరకు ఒక్క లేఔట్లకూ అనుమతి ఇవ్వకపోవడంతో అన్నమయ్య జిల్లా చివరి స్థానంలో నిలిచింది. పార్వతీపురం, అనకాపల్లి జిల్లాల్లో రెండేసి లేఔట్లకే అనుమతులిచ్చారు.

ఈ ఏడాది 7500 హెక్టార్లలో ఆటోమేషన్ విధానం

• రాయలసీమలో ఎక్కువగా వినియోగానికి చర్యలు

• వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

ఈనాడు, అమరావతి: ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 7,500 హెక్టార్లలో ఆటోమేషన్ విధానాన్ని తీసుకురానున్నట్లు వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. రాయలసీమలో ఎక్కువగా వినియోగించనున్నట్లు వెల్లడించారు. సంప్రదాయ డ్రిప్ విధానానికి ఆటోమేషన్‌ను జత చేస్తే పంట ఉత్పత్తి వృద్ధితో ఆదాయం పెరుగుతుందని తెలిపారు. కలెక్టర్ల సదస్సులో అగ్రి టెక్‌పై వ్యవసాయశాఖ ఎక్స్ అఫిసియో కార్యదర్శి రాజశేఖర్ ప్రజంటేషన్ ఇచ్చారు. 'మార్చి 2026 నాటికి 25 లక్షలమంది అగ్రిటెక్ ప్లాట్‌ఫారం అనుసంధానమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం. ప్రాంతాలవారీగా పంటల సాగుకు అనుగుణంగా రైతులకు మేలు జరిగేలా అగ్రిటెక్ విధానాల్ని అనుసరిస్తున్నాం. వ్యవసాయంలో ఏఐ వినియోగానికి సంబంధించి నీతి ఆయోగ్ సూచించిన 28 అంశాలకుగాను 18 అంశాల్లో ఇప్పటికే అమలు చేసి దేశంలోనే రాష్ట్రాన్ని ముందు వరుసలో నిలిపాం. ఎరువులు, పురుగు మందుల వాడకం, విత్తనాలు చల్లడంలోనూ డ్రోన్లను వినియోగిస్తున్నాం. దీని వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. 2024-25 ఏడాదిలో 68 వేల హెక్టార్లు పురుగు మందుల పిచికారి చేశారు. ఈ ఏడాది ఇప్పటివరకు 61 వేల హెక్టార్లలో పిచికారి జరిగింది' అని వివరించారు.. ◆ డ్రోన్ దీదీ, కిసాన్ డ్రోన్ల వినియోగానికి ప్రత్యేక యాప్‌ను తయారు చేసి డ్రోన్ యజమానులు, రైతుల్ని ఒకే ప్లాట్‌ఫాం పైకి తీసుకొస్తున్నాం..◆ పురుగుల మందు వాడకం సాగు మొత్తం కాకుండా ఏ మొక్కకు అవసరమో దాన్ని గుర్తించి పిచికారి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. తద్వారా డ్రోన్ వినియోగ ఖర్చు కూడా తగ్గుతుంది. ◆ పరిమాణం చిన్నదిగా ఉండి తక్కువ సమయంలోనే ఛార్జీ అయ్యే, ఎక్కువ బరువు తీసుకెళ్లగలిగే డ్రోన్లను రైతులకు అందుబాటులోకి తీసుకురానున్నాం. ◆ ఉద్యాన పంటల సాగులో రాయలసీమ గ్లోబల్ హబ్‌గా మార్చేందుకు సాంకేతికతను వినియోగిస్తున్నాం. ◆ ఆహారశుద్ధి రంగంలో వాల్యూ చైన్‌ను విశ్లేషిస్తే రా మెటీరియల్ ఉత్పత్తి చేసే రైతులతో పోలిస్తే మిగతా ఎక్కువ ఆదాయం ఉంది. ఎఫ్‌పీవోలు, ఎంఎస్ఎంఈల ద్వారా వీరికి ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. దీనికి సాంకేతికతను వినియోగిస్తున్నాం. ◆ ఎక్స్‌పోర్ట్ ఓరియెంటెడ్ అగ్రి బిజినెస్ మోడల్స్, స్మార్ట్ ఫార్మింగ్ టెక్నాలజీస్‌ను అమలు చేస్తున్నాం.

సరకు రవాణాలో తూర్పుతీర ముఖద్వారంగా ఏపీ

• లాజిస్టిక్స్ ఖర్చు తగ్గించేలా ప్రణాళికలు

• సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: సరకు రవాణాలో రాష్ట్రాన్ని తూర్పు తీర ముఖద్వారంగా తీర్చిదిద్దనున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. లాజిస్టిక్స్ ఖర్చులు ఏపీలోనే అతి తక్కువగా ఉండేలా తగిన మౌలిక వసతులు కల్పించనున్నట్లు వెల్లడించారు. కలెక్టర్ల సదస్సుల్లో సీఎం మాట్లాడుతూ.. జీఎస్‌డీపీలో లాజిస్టిక్స్ ఖర్చులు ప్రస్తుతం 15.7 శాతం ఉన్నాయని, దీనిని 7-8 శాతానికి తగ్గించేలా చూస్తామని చెప్పారు. ఏపీని లాజిస్టిక్ హబ్‌గా మార్చేందుకు అంతర్జాతీయ స్థాయిలో లాజిస్టిక్స్‌లో పెట్టుబడులు పెట్టేవారిని మన రాష్ట్రానికి ఆహ్వానిస్తామని సీఎం తెలిపారు. ఉద్యాన ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి చేయగలిగితే వాటికి మంచి ధరలు లభిస్తాయన్నారు. లాజిస్టిక్ పార్కులు ఏర్పాటు చేయనున్నామని, కంటెయినర్ కార్గోను ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. ఈ అంశంపై పెట్టుబడులు- మౌలికవసతులు, రవాణా, ఆర్‌అండ్‌బీ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ప్రజంటేషన్ ఇచ్చారు. అందులో ముఖ్యాంశాలివీ..

రూ.2.52 లక్షల కోట్లతో హైవేలు, రైల్వే పనులు

రాష్ట్రంలో రూ.1.50 లక్షల కోట్ల మేర జాతీయ రహదారుల పనులు, రూ.1.02 లక్షల కోట్లతో రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయి. ◆ రోడ్డు మార్గంలో సరకు రవాణాకు సగటున 41% ఖర్చవుతోంది. దీనిని తగ్గించేందుకు రైలు, జల రవాణా పెంపుపై దృష్టి సారించాం.

◆ ఇప్పటికే ఆరు ఆపరేటింగ్ పోర్టులు ఉన్నాయి. ఏడాదికి 100 మిలియన్ టన్నుల సామర్థ్యంతో నాలుగు కొత్త పోర్టులను 2027 చివరికి అందుబాటులోకి తీసుకొస్తాం. ◆ లాజిస్టిక్స్‌కు సంబంధమున్న ప్రభుత్వ రంగ సంస్థలన్నింటితో కలిపి ఏపీ లింక్ అనే గవర్నెన్స్ తీసుకురానున్నాం.

రెండు సమాంతర హైవేలు

◆ అంతర్రాష్ట్ర రహదారుల కనెక్టివిటీలో భాగంగా కోల్‌కతా- చెన్నై రహదారికి సమాంతరంగా రాష్ట్రంలో రెండు కొత్త హైవేలు రానున్నాయి.

◆ ఖరగ్‌పుర్ నుంచి అమరావతికి 446 కి.మీ. మేర యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మించనున్నారు. దీనికి త్వరలో ఎలైన్‌మెంట్ ఖరారు చేస్తాం.

◆ మూలపేట పోర్టు నుంచి విశాఖపట్నానికి 155 కి.మీ. మేర జాతీయ కోస్తా రహదారికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి.

◆ విజయనగరం నుంచి బౌధార, అరకు, పాడేరు మీదగా రాజమహేంద్రవరానికి హైవే విస్తరణ జరుగుతోంది.

◆ రాష్ట్రానికి పశ్చిమ ప్రాంతంలో ఉండే నాగ్‌పుర్, సూరత్, బెంగళూరు, బళ్లారిలకు హైవేల నిర్మాణంపై దృష్టి సారించాం.

◆ మొత్తంగా రాష్ట్రంలో రూ.1.50 లక్షల కోట్లతో 4,739 కి.మీ. మేర 155 ఎన్‌హెచ్ ప్రాజెక్టులు చేపట్టాం.

◆ హైవేల్లో వాహనాల సగటు వేగం గంటకు 80 కి.మీ. ఉంది. 120 కి.మీ. వేగంతో ప్రయాణించేలా యాక్సెస్ కంట్రోల్ హైవేలు నిర్మిస్తున్నారు.

రాష్ట్రంలో 147 రైల్వే ప్రాజెక్టులు

రాష్ట్రం నుంచి తూర్పు, మధ్య భారతదేశంలోని ప్రాంతాలకు కనెక్టివిటీ కల్పించే ప్రాజెక్టులపై దృష్టి పెట్టాం. నాగ్‌పుర్, సూరత్‌తోపాటు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని వివిధ నగరాలకు రైల్వే లైన్లతో అనుసంధానం ఉండేలా చూడనున్నాం.

◆ రూ.1.02 లక్షల కోట్లతో 147 ప్రాజెక్ట్సును రైల్వే శాఖ చేపట్టింది.◆ కలెక్టర్లు జిల్లా లాజిస్టిక్స్ ఫెసిలిటేషన్ సెల్స్ ఏర్పాటు చేసుకోవాలి. ఆ జిల్లాలో ముఖ్యమైన ఉత్పత్తులేంటి, వాటిని ఎక్కడకు రవాణా చేస్తారు, ఎలా రవాణా చేస్తే త్వరగా గమ్యస్థానాలకు చేర్చొచ్చు, గోదాములు ఎక్కడెక్కడున్నాయి వంటివన్నీ గుర్తించాలి. సమస్యలుంటే సరిచేయాలి.

◆ జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు వేగంగా భూసేకరణ జరిగేలా చూడాలి.

3 మీటర్లలోపు నీళ్లుంటే రూ.7 వేల కోట్లు ఆదా

• భూగర్భజలాల పెంపుతో పర్యావరణానికీ మేలు • నీటి భద్రతపై సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా సగటున 3 మీటర్లలోపు భూగర్భ జలాలు అందుబాటులో ఉంటే విద్యుత్తు వినియోగంలో రూ.7-8 వేల కోట్లు ఆదా అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. భూగర్భ జలాల పెంపుతో పర్యావరణ పరిరక్షణ కూడా జరుగుతుందన్నారు. వ్యవసాయంలో విద్యుత్తు వినియోగానికి రాయితీ కింద రూ.15 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఆరోగ్య రంగంలో ఔషధాలు, హెల్త్ కేర్ కింద రూ.20 వేల కోట్లు వెచ్చిస్తున్నామని, ఇప్పుడున్న దానికి 25 శాతం సామర్థ్యం పెంచితే దాదాపుగా రూ.5 వేల కోట్లు మిగులుతుందని వెల్లడించారు. అందుకే సంజీవని పథకాన్ని తీసుకొస్తున్నామని వివరించారు. ఇలా కొత్త విధానాల్ని రూపొందించడంతోపాటు ప్రజల్లోనూ అవగాహన కల్పించాలని అధికారులకు నిర్దేశించారు. కలెక్టర్ల సదస్సులో నీటి భద్రతపై ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. 'వీలైనంత వరకు లిఫ్ట్, మొబైల్ లిఫ్ట్‌లు పెట్టి రాష్ట్రవ్యాప్తంగా చెరువుల్ని పూర్తిగా నింపాలి. వచ్చే ఏడాదిలో నీటి నిల్వ 95 శాతానికి చేరాలి' అని స్పష్టం చేశారు. సాయిప్రసాద్ ఇచ్చిన ప్రజంటేషన్‌లో ముఖ్యాంశాలివీ..

చిన్ననీటిపారుదల చెరువుల్లో 20% అదనంగా నిల్వ

● రాష్ట్రవ్యాప్తంగా 38,400 చిన్ననీటిపారుదల చెరువుల్లో నీటి నిల్వపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టిసారించాలి.

● సప్లయ్, ఫీడర్ ఛానల్స్, చెరువుల్లో ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం వీటిలో 137 టీఎంసీల నీరుంది. మొత్తం సామర్థ్యంలో 66.48% చేరుకున్నాం. గతేడాది (46.99%)తో పోలిస్తే దాదాపు 20 శాతం నిల్వ పెంచాం.

● వర్షాకాలం చివరి రోజుకు రాష్ట్రంలోని అన్ని ప్రధాన రిజర్వాయర్లు నిండిపోవాలి. భూగర్భ జలాలు వర్షాకాలం పూర్తయ్యేసరికి 3 మీటర్ల లోతుకు.. వర్షాకాలం మొదలయ్యేటప్పటికి 8 మీటర్ల కంటే తగ్గకుండా చూడాలి.

● ప్రస్తుతం భూగర్భజలాలు సగటున 6.8 మీటర్ల లోతులో ఉన్నాయి. అవి ఒక మీటరు ఎత్తు పెరిగితే గరిష్ఠంగా 745 టీఎంసీలు అదనంగా అందుబాటులోకి వస్తుంది. తద్వారా నీటిని తోడేందుకు వినియోగించే విద్యుత్తులో 400 మిలియన్ యూనిట్లు ఆదా అవుతుంది.

● డ్రెయిన్లలో పరిశ్రమలు, పురపాలక, వ్యవసాయానికి సంబంధించిన కలుషిత పదార్థాలన్నీ వదులుతున్నారు. నీటి కాలుష్యంపై కూడా దృష్టి పెట్టాలి. ఇది పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో ఎక్కువగా ఉంది.

విద్యుత్తు బిల్లులు చెల్లించేలా చూడాలని సీఎం దిశానిర్దేశం

'జప్తు అనే మాట లేకుండా నీటి తీరువా వసూలుపై రైతుల్లో అవగాహన కల్పించాలి. ఇలా వసూలు చేసే మొత్తాన్ని కాల్వలు, డ్రెయిన్లలోని గుర్రపు డెక్క, కిక్కిసలు తీయడానికి వినియోగిస్తామని వారికి తెలియజేయాలి' అని సాయిప్రసాద్ సూచించగా.. 'రైతులే కాదు అందరినీ మోటివేట్ చేయాలి. రాయితీ వర్తించే అర్హులు తప్ప మిగతావారందరూ చెల్లించేలా కలెక్టర్లు చూడాలి' అని సీఎం స్పష్టం చేశారు.

నవ్వులు పూయించిన సాయిప్రసాద్

వర్షాలకు అన్ని రిజర్వాయర్లలో నీటిని నింపడంపై సీఎం జలవనరులశాఖ అధికారులను అభినందించారు. 'నాకు ఉదయం ఒకరు ఫోన్ చేసి తిరుపతి వెళ్లే దారిలో చెరువులన్నీ నిండి చాలా ఆహ్లాదాన్ని పంచుతున్నాయని చెప్పారు. రాష్ట్రమంతా ఇదే తరహాలో అన్ని జలవనరుల్లో నీళ్లుంటే ఎంత ఎనర్జిటిక్‌గా ఉంటుందో గుర్తించాలి' అని సూచించారు. సాయిప్రసాద్ స్పందిస్తూ 'నెల్లూరు కలెక్టర్ ఇంటి వెనుక పెద్ద చెరువు ఉంది. బహుశా ఆయన రోజూ దాన్ని చూస్తూ సమస్యల్ని వేగంగా పరిష్కరిస్తున్నారేమో' అని అన్నారు. దీంతో సదస్సులో నవ్వులు విరిశాయి.

● 'నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు కలెక్టర్లు రెగ్యులర్‌గా సమీక్షలు నిర్వహించాలి. నేను కలెక్టర్‌గా ఉన్నప్పటి నుంచి కూడా కలెక్టర్లు ఈ అంశంపై దృష్టి పెట్టరు. అలా ఉండకూడదు' అని సాయిప్రసాద్ పేర్కొన్నారు. 'నేను చేసిన తప్పును మీరు చేయొద్దని సాయిప్రసాద్ చెబుతున్నారు' అని సీఎం వ్యాఖ్యానించడంతో నవ్వులు విరబూశాయి.

ఇసుక సరఫరాలో ఏడు జిల్లాలు వెనుకబాటు

• రెవెన్యూశాఖ వద్ద భారీగా లీజుల ఎన్వోసీలు పెండింగ్

ఈనాడు, అమరావతి: ప్రజలకు ఇసుక అందుబాటులో ఉంచడం, అవసరం మేరకు వారికి సరఫరా అయ్యేలా చూడటంలో.. ఏడు జిల్లాలు గత మూడు నెలలుగా వెనుకబాటులో ఉన్నాయి. తిరుపతి, శ్రీసత్యసాయి, బాపట్ల, అనకాపల్లి, ప్రకాశం, అన్నమయ్య, కృష్ణా జిల్లాల్లో ఈ పరిస్థితి ఉంది. ప్రజల సంతృప్తిస్థాయి సాధనలో వరుసగా మూడు నెలల నుంచి ఈ జిల్లాలు వెనుకబడ్డాయి. కలెక్టర్ల సదస్సుల్లో గనులశాఖపై కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తన ప్రజంటేషన్‌లో ప్రస్తావించిన అంశాలివి.. ◆ నెల్లూరు జిల్లాలో ఇసుక తవ్వకాలు జరుపుతున్న ప్రైవేటు ఏజెన్సీల బాధ్యతలను తగ్గించి, జిల్లా ఇసుక కమిటీ ద్వారా పర్యవేక్షించాలి. ప్రతి జిల్లాలో ఇసుక అందుబాటులో ఉండేలా కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలి. ఇప్పటికే ఇసుక తవ్వకాలు జరిపిన నదుల్లోని గుంతల్లో.. మళ్లీ ఎగువ నుంచి వరద వస్తే.. ఎంత ఇసుక వచ్చి చేరుతుందో శాస్త్రీయంగా అంచనా వేసేందుకు ఐదు సంస్థలను ఎంపికచేశాం. వీటిలో ఏదైనా సంస్థలతో కలెక్టర్లు అంచనాలు వేయించాలి. పర్యావరణ అనుమతులు పొందేందుకు ఇది అవసరం.

ఎన్వోసీల జారీలో తీవ్ర జాప్యం..: చిన్నతరహా ఖనిజాల లీజుల కోసం అన్ని జిల్లాల్లో కలిపి 1,294 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 1,253 లీజులకు సంబంధించి నిరభ్యంతర ధ్రువపత్రాల (ఎన్వోసీ) కోసం రెవెన్యూ అధికారులకు పంపారు. ఇప్పటి వరకు కేవలం 337 ఎన్వోసీలు మాత్రమే జారీచేశారు. 22 తిరస్కరించారు. ఇంకా 899 చాలా రోజులుగా పెండింగ్ ఉన్నాయి. చిత్తూరు జిల్లాలో 166, అనకాపల్లి- 142, తిరుపతి-100, కాకినాడ-84, ఎన్టీఆర్-76, శ్రీకాకుళం-72, అల్లూరి సీతారామరాజు-36, తూర్పుగోదావరి జిల్లాలో 35 ఎన్వోసీలు పెండింగ్ ఉన్నాయి. వెంటనే ఎన్వోసీలు జారీచేసేలా కలెక్టర్లు దృష్టిపెట్టాలి. వీటిలో 50 శాతం లీజులకు అనుమతులిస్తే వచ్చే మూడు నెలల్లో ప్రభుత్వానికి రూ.100 కోట్ల రాబడి వస్తుంది.

◆ గనులశాఖలో ఈ ఆర్థిక సంవత్సరంలో అధిక రాబడి సాధిస్తున్న జిల్లాల్లో ఈసారి ప్రకాశం రూ.225 కోట్లు, తూర్పుగోదావరి రూ.240 కోట్లు, ఎన్టీఆర్-రూ.114 కోట్లు, నంద్యాల-రూ.111 కోట్లు, కడప-రూ.119 కోట్లు, చిత్తూరు-రూ.76 కోట్లు, పల్నాడు జిల్లా రూ.68 కోట్లతో తొలి ఏడు స్థానాల్లో ఉన్నాయి. ఈ శాఖ ఆదాయంలో ఈ ఏడు జిల్లాల నుంచే 60 శాతం భాగస్వామ్యం ఉంటోంది.

ఆహార కల్తీ పెద్ద సమస్య

• కలెక్టర్ల సదస్సులో సీఎం

ఈనాడు, అమరావతి: 'ఆహార కల్తీ పెద్ద సమస్యగా మారింది. ఆహార పదార్థాల్లో రసాయనాలు కలిపేస్తున్నారు. కోళ్ల ఆరోగ్యానికి, బరువు పెరగడానికి, ఎదగడానికి యాంటీబయాటిక్స్, హార్మోన్ల వ్యాక్సిన్లు వేస్తున్నారు. దీంతో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. ఫ్యాటీ లివర్ రావడానికీ ఆహార కల్తీలే కారణం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలో కలెక్టర్ల సదస్సు రెండో రోజున సీఎం మాట్లాడుతూ మాతాశిశు మరణాల తగ్గింపు, ప్రజల జీవన ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. ఎన్టీఆర్ బేబీ కిట్ల పథకం అమలులో జాప్యం లేకుండా అదనంగా రెండు వస్తువులకు అవసరమైన రూ.51 కోట్లు మంజూరు చేయాలని ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. 'జనాభా నిర్వహణ- మానవ వనరుల అభివృద్ధి, పది సూత్రాల మిషన్‌'పై వైద్యారోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ ప్రజంటేషన్ ఇచ్చారు. ముఖ్యాంశాలివీ..

రాష్ట్రంలో పెరుగుతున్న వృద్ధ జనాభా

◆ రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు 1.5. మరోవైపు వృద్ధుల జనాభా వేగంగా పెరుగుతోంది. ఏపీలో మధ్య వయసు ప్రస్తుతం 32.5 సంవత్సరాలు. ఇది దేశ సగటు (28.4 ఏళ్ల) కంటే ఎక్కువ. ◆ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలి. రాష్ట్రంలో సగటు ఆయుర్దాయం 70.6 సంవత్సరాలు. దేశ సగటు (72.03 ఏళ్ల) కంటే తక్కువ. ◆ రాష్ట్రంలో మహిళా శ్రామికుల భాగస్వామ్యం 31% దేశ సగటు (32.8- 37%) కంటే తక్కువ. మెరుగైన రవాణా వ్యవస్థ, ప్రాంగణాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో దీన్ని పెంచితే రాష్ట్ర జీఎస్‌డీపీ 15 శాతం పెరిగే అవకాశం ఉంది. ◆ స్కిల్ పాస్‌పోర్ట్ వ్యవస్థ ద్వారా ఆరో తరగతి నుంచే సామర్థ్యాలను గుర్తించడం. యువతలో నైపుణ్యం పెంచి, ఉపాధి కల్పన. ◆ సంజీవని ద్వారా గర్భిణుల ఆరోగ్య పర్యవేక్షణ, బాల్యంలో పోషకాలు-టీకాల కార్యక్రమం. రెండో బిడ్డ నుంచి హెల్త్ లీవ్, ప్రోత్సాహకాలు. ◆ వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి. అసాంక్రమిక వ్యాధులు (ఎన్‌సీడీ) బారిన పడినవారికి సంచార వైద్యం ద్వారా క్రమం తప్పకుండా పరీక్షలు. హై, మీడియం రిస్క్ ఉన్నవారిపై ప్రత్యేక దృష్టి.

మాతా, శిశు మరణాలు తగ్గించడమే లక్ష్యం

◆ మాతృ మరణాల రేటును 30 నుంచి 5కి తగ్గించాలి. ◆ శిశు మరణాల రేటు రాష్ట్రంలో 17 ఉంటే.. సింగపూర్, ఐస్‌లాండ్‌లలో 2 కంటే తక్కువ ఉంది. ఆ స్థాయికి తీసుకెళ్లాలి. గర్భిణులను ట్రాక్ చేసి పీహెచ్‌సీ, సీహెచ్‌సీల అనుసంధానం ద్వారా సంరక్షణ చర్యలు.

◆ ప్రాంతీయ ఆసుపత్రులు, బోధనాసుపత్రుల్లో వృద్ధుల సంరక్షణకు ప్రత్యేక విభాగాల ఏర్పాటు

◆ దివ్యాంగుల సంరక్షణకు పునరావాస కేంద్రాలు స్థాపించి, వారికి ఉపాధి చూపడం. ◆ నైపుణ్యం, డిజిటల్ సాక్షరత సాధన దిశగా జిల్లాల్లో స్కిల్ హబ్‌లు, డిజిటల్ లైబ్రరీలు ప్రారంభం. ◆ పిల్లలకు జూన్‌లో స్క్రీనింగ్, డిజిటల్ హెల్త్ కార్డుల జారీ ◆ కుప్పంలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న డిజిటల్ నెర్వ్ సెంటర్, అంగన్‌వాడీ కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్త అమలుకు చర్యలు ◆ ఈ కార్యక్రమాల అమలుపై ప్రతి సోమవారం కలెక్టర్లు సంబంధిత అధికారులు సమీక్షించాలి.